

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 79

మంగళవారం 10-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోని

భారత మాజీ కెప్టెన్‌ను సముచిత రీతిలో గౌరవించిన ఐసీసీ -14లో



పటిష్ట క్వారంటైన్‌తోనే చెక్!

అమెరికాపై చైనా వ్యవసాయ ఉగ్రవాద చర్యతో ఉలిక్కిపడ్డ ప్రపంచదేశాలు -13లో



ఆగ్రహ జ్వాలల్లో లాస్ ఏంజెలెస్

లాస్ ఏంజెలెస్‌లో ఆందోళనకారులు రోడ్లపై కనిపించిన కారునల్లా దహనంచేసి ఉద్యమాగ్నిజ్వాలల్ని మరింత రగిలించారు.

- వివరాలు 6లో▶



11 ఏళ్లుగా 'ప్రగతిశీల భారత్'

ప్రజలకు సుపరిపాలన అందించడం, వారి జీవితాల్లో మార్పులు తేవడంపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

- వివరాలు 6లో▶



ప్రాణం తీసిన 'ఫుట్‌బోర్డు'

మహారాష్ట్రలోని థానే జిల్లాలో కిక్కిరిసిన రైళ్లలో నిర్లక్ష్యంగా ప్రయాణించడంతో నలుగురు ప్రయాణికులు మరణించారు.

- వివరాలు 6లో▶



శుభాన్షు అంతరిక్ష యాత్ర వాయిదా

యాక్సియోమ్–4 మిషన్‌ను బుధవారానికి వాయిదా వేసినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రకటించింది.

- వివరాలు 6లో▶

పత్రికా స్వేచ్ఛపై పాశవిక దాడి

ఏపీ వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై పచ్చమూకల విధ్వంసం

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే 'సాక్షి'పై కుతంత్రం

- ఎమర్జెన్సీని తలదన్నే రీతిలో కూటమి సర్కారు దౌర్జన్యకాండ
- రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ చెలరేగిన టీడీపీ గూండాలు
- కర్రలు, రాళ్లతో దాడి చేసిన మూకలు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే పన్నాగం
- ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌బుక్ అరాచకంపై జాతీయ స్థాయిలో ఆందోళన
- 'సాక్షి'పై దాడులను, కొమ్మినేని అరెస్టును ఖండించిన జర్నలిస్టులు 2 లో

నాణేనికి మరోవైపు కోణాన్ని నిర్భయంగా చూపుతున్న తెలుగు ప్రజల మనస్సాక్షి.. 'సాక్షి'పై ముష్కర మూకలు దాడులకు తెగబడ్డాయి..

అదను కోసం నక్కిన గుంటనక్కలు లేగదూడపై ఆవురావురుమంటూ విరుచుకుపడిన చందంగా ఒక్కసారిగా సాక్షి కార్యాలయాలపై ఈ పచ్చమూకలు విరుచుకుపడ్డాయి..

గేట్లపై రాళ్లు, కోడిగుడ్లు విసిరి, బోర్డులను విరగ్గొట్టి, పేపర్లను తగులబెట్టి వికృతానందాన్ని ఆస్వాదించాయి.



విజయవాడలోని 'సాక్షి' కార్యాలయంపై దాడి చేసి బోర్డును ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండాలు



హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ

- ఏడాది దుర్మార్గపు పాలన, అవినీతి, వైఫల్యాలపై ప్రశ్నించే స్వరం వినిపించకుండా చేయడానికి బాబు అధికార దుర్వినియోగం
- సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం

- వివరాలు 2లో

కొమ్మినేని అక్రమ అరెస్ట్

- 'సాక్షి'పై పెట్టింది పక్కాగా అక్రమ కేసే
- విశ్లేషకుడి అభిప్రాయాన్ని సాక్షి అభిప్రాయంగా ఆపాదింపు
- కులమతాలకు ముడిపెట్టడం దుర్మార్గం
- అదే రోజు ఆ వ్యాఖ్యలను ఖండించిన సాక్షి

2 లో

టీపీసీసీ జంబో కార్యవర్గం

27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులు

- సామాజిక న్యాయానికి, మహిళలకు ప్రాధాన్యత
- 27 మంది ఉపాధ్యక్షుల్లో బీసీలకు 8, ఎస్సీలకు 5 పదవులు
- 69 మంది ప్రధాన కార్యదర్శుల్లో అత్యధికంగా 26 మంది బీసీలు
- ఎంపీ రఘువీర్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చోటు
- కేసీ వేణుగోపాల్‌తో సీఎం చర్చల అనంతరం ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో కొత్తగా 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈ పదవుల్లో సామాజిక న్యాయానికి, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చింది. 27 మంది ఉపాధ్యక్షులలో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లింలకు 3 పదవులు ఇచ్చారు. 67 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. అలాగే 69 ప్రధాన కార్యదర్శి పదవులలో బీసీలకు అత్యధికంగా 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులు ఇచ్చారు. ఇందులో 68 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు దక్కాయి. సోమవారం ఢిల్లీకి వచ్చిన సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చల అనంతరం కార్యవర్గ జాబితాను ఖరారు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదించిన జాబితాను సోమవారం రాత్రి పార్టీ విడుదల చేసింది. నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ పీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. 69 మంది ప్రధాన కార్యదర్శుల్లో

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ చిన్నారులకు 'బాల భరోసా'



అంగన్‌వాడీల్లోని చిన్నారుల కోసం కొత్తగా 'బాలభరోసా' కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ పథకం కింద ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

- వివరాలు 3లో▶

ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం?



ఫోన్‌ట్యాపింగ్ కేసుతో తనకు సంబంధమే లేదని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సిట్ అధికారుల విచారణలో చెప్పినట్లు సమాచారం.

- వివరాలు 3లో▶

మార్చిలోనే టెన్త్ పరీక్షలు



ఈ విద్యా సంవత్సరం పదోతరగతి పరీక్షలను 2026 మార్చిలో నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని జనవరి 10 నాటికి మొత్తం సిలబస్ బోధన పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. విద్యా సంవత్సరం కేలండర్‌ను విడుదల చేసింది.

- వివరాలు 16లో▶

మా యూనిట్లు మార్చండి..



రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో యూనిట్ల మార్పు, కేటగిరీల సవరణ కోసం అధికారులపై ఒత్తిడి తీవ్రమైంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పలువురు అర్జీదారులు వాటిలో మార్పులు కోరుతూ ఆ మేరకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

- వివరాలు 3లో▶

ఇంకాచెప్పాలంటే




అలాగే ట్రంప్, మస్క్ ఎప్పుడు కొట్టుకుంటారో కూడా కాస్త చెబుతారా!

అన్ని నిర్ణయాలూ మంత్రివర్గ ఆమోదంతోనే..

కాళేశ్వరం కమిషన్‌కు స్పష్టం చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు

- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడం వల్లే బరాజ్ లొకేషన్ మేడిగడ్డకు మార్పు
- బరాజ్‌ల నిల్వ సామర్థ్యం పెంచుకోవాలని సూచించడంతోనే ప్రాజెక్టు రీఇంజనీరింగ్
- రుణాల సమీకరణ కోసమే కాళేశ్వరం కార్పొరేషన్
- గంటసేపు కొనసాగిన జస్టిస్ ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన ప్రతి నిర్ణయం రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతోనే జరిగిందని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు చెప్పారు. మంత్రివర్గ ఆమోదంతోనే డీపీఆర్ తయారీ పనులను వ్యాప్కోస్‌కు అందించినట్టు తెలిపారు. బరాజ్‌ల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం తన కార్యాలయంలో హరీశ్‌రావుకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా పలు కీలక ప్రశ్నలు సంధించింది. సాగునీటి ప్రాజెక్టులపై అధ్యయనం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం పరిధి ఏమిటి? అని కమిషన్ ప్రశ్నించగా, హరీశ్‌రావు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర వివాదాలు ఉండటం, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి అనుమతులు, నీటి కేటాయింపులు

మిగతా 12వ పేజీలో ▶



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

భూభారతి మాకు ఎన్నికల రెఫరెండమే!

ఈ చట్టం దేశానికే రోల్ మోడల్

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- వివరాలు 16లో

ఎండకు 'కంది'పోదు!

ప్రపంచంలోనే తొలిసారిగా గరిష్ట ఉష్ణోగ్రతను తట్టుకొనే కంది వంగడాన్ని అభివృద్ధి చేసిన ఇక్రిశాట్..

- 125 రోజుల్లో చేతికందే ఐసీపీవీ 25444 రకం కంది పంట..
- హెక్టార్‌కు 2 టన్నుల దిగుబడి

- వివరాలు 16లో



గుంటూరు జిల్లా మంగళగిరిలోని సాక్షి యూనిట్ ఆఫీస్ గేటు ఎక్కిన టీడీపీ మహిళా నేతలు



సాక్షి తిరుపతి యూనిట్ కార్యాలయం గేట్లను కాళ్లతో తన్నుతున్న టీడీపీ మహిళా నేతలు



అనంతపురంలో 'సాక్షి' కార్యాలయం ఎదుట బారికేడ్లు కూల్చివేసి లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కూటమి శ్రేణులు



పత్రికా స్వేచ్ఛపై పాశవిక దాడి

రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై పచ్చమూకల విధ్వంసం

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే 'సాక్షి'పై కుతంత్రం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచకాలు పతాకస్థాయికి చేరాయి. ప్రజా స్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే పత్రికా స్వేచ్ఛకూ సంకెళ్లు వేస్తున్నారు. నిజాలు రాసే కలాలను, వాస్తవాలు చెప్పే గళాలను నిరంకుశంగా అణగదొక్కుతున్నారు. గత ఎన్నికల్లో గుప్పించిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదైనా ఒక్కటీ నెరవేర్చలేకపోతున్న అసమర్థ చంద్రబాబు ప్రభుత్వం, తన చేతగానితనాన్ని కప్పిపుచ్చు కోవడానికి డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేస్తోంది. అందులో భాగంగానే అడ్డగోలుగా అక్రమ అరెస్టులు, అనవసర రాద్ధాంతాలు చేస్తోంది. అంతేకాక.. రాజకీయ హత్యలు, కుల, మత విద్వేషాలు అంటూ అనేక అడ్డదారులు తొక్కుతోంది. ఈ క్రమంలోనే.. ఎవరో చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపించి 'సాక్షి'పై దాడులకు ఉసిగొలిపింది. తెలుగువారి మనస్సాక్షిగా.. పేదవాడి గొంతుకై.. ప్రజల పక్షాన నిలబడుతూ, వాస్తవాలను ప్రచురిస్తూ.. ప్రసారం చేస్తున్న 'సాక్షి'కి సంబంధంలేని వ్యాఖ్యలను ఆపాదిస్తూ రాజకీయ కుట్రలకు బరితెగిస్తోంది. ఇందులో భాగంగా టీడీపీ ప్రోద్బలంతో కూటమి నేతలు, అల్లరిమూకలు కలిసి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై మూకుమ్మడి దాడులకు తెగబడ్డారు. విచక్షణారహితంగా రాళ్లు రువ్వుతూ, కోడిగుడ్లు విసురుతూ రెచ్చిపోయారు. పలు 'సాక్షి' యూనిట్ కార్యాలయాల వద్ద నేమ్ బోర్డులను పెకిలించేశారు. 'సాక్షి' పత్రిక ప్రతులతో పాటు, 'సాక్షి' నేమ్ బోర్డులను తగులబెట్టారు. బయటి వ్యక్తి వ్యాఖ్యలతో సంబంధంలేదని 'సాక్షి' చెప్పినప్పటికీ రెచ్చిపోయిన టీడీపీ, బీజేపీ, జనసేన మూకలు నానా బీభత్సం సృష్టిస్తూ, 'సాక్షి' సిబ్బందిని భయాందోళనలకు గురిచేశారు.

విజయవాడ 'సాక్షి' రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై దాడి..

ఈ దాడుల్లో భాగంగా.. విజయవాడ ఆటోనగర్‌లో ఉన్న 'సాక్షి' రాష్ట్ర ప్రధాన కార్యాలయంపైనా పచ్చమూకలు విరుచుకుపడ్డాయి. టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు భార్య అనురాధ, ఆయన కొడుకు గద్దె క్రాంతికుమార్, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు, అల్లరిమూకలు ఉ.11 గంటలకు 'సాక్షి' యూనిట్ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అప్పటికే పోలీసుల సూచనల మేరకు సాక్షి కార్యాలయం గేటును భద్రతా సిబ్బంది మూసివేయడంతో ఆందోళనకారులు గేటు ముందు బైఠాయించారు. 'సాక్షి' పత్రికకు, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యాజమాన్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అక్కడితో సరిపెట్టకుండా, కొందరు అత్యుత్సాహంతో కార్యాలయం గేటుపైకెక్కి లోపలికి ప్రవేశించేందుకు యత్నించారు. కార్యాలయంలోకి వెళ్లి విధ్వంసం చేయాలని శతధా ప్రయత్నించారు. కానీ, వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన కూటమి నేతలు తమ కార్యకర్తలను మరింతగా రెచ్చగొట్టారు. గుడ్లు, రాళ్లు తెచ్చి కార్యాలయం పైకి విసిరారు. దీంతో అక్కడ రక్షణ కల్పిస్తున్న పోలీసులకు అవి తగిలాయి. మహిళా పోలీసులపై కోడిగుడ్లు పడ్డాయి. అప్పటికీ శాంతించని కూటమి నేతలు 'సాక్షి' నేమ్ బోర్డును తొలగించి, కొంత భాగాన్ని మురుగుకాలువలో పడేశారు. మిగతా భాగాన్ని గేటు ముందుకు తెచ్చి కాళ్లతో తొక్కారు. పత్రిక ప్రతులతో పాటు నేమ్ బోర్డుకు నిప్పుపెట్టారు. దాదాపు మూడు గంటల పాటు ఈ విధ్వంసకాండ కొనసాగింది. ఆ సమయంలో విధుల్లోకి వెళ్లాల్సిన 'సాక్షి' సిబ్బంది రోడ్డుపైనే మండుటెండలో ఉండిపోవాల్సి వచ్చింది. మరోవైపు.. కూటమి నేతల దుశ్చర్యలకు ఆటోనగర్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనచోదకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 'సాక్షి'కి సంబంధం లేని అంశంపై టీడీపీ కూటమి నేతలు ఇలా అరాచకంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజల వాణిగా.. వాస్తవాల వారధిగా సాక్షి నిలవడం నచ్చని ఉన్మాదులు ఈ దాడిలో అత్యుత్సాహం చూపడం ఆశ్చర్యపరచకపోయినా.. నచ్చని మాట అన్నారంటూ ఆగ్రహించిన అతివలు అత్యంత లాఘవంగా గేట్ల పైకెక్కడం చూసి జనం ముక్కున వేలేసుకున్నారు.. పొల్లు మాటన్న ఆ విశ్లేషకుడు క్షమించమన్నాడు.. మహిళలను గౌరవించడంలో ముందుండే సాక్షి మీడియా ఆ విశ్లేషకుడి మాటలను తీవ్రంగా ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది.. వాటిని సాక్షికి ఆపాదించవద్దని కోరింది. అయినా దీనిని ఓ అవకాశంగా మార్చుకోవాలన్న దుర్బుద్ధితో రాజకీయ కుట్రతో దీనిని చిలవలు పలవలుగా చిత్రీకరిస్తూ శ్రేణులను ఎగదోస్తూ దాడులకు ప్రేరేపించారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు పురికొల్పారు.. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సాగిస్తున్న ఈ దుర్మార్గాన్ని ప్రజాస్వామికవాదులు, పత్రికాస్వేచ్ఛను కాంక్షించే ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నారు.. ఈ నైచ్యాన్ని నిరసిస్తూ నినదిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎల్లోగ్యాంగ్ అరాచకం..

- శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని 'సాక్షి' కార్యాలయం ఆస్తులను టీడీపీ మూకలు నిరసనకారుల ముసుగులో ధ్వంసం చేశాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బావ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు తదితరులు విధ్వంసకాండకు పాల్పడ్డారు. కార్యాలయం నేం బోర్డును పీకేసి తగలబెట్టారు. కార్యాలయంలోకి, ప్రహరీపై పేడ విసిరారు.
- విశాఖ, అనకాపల్లి 'సాక్షి' కార్యాలయాల వద్ద టీడీపీ మహిళా కార్యకర్తలు చెలరేగిపోయారు. విశాఖపట్నం అక్కయ్యపాలెంలోని 'సాక్షి' ఆఫీసు వద్దకు 50 మందికి పైగా టీడీపీ మహిళా కార్యకర్తలు వచ్చి 'సాక్షి' ప్రతులను చింపి తగులబెట్టారు. రాజమహేంద్రవరం యూనిట్ కార్యాలయం వద్ద, అమలాపురంలోని సాక్షి కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ధర్నా చేశారు.
- ఏలూరు సాక్షి జిల్లా కార్యాలయంపైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం దాడులకు యత్నించారు. సాక్షి కార్యాలయంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించారు.
- గుంటూరు జిల్లా ఆత్మకూరులోని సాక్షి కార్యాలయం వద్ద అమరావతి జేఏసీ పేరుతో ధర్నా చేశారు. పలుమార్లు సాక్షి కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. కార్యాలయం నేం బోర్డును ధ్వంసం చేశారు. మరోవైపు.. గుంటూరు, పల్నాడు జిల్లా నరసరావుపేట సాక్షి కార్యాలయాల ముందు కూడా ఆందోళన చేశారు. నెల్లూరు జిల్లా సాక్షి యూనిట్ కార్యాలయాన్ని టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ముట్టడించి సాక్షి ప్రతులను దగ్ధంచేశారు. కర్నూలు సాక్షి కార్యాలయం వద్ద టీడీపీ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, మహిళలు ఆందోళన చేశారు.
- కడప సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట కూడా టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆఫీసులో విధ్వంసం సృష్టించేందుకు కొందరు గేటు దూకేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రేణిగుంటలోని తిరుపతి సాక్షి యూనిట్ కార్యాలయంపైనా సోమవారం సాయంత్రం టీడీపీ మూకలు కొందరు రౌడీలతో దాడికి తెగబడ్డాయి. గేట్లు ఎక్కి సాక్షి కార్యాలయంలోకి చొరబడేందుకు యత్నించారు. కార్యాలయంపై రాళ్ల దాడి చేశారు.
- అనంతపురంలోనూ సాక్షి కార్యాలయాన్ని టీడీపీ రౌడీమూకలు ముట్టడించేందుకు యత్నించారు.

వివరాలకు, ఫొటోలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వేధింపులు సరికాదు

ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్

సాక్షి, అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును ఐజేయూ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ తీవ్రంగా ఖండించారు. 70 ఏళ్ల కొమ్మినేనిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. ఆ వ్యాఖ్యలకు సాక్షి మీడియా, కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ చెప్పినప్పటికీ కనీసం మందులు తీసుకోనివ్వకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కొమ్మినేని టెర్రరిస్ట్ కాదని, పారిపోయే వ్యక్తి కూడా కాదని అలాంటి వ్యక్తిని అక్రమంగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. 'రాజకీయ నేతలు మహిళలను కించపరుస్తూ అనేకసార్లు వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు కూడా ఓ ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు దారుణంగా మహిళలను కించపరుస్తూ మాట్లాడారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని ప్రశ్నించారు. మీడియా కార్యాలయాలపై రాజకీయ ప్రేరేపిత దాడులు సరైన విధానం కాదన్నారు.

మేమేం చేసినా ఒప్పే అనే రీతిలో పాలక పార్టీలు

చట్టప్రకారమే ఏదైనా చేయాలి: తెలకపల్లి

సాక్షి, హైదరాబాద్: పాలక పార్టీలు తామేం చేసినా ఒప్పే, ఇతరులు ఏం చేసినా తప్పే అనే రీతిలో వ్యవహరిస్తున్నాయని ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి విమర్శించారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసిన తీరును ఆయన సోమవారం తప్పుబట్టారు. కనీసం ఔషధాలు, దుస్తులు కూడా వెంట తెచ్చుకోనీయకుండా కొమ్మినేనిని పోలీసులు అడ్డుకోవటం సరికాదని పేర్కొన్నారు. తమకు ఎవరూ ఎదురు మాట్లాడకూడదన్న రీతిలో పాలకులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకులు సహనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏం చేసినా చట్టప్రకారమే చేయాలని సూచించారు.

కొమ్మినేని అక్రమ అరెస్ట్

సాక్షి, అమరావతి/లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి సోమవారం ఉదయమే చేరుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఏ అభియోగాలపై తనను అదుపులోకి తీసుకున్నారని ప్రశ్నించిన కొమ్మినేనికి సరైన సమాధానం ఇవ్వలేదు. 70 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన్ను.. ఇంటిలోపల గదిలోకి వెళ్లి మందులను తెచ్చుకునేందుకు కూడా అనుమతించలేదు. బలవంతంగా వాహనం ఎక్కించి గుంటూరుకు తరలించారు. కొమ్మినేనిని సోమవారం ఉదయం 11 గంటలకు అరెస్టు చేసినట్టు ప్రకటించారు. సాయంత్రం 7 గంటల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో తిప్పుతూ రాత్రి 9.40 గంటలకు నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా, కొమ్మినేని శ్రీనివాసరావుకు అస్వస్థతగా ఉన్నట్లు సమాచారం.

అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సాక్షి మీడియాపై కుట్రతోనే చంద్రబాబు ప్రభుత్వం పక్కాగా అక్రమ కేసు నమోదు చేసింది. కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి మీడియా యాజమాన్యంపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆరే అందుకు నిదర్శనం. అసలు ఉదంతంతో ఏమాత్రం సంబంధం లేని బీఎన్ఎస్ సెక్షన్ల కింద అక్రమ కేసు నమోదు చేసింది. బీఎన్ఎస్ సెక్షన్లు 79, 196(1), 353(2), 299, 356(2) 61(1) కింద కేసు నమోదు చేయడం ప్రభుత్వ కుట్రకు తార్కాణం. ఎందుకంటే కుట్ర పూరితంగా వ్యవహరించడం, విద్వేషాలను వ్యాపింప చేయడం తదితర నేరాలకు ఈ సెక్షన్లు వర్తిస్తాయి. అంతేగానీ ఓ టీవీ చానల్లో స్వతంత్ర విశ్లేషకుడు వ్యక్తం చేసిన అభిప్రాయానికి ఆ సెక్షన్లు నమోదు చేయడం విడ్డూరం. అసలు ఆ చర్చా గోష్ఠిలో ఎక్కడా కుల ప్రస్తావనే లేకపోయినా, బీఎన్ఎస్ 3(1)(యు) సెక్షన్‌ను చేరుస్తూ ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేయడం వెనుక ప్రభుత్వ పెద్దల కుట్ర ఉందన్నది సుస్పష్టం. ఆ చర్చా గోష్ఠిలో స్వతంత్ర విశ్లేషకుడు కృష్ణంరాజు వ్యాఖ్యను కొమ్మినేని శ్రీనివాసరావు అప్పుడే ఖండించారు, వారించారు. ఇక ఆయన వ్యాఖ్యతో తమకు సంబంధం లేదని సాక్షి మీడియా యాజమాన్యం స్పష్టం చేసింది. ఆ వ్యాఖ్యలను అప్పుడే ఖండించింది. ఆ వ్యాఖ్యలను సమర్థించలేదని, సమర్థించబోమని కూడా ప్రకటించింది. మహిళలంటే తమకు అత్యంత గౌరవభావం ఉన్నట్లు స్పష్టం చేసింది. ఆ వ్యాఖ్యలను ఆ స్వతంత్ర విశ్లేషకుడి అభిప్రాయంగానే పరిగణించాలని చెప్పింది. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం వక్రీకరించి కొమ్మినేని శ్రీనివాసరావుతోపాటు సాక్షి మీడియా యాజమాన్యంపై అక్రమ కేసు నమోదు చేయడం పక్కా కుతంత్రమే.

అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్

- ఏడాది దుర్మార్గపు పాలన, అవినీతి, వైఫల్యాలపై ప్రశ్నించే స్వరం వినిపించకుండా చేయడానికి చంద్రబాబు అధికార దుర్వినియోగం
- ప్రజలు, ప్రజాస్వామ్యవాదుల్ని, మేధావుల్ని, జర్నలిస్టుల్ని భయకంపితుల్ని చేస్తున్నారు
- తాను చేయని వ్యాఖ్యలకు సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని అరెస్టుచేసి కక్ష సాధింపులను పతాకస్థాయికి తీసుకెళ్లారు
- చెడు సంప్రదాయాలకు నాంది పలుకుతూ.. ఈరోజు ఏది విత్తుతారో రేపు అదే పండుతుంది
- అది రెండింతలవుతుందని మర్చిపోకండి అంటూ చంద్రబాబుకు హెచ్చరిక



'ఎక్స్'వేదికగా సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఆయన నివాసంలో ఏపీ పోలీసులు అరెస్టు చేయడంపై వైఎస్ జగన్ స్పందించారు. 'ఎక్స్'వేదికగా కొమ్మినేని అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ పోస్టు చేశారు. అనని మాటలను సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు ఆపాదిస్తూ, వాటిని వక్రీకరించి విషప్రచారం చేసి, ఆయనను అరెస్టు చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా ఒక పథకం ప్రకారం సాక్షి యూనిట్ కార్యాలయాలపైన దాడులు చేయించారని ధ్వజమెత్తారు. ఈ అరాచకానికి మహిళల గౌరవం అనే ముసుగు తొడిగి ఎక్కడికక్కడ విధ్వంసం చేస్తూ ఆటవికంగా వ్యవహరిస్తున్నారని సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. కోడలు మగపిల్లాడిని కంటే అత్త వద్దంటుందా? అని మీరు, ఆడపిల్ల కనిపిస్తే ముద్దైనా పెట్టాలి లేదా కడుపైనా చేయాలి అని మీ బావమరిది గతంలో అన్న మాటలు చూస్తే.. మీకు మహిళల మీద ఎంతటి గౌరవం ఉందో తెలుస్తోందని వైఎస్ జగన్ దుయ్యబట్టారు. ఇంకా ఈ పోస్టులో ఆయన ఏం తెలిపారంటే..

ఆంధ్రప్రదేశ్ అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. ప్రజాస్వామ్యం, చట్టం, న్యాయం ఖూనీ అయిపోతున్నాయి. ప్రజలు, ప్రజాస్వామ్యవాదుల్ని, మేధావుల్ని, జర్నలిస్టుల్ని భయకంపితుల్ని చేస్తున్నారు. ఏడాది కాలంగా చంద్రబాబు చేస్తున్న అరాచకపు, అన్యాయ పాలనపై ప్రజల తరఫున వీరెవ్వరూ గొంతెత్తకుండా, ఏడాదిగా తన దుర్మార్గపు పాలన, తన మోసాలు, తన అవినీతి, తన వైఫల్యాలపై స్వరం వినిపించకుండా చంద్రబాబు తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అణచివేయడానికి యత్నిస్తున్నారు. తాను చేయని వ్యాఖ్యలకు 70 ఏళ్ల వృద్ధుడైన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టుచేసి కక్షసాధింపుల విష సంస్కృతిని పతాక స్థాయికి తీసుకెళ్లారు.

సహజంగా ఒక డిబేట్ జరిగేటప్పుడు, వక్తలు మాట్లాడే మాటలకు, యాంకర్‌కు ఏం సంబంధం? కొందరు అనుకూలంగానూ, మరికొందరు వ్యతిరేకంగానూ మాట్లాడుతూ ఉంటారు. కొన్ని టీవీ ఛానళ్లలో వ్యక్తిత్వాలను హననం చేస్తూ చాలామంది గెస్టులు మాట్లాడిన సందర్భాలు గతంలో మనం చూడలేదా? ఇప్పటికీ కొనసాగడంలేదా?

ప్రజల తరఫున మీడియా నిలవకూడదని, చంద్రబాబు చేసిన తప్పులను ప్రశ్నించకూడదని ఒక పథకం ప్రకారం లేనివాటిని ఆపాదిస్తూ, టాపిక్‌లను డైవర్ట్ చేస్తూ, వక్రీకరిస్తూ, సాక్షి మీడియాపైనా దాడులు చేయిస్తున్నారు. కొమ్మినేనిపై చంద్రబాబు కక్ష కట్టడం ఇది తొలిసారి కాదు. గతంలోనే ఆయన ఉద్యోగాన్ని ఊడగొట్టాడు. ఆయన నిష్పక్షపాతంగా డిబేట్లు చేయడం తట్టుకోలేక 2014–19 మధ్య ఆ ఛానల్‌పై (గతంలో, సాక్షి కాదు) ఆంక్షలు విధించారు. ఇప్పుడు కూడా తనకు మద్దతుగా లేవన్న కారణంతో ఆయా ఛానళ్లను నియంత్రిస్తూ కక్ష సాధిస్తున్నారు. కొమ్మినేని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను.

చంద్రబాబూ.. ప్రజలు మీకు ఇచ్చిన అధికారం ఐదేళ్లే. అందులో ఏడాది గడిచిపోయింది. నాలుగేళ్ల తర్వాత మీరు చేసిన అన్యాయాలు, అక్రమాలు, అధికార దుర్వినియోగాలపై ప్రజలకు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని, చేసిన తప్పులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోండి. చెడు సంప్రదాయాలకు నాంది పలుకుతూ ఇవాళ ఏది విత్తుతారో, రేపు అదే పండుతుంది, అది రెండింతలవుతుందని మర్చిపోకండి''.

చంద్రబాబూ.. రాష్ట్రంలో మీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. ఈ ఏడాది పాలనలో మహిళలు, బాలికల పట్ల మీకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని తేలిపోయింది. అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుకునే తమ కూతురు తన్మయి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే, 6 రోజుల తర్వాత ఆ అమ్మాయి దారుణంగా హత్యకు గురై శవమై కనిపించింది. కనిపెట్టడానికి మీకు, మీ యంత్రాంగానికి చేతకాలేదు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుకుర్రాకులపల్లెలో 9వ తరగతి విద్యార్థినిపై 6 నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి 14 మంది అత్యాచారం చేస్తే, బాధితురాలు ఫిర్యాదు చేయనీయకుండా భయపెట్టారు. నేరం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం మీకు చేతకాలేదు. కొందరు చేస్తున్న అఘాయిత్యాలకు స్కూలుకు వెళ్తున్న బాలికలు గర్భం దాలుస్తున్న పరిస్థితులు చూస్తున్నాం. మీ పాలన మొదటి ఏడాదిలోనే 188 మంది మహిళలు, బాలికలు అత్యాచారాలకు గురైతే, 15 మందిని రేప్ చేసి చంపేశారు. వందలకొద్దీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడ్డారు. మీ ట్రాక్ రికార్డు ఇంత ఘోరంగా ఉంది.

చంద్రబాబూ.. మీరు వచ్చాక విద్య, వైద్యం, వ్యవసాయం, లా అండ్ ఆర్డర్ పూర్తిగా నాశనం అయిపోయాయి, నిర్వీర్యం అయిపోయాయి. విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది. అధికారంకోసం సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి, తీరా సీట్లోకి వచ్చాక వారికి నిలువెల్లా వెన్నుపోటు పొడిచి, ఏడాది పాలన తర్వాత ప్రజలముందు దోషిగా నిలబడ్డారు. పాలనలో చతికిలపడ్డ, అసమర్థ, అవినీతి, అరాచక ముఖ్యమంత్రిగా ప్రజలు మిమ్మల్ని చూస్తున్నారు. వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి మీ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలతో తప్పుడు ప్రచారం చేయించి, కిరాతకంగా వ్యవహరిస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ ఎంతోకాలం చెల్లవు చంద్రబాబూ అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే..

'సాక్షి'ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి

- ఏపీ ప్రభుత్వం దుస్సంప్రదాయానికి తెగబడింది..
- పత్రిక కార్యాలయాలపై దాడులు, కొమ్మినేని అరెస్టుకు ఖండన
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 'సాక్షి'సిబ్బంది నిరసన



హైదరాబాద్ సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలో ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి, ఇతర సిబ్బంది



విజయవాడ సాక్షి కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో జర్నలిస్టుల ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: రెడ్ బుక్ రాజ్యాంగంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 'సాక్షి'కార్యాలయాలపై చేసిన దాడుల్ని జర్నలిస్టుల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి అన్నారు. అలాగే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఏపీలోని టీడీపీ ప్రభుత్వం త్వరలో ఏడాది పాలన పూర్తి చేసుకోబోతున్న నేపథ్యంలో.. ఏడాది పాలన, హామీల అమలు వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి దుస్సంప్రదాయానికి తెగబడిందని దుయ్యబట్టారు. ఏపీలో 'సాక్షి'కార్యాలయాలపై టీడీపీ మూకల దాడులు, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టుకు నిరసనగా సోమవారం రాత్రి హైదరాబాద్ ప్రధాన కార్యాలయం వద్ద జర్నలిస్టులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. 'సాక్షి'పై దాడులను ఖండిద్దాం, రెడ్‌బుక్ రాజ్యాంగం డౌన్‌డౌన్, సాక్షి కార్యాలయాలపై దాడుల్ని అరికట్టాలి, పత్రికా స్వేచ్ఛ వర్ధిల్లాలి, వియ్ వాంట్ జస్టిస్.. అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధనంజయరెడ్డి మాట్లాడారు.

ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేసి ఉండదు..

రాజకీయ దురుద్దేశాలతో, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా బహుశా ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలకు పాల్పడి ఉండదని ధనంజయరెడ్డి పేర్కొన్నారు. 'సాక్షి'పై దాడులు పూర్తిగా గర్హనీయమని అన్నారు. 'సాక్షి'డిబేట్‌లో విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యల్ని సాక్షి మీడియా గ్రూప్ ఇప్పటికే పూర్తిగా ఖండించిందని గుర్తు చేశారు. డిబేట్‌లో పాల్గొన్న వ్యక్తి, నిర్వాహకుడైన కొమ్మినేని కూడా ఆ వ్యాఖ్యల్ని ఖండించారని తెలిపారు. అయినప్పటికీ 'సాక్షి'కార్యాలయాలపై బహుశా దేశంలోనే ఎప్పుడూ లేని విధంగా దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాళ్లు రువ్వడం, నేమ్ ప్లేట్లపై చెప్పులు విసరడం వంటివి గతంలో చూడలేదని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, మేధావులు, పౌర సమాజం వీటి గురించి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా 'సాక్షి'జిల్లా కార్యాలయాల వద్ద కూడా జర్నలిస్టులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కూడా నిరసనల్లో పాల్గొని ఏపీ ప్రభుత్వ తీరును ఖండించారు. ఏపీ వ్యాప్తంగా 'సాక్షి'సిబ్బంది సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విజయవాడ ఆటోనగర్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద కూడా ఉద్యోగులు నిరసన చేపట్టారు. ప్రభుత్వ తప్పిదాలను సాక్షి ప్రశ్నిస్తోందన్న అక్కసుతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని జర్నలిస్టులు మండిపడ్డారు. కూటమి గూండాలు సాక్షి కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేసి, నేమ్ బోర్డ్‌ను ధ్వంసం చేయడం పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడి అని వారు నినదించారు.

నేనంటే చంద్రబాబుకు పగ.. అందుకే కక్ష సాధింపు

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు



కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి విజయవాడ తీసుకొస్తున్న పోలీసులు

తన అరెస్టుపై సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు మండిపడ్డారు. 'నేను సీనియర్ సిటిజన్‌ని ఎలా అరెస్టు చేస్తారు? సెర్చ్ వారెంట్ కూడా ఇవ్వలేదు. 70 ఏళ్ల వయసులో నాపైన ప్రభుత్వానికి ఇంత కక్ష దేనికి? కక్ష గట్టి చేస్తున్నారు. నా వల్ల ఎవరికి నష్టం కలిగిందో, ఇబ్బంది కలిగిందో చెప్పడం లేదు. పోలీసులు రూల్స్ పాటించకుండా ఐడీ కార్డులు చూపి తుళ్లూరు తీసుకువెళ్తామని చెప్పారు. ఇంటిలో పైకి వెళ్లి మందులు తెచ్చుకోవడానికి కూడా పోలీసులు ఒప్పులేదు. ఫిర్యాదు ఎవరు ఇచ్చారో చెప్పకుండా కావాలనే నాపై కక్ష గట్టి చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్ట్ పరిస్థితే ఇలా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితేంటి? కేసు ఎవరు పెట్టారో చెప్పడం లేదు. సాక్షిలో నా డిబేట్‌లు రాకుండా చేయాలని చూస్తున్నారేమో. ప్రభుత్వ వ్యతిరేక వాయిస్ వినిపించకుండా చేసే ప్రయత్నం జరుగుతోంది. జర్నలిస్టులను కూడా వదిలిపెట్టడం లేదు. రెడ్ బుక్‌లో ఇది కూడా భాగమేమో. గతంలో ఒక టీవీ చానెల్‌లో నేను పనిచేస్తున్నప్పుడు అమరావతి భూములపై నేను డిబేట్ చేస్తే యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి నన్ను తొలగించేలా చేశారు. అప్పటి నుంచి నాపై చంద్రబాబుకు కోపం ఉంది. ఆ తర్వాత నాకు వైఎస్ జగన్ సాక్షిలో అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఏ అవకాశం లేకపోయినా కావాలని నాపై పోలీసులు దొంగ కేసు పెట్టారు. నేను అనని విషయంపైన కేసు పెట్టడం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. అమరావతి మహిళలను ఎవరూ ఏమీ అనలేదు. కావాలని రెచ్చగొట్టి చేస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్‌కు కోపం వస్తే ఎవరైనా జైలుపాలు కావాల్సిందే' అని ఆవేదన వ్యక్తం చేశారు.

మా యూనిట్లు మార్చండి..

- తొలుత రూ.లక్షలోపు తొలి రెండు కేటగిరీల పరిశీలనకు సర్కారు నిర్ణయం
- ఈ రెండు కేటగిరీలకు లక్ష్యానికి తక్కువగా వచ్చిన అర్జీలు
- తొలి విడతలోనే లబ్ధిదారులుగా ఎంపికయ్యేందుకు చివరి రెండు కేటగిరీలకు చెందిన అర్జీదారుల ప్రయత్నాలు

కేటగిరీల మార్పు కోసం యువ వికాసం దరఖాస్తుదారుల వినతులు

కేటగిరీల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా

కేటగిరీ	దరఖాస్తులు
కేటగిరీ-1 (రూ.50 వేల లోపు)	39,401
కేటగిరీ-2 (రూ.50 వేల-రూ.లక్ష)	93,233
కేటగిరీ-3 (రూ.లక్ష-రూ.2 లక్షలు)	2,49,434
కేటగిరీ-4 (రూ.2 లక్షలు-రూ.4లక్షలు)	12,41,696
మొత్తం	16,23,764

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో యూనిట్ల మార్పు, కేటగిరీల సవరణ కోసం అధికారులపై ఒత్తిడి తీవ్రమైంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పలువురు అర్జీదారులు వాటిలో మార్పులు కోరుతూ ఆ మేరకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దరఖాస్తులో మార్పులు చేసేందుకు సంబంధించిన లాగిన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్ల వద్ద ఉండడంతో వారి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2వ తేదీన తొలి రెండు కేటగిరీల్లో ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. కానీ చివరి నిమిషంలో ఎంపిక ప్రక్రియ, మంజూరు కార్యక్రమాన్ని వాయిదా వేసింది. అయితే ప్రభుత్వం తొలి రెండు కేటగిరీ లకే ముందుగా మంజూరు పత్రాలు ఇవ్వనుందనే ప్రచారంతో.. తొలి విడతలోనే లబ్ధిదారులుగా ఎంపికయ్యే ఉద్దేశంతో తొలుత చివరి రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అనేకమంది, ప్రస్తుతం తమ కేటగిరీలను మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



చివరి రెండు కేటగిరీలకు అధిక దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ రకాల యూనిట్ల కోసం మొత్తం 4 కేటగిరీల్లో దరఖాస్తులను స్వీకరించింది. ఆన్‌లైన్ పద్ధతిలో మార్చి 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంక్షేమ శాఖలు..ఏప్రిల్ 14వ తేదీ 11.59 గంటల వరకు కొనసాగించింది. మొత్తం 16,23,764 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. రూ.50 వేల లోపు పరిమితి ఉన్న యూనిట్లను కేటగిరీ-1గా, రూ.50 వేల నుంచి రూ.1 లక్షలోపు వాటిని కేటగిరీ-2గా, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు పరిమితి ఉన్న యూనిట్లను కేటగిరీ-3, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల మధ్య ఉన్న యూనిట్లను కేటగిరీ-4గా విభజించింది. తొలి విడతలో కేటగిరీ-1,. కేటగిరీ-2లోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో తొలి రెండు కేటగిరీల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేపట్టింది. అయితే ఈ రెండు కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం కంటే తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కేటగిరీ-1లో 1,58,650 మందికి అవకాశం కల్పించాలని భావించగా.. కేవలం 39,401 దరఖాస్తులే వచ్చాయి. కేటగిరీ-2లో 1,22,540 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా.. కేవలం 93,233 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 1,48,556 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. కానీ కేటగిరీ-3, కేటగిరీ-4 కింద మాత్రం అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం తొలుత మొదటి రెండు కేటగిరీలకు చెందిన దరఖాస్తుల పరిశీలనే చేపట్టడం, ఆయా కేటగిరీలకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో.. కేటగిరీ-3, కేటగిరీ-4 కింద దరఖాస్తు చేసుకున్న వారు తొలి విడతలోనే అర్హత సాధించేందుకు, ఆ మేరకు ఆయా యూనిట్లకు మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం స్థానిక ప్రజాప్రతినిధులతో సిఫారసు చేయించుకుంటున్నారు. సుమారు లక్షకు పైబడి దరఖాస్తుదారులు ఈ విధంగా మార్పులు కోరుకుంటున్నట్లు సంక్షేమ శాఖల వర్గాలు తెలిపాయి.

లబ్ధిదారులే నిర్మాణకర్తలు

ఇష్టమైన రీతిలో నిర్మించుకునే అవకాశమిచ్చాం

ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని, పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని గృహ ప్రవేశాలకు కూడా సిద్ధమవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి ఈ రోజు వరకు ఈ వారానికి సంబంధించి లబ్ధిదారులకు 22.64 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల పథకానికి సంబంధించి గతవారం రోజుల్లో 1,549 ఇళ్ల బేస్‌మెంట్, 481 ఇళ్లు గోడల నిర్మాణం వరకు, మరో 117 ఇళ్లు శ్లాబుల వరకు పూర్తయ్యాయని వివరించారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూడా పేదవానికి ఇచ్చిన మాట లబ్ధిదారులకు నిధులను విడుదలచేసి తీరుతామన్నారు. ఒక్క రోజుకూడా ఇందిరమ్మ లబ్ధిదారుడు నిధుల కోసం ఎదురు చూడకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమచేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు 250 మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రమే ఉంటుందని, నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టడం లేదని, లబ్ధిదారులు తమకు ఇష్టమైన రీతిలో 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకునే సౌలభ్యాన్ని కల్పించామని పొంగులేటి తెలిపారు.



సీత యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు. చిత్రంలో హరీష్ శంకర్, ఝాన్సీ రెడ్డి, శ్రీలీల తదితరులు

మహిళా సాధికారత చేతల్లో చూపిస్తాం

సీత యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా సాధికార తను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే తమ ప్రభుత్వం సంకల్పమని, ఇప్పటికే ఆ దిశగా ప్రయాణం మొదలైందని చెప్పారు. సోమవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో 'షీ జాబ్స్' ఆధ్వర్యంలో రూపొందించిన 'సీత'(షి ఈజ్ ది హీరో ఆల్వేస్)' యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. 'కుటుంబాల్లో తమ హక్కులను మహిళలు స్వేచ్ఛగా వినియోగించుకుని నిర్ణయాలు తీసుకోగలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. ఆ దిశగా ఇంటి నుంచే మొదటి అడుగు పడాలి. కేంద్ర గణాంక శాఖ భారత్‌లో పురుషులు, మహిళలు - 2024 పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణలో కుటుంబ నిర్ణయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 86%, పట్టణాల్లో 89% మంది మహిళలు భాగస్వాముల వుతున్నారు. మహిళా సాధికారతను సాకారం చేసేందుకు అడుగులు వేస్తు న్న తెలంగాణ విజయగాథ ఇది'అని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, నాయకత్వం, నిర్ణయాత్మక స్థానాల్లో ఎలాంటి వివక్ష లేకుండా మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. 'ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025'కు శ్రీకారం చుట్టి, 17 రకాల వ్యాపా రాల్లో వారిని పారిశ్రామిక వేత్తలుగా మారేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలకు తొలి ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. 31 జిల్లాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల ప్రారంభానికి చమురు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం 'అని వివరించారు. 'సీత'యాప్ మహిళల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. కార్య క్రమంలో ప్రముఖ సినీనటి శ్రీలీల, సినీ డైరెక్టర్ హరీష్ శంకర్, షీ జాబ్స్ నిర్వాహకురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు 'బాల భరోసా'

- త్వరలోనే కొత్త పథకం ప్రవేశపెడతాం
- ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచిత వైద్యపరీక్షలు
- అక్టోబర్ 2న ఎస్‌హెచ్‌జీల సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ప్రారంభం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల్లోని చిన్నారుల కోసం కొత్తగా 'బాల భరోసా'కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ పథకం కింద ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచి తంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వారి లో ఎవరికైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే పెద్ద ఆస్పత్రులకు పంపి ఉచితంగా వైద్యం అందిస్తా మని చెప్పారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. సోమవారం సచివాల యం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. తెలంగాణ రైజింగ్ -2047 సాకారం కావాలంటే మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అన్నారు.

అక్టోబర్ 2న ఎస్‌హెచ్‌జీల పెట్రోల్ బంకులు

మహిళా సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు అక్టోబర్ 2న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే జిల్లాలవారీగా సోలార్ ఇన్‌స్టాలేషన్ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని చెప్పారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను నవంబర్ లోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడులపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను మహిళా సంఘాలతో కుట్టిస్తున్నామని, ఆ పనులు 90 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. పాఠశాలలు తెరిచే రోజు విద్యార్థులందరికీ యూనిఫాంలు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా సంఘాల్లో కొత్త సభ్యులను చేర్చుకోవాలని సూచించారు. అత్యంత పేదరికంలో ఉన్నవారు, మారుమూల ప్రాంతాల మహిళలు, ఎస్టీ మహిళలు ఇంకా ఎస్‌హెచ్‌జీల్లో తక్కువగా ఉన్నారని మంత్రి అభిప్రాయపడ్డారు.

త్వరలో గురుకుల పనివేళల మార్పు: ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలల పనివేళల మార్పునకు ప్రభుత్వం అంగీకరించిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. పనివేళల మార్పులపై పీఆర్‌టీయూటీఎస్ నేతలతో పాటు శ్రీపాల్ రెడ్డి.. సీఎంవో అధికారులు అజిత్ రెడ్డి, వేముల శ్రీనివాస్‌ను కలిసి, వివరించారు. గురుకుల పాఠశాలల టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు, హెల్త్ కార్డులు, గెజిటెడ్ హోదా, గురుకుల పాఠశాలల ఉమ్మడి డైరెక్టరేట్ తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చినట్లు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్ రెడ్డి తదితరులు.. సీఎంవో అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం?

- రివ్యూ కమిటీ సభ్యులను ఎందుకు వదిలేశారు?
- నా రాజీనామా తర్వాత రికార్డుల ధ్వంసం జరిగితే నేనెలా బాధ్యుడిని?
- సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించిన ప్రభాకర్‌రావు
- అక్రమ ట్యాపింగ్ కేసులో ఏడు గంటల పాటు విచారణ
- బుధవారం మరోసారి విచారణకు రావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సిట్ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం మాట అటుంచితే.. ఆయనే సిట్ అధికారులను ఎదురు ప్రశ్నిస్తున్నారని తెలిసింది. ఆదివారం అమెరికా నుంచి తిరిగి వచ్చిన ప్రభాకర్‌రావు సోమవారం తన న్యాయవాదితో కలిసి సిట్ విచారణకు హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయానికి ప్రభాకర్‌రావు చేరుకున్నారు. వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్, సిట్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని బృందం ప్రభాకర్‌రావును ప్రశ్నించింది. మధ్యాహ్నం గంటసేపు లంచ్ బ్రేక్ ఇచ్చి, రాత్రి 7.30 గంటల వరకు ఆయన్ను విచారించారు. ప్రభాకర్‌రావు చెప్పిన వివరాలను ఆయన స్టేట్‌మెంట్‌గా రికార్డు చేసుకున్నారు. బుధవారం మరోసారి విచారణకు రావాల్సిందిగా ప్రభాకర్‌రావుకు పోలీసులు సూచించారు.

ట్యాపింగ్‌కు నేను అనుమతివ్వలేదు

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు పోలీసులు చేసిన దర్యాప్తు, నిందితులు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించారు. అయితే, ఆయన మాత్రం ఈ కేసుతో తనకు సంబంధమే లేదని వాదించినట్లు విశ్వసనీయ సమాచారం. 'అక్రమ ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం? ఏయే ఫోన్లు ట్యాప్ చేయాలి? ఎంత కాలం చేయాలి? ఎందుకు చేయాలి? అనేది ఖరారు చేయడానికి, ఆ వ్యవహారాన్ని పర్యవేక్షించడానికి రివ్యూ కమిటీ ఉంటుంది. ఆ కమిటీలో సభ్యులుగా ఉండే ఉన్నతాధికారులను ఎందుకు వదిలేశారు?' అని ప్రభాకర్ రావు ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయా అధికారులను విచారించి, వాంగ్మూలాలు నమోదు చేశామని పోలీసులు చెప్పగా... ట్యాపింగ్‌కు అనుమతి ఇచ్చింది వారేనని.. తనకు ఏమాత్రం సంబంధం లేదని వాదించినట్లు సమాచారం.

వారితో వృత్తిగత బంధమే..

డీఎస్పీగా పని చేసిన ప్రణీత్‌రావు తనవద్ద పని చేశారని, విధి నిర్వహణలో భాగమైన మావోయిస్టులకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే తాము పర్యవేక్షించామని ప్రభాకర్‌రావు చెప్పినట్లు తెలిసింది. తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావు తదితరులతో తనకు వృత్తిపరమైన సంబంధాలు మాత్రమే ఉన్నాయని స్పష్టంచేసినట్లు సమాచారం. 2023 నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఎస్ఐబీ కార్యాలయంలో హార్డ్‌డిస్క్‌ల ధ్వంసంపైనా అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించారు. ఆ నెల 30న సాయంత్రం 4 గంటలకే తాను ఎస్ఐబీ చీఫ్ పోస్టుకు రాజీనామా చేశానని, ఆ వెంటనే కార్యాలయాన్ని విడిచిపెట్టి వెళ్లానని చెప్పిన ప్రభాకర్‌రావు... ఆ తర్వాత రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతో తనకు ఎలా సంబంధం ఉంటుందని సిట్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ హార్డ్‌డిస్కులు ధ్వంసం చేసి, కొత్తవి పెట్టమన్నది ఎవరు? అని పోలీసులు ప్రశ్నించగా... ఆయన నుంచి సరైన స్పందన రాలేదు. ఈ విచారణ మొత్తాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. బుధవారం మరోసారి విచారణకు రావాల్సిందిగా ప్రభాకర్‌రావుకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల సమయంలో వినియోగించిన రెండు సెల్‌ఫోన్లు, ట్యాబ్, మ్యాక్‌బుక్, ల్యాప్‌టాప్ తీసుకువచ్చి అప్పగించాలని ఆదేశించారు.

'సాక్షి'పై దాడుల్ని ఖండించిన ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: సాక్షి టీవీ నిర్వహించిన ఒక చర్చ కార్యక్రమంపై నిరసన పేరుతో ఏపీలోని సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు జరిపి, ధ్వంసం చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె.రాంనారాయణ, సీనియర్ సంపాదకుడు డాక్టర్ కె.రామచంద్ర మూర్తి సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధ్వంస సంస్కృతి ఏ రకంగానూ సమర్థనీయం కాదన్నారు. కొమ్మినేనిపై కేసు నమోదు చేయడం సరైంది కాదని, క్షమాపణ చెప్పిన జర్నలిస్టును విడుదల చేయాలని కోరారు. సాక్షి పత్రిక, చానల్ కార్యాలయాల ధ్వంసానికి పాల్పడ్డ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులు తగవు

ఏపీయూడబ్ల్యూజే ఖండన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో సాక్షి పత్రిక కార్యాలయాలపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులు చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఏపీ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అధికార టీడీపీ కార్యకర్తలు.. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి, బోర్డులను తొలగించడం, పత్రిక ప్రతులను దహనం చేయడం వంటి చర్యలు దిగ్భ్రాంతి కలిగించాయని పేర్కొన్నారు. జూన్ 6న సాక్షి టీవీ లైవ్ షోలో అమరావతి మహిళలను కించపరుస్తూ ఒక పాత్రికేయుడు చేసిన వ్యాఖ్యల నేపథ్యాన్ని పురస్కరించుకుని.. అధికార పార్టీ కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపై దాడులకు పూనుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని జర్నలిస్ట్ నాయకులు అభిప్రాయపడ్డారు. అధికార పార్టీ నేతలు వెంటనే తమ కార్యకర్తలను అదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. లైవ్ షో నిర్వాహకుడు, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు.. తన షోలో జరిగిన ఘటనకు క్షమాపణ చెప్పినందున ఆయన సీనియారిటీని, వయసును దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు నిలిపివేయాలని యూనియన్ల నాయకులు విజ్ఞప్తి చేశారు. సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడులు హేయమని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్-ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు సింహాద్రి కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి అంశంపై 'సాక్షి' చానల్‌లో ప్రసారమైన చర్చపై రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుంటే.. మరోవైపు 'సాక్షి' కార్యాలయాలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడి ఆస్తులను ధ్వంసం చేయడం అధికార దౌర్జన్యానికి పరాకాష్టగా కనిపిస్తోందని సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రమణారెడ్డి పేర్కొన్నారు. సాక్షి మీడియాపై దాడులు హేయం

అరెస్టు కక్ష సాధింపే..

సాక్షిపై దాడులు దురదృష్టకరం: ఐఎఫ్‌డబ్ల్యూజే, టీడబ్ల్యూజేఎఫ్

చార్మినార్ (హైదరాబాద్): సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడాన్ని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించాయి. ఇది పోలీసుల కక్ష సాధింపు చర్యలో భాగమని ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య, సీనియర్ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్ తదితరులు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు హైదరాబాద్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు సందర్భంగా వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని తెలిపారు. ఆందోళనల పేరుతో సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడులకు దిగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి: డీజేయూ

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును డెమొక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్ (డీజేయూ) ఏపీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అమరావతి రాజధానిపై సాక్షి టీవీలో జరిగిన చర్చ నేపథ్యంలో.. విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు దుర్మార్గమైన చర్య, పత్రికా స్వేచ్ఛపై దాడి అని డీజేయూ ఒక ప్రకటనలో ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వ సర్వే రిపోర్టును జర్నలిస్టులు విశ్లేషణాత్మకంగా చర్చించటం నేరం కాదని, పత్రికలకు ఆ స్వేచ్ఛ ఉందని డీజేయూ రాష్ట్ర అధ్యక్షుడు గజం విజయ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు, వ్యవస్థాపక అధ్యక్షుడు బళ్లా రాధాకృష్ణ, కోశాధికారి సూరత్ బాలకృష్ణ పేర్కొన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జస్టిస్ శ్రీసుధ సేవలు ప్రశంసనీయం

వీడ్కోలు సమావేశంలో హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్

నాలుగేళ్లలో 5,055 కేసులను పరిష్కరించారని కితాబు



జస్టిస్ శ్రీసుధ

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జస్టిస్ పి.శ్రీసుధ 5,055 కేసులను పరిష్కరించారని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ప్రశంసించారు. కుటుంబ సంబంధిత వివాదాల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారన్నారు. బదిలీపై కర్ణాటక వెళ్తున్న జస్టిస్ శ్రీసుధను హైకోర్టు ఫుల్ బెంచ్ సోమవారం ఘనంగా వీడ్కో లు పలికింది. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఆమె సేవలను ప్రశంసించారు. ముందుగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ఆమె ఇచ్చిన కీలక తీర్పులను, న్యాయమూర్తిగా ఎదిగిన తీరును వివరించారు. జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు సహా పలు ప్రధాన కేసుల విచారణ, తీర్పులో తాను భాగస్వామి కావడం హర్షణీయమన్నారు. దీనికి సహకరించిన సహచర న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 2021 నుంచి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా తాను అందించిన విధులు ఎంతో సంతృప్తినిచ్చాయని జస్టిస్ శ్రీసుధ చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులతోపాటు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు జగన్, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం హెచ్‌సీఏఏ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తెలంగాణ హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న జస్టిస్ శ్రీసుధను కర్ణాటకకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఏప్రిల్‌లో సిఫార్సు చేయగా కేంద్రం ఆమోదించిన విషయం తెలిసిందే.

దేశానికి జీఎస్ఐ అద్భుత సహకారం

నెక్స్ట్ జెన్ జియోఫిజిక్స్ సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఎల్బీనగర్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) 175 ఏళ్లుగా దేశా నికి అద్భుత సేవలు అందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రశంసించారు. జీఎస్ఐ శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ)లోని ఆడిటోరియంలో నెక్స్ట్ జెన్ జియోఫిజిక్స్-2025 సదస్సును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథులుగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లా డుతూ ఖనిజాల అన్వేషణ ప్రమాదాలతో కూడుకున్నదైనప్పటికీ జీఎస్ఐ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భార తదేశ శక్తి, సాంకేతిక అవసరాలను తీర్చడానికి అధిక రిజల్యూషన్ భూకంప డేటా, ఏఐ-ఎంఎల్ ఇంటిగ్రేషన్ జియో ఫిజికల్ మ్యాపింగ్ అవసరం ఉందన్నారు. ఏఐ మెషీన్ లెర్నింగ్, జియో స్పేషియల్ అనలిటిక్స్ రంగాల్లో భారత్ స్థిరమైన అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. ప్రధాని మోదీ మార్గ దర్శకత్వంలో ఆత్మనిర్భర్ వికసిత్ భారత్ దార్శనికతతో వ్యూహాలను అమ లు చేస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ఈటల మాట్లాడుతూ ఖనిజ భద్రత, ప్రకృతి వైపరీత్యాల సవాళ్లను పరిష్కరించడంలో భౌగోళిక శాస్త్ర పరిశోధన కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ఇరువురు నేతలు అధునాతన హైడ్రాలిక్ డ్రిల్లింగ్, ఎక్స్‌పో పెవిలియన్‌ను ప్రారంభించి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను తిలకించి సాంకేతిక వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఎస్ఐ డీజీ అసిత్ సాహా, డైరెక్టర్లు ధీరజ్ పాండే, ప్రకాష్‌కుమార్, శాలివాహన్, డీడీజీలు రవి, ఎల్‌పీ సింగ్, కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

20న ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20న ఎల్బీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం సీజీహెచ్ కాంప్లెక్స్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరౌతారని తెలిపారు. యోగాను జీవితంలో భాగం చేయాలనే అంశాన్ని విద్యార్థి దశనుంచే అలవాటు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు యోగాకు అంబాసిడర్ కావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈనెల 30 వరకు రేషన్ పంపిణీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాలు ఈనెల 30వరకు తెరిచే ఉంటాయని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం నెలాఖరు వరకు పంపిణీ చేస్తామని పేర్కొంది. ఈనెల 15వ తేదీతో రేషన్ పంపిణీ ముగుస్తుందని కొందరు భావిస్తున్నారని, అలాంటిదేమీ లేదని స్పష్టం చేసింది. అధికారికంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం 30వ తేదీ వరకు రేషన్ పంపిణీ కొనసాగుతుందని సంస్థ తరఫున ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు రేషన్ దుకాణాల వద్ద గుమిగూడాల్సిన అవసరం లేదని, లబ్ధిదారులు నిర్దేశిత సమయంలో క్రమపద్ధతిలో రేషన్ దుకాణాలను సందర్శించి, తమకు కేటాయించిన రేషన్ తీసుకోవాలని కోరారు. ప్రజలకు సరైన సమాచారం కోసం రేషన్ డీలర్లు తమ దుకాణాల వద్ద షెడ్యూల్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు.





ప్రతి దేశమూ ఇతర దేశాలను ఎగతాళి చేస్తుంది.
కానీ వేటికవి అన్నీ సరైనవే.
- ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 10 జూన్ 2025

నివురుగప్పిన నిప్పు

తుపాను ముందరి ప్రశాంతత అంటే ఇదేనేమో! కొద్దివారాలుగా మణిపూర్ కొంత ప్రశాంతంగా ఉందని భ్రమిస్తున్నంత సేపు పట్టలేదు... ఆ రాష్ట్రం మరోసారి భగ్గుమంది. గత రెండేళ్ళుగా జాతి ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం మళ్ళీ పతాక శీర్షికలకు ఎక్కింది. 2023 అల్లర్ల వేళ అనేక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న మైతేయ్‌ల ర్యాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' (ఏటీ) నేత కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆదివారం ఉద్రిక్తత పెచ్చరిల్లింది. భగ్గుమన్న నిరసనల మధ్య రాష్ట్రంలో పలుచోట్ల కర్ఫ్యూ, అయిదు రోజుల పాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించాల్సి వచ్చింది. వివిధ పార్టీల ఎమ్మెల్యేలు 23 మంది ఆదివారం వెళ్ళి, గవర్నర్‌ను కలసి పరిస్థితిని వివరించి, సామరస్యపూర్వక పరిష్కారానికై అర్థించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వెరసి, కేంద్రం సుదీర్ఘ జాప్యం తర్వాత ఫిబ్రవరిలో ఎట్టకేలకు అసమర్థ బీరేన్ సింగ్ సర్కార్‌ను తప్పించి రాష్ట్రపతి పాలన విధించిందన్న మాటే గానీ, మణిపూర్‌ను యథాపూర్వ స్థితికి తీసుకురాలేకపోయింది. తాజా పరిణామాలే అందుకు నిలువెత్తు నిదర్శనం.

మైతేయ్‌లకు ఎస్టీ హోదాను ఇవ్వడాన్ని కుకీ వర్గ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించడం రెండేళ్ళ క్రితం జాతుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆర్థిక ప్రయోజనాలు, భూయాజమాన్యంపై అసలే దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి ఆ తాజా పరిణామంతో మరింత చిచ్చు రేపింది. అలా 2023 మే 3 నుంచి రాష్ట్రం అక్షరాలా తగలబడుతూనే ఉంది. ఈ ఘర్షణల వల్ల 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. బీరేన్ సింగ్ సారథ్యంలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ, పక్షపాతధోరణితో వ్యవహరించినట్టు ఆది నుంచీ ఆరోపణలున్నాయి. చివరకు భద్రతా దళాలు సైతం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్టు వార్తలొచ్చిన సంగతి మర్చిపోలేం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, బీరేన్‌ను మార్చడానికి ఇష్టపడని బీజేపీ అధిష్ఠానం తీరా గత ఫిబ్రవరిలో ఆయనను పక్కకు తప్పించినా పుణ్యకాలం గడిచిపోయింది.

2022 ఫిబ్రవరి నాటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ మద్దతు కూడగట్టుకొని అధికారం చేపట్టినా, పట్టుమని పదిహేను నెలలకే రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. మొత్తం 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో నిజానికి బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. రాష్ట్రం అతలాకుతలమవుతున్న వేళ... బీరేన్ స్థానంలో అన్ని వర్గాలకూ అనుకూలుడైన కొత్త వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి, రాష్ట్రపతి పాలనను నివారించి ఉండవచ్చు. కానీ, సీఎం అభ్యర్థిపై సొంత పార్టీలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా, కుకీ–జో వర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురు ఘర్షణలు మొదలైన నాటి నుంచి సభకు దూరంగా ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా తయారైంది. చివరకు, ఘర్షణలు మొదలైన 21 నెలల తర్వాత రాష్ట్రపతి పాలనే శరణ్యమైంది. కానీ, అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. ఈశాన్య భారత అభివృద్ధికి తామే బాటలు వేస్తున్నామంటున్న పాలక పార్టీ మణిపూర్ వ్యవహారాన్ని సరైన రీతిలో చక్కదిద్దలేకపోయిందన్న శాశ్వత అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన విధించినా, పర్వత ప్రాంత రాష్ట్రంలో పరిస్థితి నేటికీ నివురు గప్పిన నిప్పులానే ఉందని శని, ఆదివారం నాటి ఘటనలు మరోమారు ఋజువు చేశాయి.

అక్కడి ఉద్రిక్తతను ప్రపంచానికి నివేదిస్తున్న విలేఖరులు సైతం శనివారం భద్రతా బలగాల దాడికి గురయ్యారు. పాత్రికేయులపై రాష్ట్రంలో పదే పదే జరుగుతున్న దాడులకు నిరసనగా చివరకు సోమవారం మణిపూర్‌లోని ప్రధాన పత్రికలన్నీ తమ పేపర్‌లో సంపాదకీయ స్థానాన్ని ఖాళీగా వదిలేశాయి. పత్రికలన్నీ సమష్టిగా నిలిచి ఇలా అరుదైన రీతిలో తమ నిరసన తెలియజేయడం ఓ బలమైన సందేశం. మణిపూర్‌లో ఇప్పటికీ మామూలు పరిస్థితులు లేవనడానికి ప్రతీక. అసలు రెండేళ్ళ క్రితం ఘర్షణలు చెలరేగగానే ఆ ఏడాది జూన్ 4న కేంద్రం ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేసింది. పదే పదే పొడిగింపుల ప్రహసనంతో సదరు సంఘం కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ దాకా దేకింది. అప్పటికైనా ఆ సంఘం కొత్తగా తేల్చేదేమిటో, దాని నివేదికతో ఒరిగేదేమిటో చెప్పలేం. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని 2023 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ వ్యాఖ్యానించినా మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. నష్టనివారణలో చిత్తశుద్ధి కరవైంది.

రాష్ట్రపతి పాలనతో పరిస్థితి మెరుగువతుందనుకుంటే అడియాసైంది. గవర్నర్ సైతం ఇంఫాల్ విమానాశ్రయం నుంచి ఇంటికి హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిరావడం దిగ్భ్రాంతికరం. సాక్షాత్తూ బీజేపీ ఎంపీ ఒకరు 2020లో స్థాపించిన 'ఏటీ' సాయుధ పౌరసైన్యంగా మారి హింసకు పాల్పడి, ఆయుధాలను కొల్లగొట్టినట్టు కథనం. ఎవరెన్నిమార్లు అభ్యర్థించినా, ఇప్పటికీ ఆయుధాలను అప్పగించలేదు. రేపు అవి మరే నేరగాళ్ళ చేతిలో పడి, ఎక్కడకు దారి తీస్తాయో ఊహించలేం. గతంలో పలు తీవ్రవాద వర్గాలు నిషేధానికి గురైనా, ఇప్పటికీ ఏటీని ఎందుకు నిషేధించలేదంటే జవాబూ లేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని పెదవి విప్పకపోవడం, ప్రపంచమంతా తిరుగుతున్నా ఈశాన్యంలో పర్యటించి భరోసా ఇవ్వకపోవడం సమర్థించలేం. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి, విభిన్న వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేయాలి. హింస కన్నా అభివృద్ధి ముఖ్యమని నచ్చజెప్పాలి. వేలాది సగటు మణిపురీలు అనేక నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి రావడం అన్ని పార్టీల సమష్టివైఫల్యం. ఇది ఇలాగే కొనసాగితే మానవత్వానికే మాయనిమచ్చ. దేశసమగ్రతకే ప్రమాదం.

జీడీపీ వృద్ధి కథనం వెనుక...

విశ్లేషణ



డా॥ బొడ్డు సృజన

హైదరాబాద్‌లో ఆకాశాన్ని తాకే అందమైన సాఫ్ట్‌వేర్ కార్యాలయాలకి ఎనిమిది కిలోమీటర్ల ఆవల... అల్పాదాయ వర్గాలు నివసించే ఓ ప్రాంతం. అక్కడ ఓ ఇరుకింట్లో నివసించే 21 ఏళ్ల మానస తెల్లారక ముందే నిద్ర లేచి పనికి బయలుదేరుతుంది. ఓ కార్పొరేట్ కార్యాలయ హౌస్ కీపింగ్ విభాగంలో నెల మొత్తం పని చేస్తే ఆమెకు లభించే వేతనం రూ. 8,500. తల్లి ఐదు ఇళ్లల్లో పనులు చేస్తుంది. తండ్రి తెలంగాణలోని ఓ పల్లెలో సన్నకారు రైతు ఒకప్పుడు. ఇప్పుడు భవన నిర్మాణ కూలీ. ఆ పని కూడా అన్ని రోజుల్లోనూ దొరకని పరిస్థితి. మానస వాళ్ల ఇంటికి కొన్ని వీధుల ఆవల, నగర పెరుగుదలను ప్రతిఫలించే హోర్డింగులు మెరిసిపోతుంటాయి. సేవా రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధిని వెలిగించిన సాఫ్ట్‌వేర్ సిటీగా హైదరాబాద్ కొనియాడబడుతుంటుంది. కానీ మానస వాళ్ల ఇంట్లో ఈ ఆర్థిక వృద్ధి తాలూకూ వెలుగు రేఖలెక్కడా కనిపించవు.

స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పరంగా భారత్ మరో మైలురాయిని చేరుకోవడం, జపాన్‌ను అధిగమించనుండటం గురించి పత్రికలు పలు కథనాలు ప్రచురిస్తున్నాయి. భారత్ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం నిస్సందేహంగా గుర్తించదగిన విజయమే. కానీ, విమర్శనాత్మక దృష్టికోణంలో పరిశీలించినట్టయితే ఇది ప్రశంసించదగిన విజయమని చెప్పలేం. జీడీపీ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని కొలుస్తాయే తప్ప సామాజిక న్యాయం, సమ్మిళితత్వం, మానవాభివృద్ధిని కొలవలేవు. అవి ఆర్థిక వ్యవస్థ చేసే ఉత్పత్తుల గురించి చెబుతాయే తప్ప, వాటి ద్వారా ఎవరు లబ్ధి పొందుతున్నారనే కీలక విషయాన్ని పట్టించుకోవు.

రెండు భారత గాథలు

పరిమాణంలో ఆర్థిక వ్యవస్థ పెద్దదైనప్పటికీ, 125 దేశాలతో రూపొందించిన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ స్థానం దిగువనే, 111వ స్థానంలో ఉంది. సమగ్ర జాతీయ పోషకాహార సర్వే ప్రకారం, ఐదేళ్ల లోపు పిల్లల్లో దాదాపు 35 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 19 కోట్లకు పైగా భారతీయుల్లో పోషకాహార లోపముంది. ఆర్థిక వృద్ధి కూడా చాలామటుకు పట్టణ, సేవారంగ ఆధారితమైంది. 45 శాతం మంది భారతీయులకు వ్యవసాయం ఉపాధి కల్పిస్తున్నప్పటికీ, జీడీపీలో వ్యవసాయ రంగ వాటా కేవలం 15 శాతమే.

ఓవైపు జీడీపీలో పెరుగుదల నమోదవుతుండగా, మరోవైపు ఉద్యోగ రాహిత్యం తాండవిస్తోంది. ఉన్న ఉద్యోగాలకు సైతం భద్రత లేని పరిస్థితి. లేబర్ ఫోర్స్ డేటా ప్రకారం... అసంఘటిత, అభద్రమైన ఉద్యోగాల వైపు మళ్లించబడుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. దేశంలో 80–90 శాతం మంది అసంఘటిత కార్మికులే/ఉద్యోగులే.



ఆదాయ, సంపదల పరంగా ఇప్పుడు ఏర్పడిన అసమానతలు స్వాతంత్ర్యానికి ముందరి వలస కాలపు స్థాయితో పోటీ పడుతున్నాయి. వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ప్రకారం... గత పాతికేళ్లలో ఆదాయ అసమానతలు పెరుగుతూ వచ్చాయి. 40 శాతం దేశ సంపద ఒక్క శాతం దేశ కుబేరుల గుప్పిట్లో ఉంది. దిగువ భాగపు 50 శాతం ప్రజల వద్ద ఉన్న సంపద కేవలం 3 శాతమే. ఓవైపు స్టాక్ మార్కెట్లు, శత కోటీశ్వరులు పెరుగుతుంటే, మరోవైపు లక్షలాది మంది పేదరికం వైపు నెట్టివేయబడుతున్నారు. గ్రామీణ పేదలు, అసంఘటిత కార్మికులు, కింది కులాల వాళ్లు ఆర్థిక అస్థిరత తాలూకూ భారం మోస్తున్నారు. వృద్ధి రేటు పెరుగుదలపై వెలువడుతున్న విజయగాథల్లో... ఈ అసమానతల పార్శ్వం అరుదుగానే వినిపిస్తోంది.

ఇక విద్యారంగ పరిస్థితికొస్తే... సర్కారీ బడుల్లో చేరికలు పెరిగినప్పటికీ 5వ తరగతిలోపు విద్యార్థుల్లో సగానికి పైగా పిల్లలు 2వ తరగతి పుస్తకం కూడా సరిగా చదవలేకపోతున్నారు. విద్య అందుబాటులోకి రావడం ఎంత ముఖ్యమో, నాణ్యత కూడా అంతే ముఖ్యమనే విషయం ఇక్కడ గ్రహించాల్సి వుంది. ఉపాధ్యాయులకు అరకొర జీతాలు చెల్లిస్తుండటం, బట్టీ పట్టించే బోధనా పద్ధతులు అవలంబిస్తుండటం వంటి అంశాలు నాణ్యతా రాహిత్యానికి కారణమవుతున్నాయి. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకునే విషయంలో చోటు చేసుకున్న వ్యత్యాసాలు... కోవిడ్ అనంతర కాలంలో అభ్యసన సంబంధిత అంతరాల్ని మరింత పెంచాయి.

కీలక సూచికల పట్ల పట్టింపు ఏదీ?

ఇష్టపూర్వకమైన సూచికల ఆవల అంతగా పట్టించుకోని, లోతైన వ్యవస్థాగత ప్రమాదాలు పొంచి వున్నాయి. వాతావరణ సంక్షోభం, ప్రాంతీయ అసమానతలు వంటి కొన్ని కీలక సూచికలను ఏ మాత్రమూ లక్ష్యపెట్టలేదు. ఉదాహరణకు– భూగర్భ జల సంక్షోభ తీవ్రత ఎదుర్కొంటున్న ప్రపంచ దేశాల్లో భారత్ ఒకటి. కానీ ఈ సంక్షోభం వల్ల తలెత్తగల పర్యావరణ క్షీణతను జీడీపీ వృద్ధి గణకులు పరిగణనలోకి తీసుకోలేదు.

◆ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పరంగా జపాన్‌ను భారత్ అధిగమించనుండటం, భారత్ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం నిస్సందేహంగా గుర్తించదగిన విజయమే. కానీ, విమర్శనాత్మక దృష్టికోణంలో పరిశీలించినట్టయితే ఇది ప్రశంసించదగిన విజయమని చెప్పలేం. జీడీపీ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని కొలుస్తాయే తప్ప సామాజిక న్యాయం, సమ్మిళితత్వం, మానవాభివృద్ధిని కొలవలేవు. అవి ఆర్థిక వ్యవస్థ చేసే ఉత్పత్తుల గురించి చెబుతాయే తప్ప, వాటి ద్వారా ఎవరు లబ్ధి పొందుతున్నారనే కీలక విషయాన్ని పట్టించుకోవు.

మానవాభివృద్ధి పరంగా కేరళ, తమిళనాడు పై ర్యాంకుల్లో వున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు ఆరోగ్యం, అక్షరాస్యత అంశాల్లో దశాబ్దాలుగా వెనకబడి పోయాయి. సుమారు 145 కోట్ల జనాభా ఉన్న దేశంలో... తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. అసమానతల తీవ్రతను పట్టి చూపే ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా ఇవ్వొచ్చు. పోషకాహారం, విద్య, వస్తు సేవల లభ్యత, వాతావరణ స్థితిస్థాపకత తరహా సూచికల్ని మెరుగుపరచుకునే దిశగా సాగాల్సిన లోతైన సంభాషణకు... జీడీపీ గణాంకాల పట్ల ఉన్న వ్యామోహం అడ్డుపడుతోంది.

మనకు కావలసింది వృద్ధిఫలాలు మెరుగైన రీతిలో పునఃపంపిణీ కావడం. ప్రజారోగ్యంపై పెట్టుబడులు, ప్రాథమిక విద్య, పోషకాహార కార్యక్రమాలు, ఉపాధికి హామీలు వంటి వాటి ద్వారా భారత దేశ దీర్ఘకాల భవిష్యత్తుకు దోహదం చేయడం. మరో విధంగా చెప్పాలంటే... విజయాన్ని పునర్నిర్వచించడం.

మానస కుటుంబం తన మౌలిక అవసరాల విషయంలో ఎలాంటి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోనప్పుడు... ఆమె గౌరవప్రదమైన ఉద్యోగం, న్యాయమైన అవకాశాలు పొందగలిగినప్పుడు... అది, అదే అసలైన వృద్ధి కథనం. అప్పటివరకు జీడీపీ గురించిన కథనాల్లో ఉండేవి పాక్షిక సత్యాలే.

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర బోధకురాలు,
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ, ఏపీ

సోషల్ మీడియా


స్నేహ భ్రమణం



'క్రూ'లోని నా సహచరులు అసాధారణమైన వారు. మేము కలిసి ప్రయాణించేది ఈ ఒక్క వ్యోమనౌక వరకే కావచ్చు, అయినప్పటికీ, మిషన్ పూర్తయ్యాక కూడా మా స్నేహం జీవితాంతం కొనసాగుతుంది.

– శుభాంశు శుక్లా, అంతరిక్ష యాత్రకు వెళ్లనున్న భారత వ్యోమగామి

ప్రార్థన శక్తి



ప్రేమ, శాంతి కోసం పవిత్రాత్మను ప్రార్థిద్దాం. తద్వారా ఆయన సరిహద్దులను తెరుస్తారు. గోడలను పగలగొడతారు. ద్వేషాన్ని పారద్రోలుతారు. అంతేకాదు, పరలోకంలో ఉన్న మన ఏకైక తండ్రి పిల్లలముగా జీవించటానికి మనకు సహాయం చేస్తారు.

– పోప్ లియో, క్రైస్తవ మత గురువు

జానపద వీరుడు



భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధుడు, గిరిజన జానపద నాయకుడు అయిన బిర్సా ముండాను నేడు (9 జూన్) ఆయన వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ... దేశంలోని ఆదివాసీల సాంస్కృతిక మూలాలూ, వారి హక్కుల పరిరక్షణ కోసం గట్టి సంకల్పం చెప్పుకొందాం. ఆ అమర వీరుడికి ఇదే మనం ఇవ్వగలిగిన ఘనమైన నివాళి.

– డా॥ దేవ్ రంజన్ సింగ్, బిహార్ నాయకుడు

ఏఐ... ఇకపై!



ప్రారంభంలో – 'ఏఐ' మన పనులకు సహాయపడగలదని మాత్రమే అనుకున్నాం. ఇప్పుడు – ఎంత సహాయ పడుతున్నా 'ఏఐ' మనుషుల పర్యవేక్షణలో ఉండాల్సిందేనని అనుకుంటున్నాం. కొంతకాలం తర్వాత – 'ఏఐ'ని ఏఐయే నిర్వహించుకోగలదని మనం గ్రహిస్తాం.

– పాల్ గ్రాహమ్, అమెరికన్ సైంటిస్ట్

కలిసి ముందుకు...



పరస్పర గౌరవం అనే స్ఫూర్తి... మన రెండు దేశాలను (ఇండియా, బంగ్లాదేశ్) ఇరువైపులా ప్రజల అభీష్టం మేరకు పని చేయటానికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటుంది.

– మహమ్మద్ యూనస్, బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు

చేరని సహాయం



"నా పేరు గ్రెటా థన్‌బర్గ్. మాది స్వీడన్. మీరు ఈ వీడియోను చూసినట్లయితే మమ్మల్ని కాపాడేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాను. గాజాకు సహాయం అందించేందుకు సరకులతో మేము వెళుతున్న నౌకను ఇజ్రాయెల్ దళాలు, లేదా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చేవారు దారి మళ్లించారు."

– గ్రెటా థన్‌బర్గ్, క్లైమేట్ యాక్టివిస్టు (నౌక నుంచి పోస్ట్ చేసిన వీడియోలో)

కూటమి కుటిల ధర్మం

"నేరాలకు కులం, మతం ఉంటాయా?!" అని ఆంధ్రప్రదేశ్ హోమ్ మంత్రి వంగలపూడి అనిత అమాయకంగా అడుగుతున్నారు! ఈ దేశంలో నేరాలకే కాదు, శిక్షలకు కూడా కులం, మతం ఉంటాయి. అంతదాకా ఎందుకు? అనితకు ఆ పదవి రావడానికి కూడా కులం కారణం కాదా? రాజ్యాంగాన్ని, ఇండియన్ పీనల్ కోడ్‌ని, సీఆర్‌పీసీని అనిత ఆపోశన పట్టారని చంద్రబాబు ఆమెకు ఆ పదవిని కట్టబెట్ట లేదు. కులం లెక్కల్లో భాగంగానే ఆమెకు ఆ పదవి దక్కింది. ఆ విషయం మర్చిపోయి ఆమె ఇలా మాట్లాడటమే విచారకరం. మన సమాజం తులసి వనం ఏమీ కాదు. గంజాయి ఇప్పుడు కొత్తగా మొలకెత్తనూ లేదు, తెనాలిలోకి ఎప్పుడూ రాకుండానూ లేదు.

గంజాయి తాగుతున్న యువకులను రౌడీల పేరిట నడి రోడ్డులో కొట్టిన పోలీసులు గంజాయిని అమ్ముతున్న బడా స్మగ్లర్లపై పీడీ యాక్ట్ ఎందుకు పెట్టడం లేదు? హోమ్ మంత్రి అనిత ఇవేమీ ఎరగనట్లు, పోలీసులు కొడితే తప్పేముందని వివరణ పేరుతో



తెనాలి ఘటనను మరింత మండించారు. పోలీసు దెబ్బలు తిన్న దళిత యువకుల్ని పరామర్శించడానికి వైఎస్ జగన్ రాకూడదు కానీ, అమ్మనబ్రోలులో హత్యకు గురైన మాజీ రౌడీ షీటర్ వీరయ్యను పరామర్శించడానికి మాత్రం అనిత గారు వెళ్లొచ్చు! అది చాలదన్నట్లు ముఖ్యమంత్రి గారు వస్తారు. "వీరయ్యను చంపిన వాళ్లకు ఈ భూమ్మీద బ్రతికే హక్కు లేదు" అని ముఖ్యమంత్రి హోదాలో ఆయన ప్రకటిస్తారు! చంపినవాళ్లు బాగున్నారు. చంపించిన వాళ్లు బాగున్నారు. ఈ కేసుతో ఏమీ సంబంధంలేని ఒంగోలుకు చెందిన ఒక అమాయక దళిత యువకుడు మైరల సూర్య మాత్రం పోలీసు హింసను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు!

అనిత గారూ! మీ జీవితం మీది కాదు, అంబేడ్కర్‌ది. మీ చదువు మీది కాదు, అంబేడ్కర్‌ది. ఇంకా చెప్పాలంటే కారంచేడు, చుండూరు దళిత ఆత్మ గౌరవ ప్రతిఘటన పోరాటాల ఫలితమే మీ దళిత హోంమంత్రి పదవి. తెలుగు దేశం ప్రభుత్వంలో ఇంటలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన ఎ.బి. వెంకటేశ్వర రావు కూడా పోలీసులకు కొట్టే హక్కు లేదని, తెనాలి దళిత యువకులుపై దాడి చట్ట వ్యతిరేకమని సెలవిచ్చారు కదా! మాజీ రౌడీషీటర్ వీరయ్య చౌదరిని అదే కులం, అదే పార్టీ వారు హత్య చేస్తే హోంమంత్రిగా హుటాహుటిన అర్ధరాత్రి ఒంగోలు వెళ్లి పరామర్శించవచ్చు. అమ్మనబ్రోలులో అంత్యక్రియలకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లొచ్చు. కానీ తెనాలిలో దళిత యువకులపై పోలీస్ హింసను ప్రతిపక్ష నేత జగన్ ఖండించకూడదు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించకూడదు. ఇదేనా హోంమంత్రి గారూ, దళితుల పట్ల కూటమి ప్రభుత్వ ధర్మం.

– నీలం నాగేంద్ర రావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి

నెత్తుటియేరుల్లో కత్తుల కోలాటం

అభిప్రాయం



మహంతి వెంకటరావు

మనుషులు రకరకాల నేపథ్యాలతో పుడతారు. రకరకాల వర్గ, కుల, మత, ప్రాంత, భాష, జాతీయతల ఆధారిత అస్తిత్వాలు, రకరకాల వెనక్కి మళ్లే, ఉన్న చోటనే ఉంచే లేదా నెమ్మదిగానో ధృత గతిలోనో ముందుకు పోయే ఆలోచనలు, చింతనలు, సిద్ధాంతాలు, మనస్తత్వాలు ఏర్పరచుకొని రకరకాల వృత్తులు, వ్యాపకాల్లో కొనసాగి ముందో, వెనకో మరణిస్తారు.

తెంటు చలం అలియాస్ సుధాకర్ గెరిల్లా జీవితాన్ని ఎంచుకుని నిరుపేదలు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే సంకల్పంతో అజ్ఞాత జీవితం గడుపుతూ అడవి బాట పట్టి నాలుగు దశాబ్దాలు దాటింది. నిజానికి సాయుధ పోరుతో సమాజాన్ని మార్చే అజ్ఞాత రివల్యూషనరీ సగటు ఆయుష్షు మూడు నుంచి ఐదేళ్లకు మించితే గొప్పే. ఎందుకంటే వాళ్ల బతుకు నిరంతర సంగ్రామం. నిత్యం పొంచి ఉన్న దాడుల, అనారోగ్యాల, పాము కాట్ల, నెత్తుటేరుల్లో పుట్టి మునకల కత్తుల కోలాటం. ఎప్పుడో ఎక్కడో ఆయుర్వేద వైద్యుడిగా గడిపి మరణించాల్సిన ఈ చలం అలియాస్ సుధాకర్ 70 ఏళ్ల దాకా ఏటికి ఎదురీది ఉత్తరాంధ్ర, గోదావరి మన్యం, ఏవోబీ, అబూజ్మడ్ దండకారణ్య ప్రాంతాల్లో నిరుపేద ఆదివాసీ అణగారిన వర్గాల జనాల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం విత్తులు జల్లి దోపిడీని ప్రశ్నించి, ఎదిరించే చైతన్యం అందించి నిష్క్రమించాడు.

సమాజానికి అవసరమైన ఉద్యమం

2004లో వైఎస్సార్ సీఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా హోమ్ మంత్రి జానారెడ్డి తదితరులతో చర్చలు జరిపే మావోయిస్టు పార్టీ ప్రతినిధులుగా అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, తెంటు చలం అలియాస్ సుధాకర్ తదితరులు అడవి వీడి బయటకు వచ్చారు. హైదరాబాద్‌లో వాళ్లను చూసే అవకాశం మాలాంటి జర్నలిస్టులకు దక్కింది. చాలా సరళమైన, వినమ్ర జీవన విధానం వాళ్లది. వీళ్ల ఉద్యమం ఓ మోస్తరు స్థాయిలో కొనసాగడం సమాజానికీ, గిరిజనులకూ అవసరం అని; వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలు కోట్ల ఖర్చుతో చేయలేని ఆదివాసీ ఉద్ధరణ పని ఈ ఆదర్శవాద యువత చేస్తోందని 1990లలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో అప్పటి ఉమ్మడి మధ్యప్రదేశ్ డీజీపీ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదే మాట నేను మళ్లీ రెండు నెలల క్రితం



◆ వీళ్ల ఉద్యమం ఓ మోస్తరు స్థాయిలో కొనసాగడం సమాజానికీ, గిరిజనులకూ అవసరం అని; వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలు కోట్ల ఖర్చుతో చేయలేని ఆదివాసీ ఉద్ధరణ పని ఈ ఆదర్శవాద యువత చేస్తోందని 1990లలో అప్పటి ఉమ్మడి మధ్యప్రదేశ్ డీజీపీ అన్నారు.

ఒడిశాలో ఓ రైలు ప్రయాణంలో ఓ కోబ్రా కమాండో నోట విన్నాను.

బడా ధనవంతుల రక్షణ తమ ఉద్యోగం అనీ, నిరుపేదల రక్షణ కవచం మావోయిస్టులు అనీ, బ్రతుకుతెరువు కోసమే వాళ్లను హతమార్చే ఉద్యోగం చేస్తున్నాననీ 30 దాటిన వయసులోని 10 ఏళ్ల అనుభవం ఉన్న ఆ యువ కమాండో నాతో అన్నాడు. నిజానికి 19వ శతాబ్దపు జర్మన్, బ్రిటిష్ రాజులు తలచుకుంటే మార్క్స్ లాంటి శ్రామికవర్గ శ్రేయోవాదులు గాని, 20వ శతాబ్దంలో రష్యన్ జార్ చక్రవర్తి ఆగ్రహిస్తే లెనిన్, స్టాలిన్ లాంటి బోల్షెవిక్ ఉద్యమకారులు గాని ప్రవాసాలు, జైలు జీవితాల బదులు చిన్న వయసులోనే క్రూర హత్యలకు గురయ్యేవాళ్లు. కానీ అప్పటి ఫ్యూడల్ ప్రభువులు తమను పడగొట్టే యత్నంలో ఉన్న శక్తులపై కొంత ఉదారంగానే ఉండేవారు. కానీ 21వ శతాబ్దపు సూడో ప్రజాస్వామ్యంలో చర్చలకు సిద్ధమని ప్రకటించినా అందుకు ఏమాత్రం సమ్మతించకుండా, ఇజ్రాయెల్ టెక్ నైపుణ్యం అండతో వేలాది ట్రూప్స్‌ను కూంబింగ్‌కు పంపి అడవి జంతువుల్ని వెంటాడి వేటాడినట్టు ప్రభుత్వం దారుణంగా చుట్టుముట్టి చంపుతోంది.

బుద్ధుని బాటలో మధ్యే మార్గం

చావు ఎవరికీ తప్పదు. అందులోనూ విప్లవకారులు చావును ఆమోదించే కదా ఆ బాటలోకి వెళ్లారు! వాళ్లయినా, మన రాజకీయ నేతలైనా, మనమెవరిమైనా చిరకాలం ఇక్కడే ఇలాగే పదిలంగా ఉండిపోము. ఉన్నన్ని రోజులూ మనం ఎవరి మేలు కోసం బతికామో భావి తరాలు బేరీజు వేస్తాయి. బుద్ధ ప్రవచిత 'బహుజన హితమూ, బహుజన సౌఖ్యమే' ఎప్పటికైనా అనుసరణీయం. ఎక్కువమంది బతుకులు అతలాకుతలం చేసి కొద్ది మందికి కులికే అవకాశం ఇచ్చే ఏ వ్యవస్థా ఎంతో కాలం మనలేదు. ఇప్పటికైనా సాయుధ అణచివేత బదులు బుద్ధుని బాటలో మధ్యే మార్గంలో వెళ్లి శాంతియుతంగా ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తే దేశానికి భవిష్యత్‌లో విధ్వంసక అభివృద్ధి క్రమం వల్ల మరింత తీవ్ర గాయాలు తగిలే బెడద తగ్గుతుంది. అన్ని మూలలకూ ఆర్గానిక్ గ్రోత్‌ను విస్తరించడం సాధ్యపడుతుంది. కానీ పాలకులిప్పుడు కాస్త లోతుగా ఆలోచించే స్థితిలో ఉన్నారా? అత్యున్నత న్యాయస్థానం, బుద్ధిజీవులు ఆ దిశగా ప్రభుత్వం యోచించేలా చేయగలరా? ఆశావాదం అవసరమైన నైరాశ్య భరిత కాలమిది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మనసు కట్టడి

అరుణాచలంలోని రమణాశ్రమంలో పలు విషయాలపై చర్చలు జరుగుతుండటం సర్వసహజం. వచ్చిన సందర్శకులలో కొందరు అడిగిన ప్రశ్నకు భగవాన్ రమణ మహర్షి జవాబు చెప్పేవారు, మరి కొన్నింటికి మౌనం వహించేవారు. ఒకరోజు మనిషి



తన మనసును ఎలా నియంత్రించాలి అనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

కొందరు భక్తులు ధ్యానం చేయడం ద్వారా నియంత్రించుకోవచ్చని చెప్పారు. ఇంకొందరు భగవంతుడి నామస్మరణతో అదుపులో పెట్టుకోవచ్చని అన్నారు. మరి కొందరు సాత్విక ఆహారం తీసుకోవడం ద్వారా మనసును గుప్పెట్లో పెట్టుకోవచ్చని తెలిపారు. అయితే భక్తులందరూ భగవాన్ ఏం చెప్తారా అని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అప్పుడు రమణ మహర్షి తమ అభిప్రాయాన్ని ఇలా చెప్పారు:

"నేను విరూపాక్ష గుహలో ఉంటున్న రోజుల్లో ఊళ్ళోకి వెళ్ళి భిక్ష తీసుకొస్తేనే మాకు ఆహారం. అదీనూ వొట్టి అన్నం మాత్రమే. మరేవీ అంటే కూర వగైరాలేమీ ఉండేవి కావు. కొన్నిసార్లయితే భిక్షగా పొందిన అన్నం కూడా అందరికీ సరిపోయేది కాదు. అప్పుడు అందులో నీరు పోసి కలిపి గంజిలా చేసి తాగేవాళ్ళం. ఆ గంజిలో కొంచెం ఉప్పు కలిపితే రుచిగా ఉంటుందిగా అని అనుకునే వాళ్ళం. కానీ మనిషి నాలుక ఉంది చూశారు, అది దొరికిన దానితో తృప్తి పడదు. ఈ రోజు ఉప్పు కావాలని అడిగితే రేపు పప్పు కావాలని అడుగుతుంది. మరుసటి రోజు కూరేదైనా ఉంటే బాగుంటుంది కదాని కోరుతుంది. ఈ విధంగా మన అవసరాలకూ, ఆశలకూ అంతు ఉండదని అర్థం చేసుకోవాలి. నిలకడగా లేని ఈ మనసు దేని కోసం తిరుగుతుందో గ్రహించి, దాని నుంచి మనసును బయట పడెయ్యాలి. మనసును ఆత్మ కట్టడిలోకి తీసుకురావాలి. మనో నియంత్రణ అంటే అదే. ఈ సాధనే సాధువు జీవితానికి తొలి మెట్టు." దీంతో భక్తులు యథార్థాన్ని గ్రహించారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.చతుర్దశి ఉ.10.47 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: అనూరాధ సా.5.48 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.11.53 నుండి 1.37 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.38 వరకు, అమృతఘడియలు: ఉ.6.16 నుండి 8.02 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.30.

క్లుప్తంగా...

24న గోదావరి-కావేరి అనుసంధానంపై సమావేశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై ఈ నెల 24న ఢిల్లీలో నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) సంబంధిత రాష్ట్రాలతో మరోసారి సంప్రదింపుల సమావేశం నిర్వహించనుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరికి సంబంధించిన నీటిపారుదల శాఖాధికారులను ఈ సమావేశానికి ఆహ్వానించింది. ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై తెలంగాణలో ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి నీళ్లను తరలిస్తామని కేంద్రం ప్రతిపాదించగా, తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే తాము నిర్మించిన సమ్మక్క బరాజ్ నుంచి నీళ్లను తరలించుకోవాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లను తరలించాలని ఏపీ కోరుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడానికి ఈ సమావేశాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ నిర్వహిస్తోంది. ఈ నెల 12న నదుల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని సైతం ఎన్‌డబ్ల్యూడీఏ నిర్వహించనుంది.

సింగరేణిలో 'పేర్ల బాధితులకు' డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సింగరేణిలో మారు పేర్ల (అలియాస్ నేమ్స్)తో కార్మికులుగా పనిచేసి డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సింగరేణి జాగృతి నాయకులు, అలియాస్ నేమ్స్ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారితో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సంస్థలో 30 ఏళ్లకు పైగా సేవ చేసిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేయడం అన్యాయమన్నారు. తండ్రులు అలియాస్ పేర్లతో పనిచేస్తే వారసులకు రెండు ఇంటి పేర్లు ఉన్నాయనే కారణంతో ఉద్యోగాలు ఇవ్వడం లేదని, వారిని విజిలెన్స్ విభాగం ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. యాజమాన్యం మానవతా దృక్పథంతో వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కవిత సూచన మేరకు సింగరేణి జాగృతి నేతలు సంస్థ జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) సుభానీని కలిసి వినతిపత్రం అందజేశారు.

పాడి కౌశిక్‌రెడ్డి విచారణ ఎదుర్కోవాల్సిందే

- సెక్షన్ 188ను మాత్రం రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను ఇబ్బంది పెట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై నమోదు చేసిన ఐపీసీ 188ను మాత్రం కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'మీకు దండం పెడతా.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి.. నేను చేయాల్సిన ప్రచారం చేశా. నన్ను సాదుకుంటారో.. చంపుకుంటారో మీ ఇష్టం' అంటూ ఓటర్లను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారనేది ఆరోపణ. కమలాపూర్ ఎంపీడీవో ఫిర్యాదు మేరకు ఆయనపై ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. అయితే, తాను ప్రసంగించినట్లు ఉన్న వీడియో ఆధారంగా కేసు నమోదు చెల్లదని పాడి పేర్కొన్నారు. సీడీ ఆధారంగా ఫిర్యాదు చేశారని చెబుతున్న పోలీసులు దాన్ని కోర్టుకు అందజేయలేదని, సాక్షుల్లో ఒక్క ఓటరు కూడా లేరన్నారు. రాజకీయ కక్షతోనే కేసు పెట్టారని, నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులోని కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టును విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ ఏప్రిల్‌లో తీర్పు రిజర్వు చేసి.. సోమవారం వెలువరించారు. ఎమ్మెల్యేపై పెట్టిన సెక్షన్ 188 సమర్థనీయం కాదని కొట్టివేశారు. కేసును పూర్తిగా కొట్టివేయాలన్న కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తిని తోసిపుచ్చారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టం.. యువకుడి ఆత్మహత్య



వంశీ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలో విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపల్లికి చెందిన తుమ్మల వంశీ (20) ఇంటర్మీడియట్ పూర్తి చేసి కార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడుతూ రూ.10 లక్షలు పోగొట్టుకున్నాడు. బెట్టింగ్‌లో డబ్బులు పెట్టేందుకు పరిచయస్తులు, స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. ఇంట్లో ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వంశీ సోమవారం పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

జోరు మీద టూరిజం

2025లో టూరిజం జోరు మామూలుగా ఉండదు.. భారత పర్యాటక రంగానికి ఇది రికార్డ్ బ్రేకింగ్ సంవత్సరం కాబోతోంది.. విదేశీ పర్యాటకులు పోటెత్తనున్నారు... అంటోంది 'వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్' (డబ్ల్యు.టి.టి.సి.). భారత పర్యాటక రంగ వాటా ఈ ఏడాది రూ.22 లక్షల కోట్ల వరకు చేరుకోవచ్చని, ఈ రంగంలో 4.80 కోట్ల మందికి పైగా ఉపాధి లభించవచ్చని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. భారత్‌లో విదేశీ సందర్శకులు చేసే వ్యయం ఈ ఏడాది రూ.3.20 లక్షల కోట్లకు, దేశీయ పర్యాటకుల వ్యయం రూ.16 లక్షల కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. 2035 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం వాటా దాదాపుగా రెట్టింపు అవుతుందని డబ్ల్యు.టి.టి.సి. తెలిపింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



వరల్డ్ టూరిజం కౌన్సిల్ 'ఎకనమిక్ ఇంపాక్ట్ రీసెర్చ్' (ఈవీఆర్) పేరిట తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. భారత దేశంలో అంతర్జాతీయ సందర్శకుల వ్యయం 2024లో రికార్డు స్థాయిలో రూ.3.10 లక్షల కోట్లకు చేరుకుంది. 2019లో ఉన్న గరిష్ట స్థాయి కంటే ఇది 9 శాతం ఎక్కువ. ఈ ఏడాది భారత్‌లో దేశీయ పర్యటనల వ్యయం 2019లో కంటే 22 శాతం ఎక్కువగా రూ.15.50 లక్షల కోట్లుగా నమోదైంది. మళ్లీ ఊపందుకున్న అంతర్జాతీయ సందర్శనలు భారత పర్యాటక రంగానికి కాసుల వర్షం కురిపించనున్నాయి.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. విదేశీ పర్యాటకుల్లో ఎక్కువమంది హాలిడే, రిక్రియేషన్ కోసమే మనదేశానికి వస్తున్నారు. 2024లో దాదాపు 45 శాతం మంది ఇందు కోసమే రావడం గమనార్హం. 2035 నాటికి పర్యాటక రంగం వాటా రూ.42 లక్షల కోట్లకు చేరుకుంటుందని, 6.40 కోట్ల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తుందని ఈవీఆర్ అంచనా వేసింది. 2035 నాటికి మొత్తం ఉద్యోగాల్లో దాదాపు 11 శాతం పర్యాటక రంగంలోనే ఉండొచ్చని తెలిపింది. జీడీపీలో పర్యాటక రంగం వాటా 2024లో 6.6 శాతంగా ఉంది. ఇది 2035 నాటికి 6.9 శాతానికి పెరగొచ్చని లెక్కకట్టింది.

ఎన్నారైల రాకపోకలూ రాబడే

భారత పర్యాటక రంగం.. దేశ ఆర్థిక వ్యవస్థకు గత ఏడాది దాదాపు రూ.21 లక్షల కోట్లు అందించింది. 2019తో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువ. దాదాపు 4.65 కోట్ల మందికి ఉపాధి దొరికింది. భారతదేశం మొత్తం ఉపాధిలో ఇది 9.1 శాతానికి సమానం. 2024లో భారత్‌ను 96.57 లక్షల మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. వరల్డ్ టూరిజం కౌన్సిల్ అధ్యయనం ప్రకారం, కరోనాకు ముందు నాటితో పోలిస్తే ఆ పెరుగుదలకు ప్రవాస భారతీయుల సందర్శనలే ఎక్కువగా దోహదపడినట్లు తెలుస్తోంది.

ఊపు మీద వ్యాపార యానం

భారత వ్యాపార ప్రయాణాలు సైతం రికార్డు స్థాయి వృద్ధిని సాధిస్తున్నాయని వరల్డ్ టూరిజం కౌన్సిల్ అధ్యయనం వెల్లడించింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల వ్యయం కలిపి 2024లో రూ.1.10 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది 2019లోని గరిష్ట స్థాయి కంటే 2.6 శాతం ఎక్కువ. 'భారత్ ప్రపంచంలోని అత్యంత చురుకైన పర్యాటక ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించడానికి ఇది మంచి అవకాశం. ఇప్పుడు భారత్ గమనం ఆ దారిలోనే ఉంది. ఈ–వీసా విధానాన్ని సరళతరం చేసేందుకు భారత్ చర్యలు చేపట్టడం మంచి పరిణామం. సాంస్కృతిక వారసత్వ సంపద, ప్రకృతి సౌందర్యం, వినూత్నమైన ఆకర్షణల సమ్మిళితమైన భారత పర్యాటక రంగానికి ప్రభుత్వం ఒక స్థిరమైన మద్దతు ఇవ్వాలి' అని డబ్ల్యు.టి.టి.సి. సూచించింది. వరల్డ్ టూరిజం కౌన్సిల్ అధ్యక్షురాలు జూలియా సింప్సన్ భారత పర్యాటక రంగ అభివృద్ధిని ప్రశంసించారు. ప్రస్తుతం జోరుమీదున్న భారత పర్యాటక రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె సూచించారు.

2024లో ఏ దేశం నుంచి అత్యధికంగా వచ్చారంటే... (శాతాల్లో)

దేశం	శాతం
అమెరికా	18.14
బంగ్లాదేశ్	17.57
యూకే	10.28
ఆస్ట్రేలియా	5.20
కెనడా	4.78

ఆధారం: కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ

భారత్‌కు 2025 గుర్తుండిపోయే ఏడాది
- రానున్న ఆదాయం రూ.22 లక్షల కోట్లు
- 4.8 కోట్ల మందికి పైగా ఉపాధి
- 2035 నాటికి రెట్టింపు కానున్న పర్యాటకం వాటా

వరల్డ్ టూరిజం కౌన్సిల్ అంచనా

పర్యాటకంలో ఉద్యోగాల జాతర

సంవత్సరం	ఉద్యోగాలు (కోట్లలో)	మొత్తం ఉద్యోగాల్లో శాతం
2019	3.98	9
2024	4.63	9.1
2025 (అంచనా)	4.82	9.4
2035 (అంచనా)	6.39	10.9

కృష్ణా జలాలపై 18న కీలక భేటీ

- నాలుగు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులతో భేటీ కానున్న కేంద్రమంత్రి

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై గతంలో జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలో కృష్ణా ట్రిబ్యునల్–2 ఇచ్చిన తీర్పును అమలుచేసేందుకు కేంద్రం కసరత్తు ముమ్మరం చేసింది. దీనిపై అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 18న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆయా రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో సమావేశం నిర్వహించనున్నారు. వాస్తవానికి గత నెల 7న ఈ సమావేశం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పును యథాతథంగా అమలు చేస్తే మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని, తెలంగాణ అన్యాయం జరిగే ప్రమాదం ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పీటముడి: కృష్ణా జలాల పంపిణీపై 2013 నవంబర్ 29న కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు వెలువరించగా, దానిని అమల్లోకి తెస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయరాదని కోరుతూ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ సైతం ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న వాటాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే బాధ్యతలను కృష్ణా ట్రిబ్యునల్–2కే కేంద్రం అప్పగించింది. దీనిపై ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి మాత్రమే విచారణ జరుగుతున్నందున ట్రిబ్యునల్ తీర్పును అమల్లోకి తెస్తూ గెజిట్ ప్రకటన జారీ చేయాలని మహారాష్ట్ర, కర్ణాటక కోరుతున్నాయి. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే గెజిట్ ప్రకటన జారీచేసే అవకాశముంది. గెజిట్ జారీచేస్తే కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు అమల్లోకి వస్తుంది.

ఇప్పటికీ బచావత్ అవార్డే: కృష్ణా ట్రిబ్యునల్–1 కృష్ణాలో 2,060 టీఎంసీల లభ్యత ఉందని నిర్ధారించి.. మహారాష్ట్రకు 560, కర్ణాటకకు 700, ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని కేటాయించింది. కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు అమల్లోకి రాకపోవడంతో 1976లో అమల్లోకి వచ్చిన కృష్ణా ట్రిబ్యునల్–1 కేటాయింపులే ఇంకా అమలవుతున్నాయి. 65 శాతం లభ్యత ఆధారంగా కృష్ణాలో 2,578 టీఎంసీల లభ్యత ఉందని కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్ధారించి ఉమ్మడి ఏపీకి 1,005, కర్ణాటకకు 907, మహారాష్ట్రకు 666 టీఎంసీలు కేటాయించింది. 65 శాతం లభ్యతతో నీటి కేటాయింపులు చేస్తే దిగువ రాష్ట్రాలు నష్టపోతాయని ఉమ్మడి ఏపీ అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో 18న జరిగే భేటీలో ఏకాభిప్రాయం కుదిరితేనే సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకోనుంది.

పాత పద్ధతులకు స్వస్తి చెప్పండి.. కొత్త పద్ధతులపై దృష్టి పెట్టండి

- శాస్త్రవేత్తలకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచన

మహేశ్వరం/ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మన్సాన్‌పల్లి, రామచంద్రగూడ గ్రామాల్లో పర్యటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి వ్యవసాయ, ఉద్యాన పంటలను పరిశీలించారు. అనంతరం శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, కొత్త వంగడాల ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అంతకు ముందు మన్సాన్‌పల్లి గ్రామంలో రైతు సామ హన్మంత్‌రెడ్డి, రామచంద్రగూడకు చెందిన రైతు కాటారం అభిలాష్‌గౌడ్ ఆధునిక పద్ధతుల్లో సాగు చేసిన పూలు, పండ్ల తోటలను సందర్శించారు. పాలీహౌస్‌లో సాగు చేస్తున్న పూల మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్ పెంపకం, ఆయిల్‌పామ్, బొప్పాయి, మామిడి తోటల రైతులను అభినందించారు. వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గించాలని పలువురు రైతులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్‌భాషా, వ్యవసాయ కమిషనర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



రామచంద్రగూడలో చామంతి పూల తోటను పరిశీలించి రైతుతో ముచ్చటిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

స్టాళ్ల పరిశీలన

ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్‌లోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పరిశీలించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న అధునాతన మార్పులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కొబ్బరి బోర్డు' ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం తెలంగాణ పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3,300 ఎకరాల మేర కొబ్బరి సాగవుతుందని, అందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 75 శాతం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో 1,757 ఎకరాలు, ఖమ్మంలో 696 ఎకరాలలో కొబ్బరి సాగు చేస్తున్నారని, మిగతా జిల్లాలలో కూడా కొబ్బరిసాగును విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గతంలో హైదరాబాద్‌లో ఉన్న కొబ్బరిబోర్డు కార్యాలయాన్ని రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు తరలించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొబ్బరి రైతులు, రైతు సంఘాలు, ఎఫ్‌పీవోలు అశ్వారావుపేట లేదా దమ్మపేటలో కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారని చెప్పారు.

నాణ్యమైన విత్తనాల ఎంప్యానల్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలి

ఆయిల్‌పామ్ సాగు కోసం కేంద్రం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్– ఆయిల్ పామ్ (NMEO& OP) కింద తెలంగాణ 1.25 లక్షల హెక్టార్లకు లక్ష్యంగా పెట్టుకొని, ఇప్పటివరకు 75,000 హెక్టార్లలో సాగు చేపట్టి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విత్తనాల సరఫరాదారులను గుర్తించి ఎంప్యానల్ చేయడం ద్వారా రైతులకు నష్టాలు రాకుండా ఆయిల్‌పామ్ అభివృద్ధిని వేగవంతం చేయొచ్చని తుమ్మల తన లేఖలో వివరించారు.

- హార్టికల్చర్ వర్సిటీలో విద్య, పరిశోధన, విస్తరణ సేవలు విస్తరించేందుకు నిధుల విడుదల చేయాలన్నారు.

ఐఈడీ పేలి ఏఎస్పీ మృతి

- డీఎస్పీ, సీఐ, కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు
- సుక్మా జిల్లా కుంటలో ఘటన
- పోలీసులు వస్తారని అంచనా వేసి ముందే ఐఈడీ అమర్చిన మావోయిస్టులు
- దూసుకుపోతున్న పోలీసు బలగాలకు గట్టి ఎదురుదెబ్బ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు అమర్చిన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్)పై కాలుపెట్టిన ఓ ఏఎస్పీ ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో దూసుకుపోతున్న పోలీసులకు సోమవారం బస్తర్ అడవుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మంగళవారం భారత్‌బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో బస్తర్ అడవుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 7వ తేదీ రాత్రి 15మంది సభ్యులతో కూడిన మావోయిస్టుల బృందం పీఎల్‌జీఏ కమాండర్ మడావి హిడ్మా సొంతూరైన సుక్మా జిల్లాలోని పువర్తి గ్రామానికి చేరుకుంది. అక్కడ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నాడనే కారణంతో ఆ గ్రామ పటేల్‌ను నరికి చంపారు. మరుసటి రోజు 8వ తేదీ రాత్రి సుక్మా జిల్లాలో డోండ్రా గ్రామం దగ్గర క్వారీ తవ్వకాల పనిలో ఉన్న ఓ పొక్లెయినర్‌కు నిప్పు పెట్టారు. దీంతో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఘటనాస్థలికి సోమవారం ఉదయం కుంట పోలీసులు పయనమయ్యారు.



ఆకాశ్‌రావు

పక్కా ప్లానింగ్‌తో..

కుంట డివిజన్ అడిషనల్ ఎస్పీ ఆకాశ్‌రావు గిరిపుంజే(42), డీఎస్పీ భానుప్రతాప్ చంద్రాకర్, సీఐ సోనాల్ గ్వాలా కుంట–ఎర్రబోరు మార్గంలో ప్రయాణించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఎలాగైనా వస్తారని అంచనా వేసిన మావోయిస్టులు, నిప్పు పెట్టిన పొక్లెయినర్‌కు సమీపాన క్వారీలో ఉన్న రాళ్లను అటూ ఇటూ జరిపి నేలకు పైభాగంలోనే ఐఈడీలు అమర్చారు. ఇందులో ఒక ఐఈడీపై ఏఎస్పీ ఆకాశ్‌రావు గిరిపుంజే కాలు వేయగా, అది పేలి తీవ్రంగా గాయపడ్డారు. డీఎస్పీ, సీఐలకు సైతం గాయాలయ్యాయి. ఆ వెంటనే వారిని కుంట ఆస్పత్రికి తరలించేలోగా ఏఎస్పీ గిరిపుంజే పరిస్థితి విషమంగా మారింది. దీంతో హెలికాప్టర్ ద్వారా క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆకాశ్‌రావు మృతి చెందగా, డీఎస్పీ, సీఐ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆకాశ్‌రావు ప్రాణత్యాగం వృథా కాదని, త్వరలోనే మావోయిస్టులను రాష్ట్రంలో లేకుండా చేస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ ప్రకటించారు.

కూతురు బర్త్‌డేకు వస్తానని..

ఏఎస్పీ ఆకాశ్‌రావు ఛత్తీస్‌గఢ్ గ్రూప్–1 ఆఫీసర్‌గా 2013లో పోలీస్ శాఖలో చేరారు. దుర్గ్, రాయపూర్ జిల్లాల్లో పని చేశారు. ఆ తర్వాత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు బదిలీపై వచ్చారు. పోలీసు శాఖ అందించే గ్యాలంట్రీ అవార్డు సైతం పొందారు. చివరిసారిగా మే నెలలో రాయ్‌పూర్‌లో ఉన్న తన కుటుంబం వద్దకు వెళ్లారు. ఆకాశ్‌రావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 11న తన కూతురు బర్త్ డేకు ఇంటికి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పిన ఆయన.. రెండు రోజుల ముందు ప్రాణాలు కోల్పోయారు.

పోలీసు అమరుల కుటుంబాల ధర్నా

పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు రాయ్‌పూర్‌లో హోంమంత్రి విజయ్‌శర్మ ఇంటి ముందు సోమవారం ధర్నా చేశారు. అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను ఆదుకోవడం, తగురీతిలో సాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

పోలీసుల హైఅలర్ట్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు సహా 27 మంది ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు మంగళవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రత కట్టుదిట్టం చేశారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశాం

- రైతులకు రూ.15,121 కోట్ల చెల్లింపులు: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ ఈసారి ధాన్యం కొనుగోళ్లలో రికార్డు సాధించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలన చివరి రోజుల్లో 2023 యాసంగి సీజన్‌లో నాటి ప్రభుత్వం 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, తమ ప్రభుత్వం అదే జూన్ 8 నాటికి 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. వానాకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో దిగుబడి అయిన ధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగైన విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకొని అదనంగా 1,344 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను చేపట్టిందని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 12.33 లక్షల మంది రైతాంగానికి ప్రభుత్వం 15,121 కోట్ల రూపాయలను చెల్లించిందన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- అదుపుతప్పడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం
- బస్సుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం.. పలువురికి గాయాలు



కందుకూరు: ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. రోడ్డు దాటుతున్న బైక్‌ను తప్పించే క్రమంలో బైక్‌తో పాటు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, 33 కేవీ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, బస్సులోని పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. జైత్వారంకు చెందిన సంగెం శ్రీశైలం, భార్య, కుమారుడితో కలిసి ఆదివారం రాత్రి కందుకూరు చౌరస్తాలోని బంధువుల ఇంట్లో జరిగిన విందుకు హాజరయ్యారు. సోమవారం ఉదయం 6.15 గంటల సమయంలో ముగ్గురు బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. శ్రీశైలం రహదారిపై కొత్తగూడ చౌరస్తా నుంచి కొత్తగూడ గ్రామం వైపు మళ్లుతుండగా అచ్చంపేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొడుతూ రోడ్డు పక్కనే ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడంతో పాటు స్తంభం విరిగి బస్సుపై పడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్నవారిలో 15మందికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో కరెంటు సరఫరా ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

కుల దురహంకారానికి యానాది బాలుడు బలి

- వాటర్ హౌస్ ముందు స్నానం చేశాడంటూ దాడి చేసిన మహిళ
- పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలుడు..
- చికిత్స పొందుతూ మృతి..



శ్రీకాంత్

నల్లబెల్లి: కుల దురహంకారానికి ఓ యానాది (గిరిజన తెగలోని ఓ కులం) బాలుడు బలయ్యాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. కొండాపూర్‌లో జెల్ల రమేశ్–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలతో పాటు కుమారుడు శ్రీకాంత్ (14) ఉన్నాడు. రమేశ్ పాము కాటుతో ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో లక్ష్మి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో బతుకుదెరువు కోసం తల్లి కరీంనగర్‌కు వలసవెళ్లింది. కుమారుడు శ్రీకాంత్ గ్రామంలోనే నానమ్మ దగ్గర ఉంటున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంతో తన కుటుంబానికి ఉన్న గొర్రెలతో పాటు గ్రామానికి చెందిన మరో వ్యక్తి గొర్రెలు కాస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొల కొమురమ్మ మేకను కోయాలని శ్రీకాంత్‌తోపాటు మరో వ్యక్తిని కోరింది. వారిద్దరూ ఆమె ఇంటి ఆవరణలో మేకను కోశారు. అనంతరం శ్రీకాంత్ వెళ్లి కొమురమ్మ ఆడబిడ్డ చందు సూరమ్మ ఇంటి ఆవరణలో ఉన్న వాటర్‌హౌస్ వద్ద స్నానం చేస్తున్నాడు. విషయాన్ని గమనించిన కొమురమ్మ మా ఇంటి దగ్గర స్నానం చేస్తావా అంటూ.. కులం పేరుతో దూషిస్తూ కర్రతో శ్రీకాంత్‌ను విచక్షణా రహితంగా కొట్టింది. మనుమడి రోదనలు విన్న నానమ్మ శాంత వెళ్లి కొమురమ్మ కాళ్లపై పడి కొట్టొద్దని వేడుకున్నా కనికరించలేదు. ఈ క్రమంలో శ్రీకాంత్ దాడి నుంచి తప్పించుకొని పక్కనే ఉన్న తన ఇంట్లోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. కొమురమ్మ అంతటితో ఆగకుండా గడియతీయాలని హంగామా చేసింది. దీంతో ఆందోళనకు గురైన బాలుడు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే శ్రీకాంత్‌ని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.



బేడీలేసి.. బలంగా అదిమిపట్టి

- భారతీయ విద్యార్థిపై అమెరికా పోలీసుల కర్కశత్వం
- బలవంతంగా దేశ బహిష్కరణ
- వెలుగులోకి నెవార్క్ ఎయిర్‌పోర్ట్ ఘటన ఫొటోలు, వీడియోలు

వాషింగ్టన్: విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ సర్కార్ కర్కశ వైఖరి తాజాగా మరోసారి వెలుగులోకి వచ్చింది. ఒక భారతీయ విద్యార్థిని బలవంతంగా ఇండియాకు తరలిస్తూ అతని పట్ల దారుణంగా వ్యవహరించిన వ్యవహారం ఆలస్యంగా మీడియాకు బహిర్గతమైంది. విద్యార్థిని నేరస్తుడి తరహాలో సంకెళ్ల వేసి, దారుణంగా హింసిస్తూ నేలకేసి అదిమిపట్టి అదుపులోకి తీసుకుంటున్న ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విద్యాభ్యాసం కోసం తమ దేశానికి వచ్చిన విదేశీ విద్యార్థుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న అమెరికా ప్రభుత్వ వైఖరిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెవార్క్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న కునాల్ జైన్ అనే ఒక ప్రవాసభారతీయుడు తన కెమెరాలో ఈ దృశ్యాలను బంధించి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేయడంతో ఈ దారుణోదంతం బహిర్గతమైంది. హరియాణా రాష్ట్రం నుంచి వచ్చిన ఒక భారతీయ యువకుడిని నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌కు పోలీసులు సంకెళ్ల వేసి తీసుకొచ్చారు. నేనే తప్పు చేయలేదని అరుస్తున్న ఆ యువకుడిని పోలీసులు వెంటనే కిందపడేసి నేలకేసి బలంగా అదిమిపట్టారు. ఒక పోలీసు ఆ యువకుడి మీదనే కూర్చున్నాడు. ''నేరస్తుడిలా సంకెళ్ల వేయడంతో ఏడుస్తున్న ఆ విద్యార్థిని చూస్తుంటే చాలా జాలివేసింది. కలలను నిజం చేసుకునేందుకు అమెరికాకు వచ్చిఉంటాడు. ఎవరికీ ఏ హానీ తలపెట్టకపోయినా ఇలా అరెస్ట్ అయ్యాడు. ఈ ఘటనను కళ్లారా చూస్తూకూడా నేను నిస్సహాయుడినైపోయా. నా హృదయం ముక్కలైంది. చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులను ఇలా బలవంతంగా పంపేయడం నిజంగా పెద్ద విషాదం. ఆ అబ్బాయి హరియాణా యాస అయిన హర్‌యాణ్వీలో మాట్లాడుతున్నాడు. ''నాకేం పిచ్చిలేదు. ఈ అధికారులు నేను పిచ్చివాడిని అని అందర్నీ నమ్మించేందుకు కుట్ర పన్నారు'' అని ఆ విద్యార్థి అరవడం ఆ వీడియోలో కనిపించింది.

ఇండియన్ ఎంబసీ ఆదుకోవాలి

''ఇలాంటి విద్యార్థుల అంశంలో అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయం, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ జోక్యం చేసుకుని విద్యార్థులకు తగు న్యాయం జరిగేలా చూడాలి. నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో ఇతని పట్ల దారుణంగా ప్రవర్తించిన న్యూజెర్సీ అధికారులతో మాట్లాడేందుకు కొందరు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది'' అని జైన్ రాసుకొచ్చారు. ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే విదేశీ విద్యార్థుల వీసా గడువును ముగించేసి వాళ్లను బలవంతంగా దేశబహిష్కరణ చేస్తున్న వేళ తాజాగా ఈ ఘటన జరగడం గమనార్హం. పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్న విదేశీ విద్యార్థులను గుర్తించి గెంటేస్తున్న ఉదంతాలు ఇప్పుడు అమెరికాలో ఎక్కువయ్యాయి.

లాస్ ఏంజెలెస్ రణరంగం

నగరమంతటా ఆగ్రహ జ్వాలలు

- ఆందోళనకారుల దాడిలో అగ్నికి ఆహుతైన సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు
- పోలీసుల రబ్బర్ బుల్లెట్లు, భాష్పవాయు గోళాల ప్రయోగం
- కొనసాగుతున్న అక్రమవలసదారుల అరెస్ట్‌లు
- మరింత తీవ్రరూపం దాల్చిన ఉద్యమం
- నేషనల్ గార్డ్‌ల రాకతో గాడితప్పిన శాంతిభద్రతలు
- ట్రంప్ నిర్ణయంపై కోర్టుకు: కాలిఫోర్నియా గవర్నర్



లాస్ ఏంజెలెస్‌లోని నిర్బంధ కేంద్రం సమీపంలో 101 ఫ్రీవేపై పోలీసులతో నిరసనకారుల ఘర్షణ

లాస్ ఏంజెలెస్: అధ్యక్షుడు ట్రంప్ తన అసాధారణ అధికారాలను ఉపయోగించి నేషనల్ గార్డ్‌లను రంగంలోకి దింపడంతో మరింత పేట్రేగిపోయిన ఆందోళనకారులు తమ ఉద్యమాన్ని ఉధృతంచేశారు. రోడ్లపై కనిపించిన కారునల్లా దహనంచేసి ఉద్యమాగ్నిజ్వాలల్ని మరింత రగిలించారు. దీంతో లాస్ ఏంజెలెస్ నగర వీధులు ఒక్కసారిగా రణరంగంగా మారిపోయాయి. అక్రమవలసదారులను ఫెడరల్ ఏజెంట్లు, ఎఫ్‌బీఐ, పోలీసులు అరెస్ట్‌చేయడాన్ని వేలాది మంది ఆందోళనకారులు నిరసించడంతో మొదలైన ఉద్యమం నెమ్మదిగా ఉగ్రరూపం దాల్చుతోంది. ఓవైపు సరైన డాక్యుమెంట్లులేని వలసదారులను అధికారులు అదుపులోకి తీసుకుంటూ, ఆ అధికారులు, ప్రభుత్వ భవనాలకు రక్షణగా నేషనల్ గార్డ్‌లను ట్రంప్ సర్కార్ రంగంలోకి దింపడంతో నిరసనకారులు మరింతగా రెచ్చిపోయారు.

ఫ్రీవే మూసివేత

పారామౌంట్ పట్టణంలోని ప్రధాన రహదారిని దిగ్బంధించారు. దక్షిణదిశలో వాహనాల రాకపోకలకు ఉపయోగించే 101 నంబర్ ఫ్రీవే రహదారిని మూసేశారు. అడ్డుకునేందుకు వచ్చిన కాలిఫోర్నియా హైవే పెట్రోల్ అధికారులపైకి నిరసనకారులు చేతికొచ్చిన వస్తువుతో విరుచుకుపడ్డారు. కాంక్రీట్ ముక్కలు, రాళ్లు, ఎలక్ట్రిక్ స్కూటర్ విడిభాగాలు, బాణసంచాను అధికారులపైకి విసిరేశారు. వేలాదిగా ఆందోళనకారులు గుమికూడడంతో వెంటనే అందరూ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని లేదంటే అరెస్ట్‌లు తప్పవని పోలీసులు మెగాఫోన్‌లో ప్రకటించారు. అక్రమవలసల ఏరివేత కోసం నేషనల్ గార్డ్‌లను ఉపయోగించబోమని, కేవలం అధికారులు, డిటెన్షన్ సెంటర్ భవనాల రక్షణ నిమిత్తమే వాళ్లను రప్పించామని లాస్‌ఏంజెలెస్ పోలీస్ చీఫ్ జిమ్ మెక్‌డొనెల్ చెప్పారు. డజన్ల కొద్దీ ఆందోళనకారులను అరెస్ట్‌చేశామని తెలిపారు. పెట్రోల్ బాంబు విసిరినందుకు ఒకరిని, అధికారులను బైక్‌తో ఢీకొట్టినందుకు మరొకరిని అరెస్ట్‌చేశారు.

ఫేస్ మాస్క్‌లు ధరించొద్దు

ఫేస్‌మాస్క్ ధరించి ఆందోళనల్లో పాల్గొంటే ఉపేక్షించేది లేదని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంచేశారు. ఫేస్‌మాస్క్‌తో ఎవరు కనిపించినా అరెస్ట్ చేయండని అధికారులకు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా మాధ్యమం 'ట్రూత్ సోషల్' ద్వారా సూచించారు. ఉదయాన్నే నేషనల్ గార్డ్‌లు రావడంతో ఆందోళనకారుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. రాష్ట్ర పోలీసులు ఉండగా ఫెడరల్ సాయుధవిభాగమైన మీకు ఇక్కడేం పని అంటూ అందోళనకారులు వారితో వాగ్వాదానికి దిగారు. ''సిగ్గులేదు. ఇంటికి పొండి'' అంటూ ఎద్దేవా చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బలగాలు పొగబాంబులు, భాష్పవాయుగోళాలు, ఫ్లాష్‌బ్యాంగ్ గ్రెనేడ్లను ప్రయోగించారు. దీంతో వాహనాల రాకపోకలను ఆందోళనకారులు 101 ఫ్రీవేపై నిలిపేశారు. సాయంత్రం కల్లా రాష్ట్ర పెట్రోల్ అధికారులు వారిని చెదరగొట్టి రహదారిపై రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆగ్రహించిన నిరసనకారులు అక్కడే నిలిపి ఉంచిన నాలుగు స్వయంచోదిత(సెల్ఫ్ డ్రైవింగ్) వేమో సంస్థ కార్లకు నిప్పంటించారు. మంటలు అంతటా అంటుకోవడంతో ఆ కార్ల నుంచి పేలుడు శబ్దాలు వినిపించాయి. గూగుల్‌కు చెందిన ఈ కార్లు రోబోట్యాక్సీ సేవలందిస్తున్నాయి. ఉద్యమకారులు రెచ్చిపోతుండటంతో అధికారులు వెంటనే లాస్‌ఏంజెలెస్ డౌన్‌టౌన్ ప్రాంతాల్లో జనసంచారంపై నిషేధాజ్ఞలు విధించారు. గుమికూడితే అరెస్ట్‌చేస్తామని అనౌన్స్‌మెంట్ ఇచ్చారు.



నిరసనకారులు నిప్పంటించడంతో తగలబడుతున్న కార్లు

సమాఖ్య విధానాన్ని కాలరాయడమే

''కాలిఫోర్నియా రాష్ట్రంలో ఉద్యమాలు వెల్లువెత్తితే సద్దుమణిగేలా చేసే బాధ్యత ఆ రాష్ట్రానిదే. మా రాష్ట్రంలో సమస్యలుంటే మేం పరిష్కరించుకుంటాం. నేషనల్ గార్డ్‌లను రంగంలోకి దింపాల్సిన అవసరమేంటి?. గార్డ్‌లను దింపి సమాఖ్య విధానానికి ట్రంప్ సర్కార్ తూట్లుపొడుస్తోంది. ఇది రాష్ట్రాల సార్వభౌమత్వానికి తీవ్ర విఘాతం కల్గించడమే. అధ్యక్షుడి నిర్ణయాన్ని నేను న్యాయస్థానంలో సవాల్ చేస్తా'' అని డెమొక్రటిక్ పార్టీ నేత, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ నూసమ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గవర్నర్ అనుమతి, ఆమోదంలేకుండా కాలిఫోర్నియా రాష్ట్రంలోకి నేషనల్ గార్డ్‌లను కేంద్రప్రభుత్వం రప్పించడం ఇటీవలి దశాబ్దాల్లో ఇదే తొలిసారి. చివరిసారిగా 1965లో నాటి దేశాధ్యక్షుడు లిండన్ బి.జాన్సన్ అలబామాలో పౌరహక్కుల ఉద్యమాన్ని అదుపులోకి తెచ్చేందుకు అమెరికాసైన్యంలో రిజర్వ్ బలగాలైన 'నేషనల్ గార్డ్'లను రప్పించారు. ''ఆందోళనకారులు శాంతించాలి. నేషనల్ గార్డ్‌లను తీసుకొచ్చి ఆందోళనకారుల ఆగ్రహజ్వాలలను ట్రంప్ మరింత రాజేశారు. ప్రజలకు రక్షణగా వాళ్లను రప్పించినట్లు కనిపించట్లేదు. ట్రంప్‌కు మరేదో ఎజెండా ఉన్నట్లుంది'' అని లాస్ ఏంజెలెస్ నగర మహిళా మేయర్ కరెన్ బాస్ వ్యాఖ్యానించారు. ఆందోళనలు తొలుత లాస్ ఏంజెలెస్ డౌన్‌టౌన్‌లో మొదలు తర్వాత పారామౌంట్ పట్టణానికి పాకి ప్రస్తుతం సమీప కాంప్టన్ పట్టణంలో విస్తరిస్తున్నాయి. గత వారం తానికి 100 మందికిపైగా అక్రమవలసదారులను ఫెడరల్ ఏజెంట్లు అరెస్ట్‌చేసి డిటెన్షన్ సెంటర్‌లకు తరలించారు. శాన్ ఫ్రాన్సిస్కోలో 60 మందిని అరెస్ట్‌చేశారు.



నిరసనకారులపైకి రబ్బర్ తూటాలు పేలుస్తున్న పోలీసులు



నిర్బంధంలోకి తీసుకుంటున్న నేషనల్ గార్డ్ సిబ్బంది

విదేశీ జర్నలిస్ట్‌లకు గాయాలు

డౌన్‌టౌన్ లాస్‌ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్ నుంచి వలసదారులను విడిచిపెట్టాలని ఉద్యమకారులు నినాదాలుచేశారు. అప్పుడు అక్కడ ఆస్ట్రేలియాకు చెందిన 9న్యూస్ టీవీఛానెల్ మహిళా పాత్రికేయురాలు లారెన్ థామస్ రిపోర్టింగ్ చేస్తున్నారు. అదే సమయంలో ఉద్యమకారులను చెదరగొట్టేందుకు నగర పోలీసులు, నేషనల్ గార్డ్ బలగాలు రబ్బర్ బుల్లెట్ల గన్‌లను పేల్చారు. దీంతో ఒక రబ్బర్ బుల్లెట్ లారెన్‌కు తగిలింది. ప్రత్యక్ష ప్రసారం వేళ ఈ ఘటన జరిగింది. విలవిల్లాడుతున్న ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. బ్రిటిష్ ఫొటోజర్నలిస్ట్ నిక్ స్టెర్న్‌కు సైతం రబ్బర్ బుల్లెట్ తగలి ఐదు సెంటీమీటర్ల లోతు గాయమైంది. ట్రంప్ రెండోసారి అధికార పగ్గాలు స్వీకరించాక దేశవ్యాప్తంగా 1,00,000 మందిని అరెస్ట్ చేసినట్లు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) విభాగం ప్రకటించింది. ట్రంప్ అధ్యక్షుడైన తొలి 100 రోజుల్లో రోజుకు 660 మంది చొప్పున అరెస్ట్‌చేశారు. గురువారంనాటికి డిటెన్షన్ సెంటర్లలో ఏకంగా 54,000 మంది వలసదారులున్నారు. నేషనల్ గార్డ్‌లను రప్పించడానికి శ్వేతసౌధం సమర్థించుకుంది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ అసమర్థ పాలన కారణంగా ఇమిగ్రేషన్ అధికారులకు రక్షణ కరువైంది. అందుకే గార్డ్‌లను అనుమతించాం'' అని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లెవిట్ చెప్పారు. లాస్ ఏంజెలెస్‌లో కొన్ని చోట్ల ఆందోళనకారులు దుకాణాలను లూటీచేశారని పోలీసులు చెప్పారు. పరిస్థితి చేయిదాటితే 500 మంది నేవీ మెరైన్‌లను రప్పిస్తామని యూఎస్ నార్తర్న్ కమాండ్ హెచ్చరించింది.

మోదీ 11 ఏళ్ల పాలన స్వర్ణయుగం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ ● 'న్యూ ఇండియా'కు మోదీ ప్రభుత్వం పునాది వేసిందన్న రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సోమవారంతో 11 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే మూడో టర్మ్‌లో మొదటి ఏడాది పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో మోదీ పాలనపై పలువురు కేంద్ర మంత్రులు ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. ఈ 11 ఏళ్ల ప్రజాసేవలో స్వర్ణయుగం అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభివర్ణించారు. మోదీ నాయకత్వంలో నవ భారతదేశం సంస్కరణల శక్తి, మార్పుతో అభివృద్ధి, స్వయం సమృద్ధి దిశగా శరవేగంగా దూసుకెళ్తోందని ఉద్ఘాటించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా ప్రతి రంగంలో మన దేశాన్ని నంబర్ వన్‌గా నిలపాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు పని చేస్తోందని వెల్లడించారు. ఈ అభివృద్ధి ప్రయాణం ఆగదని స్పష్టంచేశారు. 11 ఏళ్ల ఈ చరిత్రాత్మక ప్రయాణం సేవా ప్రయాణమని వివరించారు. ఈ మేరకు అమిత్ షా సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. నాయకత్వం శక్తివంతంగా, సంకల్పం బలంగా, ఉద్దేశాలు స్పష్టంగా ఉంటే ప్రజాసేవ, భద్రత, సుపరిపాలనలో కొత్త రికార్డులు సృష్టించవచ్చని మోదీ ప్రభుత్వం నిరూపించిందని తెలియజేశారు. మోదీ 2014లో తొలిసారిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో దేశం అచేతనావస్థలో ఉందని, ఎటు చూసినా కుంభకోణాలు తప్ప అభివృద్ధి కనిపించని పరిస్థితి ఉందని గుర్తుచేశారు. మోదీ అధికారంలోకి వచ్చాక 11 ఏళ్లలో దేశ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రధాని మోదీ దేశంలో బుజ్జగింపు రాజకీయాలకు చరమగీతం పాడేశారని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అమిత్ షా హర్షం వ్యక్తంచేశారు. రైతులు, మహిళలు, వెనుకబడిన తరగతులు, దళితుల సాధికారతే మోదీ సర్కారు ధ్యేయమని తేల్చిచెప్పారు.

దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను కాపాడడంలో మోదీ ప్రభుత్వం తిరుగులేని అంకిత భావం ప్రదర్శిస్తోందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశానికి మోదీ సర్కారు బలమైన రక్షణ కవచంగా మారిందన్నారు. దృఢమైన, గర్వకారణమైన ఐక్య భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలో మొదటి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ కూడా చేరిందన్నారు. మోదీ తీసుకుంటున్న నిర్ణయాలతో రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. మోదీ సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బడుగ బలహీన వర్గాలకు ఎనలేని లబ్ధి చేకూరుతోందన్నారు. మానవ వనరుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ 'న్యూ ఇండియా'కు మోదీ ప్రభుత్వం పునాది వేసిందన్నారు.

ప్రపంచ వేదికపై సమున్నత భారత్: గడ్కరీ

నరేంద్ర మోదీ దార్శనికత పాలనలో దేశంలో చరిత్రాత్మక మార్పులు సంభవిస్తున్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వివరించారు. సుపరిపాలన, సమగ్రాభివృద్ధిని కళ్లారా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. దేశం ఎవరూ అందుకోలేనంత వేగంతో ఆర్థిక ప్రగతి సాధిస్తోందన్నారు. బలమైన నాయకత్వం, స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థ, ప్రజలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్న పాలనతో ప్రపంచ వేదికపై సగర్వంగా, సమున్నతంగా నిలుస్తోందని వివరించారు. ఆర్థిక ప్రగతి, సామాజిక న్యాయం, సాంస్కృతిక వైభవం, జాతీయ భద్రత విషయంలో మోదీ పాలన నూతన శకమని కేంద్ర మంత్రి, లోక్‌జనశక్తి పార్టీ అగ్రనేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు.

సువర్ణాక్షరాలతో లిఖించాలి: నడ్డా

దేశంలో గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు సువర్ణాక్షరాలతో లిఖించదగనవని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా చెప్పారు. మోదీ సర్కారుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌కు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు చెప్పారు.

ప్రచారం తప్ప పారదర్శకత లేదు

రాహుల్ గాంధీ ధ్వజం



న్యూఢిల్లీ: కేంద్రంలో 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో ప్రచారం తప్ప పారదర్శకత ఏమాత్రం లేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత, ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. మోదీ సర్కారు వర్తమానం గురించి మాట్లాడడం మానేసి, 2047కు సంబంధించిన కలల్లో విహరిస్తోందని తప్పుపట్టారు. ప్రజలను భ్రమల్లో ముంచేస్తూ కాలం గడుపుతోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఒకవైపు మోదీ ప్రభుత్వం 11వ వార్షికోత్సవాలు చేసుకుంటున్న సమయంలోనే మరోవైపు ముంబైలో ఘోర ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రైలు నుంచి కిందపడి పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యం కోట్లాది మంది ప్రజలను గమ్యస్థానాలకు చేర్చే రైల్వేశాఖ నేడు అభద్రత, గందరగోళం, విపరీతమైన రద్దీకి మారుపేరుగా మారిందని ఆక్షేపించారు. దేశంలో వాస్తవిక పరిస్థితికి ఈ ఘటన అద్దంపడుతోందన్నారు. మోదీ ప్రభుత్వం ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆలోచించేవారు ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో వచ్చిన మార్పేమీ లేదని విమర్శించారు. 2047 నాటి కలలు విక్రయించడం ఆపేసి, 2025 గురించి మాట్లాడాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

11 ఏళ్లుగా 'ప్రగతిశీల భారత్'

- సుపరిపాలన, సామాజిక న్యాయానికి పెద్దపీట
- కేబినెట్‌లో 60 శాతం మంది ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలే
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి కలిసి పనిచేద్దాం
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



న్యూఢిల్లీ: దేశంలో ప్రజలకు సుపరిపాలన అందించడం, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడంపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని, తమ మంత్రివర్గంలో 60 శాతం మంది ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలే ఉన్నారని గుర్తుచేశారు. మంత్రిమండలిలో ఆయా వర్గాలకు ఈస్థాయిలో అత్యధిక ప్రాతినిధ్యం దక్కడం ఇదే మొదటిసారి అని స్పష్టంచేశారు. కేంద్రంలో తమ ప్రభుత్వానికి 11 ఏళ్లు పూర్తికావడంతోపాటు మూడోసారి ప్రధానిగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. నేడు మన దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగానే కాకుండా అంతర్జాతీయ వేదికలపై బలమైన గొంతుకగా నిలుస్తోందని ఉద్ఘాటించారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణపై మనం గళం వినిపిస్తున్నాయని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల ఆశీస్సులు, వారి సమ్మిళిత భాగస్వామ్యంతో విభిన్న రంగాల్లో వేగవంతమైన మార్పునకు భారత్ సాక్షిగా నిలుస్తోందని హర్షం వ్యక్తంచేశారు. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' స్ఫూర్తితో ఎన్డీయే ప్రభుత్వం ప్రజాసేవలో నిమగ్నమైందని వివరించారు. 'ప్రజలే కేంద్రంగా ప్రగతి' అనే విధానాన్ని అమలు చేస్తున్నామని, ఆర్థికాభివృద్ధితో సామాజిక మార్పునకు బాటలు వేస్తున్నామని స్పష్టంచేశారు. మన ఉమ్మడి విజయాలు మనందరికీ గర్వకారణమని, అదే సమయంలో 'వికసిత్ భారత్' నిర్మాణానికి మనమంతా నడుం బిగించాలని, కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆశ, ఆత్మవిశ్వాసం, నూతన సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. వేర్వేరు రంగాల్లో తమ ప్రభుత్వం సాధించిన విజయాలు, తీసుకొచ్చిన మార్పులను ప్రధాని మోదీ 'లెవెన్ ఇయర్స్ ఆఫ్ సేవ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు ఇందులో పొందుపర్చారు.

అమెరికాలో భారత విద్యార్థులు

11.8% పెరిగారు

27 శాతంతో చైనాను దాటేశారు

వాషింగ్టన్: అమెరికాలో భారత విద్యార్థుల సంఖ్యలో 2024లో 11.8 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం అమెరికాలో 4,22,335 మంది భారత విద్యార్థులున్నట్లు యూఎస్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) విడుదల చేసిన స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ప్రోగ్రాం (ఎస్‌ఈవీపీ) తాజా వార్షిక నివేదిక వెల్లడించింది. అమెరికాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో ఇది 27 శాతం. ఈ విషయంలో భారత్ గత 15 ఏళ్లలో తొలిసారిగా చైనా (20 శాతం)ను దాటేసి అగ్రస్థానంలో నిలవడం విశేషం. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) కోర్సుల్లో అత్యధికంగా 48 శాతం మంది భారత విద్యార్థులే. 20.4 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. మొత్తంగా చైనా విద్యార్థుల సంఖ్య 2023తో పోలిస్తే 0.25 శాతం తగ్గడం విశేషం.

ఆసియా దేశాల హవా..

అమెరికాలో చదువుతున్న విదేశీయుల్లో ఆసియా దేశాల హవా కొనసాగుతోంది. మొత్తం 15.8 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 71.7 శాతం, అంటే 11,34,953 మంది ఆ దేశాలవారేనని నివేదిక తెలిపింది.

ప్రాణం తీసిన ఫుట్‌బోర్డు ప్రయాణం

- మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఘోర రైలు ప్రమాదం
- రెండు రైళ్ల నుంచి కిందపడిన 13 మంది ప్రయాణికులు
- నలుగురి మృతి... 9 మందికి గాయాలు

ముంబై: మహారాష్ట్రలోని థానే జిల్లాలో సోమవారం జరిగిన ప్రమాదంలో జీఆర్పీ కానిస్టేబుల్ సహా నలుగురు రైలు ప్రయాణికులు మరణించారు. మరో 9 మంది గాయపడ్డారు. ఉదయంపూట కిక్కిరిసిన రైళ్లలో నిర్లక్ష్యంగా ప్రయాణించడమే ఇందుకు కారణం. ముంబ్రా రైల్వే స్టేషన్‌సమీపంలో ఈ ఘటన జరిగింది. రెండు రైళ్లలో జనం కిక్కిరిసిపోయి ఉన్నారు. వీపులకు భారీ బ్యాగులు తగిలించుకొని డోర్ల వద్ద ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. వీటిలో ఒక రైలు కాసారా వైపు, మరొకటి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ వైపు వెళ్తోంది. ఈ రెండు రైళ్లు పక్కపక్కనున్న పట్టాలపై పరస్పరం వ్యతిరేక దిశలో వచ్చిన సమయంలో మూలమలుపు వద్ద ప్రయాణికుల బ్యాగులు పరస్పరం ఢీకొన్నాయి. దాంతో మొత్తం 13 మంది వెంటనే కిందపడిపోయారు. వీరిలో నలుగురు తీవ్రంగా గాయపడి మృతి చెందారని రైల్వే అధికారులు ప్రకటించారు. బాధితులను కేతన్ సరోజ్, రాహుల్ గుప్తా, మయూర్ షా, జీఆర్పీ కానిస్టేబుల్ విక్కీ ముఖ్యాద్‌గా గుర్తించారు. రైళ్లకు ఆటోమేటిక్ డోర్లు లేకపోవడం ప్రాణాంతకంగా మారిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రైళ్లకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించినట్లు అధికారి దిలీప్ కుమార్ చెప్పారు. ప్రయాణికులు లోపలికి వెళ్లగానే డోర్లు వాటంతట అవే మూసుకుపోయేలా రైలు బోగీలను డిజైన్ చేయనున్నట్లు వెల్లడించారు. ముబ్రా రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని రైల్వే శాఖను కోరనట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది.



డబుల్ డెకర్ ఫ్లై ఓవర్

ఇదేమిటో తెలుసా? డబుల్ డెకర్ ఫ్లై ఓవర్. రూ.422 కోట్లతో బిహార్ రాజధాని పట్నాలో నిర్మించిన ఈ వినూత్న ఫ్లై ఓవర్‌ను సీఎం నితీశ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్‌లో పై లేన్ 2.2 కి.మీ. పొడవుంటుంది. కార్గిల్ చౌక్ నుంచి సైన్స్ కాలేజీ దాకా వెళ్తుంది. 1.5 కి.మీ. పొడవుండే కింది లేన్ పట్నా కాలేజ్ నుంచి గాంధీ మైదాన్‌కు వెళ్తుంది. ఇవి రెండూ వన్‌వే లేన్లే కావడం విశేషం. 2022లో నిర్మాణ పనులు మొదలైన ఈ ఫ్లై ఓవర్ ఐదుసార్లు డెడ్‌లైన్ పొడిగింపుల అనంతరం ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీంతో పట్నా నడిబొడ్డులోని అశోక్-రాజ్‌పథ్ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలు చాలావరకు తీరతాయని భావిస్తున్నారు.

శుభాన్షు అంతరిక్ష యాత్ర

రేపటికి వాయిదా

న్యూఢిల్లీ: ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న యాగ్జియం-4 మిషన్ (ఏఎక్స్-4) ప్రయోగం మరోసారి వాయిదా పడింది. ప్రయోగాన్ని ముందుగా నిర్ణయించినట్టు మంగళవారం కాకుండా బుధవారం నిర్వహించనున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' సోమవారం సాయంత్రం ఈ మేరకు ప్రకటించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం అమెరికాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి మంగళవారం సాయంత్రం ఫాల్కన్-9 రాకెట్ ద్వారా నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) బయలుదేరాల్సి ఉంది. వీరిలో భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా ఉన్నారు. వాతావరణం అనుకూలించక ప్రయోగం ఒకరోజు వాయిదా పడింది.

శుభాన్షు ఖర్చు రూ.538 కోట్లు

భారత వైమానిక దళంలో గ్రూప్ కెప్టెన్‌గా పని చేస్తున్న శుభాన్షు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపించడానికి రూ.538 కోట్లు(70 మిలియన్ డాలర్లు) ఖర్చు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యయం భారత ప్రభుత్వమే భరిస్తోంది.



దక్షిణమధ్య రైల్వేలో భారీ కుదుపు!
దక్షిణమధ్య రైల్వే ఘనత ఇక మసకబారనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో సేవలందజేస్తున్న ద.మ రైల్వే జోన్ పరిధి భారీగా తగ్గనుంది. -8లో



హోమ్లీ పెట్.. ఒత్తిడి సెట్..
ఆధునిక జీవనశైలితో అధిక శాతం మంది నగర వాసులు ఒత్తిడికి లోనవుతున్నారు. ఇలాంటి సమయంలో ఇంట్లోని పెంపుడు జంతువులే మిత్రులుగా సహాయపడుతున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



విద్యుత్ వెలుగుల్లో కాచిగూడ రైల్వే స్టేషన్

'కాచిగూడ'కు చారిత్రక ప్రాముఖ్యత

రూ.421.66 కోట్లతో రైల్వే స్టేషన్ పునరభివృద్ధి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- ఫసాడ్ లైటింగ్ వ్యవస్థకు ప్రారంభోత్సవం

కాచిగూడ: ఫసాడ్ లైటింగ్ వ్యవస్థ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. చారిత్రక నేపథ్యం కలిగిన కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రూ.2.33 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలంలో 1916లో 'గోతిక్ శైలి'లో కాచిగూడ రైల్వే స్టేషన్ నిర్మించినట్లు తెలిపారు. ఈ స్టేషన్ అద్భుత నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించ డానికి మొత్తం 785 ఇల్యూమినేషన్ లైట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారతీయ రైల్వేలో తొలి డిజిటల్ పేమెంట్ సేవలు కాచిగూడలోనే ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నో రకాల ప్రాముఖ్యతను సంతరించుకున్న కాచిగూడ రైల్వే స్టేషన్‌ను రూ.421.66 కోట్లతో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద పునరభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే 30 సంవత్సరాల అవసరాలను తీర్చేలా రూ.2,750 కోట్లతో రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే హరీష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, కృష్ణ యాదవ్, వై.అమృత, సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్య ప్రకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఫసాడ్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పడకేసిన ప్రతిపాదన!

వనస్థలిపురం బస్ టెర్మినల్ ఏమైనట్లో!!

- మూడేళ్ల క్రితమే హెచ్ఎండీఏ ప్రణాళికలు
- కొత్త ప్రభుత్వంలో అటకెక్కిన ప్రాజెక్ట్



సాక్షి, సిటీబ్యూరో: శాటిలైట్ బస్‌టెర్మినళ్ల ప్రతిపాదన అటకెక్కింది. నగరంలో రోజు రోజుకూ తీవ్రమవుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని శివార్లలో శాటిలైట్ బస్ టెర్మినళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ప్రణాళికలను రూపొందించింది. దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులన్నీ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరుతున్నాయి. ట్రాఫిక్ రద్దీ కారణంగా గంటల తరబడి సిటీరోడ్లపైనే నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. సంక్రాంతి, దసరా వంటి పర్వదినాలు, వరుస సెలవులు, వేసవి సెలవుల్లో రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సుల రద్దీ కూడా పెరుగుతోంది. దీంతో బస్సుల నిర్వహణలో మరింత జాప్యం నెలకొంటోంది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు శివారు ప్రాంతాల్లో స్థలం అందుబాటులో ఉన్నచోట శాటిలైట్ టెర్మినళ్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి సిటీసర్వీసులను నడపాలనేది ప్రతిపాదన. ఈ మేరకు మియాపూర్‌తో పాటు వనస్థలిపురంలో రెండు టెర్మినళ్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మియాపూర్‌లోని స్థలాన్ని ట్రక్ పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. వనస్థలిపురంలో ఏర్పాటు చేయడం ద్వారా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే బస్సులను వనస్థలిపురం వరకు పరిమితం చేయాలని భావించారు. కానీ ప్రభుత్వం మారడంతో ఈ ప్రతిపాదన వెనక్కి వెళ్లిపోయింది.

అటవీశాఖ సానుకూలత..

- వనస్థలిపురంలోని హరిణ వనస్థలి పార్కు వద్ద టెర్మినల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు అప్పట్లో అటవీశాఖ నుంచి సానుకూలత వ్యక్తమైంది. 680 మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్ నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సైతం ఈ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా అధునాతన సదుపాయాలతో ప్రతిరోజూ కనీసం 1000 బస్సులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉంటుందని అప్పట్లో అధికారులు తెలిపారు.
- మరోవైపు దీన్ని పర్యావరణహిత ప్రమాణాలతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సోలార్ విద్యుత్‌ను వినియోగించాలని భావించారు. వనస్థలిపురం టెర్మినల్ సాకారమైతే విజయవాడ, గుంటూరు, ఖమ్మం, సూర్యాపేట్, భద్రాచలం, నల్లగొండ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులన్నింటినీ అక్కడి నుంచి నడిపేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్ నుంచి జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, లక్డీకాపూల్, కోఠి, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ వరకు అన్నిచోట్లా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను నిలపడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. శాటిలైట్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మాదాపూర్‌లో వరద కట్టడికి చర్యలు

కాలువలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లో వరద ముప్పు ఉన్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం పర్యటించారు. నాలా ద్వారా వరద నీరు సాఫీగా ముందుకు సాగే అవకాశం ఉందా? మధ్యలో ఏవైనా ఆటంకాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించారు. వర్షం పడితే నీట మునుగుతున్న నెక్టార్ గార్డెన్స్ పరిసరాల్లో తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో చర్చించారు. దుర్గం చెరువుకు ఎండాకాలంలోనూ నీటి కొరత ఉండదని, వర్షాకాలంలో ఆ నీటి నిలువల స్థాయిని తగ్గిస్తే వరద పోటెత్తదని అధికారులు సూచించారు. వర్షం పడితే నడుము లోతు నీళ్లు తమ కాలనీల్లో నిలబడుతున్నాయని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు విన్నవించారు. దుర్గం చెరువుకు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోలు ఎంతనే అంశాలపై చెరువు చుట్టూ తిరిగి రంగనాథ్ పరిశీలించారు. చెరువు లోపల తూములను, గేట్లను కూడా పరీక్షించారు. దుర్గం చెరువు దిగువ భాగంలో ఆక్రమణలతో పాటు వరద కాలువకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. దుర్గం చెరువులో ఇనార్బిట్ మాల్ వైపు మట్టి పోయడం పైనా విచారించారు. దుర్గం చెరువులో నీటిమట్టం నిర్వహణపై ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు.

నాలాలనూ వదల్లేదు!

లంగర్‌హౌస్ చెరువులో ఆక్రమణలు
- హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలాలు పెద్ద ఎత్తున కబ్జా అయ్యాయి. దీనిపై హైడ్రాకు వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 58 ఫిర్యాదులు అందగా.. వీటిలో 60 శాతానికి పైగా నాలాల కబ్జాలకు సంబంధించినవే కావడం గమనార్హం. నగరంలో ఏ నాలాను తీసుకున్నా ఉండాల్సిన వెడల్పులో సగమే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఫలితంగా వరదలు కాలనీలు, ఇళ్లల్లోకి వచ్చి సర్వం కోల్పోతున్నామని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తంచేశారు. రసూల్‌పురా వద్ద ప్యాట్నీ నాలా మాదిరే చీకోటి గార్డెన్స్‌తో పాటు ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద నాలా వెడల్పు చేయాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య పరిశీలించారు.

కబ్జాల పర్వం ఇలా..

- అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని దుర్గా ప్రావిన్స్ కాలనీ ప్రతి సంవత్సరం వరదలకు గురవుతోంది. ఇళ్లు, రహదారులు నీటిలో మునిగిపోతాయని, సమీపంలోని అనేక కాలనీల నుంచి వర్షపు నీటిని నేరుగా తమ వైపు మళ్లించడంతో మరింత ఇబ్బంది వస్తోందని హైడ్రాకు తెలిపారు. సహజ నీటి మార్గాలు ఉన్న చోట కొత్త భవనాలు వచ్చాయని ఫిర్యాదు చేశారు. లంగర్‌హౌస్ చెరువు 38 ఎకరాలు విస్తీర్ణంలో ఉండేది. ఇప్పుడు ఆ చెరువు 24 ఎకరాలే మిగిలింది. కొందరు చెరువును కబ్జా చేస్తున్నారు. ఇందుకోసం చెరువు తూములను కూడా ధ్వంసం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే చెరువు ఫెన్సింగ్ విరగ్గొట్టి అక్రమంగా రోడ్డు నిర్మాణం చేసి చెరువు స్వభావాన్ని పూర్తిగా మార్చేశారని స్థానికులు హైడ్రా దృష్టికి తెచ్చారు. ఆక్రమణలను తొలగించి చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరారు.



నాలాల కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

- మియాపూర్ సర్వే నెం. 39లో మక్త మహబూబ్‌పేట్ చెరువు కబ్జాకు గురి అవుతోంది. అలాగే మైనింగ్ ల్యాండ్ సర్వే నెం. 44/5 లో ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారు. మైనింగ్ ల్యాండ్‌ను బై నెం. ద్వారా నకిలీ పత్రాలు సృష్టించి 12 షెటర్లు వేశారు. 2013లో తహసీల్దార్ నోటీసులు ఇచ్చి కూల్చారు. ఆ భూమి విలువ రూ.300 కోట్ల వరకు ఉండటంతో కొందరు కబ్జా చేస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు హైడ్రాను కోరారు.
- మేడ్చల్ జిల్లా ఆనంద్‌బాగ్ కాలనీలోని స్ట్రీట్ నం.10, 11లలో రాకపోకలకు వీలు లేకుండా రహదారులను 2019 నుంచి మూసేశారు. 14 ఏళ్లుగా వినియోగిస్తున్న రహదారులను మూసేయడంతో తాము వేరే కాలనీల నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశాఉ. మేడ్చల్ దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రగతినగర్ కాలనీలో మొత్తం 300 కుటుంబాలుండగా.. ఇందులోని పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారంటూ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది.

బస్‌పాస్‌లపై బాదేశారు!

2.5 లక్షల మందిపై చార్జీల భారం
- ప్రయాణికుల్లో తీవ్ర వ్యతిరేకత



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ బస్‌పాస్ ధరలను భారీగా పెంచేసింది. ఈ పెంపు గ్రేటర్‌లోని సుమారు 2.5 లక్షల మందిపై పిడుగుపాటుగా మారింది. అకస్మాత్తుగా చార్జీలను 20 శాతం పెంచడంతో ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో నగదు నిల్వలు దారుణంగా పడిపోవడంతో బస్సుల నిర్వహణ, విడిభాగాల కొనుగోళ్లు, డిపోల రోజువారీ ఖర్చులు తదితర అవసరాలకు కష్టంగా మారింది. ఈ క్రమంలో ఒకవైపు పురుష ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు అష్టకష్టాలు పడుతున్న ఆర్టీసీ అధికారులు.. తాజాగా బస్‌పాస్‌లపై దృష్టి సారించారు. ప్రతి నెలా బస్‌పాస్ చార్జీల రూపంలో నగదు ఆదాయం లభించనున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బస్‌పాస్ చార్జీల పెంపుపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కొత్త చార్జీలు ఇలా..

సాధారణ ప్రయాణికులు ఎక్కువగా వినియోగించే ఆర్డినరీ నెలవారీ పాస్ రూ.1,150 నుంచి రూ.1,400కు పెరిగింది. మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ.1,300 నుంచి రూ.1,600కు చేరింది. మెట్రోడీలక్స్ రూ.1,450 నుంచి రూ.1,800. మెట్రో లగ్జరీ (ఏసీ) రూ.1,800 నుంచి రూ.2,200. విద్యార్థుల నెలవారీ ఆర్డినరీ పాస్ రూ.400 నుంచి రూ.600కు పెరిగింది. క్వార్టర్లీ (మూడు నెలలు) పాస్ రూ.1,200 నుంచి రూ.1,800. గ్రేటర్ హైదరాబాద్ ఆర్డినరీ రూ.470 నుంచి రూ.705కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్ క్వార్టర్లీ పాస్ రూ.1,350 నుంచి రూ.1,950కి చేరింది. ఆర్డినరీ స్పెషల్ పాస్ రూ.450 నుంచి రూ.650. ఎన్జీఓల నెలవారీ ఆర్డినరీ బస్ పాస్ రూ.400 నుంచి రూ.600, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ.550 నుంచి రూ.800, మెట్రో డీలక్స్ పాస్ రూ.700 నుంచి రూ.1000కి పెంచారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నడిచే పుష్పక్ ఏసీ బస్సుల పాస్ ధర రూ.5000 ఉంది. ఆర్టీసీ అధికారులు ప్రస్తుతానికి పుష్పక్ పాస్ జోలికి వెళ్లలేదు.

అగ్నిప్రమాదం జరిగితే ఎలా?

ఐసీసీసీలో మాక్ డ్రిల్ నిర్వహణ
- పర్యవేక్షించిన నగర సీపీ, డైరెక్టర్



మాక్‌డ్రిల్‌లో ఓ దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: అగ్ని ప్రమాదం జరిగితే స్పందన, సహాయ కార్యక్రమాలు ఎలా ఉండాలనే అంశంపై బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ డ్రిల్‌లో అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, 108, వాటర్ వర్క్స్ తదితర విభాగాలు పాల్గొన్నాయి. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులలో భవనంలో పని చేస్తున్న ఉద్యోగులను ఎలా కాపాడాలి? వారు స్వచ్ఛందంగా తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఇలాంటి భవనాలపై అవగాహన ఉండాలి

ఇలాంటి బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ మాక్ డ్రిల్ చాలా కీలకమైనవి. వీటిలో ఉండే, పని చేసే ఉద్యోగులకు తప్పనిసరిగా భవన నిర్మాణం, అత్యవసర నిష్క్రమణలు, ఫైర్ అలారం, అగ్నిమాపక పరికరాలు ఉన్న ప్రాంతాలు, వాటి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి. ఏడున్నర ఎకరాల స్థలం మధ్యలో ఈ భవనం నిర్మించడంతో ఫైర్ ఇంజిన్లు, 108 వాహనాలు సులభంగా సమీపం వరకు చేరుకుంటాయి. ప్రతి టవర్‌కు రెండు ప్రదేశాల్లో మెట్లు ఉన్నాయి. అగ్ని ప్రమాదాలను ఎప్పుడూ తేలికగా తీసుకోవద్దు. ఐసీసీసీలో దాదాపు రెండు వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అత్యవసర సమయంలో లిఫ్టులు వాడకుండా మెట్ల దారులను ఎంచుకోవాలి. – సీవీ ఆనంద్, సిటీ సీపీ

ప్రతి నెలా మొదటి శనివారం డ్రిల్స్

83.26 మీటర్ల ఎత్తైన ఈ భవనంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే పై అంతస్తుల్లో ఉన్న వారికే ఎక్కువ ముప్పు ఉంటుంది. అగ్ని రాజుకున్నప్పుడు మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించాలి. ఈ భవనంలో అన్ని రకాలైన భద్రతా సౌకర్యాలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వాటిని సక్రమంగా ఉపయోగించుకోవాలి. ప్రతి ఫ్లోర్‌లో ఒక ఫైర్ మార్షల్, అతనికి సహాయకుడిగా ఒక అసిస్టెంట్ నియమిస్తున్నాం. వీరు తమకు కేటాయించిన ఫ్లోర్‌లోని ఉద్యోగులకు అత్యవసర స్పందనపై అవగాహన కల్పిస్తారు. ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను ప్రతి నెల మొదటి శనివారం నిర్వహిస్తాం.
– వీబీ కమలాసన్‌రెడ్డి, ఐసీసీసీ డైరెక్టర్



మాట్లాడుతున్న కమలాసన్‌రెడ్డి

నగరంలో రెండు కీలక విచారణలు

- అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు
- 'కాళేశ్వరం' విషయమై మాజీ మంత్రి హరీష్‌రావు
- రెండూ గత ప్రభుత్వం హయాంలో జరిగినవే



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సోమవారం రెండు కీలక విచారణలు జరిగాయి. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును పోలీసులు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (కేఎల్ఐపీ) వ్యవహారంలో మాజీ మంత్రి టి.హరీష్‌రావును జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ ప్రశ్నించారు. ఈ రెండూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంకు సంబంధించిన వ్యవహారాలు కావడంతో పాటు ఆ కేసు నమోదైంది, ఈ కమిషన్ ఏర్పాటైంది సైతం గత ఏడాది మార్చిలోనే కావడం గమనార్హం. ఈ విచారణల నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్, బీఆర్‌కేఆర్ భవన్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుదీర్ఘకాలం తర్వాత వచ్చిన ప్రభాకర్‌రావు...

రాష్ట్ర అసెంబ్లీకి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు ఆ పదవికి రాజీనామా చేశారు. గత ఏడాది మార్చిలో ట్యాపింగ్‌కు సంబంధించి (తొలుత హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం) కేసు నమోదు కావడానికి ముందే అమెరికా వెళ్లిపోయారు. ప్రభాకర్‌రావుపై ఎల్ఓసీ, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించిన నగర పోలీసులు ఆయన పాస్‌పోర్టునూ రద్దు చేయించారు. గత నెలలో సుప్రీం కోర్టు స్వల్ప ఊరట ఇవ్వడంతో ప్రభాకర్‌రావు రాకకు మార్గం సుగమమైంది. దీంతో ఆయన 15 నెలల తర్వాత ఆదివారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు తన న్యాయవాదితో కలిసి జూబ్లీ హిల్స్ పోలీసుస్టేషన్‌లో ఉన్న సిట్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు.

15 నెలల తర్వాత హరీష్‌రావు..

బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో (కేఎల్ఐపీ) పాటు మరికొన్ని బ్యారేజీల విషయంపై ప్రభుత్వం దృష్టికి అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు చోటు చేసుకున్న కొన్ని కీలక పరిణామాల నేపథ్యంలో వీటిపై విచారణ కోసం గతేడాది మార్చిలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పటి వరకు అనేక మంది ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ప్రశ్నించింది. శనివారం ఎంపీ ఈటల రాజేందర్, సోమవారం టి.హరీష్‌రావు వంతులు వచ్చాయి. హరీష్‌రావు సోమవారం ఉదయం ఉదయం 11 గంటల ప్రాంతంలో కమిషన్ కార్యాలయం ఉన్న బూర్గుల రామకృష్ణారావు భవన్‌కు వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈయన విచారణ కొనసాగింది.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

రెండు డీసీఎంలు దగ్ధం

మైలార్‌దేవ్‌పల్లి: జంతు కళేబరాలు, చర్మం తరలిస్తున్నారనే సమాచారంతో కొందరు యువకులు రెండు డీసీఎం వాహనాలను తగులబెట్టిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కమాటిపురా నుంచి జల్‌పల్లికి చెందిన రెండు డీసీఎం వాహనాలను అడ్డుకుని డ్రైవర్లను నిలదీశారు. దీంతో ఒక డ్రైవర్ అక్కడ నుంచి పారిపోవడంతో మరో డ్రైవర్‌పై దాడి చేశారు. అలాగే డీసీఎంల అద్దాలు, డోర్స్‌ను ధ్వంసం చేసి నిప్పు అంటించారు. దీంతో ఈ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో సీపీ అవినాష్ మహంతి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, సీఐ నరేందర్, రాచకొండ పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను నిలువరించే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజన్ సహాయంతో డీసీఎంలో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై ఇప్పటికే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు 15 మంది యువకులను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే మరికొంత మందిపై సైతం కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది. కాగా ఈ ఘటనలకు నిరసనగా మరో వర్గం వారు సైతం ఆందోళనలకు దిగారు. దీంతో స్టేషన్‌లోనే ఉన్న సీపీ అవినాష్ మహంతి వారితో మాట్లాడారు. ఘటనపై న్యాయం జరిగేలా చూస్తామని దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు.

కూతురికి వాతలు పెట్టిన తండ్రి

భర్తపై ఫిర్యాదు చేసిన భార్య

సైదాబాద్: తెలిసో తెలియకో చిన్న పిల్లలు తప్పులు చేస్తే తల్లిదండ్రులు చీవాట్లు పెట్టడం సర్వసాధారణం. కానీ కన్నకూతురు తప్పు చేసిందో లేదో నిర్ధారించుకోకుండానే ఒక తండ్రి విచక్షణారహితంగా ముఖంపైన, చేతులపైన వాతలు పెట్టాడు. ఎంతగా అంటే ఆ చిన్నారి ప్రస్తుతం ఆసపత్రిలో చేరి చికిత్స పొందుతోంది. దాంతో తట్టుకోలేక పోయిన ఆ పాప తల్లి భర్తపైనే సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుబ్రమణ్యనగర్‌లో నివసించే ఆర్.హర్యా, జ్యోతి దంపతులు కూలి పనులు చేస్తుంటారు. వారికి ఇద్దరు కుమారులు, కూతురు (11) సంతానం. కుమార్తె స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటుంది. ఎండాకాలం సెలవులు కావటంతో కుమార్తెను తల్లిదండ్రులు బిజినేపల్లి మండలం గంగారం గ్రామంలోని నానమ్మ ఇంటికి పంపారు. నెల రోజులు అక్కడే ఉన్న బాలిక ఈ నెల 6న తిరిగి ఇంటికి వచ్చింది. అదేరోజు రాత్రి హర్యాకు అతని తమ్ముడు గ్రామం నుంచి ఫోన్ చేసి సెలవుల్లో ఇక్కడికి వచ్చిన కుమార్తె ఒకరితో చనువుగా ఉందని చెప్పాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న తండ్రి హర్యా కోపోద్రిక్తుడై వంటింట్లోని అట్ల కాడను కాల్చి కుమార్తె ముఖం, చేతులపై వాతలు పెట్టాడు. దాంతో తీవ్రగాయాలైన ఆమెను తల్లి జ్యోతి ఉస్మానియా ఆసుపత్రికి తరలించింది. తన మరిది చెప్పిన మాటలు విని..నిజానిజాలు తెలుసుకోకుండా కూతురిని గాయపరిచిన భర్తపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని జ్యోతి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణమధ్య రైల్వేలో భారీ కుదుపు!

విభజనతో 6400 కి.మీ.ల నుంచి 2500 కి.మీ.తగ్గనున్న పరిధి

- సుమారు 12 లక్షల నుంచి 5 లక్షల వరకు ప్రయాణికులు తగ్గుముఖం
- గణనీయంగా తగ్గనున్న ఆదాయం..
- హైదరాబాద్ నుంచి సుమారు 2 వేల మంది బదిలీ



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వేకు భారతీయ రైల్వేల్లోనే ఐదోస్థానం ఉంది. ప్రయాణికుల రాకపోకల్లోనూ, సరుకు రవాణాలోనూ రికార్డుస్థాయిలో ఆదాయం వస్తుంది. అలాంటి దక్షిణమధ్య రైల్వే ఘనత ఇక మసకబారనుంది. మొట్టమొదట హైదరాబాద్ కేంద్రంగా నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే సేవలు ఆరంభమయ్యాయి. స్వాతంత్య్రానంతరం భారతీయ రైల్వేలో విలీనమైన తరువాత 1966 అక్టోబర్ 2వ తేదీన దక్షిణమధ్య రైల్వే జోన్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటకల్లోని కొంతభాగంతో కలిపి మొత్తం 6 డివిజన్‌లతో సేవలందజేస్తున్న దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధి ప్రస్తుత విభజనతో గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం సుమారు 650 రైళ్లు ప్రతి రోజు రాకపోకలు సాగిస్తున్నాయి. 12 లక్షల మందికి పైగా ప్రయాణికులు దక్షిణమధ్య రైల్వే సేవలను వినియోగించుకుంటున్నారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో దక్షిణమధ్య రైల్వే పరిధి గణనీయంగా తగ్గనుంది. ప్రయాణికులు, రైళ్ల రాకపోకలతో పాటు, ఆదాయం కూడా భారీగా తగ్గుముఖంపట్టనుందని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం నగరంలోని వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో సగానికి పైగా కొత్త జోన్‌కు తరలి వెళ్లనున్నారు. డివిజన్‌ల సంఖ్య కూడా 6 నుంచి 3 కు తగ్గనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్‌లు మాత్రమే దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలో ఉంటాయి. వీటితో పాటు లాలాగూడ వర్క్‌షాపు ఉంటుంది. అలాగే లాలాపేట్‌లోని రైల్వే కేంద్ర ఆసుపత్రిలో విధులు నిర్వహించే డాక్టర్లు, అధికారులు, సిబ్బంది విభజన కూడా అనివార్యం కానుంది.

తగ్గనున్న పరిధి....

ప్రస్తుతం సుమారు 6400 కి.మీ.పరిధిలో దక్షిణమధ్య రైల్వే రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే 12 లక్షల మంది ప్రయాణికుల ద్వారా ప్రతి రోజు రూ.2.5 కోట్ల ఆదాయం లభిస్తుంది. జోన్ విభజన వల్ల ప్రయాణికుల సంఖ్య 5 లక్షలకు తగ్గనుంది. జోన్ పరిధి కూడా 2500 కి.మీ.వరకు తగ్గే అవకాశం ఉంది. తెలంగాణలోని జిల్లాల కంటే హైదరాబాద్‌నుంచే ఎక్కువ మంది ప్రయాణం చేస్తారు. ఆదాయార్జనలో హైదరాబాద్ మాత్రమే కీలకం కానుంది. 'ప్రయాణికులు ఏ జోన్ ఒరిజినేటింగ్ (ప్రారంభ)స్టేషన్ నుంచి బయలుదేరితే టిక్కెట్ల పైన వచ్చే ఆదాయం ఆ జోన్‌కే చెందుతుంది. ఈ లెక్కన విజయవాడ, విశాఖ, కాకినాడ, తిరుపతి వంటి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల నుంచి లభించే ఆదాయం దక్షిణ కోస్తా జోన్‌కు వెళ్లనుంది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి బయలుదేరే ప్రయాణికుల ఆదాయం దక్షిణమధ్య రైల్వేకు లభిస్తుంది. దీంతో ఈ జోన్ పరిధిలో ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గనుంది. ఇప్పటికే దక్షిణకోస్తా జనరల్ మేనేజర్ నియామకం పూర్తయిన దృష్ట్యా మరో ఐదారు నెలల్లో జోన్‌లోని అన్ని విభాగాల విభజన ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

ఉద్యోగుల విభజన...

దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలోని అన్ని విభాగాల్లో 1.05 లక్షల మంది పనిచేయవలసి ఉండగా ప్రస్తుతం 92 వేల మంది పని చేస్తున్నారు. 14 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డివిజన్‌లలో విధులు నిర్వహించే డివిజనల్ రైల్వేమేనేజర్‌లు మొదలుకొని ఆయా డివిజన్‌లకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది యదావిధిగా అక్కడే ఉంటారు.కానీ హైదరాబాద్ కేంద్రంగా ఉమ్మడి కార్యాలయాలుగా ఉన్న రైల్‌నిలయం, లేఖాభవన్, రైల్ నిర్మాణ్ భవన్, రైల్వే కేంద్రీయ ఆసుపత్రిల్లో పని చేసే అధికారులు, సిబ్బంది మాత్రం రెండు జోన్‌లకు చెందనున్నారు. ఈ కార్యాలయాల్లో 3500 మందికి పైగా పనిచేస్తున్నారు.విభజన నేపథ్యంలో 2000 మందికి పైగా దక్షిణ కోస్తాకు బదిలీ కానున్నారు. విభజన ఏర్పాట్లు ప్రాథమిక దశలో ఉన్నాయని, అన్ని అంశాల్లోనూ త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఒక అధికారి వివరించారు. పూర్తిస్థాయి విభజన జరిగిన తరువాత కొత్త జోన్ అవతరణ తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు.

స్టీల్ షాపులో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన స్టీల్ సామాగ్రి

చిక్కడపల్లి: అజామాబాద్‌లోని హిందుస్తాన్ స్టీల్‌వరల్డ్ ఔట్‌లెట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం..వీఎస్టీ అజామాబాద్‌లో మహ్మద్ ఇమ్రాన్ హిందుస్తాన్ స్టీల్‌వరల్డ్ ఔట్‌లెట్‌ను నిర్వహిస్తున్నారు. కాగా ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో షాప్ నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడడంతో స్థానికులు పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండుగంటల పాటు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్‌వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో షాప్‌లోని సీలింగ్‌ఫ్యాన్లు, లైట్లు, స్టీల్‌సామాన్లు, మిక్సీలు తదితర వస్తువులు కాలిపోయాయి. చిక్కడపల్లి ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడి వద్ద రూ.25 లక్షలు పట్టివేత

శంషాబాద్: ఎలాంటి రుజువులు లేకుండా నగదు తరలిస్తున్న ఓ దేశీయ ప్రయాణికుడిని శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నగరానికి చెందిన శశివర్ధన్‌రెడ్డి సోమవారం ఐఎక్స్–2933 విమానంలో గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో అతడి వద్ద రూ.25 లక్షల నగదు లభ్యమైంది. దానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు కూడా శశివర్ధన్‌రెడ్డి చూపకపోవడంతో డబ్బును నగరంలో ఆదాయపుపన్ను శాఖకు చెందిన అయకార్‌భవన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు అరెస్ట్ చేసి డబ్బులు ఎవరికి ఇవ్వడానికి తరలిస్తున్నాడు..ఇతర లావాదేవీలపై దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

సుప్రీంకోర్టు న్యాయవాదిపై హత్యాయత్నం

నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తున్న సుప్రీంకోర్టు న్యాయవాదిని వెంబడించిన నలుగురు యువకులు ఆయనను అడ్డగించి పిస్టల్ చూపి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..చందూలాల్ బేలాలో నివసించే సీనియర్ సుప్రీంకోర్టు లాయర్ బి.శైలేష్ సక్సేనా ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తన అధికారిక గనమెన్ మహేష్‌ను బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో దింపి తన కారులో భార్య, బావమరిదితో కలిసి రాయదుర్గం వైపు వెళ్తున్నాడు. రోడ్డునెంబర్–12లోని విరించి ఆస్పత్రి వద్ద ముందస్తు పథకం ప్రకార నలుగురు యువకులు బ్లాక్ కలర్ జాగ్వార్ కారులో ఆయన కదలికలను గమనిస్తూ ముందుకు వెళ్లారు. నీలోఫర్ కేఫ్ వద్దకు రాగానే పెద్ద పెద్ద హారన్లతో ఇబ్బందికి గురిచేశారు. దీంతో డోర్ తెరిచిన శైలేష్ సక్సేనా ఎందుకు హారన్లు కొడుతున్నారంటూ జాగ్వార్ కారులో ఉన్న నలుగురినీ ప్రశ్నించాడు. ఈ రోజు మీ పని అయిపోతుంది..అంటూ వారు అసభ్య పదజాలంతో దూషిస్తూ హెచ్చరించి శైలేష్ సక్సేనా కారును ఓవర్‌టేక్ చేసి ముందుకువెళ్లారు. కొద్ది దూరంలో కారు ఆపి శైలేష్ సక్సేనాను అడ్డుకునేందుకు యత్నించగా ఆయన వారి నుంచి తప్పించుకుని ముందుకు దూసుకెళ్లారు. ఆగంతకులు మళ్లీ కారును ఓవర్ టేక్ చేస్తూ ఫిలిం ఛాంబర్ వద్ద కారును రోడ్డుకు అడ్డంగా పెట్టి సక్సేనా కారును అడ్డుకున్నారు. కారులో నుంచి బయటకు వచ్చిన నలుగురు యువకులు సక్సేనా కారు అద్దాలను కొడుతూ ఫైర్ ఆర్మీ పిస్టల్‌తో బెదిరించారు. భయభ్రాంతులకు గురైన సక్సేనా అరగంట పాటు వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే ఆగంతకులు నలుగురూ చుట్టూ రౌండప్ చేసి కారు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా బెదిరిస్తూ హెచ్చరిస్తూ పిస్టల్ చూపిస్తూ కాల్చేస్తామంటూ సైగలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఎలాగోలా కారు రివర్స్ చేసుకున్న సక్సేనా వారి నుంచి తప్పించుకుని అర్ధ రాత్రి 1 గంటలకు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. తాను పెద్ద పెద్ద భూవివాదాలు కోర్టుల్లో వాదిస్తుంటానని, తనకు చాలామంది శత్రువులు ఉన్నారని, పలుమార్లు దాడులు కూడా జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రభుత్వం నుంచి గన్‌మెన్ కూడా ఉన్నారన్నారు. ఇటీవలనే రివాల్వర్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నానని వెల్లడించారు. పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్‌ను హత్య చేసేందుకు యత్నించాడా..? బెదిరించి కిడ్నాప్ చేసేందుకు యత్నించారా? అన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

బంగారం కోసమే బాలమ్మ హత్య

- తెలిసిన మహిళే ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తింపు
- నిందితురాలి అరెస్టు, రిమాండ్



బాలమ్మ(ఫైల్)

మణికొండ: ఓ వృద్ధురాలి మెడలో, కాళ్లకు ఉన్న బంగారం, వెండిపై కన్నేసిన ఓ మహిళ ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి హత్య చేసిన సంఘటనను నార్సింగి పోలీసులు ఛేదించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రామేశ్వరం బాలమ్మ(75) ఈ నెల 3వ తేదీన ప్రతిరోజు మాదిరిగానే వాకింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవటం, ఆమె కోడలు ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా కోడలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు..ఆమె అనుమానం వ్యక్తం చేసిన మహిళ అనిత కూడా అప్పటి నుంచి కనిపించకుండా పోవడంతో వెదకడం ప్రారంభించారు. 4వ తేదీనే బాలమ్మ మృతదేహం వికారాబాద్ జిల్లా చెన్‌గొముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించింది. అప్పటికే మృతదేహం గుర్తు పట్టరాకుండా ఉండటం, శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవటంతో వారు స్పాట్‌లోనే పోస్టుమార్టం నిర్వహించి కండ్లపల్లి అడవిలోనే ఖననం చేశారు.

అనిత చిక్కడంతో వెలుగులోకి..

నార్సింగి పోలీసులు విచారణ క్రమంలో అనితను ఈ నెల 7వ తేదీన ఆమె స్వస్థలం వికారాబాద్ జిల్లా పరిగి మండలం, మిట్టకోడూరు గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. ఆమెను తమదైన శైలిలో విచారించటంతో బాలమ్మను తానే బంగారం గురించి హత్య చేశానని, ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి తస్కరించినట్లు అంగీకరించింది. మృతదేహం కండ్లపల్లి అడవిలో వదిలేశానని తెలిపింది. దాంతో చెన్‌గొముల్ పోలీసులను సంప్రదించటంతో గుర్తు తెలియని మహిళ శవంగా భావించి పోస్టు మార్టం నిర్వహించి అక్కడే పూడ్చివేశామని తెలిపారు. దాంతో పూడూర్ మండల తహసీల్దార్ అనుమతితో పాతిపెట్టిన బాలమ్మ మృతదేహాన్ని ఈనెల 7వ తేదీన వెలికి తీశారు. ఆమెను బాలమ్మగానే బంధువులు గుర్తించటం, హంతకురాలి వద్ద ఉన్న బంగారం, వెండి స్వాధీనం కావటంతో అనితను అరెస్టు చేశారు.

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు యువతి ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)

కుత్బుల్లాపూర్: మొబైల్ ఫోన్ ఎక్కువగా మాట్లాడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. ఏఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్ ప్రాంతానికి చెందిన రాజేష్‌కుమార్ కుమార్తె తేజస్విని(19) గౌతమి కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. కాగా ఈ నెల 8వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో యువతి ఫోన్‌లో మాట్లాడుతుండగా తల్లిదండ్రులు మందలించారు. సోమవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ డ్యూటీకి వెళ్లగా..ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటర్నెట్ టెక్నీషియన్ ఇంటికి వచ్చి రాజేష్‌కుమార్ మొబైల్‌కు ఫోన్‌చేశాడు. అతను వెంటనే కుమార్తెకు ఫోన్ చేశాడు. ఆమె ఎంతకీ లేపకపోవడంతో పక్కింట్లో ఉండే లక్ష్మికి కాల్ చేసి చూడమని చెప్పాడు. దీంతో లక్ష్మి వెళ్లి చూడగా తేజస్విని చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల హంతకుడు డ్రైవరే..

మరో వ్యక్తి సహకరించినట్లు పోలీసుల గుర్తింపు: ఇద్దరి అరెస్టు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జన చైతన్య ఫేజ్–2 అపార్ట్‌మెంట్‌లో జరిగిన జంట హత్య కేసులో ప్రధాన నిందితుడు గతంలో పని చేసిన కారు డ్రైవర్‌గా రాజేంద్రనగర్ పోలీసులు నిర్ధారించారు. నిందితున్ని సోమవారం ఉదయం మెదక్‌లో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. హంతకుడు సంవత్సరంన్నర క్రితం వరకు షేక్ అబ్దుల్లా వద్ద కారు డ్రైవర్‌గా పని చేశాడు. ఆ సమయంలో షేక్ అబ్దుల్లాతో పాటు రిజ్వానాలు కఠినంగా ఉండేవారని..తరచూ దూషించేవారని...దీంతోనే కక్ష పెంచుకున్నట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. గతంలో మూడుసార్లు హత్యాయత్నం చేసేందుకు వచ్చి వెనుదిరిగాడని.. చివరకు ఈ నెల 6వ తేదీన హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ హత్యకు సహకరించిన మరో నిందితుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బియ్యం బస్తాలు ఎత్తుతుండగా హమాలీ కార్మికుడి మృతి



మట్టయ్య (ఫైల్)

జవహర్‌నగర్: రేషన్ షాప్ వద్ద బియ్యం బస్తాలను ఎత్తుతుండగా ఓ హమాలీ కార్మికుడు మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌లో నివసించే మట్టయ్య (48) హమాలి పని చేస్తుంటాడు. భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి ఉంటున్నారు. సోమవారం బీజేఆర్‌నగర్‌లో ఓ రేషన్ షాప్ వద్ద బియ్యం బస్తాలను ఎత్తుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు 108కు ఫోన్ చేయగా సంఘటన స్థలానికి వచ్చి మట్టయ్యను పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బస్తాలను ఎత్తుతుండగా గుండెపోటుతో మృతి చెందిఉండవచ్చని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్స్ టు గంజాయి స్మగ్లర్స్!

కొత్త అవతారం ఎత్తుతున్న రౌడీషీటర్లు

- జైల్లో ఏర్పడిన పరిచయాలతో ఈ దందా
- ఈ ఏడాది ఇప్పటికే ఇలా ఐదుగురు అరెస్టు
- అప్రమత్తమైన సిటీ టాస్క్‌ఫోర్స్ బృందాలు



మారేడ్‌పల్లిలో పట్టుబడిన గంజాయి విక్రేతలు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగమనంలో సాగుతోంది. దీంతో సెటిల్‌మెంట్లకు ఆస్కారం ఉండట్లేదు. ఒకప్పటి మాదిరిగా వసూళ్లకు అవకాశం లేదు. దీంతో అనేక మంది రౌడీషీటర్లు ప్రస్తుతం గంజాయి స్మగ్లర్ల అవతారం ఎత్తుతున్నారు. ఆంధ్రా–ఒడిస్సా సరిహద్దు ప్రాంతం (ఏఓబీ) నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి సరుకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి–మే మధ్య ఐదుగురు రౌడీషీటర్లు గంజాయితో చిక్కారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న నగర టాస్క్‌ఫోర్స్ బృందాలు అప్రమత్తం అయ్యాయి.

మూలాల వరకు వెళ్తున్న పోలీసులు...

స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు, హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లతో పాటు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సైతం మాదకద్రవ్యాల దందాపై ఉక్కుపాదం మోపుతున్నాయి. సింథటిక్ డ్రగ్స్ కంటే ప్రమాదకరంగా చెలామణి అవుతున్న గంజాయిపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఒకప్పటి మాదిరిగా ఇక్కడి విక్రేతలు, వినియోగదారులనే కాకుండా సరఫరా చేస్తున్న వారితో పాటు కొన్ని కేసుల్లో గంజాయి పండిస్తున్న వారినీ పట్టుకుని జైళ్లకు పంపిస్తున్నారు. దీనికోసం డెకాయ్ ఆపరేషన్లు చేయడంతో పాటు అవసరమైన ఆయా ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు.

జైళ్లలో ఏర్పడుతున్న పరిచయాలు...

అలాగే నగరానికి చెందిన రౌడీషీటర్ల పైనా పోలీసు విభాగం నిఘా ఉంచుతోంది. స్థానికంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని చెక్ చెప్తోంది. మరో పక్క ప్రతి నెలా టాస్క్‌ఫోర్స్ ఎదుట హాజరుకాకుండా తప్పించుకుంటున్న, అజ్ఞాతంలో ఉండి కోర్టు విచారణకు హాజరుకాని వారితో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్న, వివిధ నేరాల్లో వాంటెడ్‌గా మారిన రౌడీషీటర్లను పట్టుకుని జైలుకు పంపిస్తోంది. ఇలా అప్పటికే జైల్లో ఉంటున్న గంజాయి విక్రేతలు, సరఫరాదారులు, పండించే వారితో రౌడీషీటర్లకు పరిచయాలు ఏర్పడుతున్నాయి. వారి ద్వారా గంజాయికి ఉన్న డిమాండ్ తెలుసుకుంటున్న రౌడీషీటర్లు ఆ దందా మొదలుపెడుతున్నారు.

అనుమానం రాని మార్గంలో రవాణా...

సాధారణంగా నగరానికి ఏఓబీ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా గంజాయి స్మగ్లింగ్ అవుతుంది. ఈ సరుకు సిటీ మీదుగానే మహారాష్ట్రకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలు ఉంటాయి. దీంతో రౌడీషీటర్లు కొత్త ఎత్తు వేస్తున్నారు. అప్పటికే నాగ్‌పూర్‌కు చేరిపోయిన గంజాయిని అక్కడి వారి నుంచి ఖరీదు చేస్తున్నారు. అక్కడ నుంచి కారులో సిటీకి తీసుకువచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి విక్రయిస్తున్నారు. నాగ్‌పూర్ టు హైదరాబాద్ రూట్‌లో గంజాయి కోసం తనిఖీలు ఉండకపోవడం వీరికి కలిసి వస్తోంది. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా మార్చడానికి, దాన్ని తీసుకువెళ్లి విక్రయించడానికి కమీషన్ ప్రాతిపదికన అనుచరుల్ని ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఒక్కో కేజీకి రూ.25 వేల వరకు విక్రయం...

ఈ నేరగాళ్లు నాగ్‌పూర్‌తో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో గంజాయిని కేజీ రూ.4 వేల నుంచి రూ.7 వేలు వెచ్చించి ఖరీదు చేస్తున్నారు. దీన్ని ఎవరికీ అనుమానం, వాసన రాకుండా ప్యాక్ చేసి కారులు, ప్రైవేట్ బస్సులతో పాటు రైళ్లలోనూ నగరానికి తీసుకువస్తున్నారు. ఆపై 50, 100 గ్రాముల ప్యాకెట్లలో ప్యాక్ చేసి వినియోగదారులు, దళారులకు విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో కేజీని రూ.20 వేల నుంచి రూ.25 వేలకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సరుకు అమ్మడానికి ఎలాంటి నేర చరిత్ర లేని వారినే ఎంపిక చేసుకుని అనుచరులుగా మార్చుకుంటున్నారని పోలీసులు చెప్తున్నారు.

గంజాయితో చిక్కిన రౌడీషీటర్లు...

- ఫిబ్రవరి 24న మారేడ్‌పల్లి రౌడీషీటర్లు టి.సంజయ్, టి.పవన్ ఎనిమిది కేజీల గంజాయితో చిక్కారు. వీరితో ఐదుగురు అనుచరులూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 11న టప్పాచబుత్ర రౌడీషీటర్ ఇమ్రాన్‌తో పాటు ఇద్దరు అనుచరులు 1.5 కేజీల గంజాయితో అరెస్టు అయ్యారు.
- ఏప్రిల్ 14న చాదర్‌ఘాట్ రౌడీషీటర్ మహ్మద్ ఇమ్రాన్ మూడు కేజీల గంజాయి, 60 ఆల్ఫాజోలం ట్యాబ్లెట్లతో పాటు 110 మత్తు ఇంజెక్షన్లతో చిక్కాడు.
- ఏప్రిల్ 24న మాసబ్‌ట్యాంక్ రౌడీషీటర్ మహ్మద్ సోఫియానుద్దీన్ రెండు కేజీల గంజాయితో చిక్కి జైలుకు వెళ్లాడు.
- మే 20న ఘరానా రౌడీషీటర్, స్నాచర్ సయ్యద్ నయీద్ హుస్సేన్ అలియాస్ లాంబా 21 కేజీల గంజాయితో చిక్కాడు. ఇతడితో పాటు నలుగురు అనుచరులూ పట్టుబడ్డారు.

జూబ్లీహిల్స్‌ క్లబ్‌లో ఈత పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజేశ్వరరావు

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ ఇంటర్నేషనల్‌ సెంటర్‌లో సభ్యులకు ఈత పోటీలు నిర్వహించారు. 5–90 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారికి నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారు. క్లబ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జేసీసీ ప్రెసిడెంట్‌ కే సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు, గవర్నింగ్‌ కౌన్సిల్‌ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. 85–90 వయస్సు ఫ్రీ స్టైల్‌ విభాగంలో మొదటి బహుమతి బీఎస్‌ రాజు, 55–60 విభాగంలో కల్లం గంగారెడ్డి, 50 మీటర్ల విభాగంలో మేకా రామకృష్ణ, మహిళా విభాగంలో వేదరాజు, 25 మీటర్ల విభాగంలో ఆరాధ్య బహుమతులు గెలుచుకున్నారు.

డాక్టరేట్‌ ప్రదానం


డాక్టరేట్‌ అందుకున్న శ్రీనివాసరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్‌ కల్యాణ్‌ నగర్‌ వెంచర్‌–3కి చెందిన సామాజిక వేత్త శ్రీనివాసరెడ్డికి గౌరవ డాక్టరేట్‌ వరించింది. సోమవారం న్యూఢిల్లీలో యూనివర్సల్‌ హానరరీ అవార్డ్‌ కౌన్సిల్‌ సామాజిక సేవలో భాగంగా శ్రీనివాసరెడ్డికి డాక్టరేట్‌ అందజేశారు.

వెంటనే కులగణన చేపట్టాలి

లిబర్టీ: కుల గణనను వెంటనే చేపట్టాలని బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. దేశవ్యాప్తంగా కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఆచరణలో చిత్తశుద్ధి లోపించిందన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన, జన గణనను చేస్తామని కేంద్ర ప్రభుత్వం పక్షాన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ ప్రకటించి నెల రోజులవుతున్నా ఇంకా ఆచరణలో రూపుదాల్చకపోవడం బాధాకరమన్నారు. బీసీలను మభ్యపెట్టడానికి ప్రభుత్వం ప్రకటన చేసిందా నిజంగా చేయాలన్న చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నించారు.

మంత్రికి సత్కారం

లిబర్టీ: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్‌ను కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు వెన్న సదానంద్‌ సత్కారించారు. దళితుల ప్రగతి, ఆర్థిక, అభివృద్ధి కోసం కృషి చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పార్లమెంట్‌ సభ్యుడిగా పనిచేసిన గడ్డం వివేక్‌ శాసన సభ్యులు, మంత్రిగా ప్రమాణం చేసిన క్రమంలో దళితజాతి మొత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతుందన్నారు.

అకారణంగా వ్యక్తిపై దాడి

వెంగళరావునగర్‌: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరంగం రఘు రహమత్‌నగర్‌లో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ నెల 8న రాత్రి బాలానగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి వెళ్తూ యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్‌ వద్ద పాన్‌కోసం ఆగాడు. ఆ సమయంలో యాదగిరి నగర్‌కు చెందిన బి.సునీల్‌, బి.శంకర్‌, బి.అనిల్‌కుమార్‌ మద్యం తాగి అక్కడకు వచ్చి రఘుతో దుర్భాషలాడారు. ఇదేమని ప్రశ్నించగా కర్రలు, ఇనుప రాడ్డుతో దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ ఆడుతున్న యువకుడి అరెస్ట్‌

వెంగళరావునగర్‌: ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ ఆడుతున్న యువకుడిని మధురానగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్‌ పరిసర ప్రాంతాల్లో ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ జోరుగా సాగుతోందని పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం రాత్రి ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ మధురానగర్‌లో పెట్రోలింగ్‌ విధులు నిర్వహిస్తుండగా మధురానగర్‌లోని ఓ హాస్టల్‌ సమీపంలో జి.సురేష్‌ అనే యువకుడు ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ ఆడుతుండగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం


ఎల్‌ఓసీ అందజేస్తున్న సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌: సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరమని కార్పొరేటర్‌ సీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీ రాంనగర్‌కు చెందిన సిరాజ్‌, రహమత్‌నగర్‌కు చెందిన శశిరంజాన్‌ శర్మలకు సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను సోమవారంఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్‌సాబేర్‌, సయ్యద్‌ షరీఫ్‌, లింగమూర్తి, శ్రీనివాస్‌, సంజీవ్‌రావు, మన్సూర్‌ పాల్గొన్నారు.

వర్షాకాలం వస్తున్నా

పూర్తికాని డీసిల్టింగ్‌!

- నాలాల్లో చెత్తా చెదారంతో ముందుకు కదలని వరద
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం


బీజేఆర్‌నగర్‌ బస్తీలో పూడిక తీస్తున్న దృశ్యం

బంజారాహిల్స్‌: ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో ఇప్పటికే నాలాల్లో డీసిల్టింగ్‌ పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జోన్‌ పరిధిలో 181 కిలో మీటర్ల మేర వరదనీటి కాలువలు ఉండగా, ఇప్పటివరకు 60 శాతం మాత్రమే డీసిల్టింగ్‌ పూర్తి చేశారు. వర్షాకాలం రాకముందే ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల నిర్వాకంతో ఎక్కడికక్కడ నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోయి బురద నిండిపోయి చెత్తా చెదారంతో వరదనీరు ముందుకు వెళ్లడం లేదు. పలుచోట్ల నిండిన నాలాల్లో వరదనీరు చేరి బురదతో కలిసి వెనక్కి నెట్టుకొస్తూ ఇళ్లను ముంచెత్తుతున్నాయి. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. వరద నీటి కాలువల్లో డీసిల్టింగ్‌ పనుల కోసం ప్రతియేటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ఏమాత్రం ఫలితం ఉండడం లేదు. ఎక్కడికక్కడ డీసిల్టింగ్‌ సమస్యలు స్థానికంగా తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఏప్రిల్‌, మే నెలల్లోనే భారీగా వర్షాలు కురిసి నాలాలన్నీ నిండిపోయి మురుగంతా వెనక్కి వస్తున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేయి చేయి కలిపారు.. పూడిక తీయించుకున్నారు..

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 పరిధిలోని ఫిలింనగర్‌ బీజేఆర్‌నగర్‌ బస్తీలో నివాసాలకు ఆనుకొని ఉన్న నాలాలోని వ్యర్థాలు, మురుగు నీరు ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఈ సమస్యను పలుమార్లు స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులకు, బస్తీ లీడర్లకు సైతం చెప్పారు. కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఈ మురుగు వల్ల దోమల బెడద పెరిగి కొంత మంది బస్తీవాసులు విష జ్వరాల బారిన సైతం పడ్డారు. ఎవ్వరికి చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో నాలాను ఆనుకొని ఉన్న నివాసితులంతా చెయ్యి చెయ్యి కలిపి తలా కొంచెం డబ్బులు వేసుకొని జేసీబీతో నాలాలో పేరుకుపోయిన పూడికను తొలగించుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఈ సమస్య గురించి ఎన్నోమార్లు చెప్పామని కానీ పూడిక తీస్తామని చెప్పి పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు పడితే ఇళ్లల్లో తాము ఉండే పరిస్థితి లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతియేటా ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి లక్షలాది రూపాయిలు డీసల్టింగ్‌కు కేటాయిస్తున్నా బస్తీలను ఆనుకొని ఉన్న నాలాల్లో మాత్రం వ్యర్థాలు తొలగించడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



నాలాల్లో డీసిల్టింగ్‌ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. చాలా ఇళ్లల్లోకి మురుగు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీసిల్టింగ్‌ చేపట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో మేమే డబ్బులు వేసుకుని పూడిక తీయించాం. మా బస్తీల్లో వరద వచ్చిందంటే పరిస్థితి భయంకరంగా ఉంటుంది.

– శ్రీశైలం, ఫిలింనగర్‌

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నాలాల్లో డీసిల్టింగ్‌ పనులు చేపట్టకపోవడంతో వ్యర్థాలు, బురద నిండిపోయింది. వెంటనే తొలగించాలంటూ ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. బురద, దుర్వాసనలు, దుర్గంధంతో మా వ్యాపారాలకు ఇబ్బందికరంగా మారింది. ఎవరూ స్పందించకపోవడంతో మేమే డబ్బులు వేసుకుని పూడిక తీయించుకున్నాం.

– రఘు, మెకానిక్‌ బీజేఆర్‌నగర్‌

హడ్కో పన్ను బాండ్లపై సమావేశం


మాట్లాడుతున్న ప్రతినిధులు

బంజారాహిల్స్‌: హౌసింగ్‌ అండ్‌ అర్బన్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (హడ్కో) సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో 54 ఈసీ క్యాపిటల్‌ గెయిన్‌ ట్యాక్స్‌ మినహాయింపు బాండ్లపై చర్చించడానికి అసోసియేట్స్‌ మీట్‌ను నిర్వహించింది. సీబీడీటీ ఏప్రిల్‌ 7 నోటిఫికేషన్‌ తర్వాత హడ్కో ఈ బాండ్లను జారీ చేయడానికి అధికారం పొందిందని, ఈ పన్ను ఆదా ఎంపికను అందించే ఎంపిక చేసిన పీఎస్‌యూలలో చేరిందని హడ్కో డైరెక్టర్‌ (ఫైనాన్స్‌) దల్జీత్‌సింగ్‌ కత్రీ తెలిపారు. హడ్కో డైరెక్టర్‌ (ఫైనాన్స్‌), ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ (ఫైనాన్స్‌), రీజనల్‌ హెడ్‌ ఈ బాండ్లలో ఆరు నెలల లోపు రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక ఆస్తి అమ్మకాల నుంచి మూలధన లాభాలు పన్ను నుంచి మినహాయింపబడతాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎల్వీఎస్‌ సుధాకర్‌బాబు, పి.సుభాష్‌రెడ్డి, సీనియర్‌ అధికారులు పాల్గొన్నారు.

11న దళిత నాయకత్వ వేదిక ఆవిర్భావ సభ


మాట్లాడుతున్న బెల్లి సురేష్‌

హిమాయత్‌నగర్‌ : దళిత నాయకత్వ వేదిక ఆవిర్భావ వేడుకలు ఈ నెల 11న సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు డీఎల్‌ఎఫ్‌ ప్రతినిధులు సురేష్‌, పాలడుగు శ్రీనివాస్‌, డాక్టర్‌ తలారి సత్యం తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దళిత నాయకత్వాన్ని బలోపేతం చేయడం, ఉద్యమాలు, నూతన రాజకీయ ఆలోచనలు, సామాజిక సాంస్కృతిక కృషిలో భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా(డీఎల్‌ఎస్‌) ఆవిర్భవించిందన్నారు. ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, నకిరేకల్‌ ఎమ్మెల్యే వేముల వీరేశం, పలు బహుజన సమాజ్‌ నాయకులు నల్లా సూర్యప్రకాష్‌, మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్‌, దళిత మానవ హక్కుల జాతీయ కన్వీనర్‌ పాల్‌ దివాకర్‌, రచయిత జిలుకర శ్రీనివాస్‌, విద్యాసాగర్‌ తదితరులు హాజరవుతారన్నారు.

సమస్యలపై కార్పొరేటర్‌ ఆరా

హిమాయత్‌నగర్‌: హిమాయత్‌నగర్‌ డివిజన్‌ ఫరీద్‌ బస్తీలో గత కొన్ని రోజులుగా పైప్‌లైన్‌, నీటి సమస్య ఉందని విషయం తెలుసుకున్న హిమాయత్‌నగర్‌ కార్పొరేటర్‌ మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌ స్థానికులను కలిసి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు మహేష్‌, హితేష్‌, సందీప్‌, నదీమ్‌, మోసిన్‌, జహీద్‌, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: టమాట రూ.23, నల్లవంకాయ.23, పొడుగువంకాయ.23, బెండకాయ.40, పచ్చిమిర్చి.40, బజ్జిమిర్చి.25, క్యాప్సికం.61, పచ్చికాకరకాయ.38, పందిరిబీర.35, క్యాబేజీ.15, క్యారెట్‌.40, దొండకాయ.23, గుండు బీన్సీస్‌.85, గింజచిక్కుడు.65, గోకరకాయ.40, కీర.23, దోసకాయ.18.

గుంతలమయమైన రోడ్డు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెబర్‌–14 ప్రధాన రహదారిలో గత కొంతకాలంగా మంచినీటి పైప్‌లైన్‌ నిర్మాణం కోసం జలమండలి అధికారులు తవ్వకాలు చేపట్టారు. పైప్‌లైన్‌ వేసిన తర్వాత మూడు, నాలుగు రోజుల్లో జీహెచ్‌ఎంసీ రీస్టోరేషన్‌ వర్క్‌ చేసి రోడ్డుపై గుంతలు పూడ్చాల్సి ఉంటుంది. రెండు నెలలు అయినా పూడ్చకపోవడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సర్టిఫికెట్ల అందజేత

ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌ గణేష్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్‌ శిక్షణలో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు అడిషినల్‌ డీసీపీ ఆనంద్‌, ఖైరతాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజశేఖర్‌ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఆర్గనైజింగ్‌ చైర్మన్‌ సింగరి రాజ్‌కుమార్‌, మహేందర్‌బాబు, వీణామాధురి పాల్గొన్నారు.

చెత్తా.. తొలగించరా?

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, ఫిలింనగర్‌, వెంకటేశ్వరకాలనీ, పంజగుట్ట, యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ, ఖైరతాబాద్‌, సోమాజీగూడ ప్రాంతాల్లో చెత్తా చెదారం భారీగా పేరుకుపోయింది. పారిశుద్ధ్య విభాగం సిబ్బంది చెత్తను తీసుకువచ్చి రోడ్ల పక్కనే వేస్తున్నారు. స్థానికులు సైతం తమ ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థాలు, చెత్త చెదారాన్ని ప్లాస్టిక్‌ కవర్‌లో తెచ్చి రోడ్ల పక్కన డంప్‌ చేస్తున్నారు. ప్రతిరోజూ చెత్తా చెదారం తొలగించాల్సి ఉండగా సిబ్బంది అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణల తొలగింపు


పార్కింగ్‌ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌ హెగ్డే

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–2లోని కమలాపురికాలనీ జీహెచ్‌ఎంసీ ప్రధాన గేటుకు రెండువైపులా రోడ్డు, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఆటో ట్రాలీలతో పాటు వ్యాన్లు, డబ్బాలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ బహిరంగ మల, మూత్ర విసర్జనలు, మందుబాబుల ఆగడాలు పెరిగిపోయి న్యూసెన్స్‌గా మారింది. ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చేవారికి గేటు ముందు పరిస్థితులు నరకాన్ని చూపిస్తున్నాయి. దీంతో ఇటీవల కాలనీవాసులు వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా వారం క్రితం ఆయన ఇక్కడికి వచ్చి ఈ ప్రాంతంలో పార్కింగ్‌ చేయవద్దని సూచించినా ఏమాత్రం వినిపించుకోలేదు. దీంతో సోమవారం బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌ హెగ్డే నేతృతవ్వంలో ఇన్‌స్పెక్టర్‌ సాయిప్రకాష్‌గౌడ్‌తో పాటు ట్రాఫిక్‌ పోలీసులు ఇక్కడ స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి అక్రమ పార్కింగ్‌ చేయవద్దని హెచ్చరించారు. అక్కడ ఉన్న డబ్బాలను కూడా తొలగింపజేశారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి


ఇంటింటి సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్‌: బడిబాట కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–7లోని గతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన జరుగుతుందని, అన్నీ ఉచితంగా లభిస్తాయని తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని సూచిస్తున్నారు.

ప్రజావాణికి స్పందన కరువు


ప్రజల కోసం ఎదురు చూస్తున్న అధికారులు

వెంగళరావునగర్‌: యూసుఫ్‌గూడ సర్కిల్‌–19 కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ సందర్భంగా ఉప కమిషనర్‌ జకియా సుల్తానా మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించడం, లేదా దరఖాస్తు చేసుకోవడం చేయాలని, తక్షణమే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అయితే ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మధ్యాహ్నం వరకు ఖాళీగా కూర్చున్న అధికారులు ఆ తర్వాత ఎవరి విధులకు వారు వెళ్లిపోయారు.

బోనాల ఏర్పాట్లపై నేడు సమన్వయ సమావేశం

పాల్గొననున్న మంత్రులు సురేఖ, పొన్నం

చార్మినార్: ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలకు నగరం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తోంది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగే సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉత్సవాల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. ఈసారి ఉత్సవాలను వైభవంగా కనుల పండువగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి: జస్టిస్ చంద్రకుమార్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

మియాపూర్: ప్రభుత్వ విద్యావ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టం చేయాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మియాపూర్ ఎంఏ నగర్ కాలనీ కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ దేశంలో పోటీ పరీక్షల పత్రాల లీకేజ్ అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. 2014 కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 6 శాతం నిధులు కేటాయించగా, 2024తో 2.5 శాతానికి తగ్గించారని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను నిరసించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, రాష్ట్ర మహిళా కన్వీనర్ సావిత్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుమార్, హైదరాబాద్ కన్వీనర్ శ్రీకాంత్, నాగరాజు, రాజు, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

వీసాల పేరిట మోసం

–ఇద్దరి రిమాండ్



డేనియల్



జహీర్‌ఖాన్

పంజగుట్ట: విద్యా, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే వారికి వీసాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన నిర్వాహకులను పంజగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తమిళనాడుకు చెందిన డేనియల్ నాగోల్‌లో ఉంటూ 2022లో సోమాజిగూడలో గ్లోబల్ పాత్‌వే ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రారంభించాడు. ఇతడి స్నేహితుడు జహీర్‌ఖాన్‌తో కలిసి విదేశాలకు వీసా ఇప్పిస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. అందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశాడు. నగరానికి చెందిన మీర్ మజార్ అలీ అనే వ్యక్తి వీసా కోసం రూ.10 లక్షలు చెల్లించాడు. వీసా ఇప్పించకపోగా డబ్బులు అడిగితే దబాయిస్తున్నారు. గత రెండు నెలలుగా కార్యాలయం కూడా మూసివేశాడు.దీంతో మీర్ మజార్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు సంస్థపై ఆరా తీయగా 20 మంది బాధితుల నుంచి రూ. 99 లక్షల వరకు వసూలు చేసినట్లు గుర్తించారు. డేనియల్, జహీర్‌ఖాన్‌లను సోమవారం అరెస్టు చేశారు.

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో డిజైన్ ఎక్స్‌ప్లోర్ సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంపు–2025 ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది.
- ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టులో యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్లతో కలిసి ఉచితంగా టైలరింగ్, సీసీటీవీ ప్రోగ్రాంలలో ఉచిత శిక్షణ ఇస్తారు.
- కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని వివేకానంద నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 గంటలకు వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్ హాలులో గ్యాస్ట్రో ఎంట్రాలజీపై అవగాహన కార్యక్రమం జరుగుతుంది.
- బంజారా రచయితల సంఘం పక్షాన 1961లో బంజారాల జీవనం అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరుగుతుంది.
- హిందీ ప్రచార్ సభ హైదరాబాద్ 90వ వార్షికోత్సవం నాంపల్లి స్టేషన్ రోడ్‌లోని హిందీభవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'కాలం'తో నడిచేందుకు..!

- వారసత్వ గడియారాలకు మరమ్మతులు
- త్వరలో పనులు పూర్తి చేయనున్న జీహెచ్ఎంసీ



కాచిగూడ రైల్వేస్టేషన్‌లో..



ఎంజే మార్కెట్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: క్లాక్ టవర్.. ఆయా ప్రాంతాల్లో ఐకానిక్ సింబల్.. నగరంలోని పలు కూడళ్ల వద్ద దర్శనమిచ్చే నిలువెత్తు కాలసూచిక. వాహనదారులు, పాదచారులు ఖచ్చితమైన సమయం తెలుసుకునేందుకు వీలుగా ఇవి కొలువుదీరి ఉన్నాయి. నగరంలోని సికింద్రాబాద్ క్లాక్ టవర్‌సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న క్లాక్ టవర్లకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఇవి వారసత్వ టవర్లుగా కూడా ఉన్నాయి. అంతటి ప్రత్యేకత కలిగిన క్లాక్ టవర్లలోని గడియారాల పనితీరుపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఆలనాపాలన కరువుకావడంతో అవి సరిగ్గా పనిచేయకుండా పోయాయి. నగరంలోని చరిత్రాత్మక భవనాలను, సముదాయాలను పరిరక్షించే క్రమంలో క్లాక్ టవర్లను కూడా పరిరక్షించాలని, గడియారాలను బాగు చేయించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. తొలుత సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సీఎస్ఐ చర్చి దగ్గరి అందరికీ సుపరిచితమైన క్లాక్‌టవర్‌తోపాటు మోండా మార్కెట్‌లోని మారుతి వీధి, రామ్‌గోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లోని చారిత్రక గడియారాలను మరమ్మతులతో పునరుద్ధరించడంతోపాటు నిర్వహణ పనుల్ని కూడా నిపుణులైన ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయించింది. ఓ వైపు వారసత్వ కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఆధునిక సాంకేతికతలతో వాటి మరమ్మతుకు సిద్ధమైంది. ఎలాంటి అంతరాయం లేకుండా కాలంతోపాటు గడియారం నిరంతరం నడిచేందుకు, కచ్చితమైన సమయాన్ని తెలిపే ఉపకరణాల్ని బాగు చేయడం, అవసరమైతే కొత్తవి అమర్చడం వంటివి చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా వాటికి పూర్వ వైభవం తెచ్చేందుకు సంబంధిత అధికారులు సిద్ధమయ్యారు.

ఏం చేయనున్నారు ?

- గడియారాలున్న కట్టడం, భవనం నిర్మాణశైలి మారకుండా ఉన్న రూపంలోనే పరిరక్షించడం
- గంటల ధ్వని బాగా వినిపించేందుకు స్పీకర్ డయాఫ్రమ్‌లను మరమ్మతు చేయడం లేదా కొత్తవి అమర్చడం
- రాత్రివేళ సైతం సమయం స్పష్టంగా కనిపించేలా లైటింగ్ ఏర్పాట్లు చేయడం
- సూర్యకాంతి తక్కువగా ఉన్నప్పుడు సవ్యంగా పనిచేసేందుకు బ్యాటరీ బ్యాకప్ అందుబాటులో ఉంచడం
- గడియారాలకు పూర్తిస్థాయి సర్వీసింగ్, ఆయిలింగ్‌లతోపాటు అవసరమైన సింక్రనైజేషన్ పనులు చేయడం
- ఈ పనులకు ఎంపికైన ఏజెన్సీలు ప్రతినెలా తనిఖీలు చేస్తూ, ఎప్పటికప్పుడు అవసరమైన సేవలందించాల్సి ఉంటుంది. 24X7 కచ్చితంగా పనిచేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు టెండర్లు ఆహ్వానించారు.



సికింద్రాబాద్ క్లాక్ టవర్

ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్–2025 పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేశారు. పీహెచ్‌డీ కేటగిరీ–2లో ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో 49 సబ్జెక్టులకు జరిగిన ఎంట్రన్స్ టెస్టుకు 9,747 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 7,907 మంది హాజరయ్యారు. వీరిలో 4,950 (62.60%) మంది అర్హత సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు. ర్యాంకు కార్డులను ఉస్మానియా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కార్యక్రమంలో వీసీ ప్రొ.కుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభంకానున్నట్లు వీసీ ప్రొ.కుమార్ తెలిపారు. స్టాండింగ్ కమిటీ సమావేశం అనంతరం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా ఫ్యాకల్టీలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పీహెచ్‌డీ ప్రవేశాలకు వంద మార్కుల్లో 70 రాత పరీక్షకు, 30 మార్కులు యూజీసీ నెట్, జేఆర్ఎఫ్, పీజీ కోర్సుల్లో సాధించిన మార్కుల శాతం, ఇంటర్వ్యూలకు వేర్వేరుగా ఉంటాయని వివరించారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా ప్రొ.కుమార్ పేర్కొన్నారు.

ఓయూలో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగంలో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఆధునిక యాంటీనా ఇంజినీరింగ్ ద్వారా కమ్యూనికేషన్, రాడార్ సవాళ్లకు పరిష్కారం అనే అంశం పై జరిగిన వర్క్‌షాప్‌నకు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఓయూ వీసీ ప్రొ.కుమార్, గౌరవ అతిథులుగా ఐఈఈఈ ఏపీఎస్ అధ్యక్షులు ప్రొ.కిష్టోఫ్ ఫ్యూమాక్స్, రావూస్ కన్సల్టెంట్స్ సీఈవో డా.సుధాకర్ రావు, ఏఎంపీఎల్ డా.ఎంవీ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం ఈసీఈలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 2001–2005 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కార్నె జయనాథ్, ఎస్‌వీపీ నయానకు డా.సుధాకర్ రావు అవార్డును అందచేశారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగం హెడ్, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ.రామకృష్ణ, కోఆర్డినేటర్లు డా.నరేంద్రరెడ్డి, డా.భారతీ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న నయాన

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

– ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హిమాయత్‌నగర్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. సోమవారం నారాయణగూడ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటైన పీఏసీఎస్‌లో ఉద్యోగులు రైతులతో చాలా దగ్గరి సంబంధాన్ని కలిగి వుంటారని, రైతు సంఘాలను క్రెడిట్, ఇన్‌పుట్‌లు, మార్కెట్, విలువ జోడింపులకు దగ్గరగా తీసుకు రావడంలో ప్రధాన పాత్ర పోషిస్తారని గుర్తుచేశారు. పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాక గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. అన్నివర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడివుందని తెలిపారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వై.నాగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, నేతలు అనంతుల నరసయ్య, భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం'

పంజగుట్ట: ఇప్పటికే పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రకు పారిస్తుండగా, ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టుతో నాగార్జునసాగర్ నుంచి గోదావరి నీటిని కూడా ఆంధ్రకు తరలించే కుట్రలు జరుగుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర త్యనారాయణఅధ్యక్షతన, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సమన్వయకర్తగా సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కృష్ణా మింగిరు.. గోదావరి మీద పడ్డారు' అనే అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంత రావు, జలవనరుల రంగం నిపుణుడు వి.ప్రకాష్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ ప్రాజక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి జాలాలను రాయలసీమ, నెల్లూరు అనంతరం తమిళనాడు ప్రాంతాలకు తరలించే కుట్ర జరుగుతుందన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతందని దీన్ని యావత్ తెలంగాణ ప్రజలు కలిసి అడ్డుకోవాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటం, ఆంధ్రప్రదేశ్‌లో కూడా కూటమి ప్రభుత్వం ఉండటంతో తెలంగాణకు అన్యాయం చేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్.హరిశంకర్ గౌడ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, బోయ గోపి, సుధాకర్ ముదిరాజ్, సాంబశివ గౌడ్, జయంతి, కరుణశ్రీ, నవీన్ గౌడ్, పాల్గొన్నారు.



గోపీనాథ్ మంచి మిత్రుడు: తలసాని



సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చాలా బాధాకరమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం మాదాపూర్‌లోని గోపీనాథ్ నివాసానికి మాజీ హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోపీనాథ్ సతీమణి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. 1992 నుంచి గోపీనాథ్, తాను సోదరులుగా, మంచి మిత్రులుగా కలిసి రాజకీయాల్లో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. భౌతికంగా గోపీనాథ్ దూరమైనప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తలసాని వెంట బీఆర్ఎస్ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజం, అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, సంతోష్ కుమార్, అశోక్ యాదవ్, శ్రీహరి, ఆరిఫ్, హరిసింగ్, నారాయణరాజు ఉన్నారు.

'సిరితలపుల శతకం' ఆవిష్కరణ



చిక్కడపల్లి: వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు సాహిత్యంపై రచనలు చేయడం ప్రశంసనీయమని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. వంశీ విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో రచయిత్రి స్వాతి జంగా(సింగపూర్) రచించిన 'సిరితలపుల శతకం'పుస్తకాన్ని సోమవారం రాత్రి త్యాగరాయగానసభలోని కళా లలిత కళావేదికలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సహజశైలిలో శతకం రాయడం అభినందనీయమన్నారు. స్వాతి జంగాకు వంశీ ప్రవాస భారతీయ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు కేవీ కృష్ణకుమారి, వాణి ఉప్పల, వంశీ రామరాజు, టి.సుధాదేవి, శైలజ, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

బంజారాహిల్స్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు జీఓలు ఇచ్చి చేతులు దులుపుకుంటే కుదరదని, వెంటనే నిధులు కేటాయించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో జరిగిన వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తీర్మానంలో రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, దానికి పాలకవర్గం ఏర్పాటు చేయాలని, లేదంటే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అర్హులైన అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తిరుపతిరెడ్డి, చక్రధర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, స్వప్నరెడ్డి, రామచంద్రరెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ: ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అనేక రైల్వేస్టేషన్లను ఆధునీకరించడంతోపాటు నూతన స్టేషన్లు, లైన్లు ఏర్పాటు చేస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం అల్వాల్ నాగిరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైల్వేస్టేషన్ల ఆధునీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా కేంద్ర ప్రభుత్వం వంద శాతం నిధులు ఇచ్చి పనులు చేపడుతుందన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని వెంకటాపురం, మచ్చబొల్లారం జనప్రియ హౌసింగ్ కాలనీ వద్ద, బొల్లారం రైల్వే స్టేషన్ వద్ద, తుర్కపల్లి, మేడ్చల్, గౌడవెల్లి, గుండ్ల పోచంపల్లిలో రైల్వేస్టేషన్లు ఆధునీకరించడంతోపాటు సౌకర్యాలు పెంచాలన్నారు. అల్వాల్ పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్‌లోని తుర్కపల్లిలో చేపట్టబోయే పనులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం తన వంతు నిధులు మంజూరు చేసిందని, మిగతా ఎక్కడ కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. వరంగల్– హైదరాబాద్ హైవేలో రైల్వే లైన్ రోడ్లను కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి, వీకే మహేష్, ఉపేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, చింతల మాణిక్యరెడ్డి, గోపు రమణారెడ్డి, వెంకటేష్, మల్లిఖార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పాఠశాలల పునఃప్రారంభమయ్యే నాటికి సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, డ్రెస్సులను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ప్రజల నుంచి 64 అర్జీలను స్వీకరించారు. అనంతరం విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 12న పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ శిక్షణ ఇవ్వాలి

టీడబ్ల్యూజేఎఫ్ తెలంగాణ ప్రెస్ అకాడమీ నిర్వహిస్తున్న జర్నలిస్టుల శిక్షణా తరగతుల్లో పాల్గొనేందుకు అర్హులైన జర్నలిస్టులందరికీ అవకాశం కల్పించాలని, జిల్లా కేంద్రాల్లోనూ శిక్షణ ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ కమిటీ కార్యదర్శి మైల సైదులు కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేయగా జిల్లా కేంద్రంలోనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డీపీఆర్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ (ఐఎఫ్‌జే) నేషనల్ కౌన్సిల్ మెంబర్ దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ్మా, నరేష్, సీనియర్ నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్టీ ట్రిబ్యునల్‌ను తరలించాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి

కాచిగూడ: అబిడ్స్‌లో ఉన్న డెబ్ట్ రికవరీ ట్రిబ్యునల్(డీఆర్టీ)ను ఇతర ప్రాంతానికి తరలించాలని డీఆర్టీ బార్ అసోసియేషన్ నేతలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ జి.రామారావు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల పవన్‌కుమార్ యాదవ్, రాగి శ్రవణ్ కుమార్ తదితరులు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని బీజేపీ నగర కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అసౌకర్యాలకు నిలయంగా ఉన్న డీఆర్టీ ట్రిబ్యునల్ కార్యాలయాన్ని కవాడిగూడలోని సీజీవో టవర్స్‌కుగానీ, అన్ని సౌకర్యాలు ఉన్న ఇతర ప్రదేశాలకుగానీ మార్చాలని అన్నారు. డీఆర్టీ అప్పిలేట్ కేంద్రం కలకత్తాలో ఉండటం వల్ల దూరభారంతోపాటు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, హైదరాబాద్ నగరంలో మరో అప్పిలేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.


మొరాయించిన 'బిల్డ్ నౌ' సాఫ్ట్‌వేర్

- నిర్మాణదారులకు తప్పని ఇబ్బందులు
- పెండింగ్‌లో పెద్ద ఎత్తున దరఖాస్తులు

రాజేంద్రనగర్: ఇంటి నిర్మాణ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ కొత్తగా ప్రవేశపెట్టిన బిల్డ్ నౌ సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. రోజుల తరబడి సర్వర్ డౌన్‌తో ఓటీపీలు రాకపోవడంతో అటు నిర్మాణదారులు, ఇటు అధికారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ గతంలో టీఎస్ బీ–పాస్ ద్వారా ఇంటి అనుమతులను మంజూరు చేసింది. వివిధ కారణాలతో ఆ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేసి కొత్తగా బిల్డ్ నౌ సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా మొదట జీహెచ్ఎంసీ అధికారులు రెండు, మూడు రోజుల్లో అనుమతులు ఇస్తామని ప్రకటించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం నుంచి ఈ సాఫ్ట్‌వేర్ పని చేయడం లేదు. దీంతో నిర్మాణదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటు ఐదు డివిజన్లకు కేవలం ఒకే ఒక్క సెక్షన్ అధికారి ఉండటంతో అనుమతుల మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంటోంది. సంబంధిత యజమాని దరఖాస్తు చేసుకున్న స్థలానికి వెళ్లి పరిశీలించిన అనంతరం సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలి. ఐదు డివిజన్లకు ఒకే ఒక్క అధికారి ఉండటంతో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. సాఫ్ట్‌వేర్ పని చేయకపోవడం, ఇటు సిబ్బంది కొరత కారణంగా సర్కిల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు, నాలుగు రోజుల్లోనే దాదాపు 50కి పైగా పెండింగ్‌లో పడ్డాయి. వీటితోపాటు గతంలో 100కు పైగా ఫైళ్లు పెండింగ్‌లో కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయమైన అనుమతుల విషయంలో అధికారులు ఇలా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సాఫ్ట్‌వేర్‌కు మరమ్మతులు చేయించి సెక్షన్ అధికారుల సంఖ్యను పెంచాలని రాజేంద్రనగర్ వాసులు కోరుతున్నారు.

నాన్ జ్యుడీషియల్ స్టాంప్ కౌంటర్ ప్రారంభం

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి: శ్రీనాథ్



నాన్ జ్యుడీషియల్ స్టాంప్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న పిల్లరిశెట్టి శ్రీనాథ్ తదితరులు

సిటీ కోర్టులు: న్యాయవాదులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పిల్లరిశెట్టి శ్రీనాథ్ తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్ కోర్టులో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ సేల్ కౌంటర్‌ను న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజేంద్రనగర్ కోర్టులో నాన్ జ్యుడీషియల్ సేల్ కౌంటర్ లేకపోవడంతో అక్కడి న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి న్యాయవాదుల పరస్పర సహకార సంఘం దృష్టికి తీసుకువచ్చి విన్నవించారని తెలిపారు. దీంతో వెంటనే సంఘం సభ్యులందరం కలిసి స్టాంప్, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఇటీవల లైసెన్స్ కూడా రావడంతో వెంటనే రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణంలో నాన్ జ్యుడీషియల్ కౌంటర్‌ను ప్రారంభించి న్యాయవాదులకు అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఈ కౌంటర్ అన్ని రకాల నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో అనునిత్యం న్యాయవాదుల పక్షాన నిలబడి వారికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ వినతి మన్నించి వెంటనే రాజేంద్రనగర్ కోర్టుకు నాన్‌జ్యుడీషయల్ స్టాంప్ కౌంటర్‌ను ఏర్పాటు చేసినందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, న్యాయవాదులు న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందలు తెలియజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఉప అధ్యక్షుడు ప్రవీణ్ మణికొండ, కార్యదర్శి శ్రీధర్ తడకంటి, జాయింట్ సెక్రెటరి మహేశ్వర ఆర్మల, కోశాధికారి గిరి తోర్నాల, రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెర్ఫ్యూమ్ తయారీ వర్క్ షాప్..



ఈ నెల 15న డయాబ్లో వేదికగా నిర్వహణ

సాక్షి, సిటీ బ్యూరో: ఈ మధ్య ట్రెండింగ్ అవుతున్న పెర్ఫ్యూమ్ మేకింగ్.. నగరంలో కూడా పరిమళాలను వెదజల్లనుంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న ఈ పెర్ఫ్యూమ్ మేకింగ్ వర్క్ షాప్ నగరంలోని డయాబ్లో వేదికగా ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నారు. ఆర్టిసాన్ బే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వినూత్న కార్యక్రమంలో నగరంలోని అన్ని వయసుల వారూ పాల్గొనవచ్చు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సుగంధ పరిమళాల తయారీ కార్యక్రమం నగరవాసులను అలరిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ వర్క్ షాప్ కొనసాగనుంది. ఈ వర్క్ షాప్‌కు సంబంధించిన పాస్‌లు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



ఈ ఆధునిక జీవనశైలిలో భాగంగా అధిక శాతం మంది నగరవాసులు ఒత్తిడికి లోనవుతున్నారు. దీంతో మానవులకు మానసిక ప్రశాంతత ఒక విలాసంగా మారుతోంది. ఇలాంటి సమయంలో మన ఇంట్లో ఉండే పెంపుడు జంతువులే మిత్రులుగా ఎంతో సహాయపడుతున్నాయి. ఈ విషయం ఇటీవల మార్స్ పెట్‌కేర్, మెడిటేషన్ యాప్ కామ్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో వెల్లడైంది. 20 దేశాల్లో 31 వేల మందిపై నిర్వహించిన ఈ సర్వేలో భారత్‌కు చెందిన వెయ్యి మంది పెంపుడు జంతువుల యజమానుల అభిప్రాయాలు విశేషంగా వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలు తెలుసుకుందాం.. - సాక్షి, సిటీబ్యూరో

హోమ్లీ పెట్.. ఒత్తిడి సెట్..

పెంపుడు జంతువులతో మానసిక ప్రశాంతత

- జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఒంటరితనం దూరం
- మానవ శ్రేయస్సులో పెంపుడు జంతువుల ప్రభావం
- మార్స్, కామ్ సర్వేలో వెల్లడైన విశేష అంశాలు
- పెంపుడు జంతువులకు అనుకూలంగా హైదరాబాద్‌లోని మార్స్ కార్యాలయం







పెంపుడు జంతువుల కారణంగా భారతీయుల్లో 92 శాతం మంది తమ స్క్రీన్ టైమ్ తగ్గిందని చెబుతుండగా, 93 శాతం మంది రోజువారీ పనుల మధ్య బ్రేక్ తీసుకోడానికి పెంపుడు జంతువులే ప్రేరణగా ఉన్నాయని చెబుతున్నారు. అలాగే, 82 శాతం మంది పెంపుడు జంతువులతో మాట్లాడటం ద్వారా రిలాక్సేషన్ పొందుతున్నామని, ఒంటరి తనానికి దూరం అవుతున్నామని పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్‌లోని మార్స్ కార్యాలయం కూడా భాగస్వామ్యమైంది.

సర్వే విశేషాలివే..

ఈ సర్వేలో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 79 శాతం మంది భారతీయులు నిద్ర బాగా పడుతోందని చెబుతుండగా, అదే అమెరికాలో ఇది కేవలం 55 శాతం మాత్రమే ఉండటం విశేషం. అంతేకాదు, 88 శాతం మంది ఆలోచనల్లో ఆవేశం తగ్గిందని, 76 శాతం మంది ఆ క్షణాలను ఆస్వాదించే పరిస్థితుల్లో ఉన్నామని వెల్లడించారు. ఈ డేటా కేవలం గణాంకాలుగా కాకుండా, మానవుల మానసిక శ్రేయస్సులో పెంపుడు జంతువుల ప్రభావాన్ని తేటతెల్లం చేస్తోంది. ఈ సందర్భంగా మార్స్ పెట్‌కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలిల్ మూర్తి చెప్పినట్లు, 'పెంపుడు జంతువులు కేవలం మనిషికి ఆనందం కలిగించడమే కాక, మెదడుకు విశ్రాంతినిచ్చే సహచరులుగా నిలుస్తున్నాయి.' కామ్ చీఫ్ కంటెంట్ ఆఫీసర్ గ్రెగ్ జస్టిస్ మాట్లాడుతూ.. 'పెంపుడు జంతువులు మెడిటేషన్ లాంటి ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. మానవ సంబంధాల్లో మానవ–జంతు అనుబంధం ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటోంది' అన్నారు.

పెంపుడు జంతువుల భాగస్వామ్యం..

ఈ సర్వే ద్వారా మార్స్, కామ్ మధ్య దీర్ఘకాలిక గ్లోబల్ భాగస్వామ్యం ప్రారంభమైంది. ఈ భాగస్వామ్యం ఫలితంగా కామ్ యాప్‌లో ప్రత్యేకంగా పెంపుడు జంతువుల నేపథ్యంలో గైడెడ్ మెడిటేషన్లు, మైండ్‌ఫుల్‌నెస్ టూల్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది మానసిక ఆరోగ్యాన్ని పెంపుడు జంతువుల అనుబంధంతో మరింత బలోపేతం చేస్తోంది. హైదరాబాద్‌లోని మార్స్ కార్యాలయం కూడా పెంపుడు జంతువులకు అనుకూలంగా రూపొందించబడినదని వారు పేర్కొన్నారు. 'మాయా', 'మైలో' వంటి పెట్ అసోసియేట్స్‌తో సహా సంస్థ జంతుప్రేమకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిశోధన స్పష్టంగా చెబుతున్న విషయం ఏమిటంటే.. పెంపుడు జంతువులు ఇక కేవలం సరదా కోసం కాదు, ఆరోగ్యంగా బతకడానికీ, హాయిగా ఉండడానికీ ఒక సహజ మార్గంగా నిలుస్తున్నాయి..



డిజిటల్ డీటాక్స్, ఒత్తిడి దూరం..

మెరుగైన నిద్ర, ఒత్తిడి తగ్గింపు, ఆనందం, డిజిటల్ డీటాక్స్ ఇవన్నీ కుక్కలు, పిల్లులు, ఇతర జంతువుల ప్రేమలో దొరుకుతున్నాయి. ఈ సందర్భంగా పెంపుడు జంతువులను దత్తత తీసుకోవాలని, తమ ఇంట్లోకి ఆహ్వానించాలని కోరారు. పాలసీ మేకర్లు, షెల్టర్లతో కలిసి భారతదేశాన్ని పెంపుడు జంతువులకు మరింత అనుకూలంగా మార్చాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. మానవ జీవితంలో పెంపుడు జంతువులు ఆత్మీయుల్లా మారి, మానసిక ప్రశాంతతకు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.





ఉత్సవాల రాజు.. పోతురాజు

నగరంలో బోనాలకు సిద్ధమవుతున్న కళాకారులు

- కొందరు వంశపారంపర్యంగా ఇదే వృత్తిలో
- బోనాల ఊరేగింపులో వీరి విన్యాసాలే హైలెట్

బోనాలు.. పోతురాజులు.. ఈ రెండింటికీ విడదీయరాని అనుబంధం. శతాబ్దాలుగా బోనాలు, పోతురాజుల పేర్లు ఒకదానికొకటి పోటీపడుతూ ప్రాచుర్యం పొందుతున్నాయి. ఎల్లమ్మ అమ్మవారి ఆలయాల ముందు పోతురాజుల విన్యాసాలు కళ్లప్పగించి చూడాల్సిందే. వేల సంఖ్యలో భక్తులు పాల్గొనే బోనాల ఊరేగింపుకు పోతురాజుల విన్యాసాలు హైలెట్‌గా నిలుస్తాయి. ఒళ్లు గగుర్పొడిచే వీరి విన్యాసాలు బోనాల ఉత్సవాలకే ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. వారి గింకారాలతో ఆ ప్రాంతంలో నిశబ్దం ఆవహిస్తుంది. చూసేవారంతా భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. ముఖ్యంగా పోతురాజు నిమ్మకాయలతో చేసే విన్యాసం చూడముచ్చటగా అనిపిస్తుంది. రెండు చేతుల్లో కోరడాలతో సై సై అని చప్పుడు చేస్తూ పోతురాజుల వీరంగం భలే ఆకట్టుకుంటుంది. – గోల్కొండ

పోతురాజుల ప్రత్యేక ఆకర్షణ..



పోతురాజు వేషంలో తయారవడమే ఒక ప్రత్యేక కళ. బోనాలలో పోతురాజులది ప్రత్యేక ఆకర్షణ. శరీరం మొత్తం వివిధ రకాల రంగులు, కాళ్లకు గల్లు గల్లు మనే గజ్జెలతో పోతురాజులు ఆకట్టుకుంటారు. మెడలో మాలలు, రెండు చేతుల్లో కోరడాలతో, నాలుక బయటకు తీస్తే ప్రతి ఒక్కరూ భయపడాల్సిందే. కాగా గోల్కొండ కోట బోనాలలో గత దశాబ్ద కాలంగా పోతురాజుగా ప్రజలను ఆకట్టుకుంటున్నాడు తల్వార్ శివ. పోతురాజు వేషంలో స్థానిక ప్రజల అభిమానాన్ని పొందాడు. అమ్మమీద భక్తితోనే బోనాల ఊరేగింపులో పోతురాజు వేషం వేస్తున్నానని తల్వార్ శివ అంటున్నాడు. ఒక్క రోజు వేషానికి వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఊరేగింపులో విన్యాసాలు చేస్తుంటే ప్రజలు తమను ఆదరిస్తారని, ఇది తమకు ఎంతో గర్వంగా అనిపిస్తుందని అంటున్నారు.




మాన్‌సూన్ రెగట్టా షురూ..

తొలి రోజు తెలంగాణ సెయిలర్ల సత్తా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్ సాగర్‌లో 16వ ఎడిషన్ మాన్‌సూన్ రెగట్టా సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. మొత్తం ఏడు విభాగాల్లో 127 మంది సెయిలర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. తొలి రోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో తెలంగాణ సెయిలర్లు సత్తా చాటారు. అండర్–19 మిక్స్‌డ్ డబుల్ క్లాస్‌లో తనుజా కామేశ్వర్–శ్రవణ్ పూర్తి ఆధిపత్యంతో తొలి మూడు రేసులనూ గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో రాష్ట్రానికి చెందిన దీక్షిత కొమ్మరవెల్లి–గణేష్ పీర్కట్ల రెండో స్థానంలో నిలిచారు. సబ్–జూనియర్ బాలుర విభాగంలో లోకల్ సెయిలర్ రిజ్వాన్ మహమ్మద్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఆకట్టుకున్నాడు. తమిళనాడుకు చెందిన కృష్ణ రెండో స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో లాహిరి కొమరవెల్లి, తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణకు గట్టి పోటీ ఇచ్చింది. తొలి రెండు రేసుల్లో చివరి వరకూ ఆధిక్యంలో నిలిచినప్పటికీ లాహిరి స్వల్ప తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అగ్రస్థానంలో నిలిచిన శ్రేయ ఆసియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో శ్రేయ కృష్ణ ఫేవరెట్‌గా ఉంది. లాహిరి త్వరలో మలేసియాలో జరిగే లాంగ్కావి యూత్ ఇంటర్నేషనల్ పోటీలకు వెళ్లనుంది.

ఘనంగా చిడా–దహి మహోత్సవం..



- ఆకట్టుకున్న తెప్పోత్సవం, అభిషేకం
- హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో అద్భుతంగా ఉత్సవం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో పానిహటి చిడా–దహి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో సోమవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. చిడా–దహి మహోత్సవం గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో ఆధ్యాత్మికతకు ప్రాముఖ్యత కలిగిన ఉత్సవం. సుమారు 500 సంవత్సరాల క్రితం శ్రీనిత్యానంద ప్రభు ఆజ్ఞతో రఘునాథ దాస గోస్వామి పానిహటిలో (బెంగాల్ రాష్ట్రం) అటుకుల అన్నం, పెరుగు, పాలు, పండ్లు తదితర పదార్థాలతో మహా భోజనాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవం భక్తి సేవలో నిమగ్నమై శ్రీచైతన్య మహా ప్రభు, శ్రీనిత్యానందుని తృప్తిపరచడం ద్వారా పరమ కృపను పొందవచ్చనే సందేశాన్ని అందిస్తుంది. దీనిని దండ మహోత్సవంగా కూడా పిలుస్తారు. భక్తుల సేవే.. పరమ సేవ అన్న ఆధ్యాత్మిక సత్యాన్ని సూచిస్తుంది. పానిహటి చిడా–దహి ఉత్సవాల్లో భాగంగా జప యజ్ఞం, నగర సంకీర్తన, భక్తుల దీక్షా కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. గురుకుల పిల్లలు ప్రదర్శించిన నాటిక, ఆధ్యాత్మిక బోధనలు, ప్రవచనం, తెప్పోత్సవం భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీనిత్యానంద–గౌరాంగ అభిషేకం, పంచామృతం, పంచగవ్య, పండ్ల రసాలు, సుగంధ పుష్పాలు, ఔషధాలు, నవరత్నాలతో విశిష్టంగా నిర్వహించారు. హరేకృష్ణ మూమెంట అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూ మాట్లాడుతూ భగవంతుని కృప పొందాలంటే భక్తుల సేవే సులభమైన మార్గమని పానిహటి చిడా–దహి మహోత్సవం బోధిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ రుచికరమైన ప్రసాదం వడ్డించారు. హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉత్సవం అద్భుతంగా నిర్వహించారు.

నార్సింగిలోని దేవాలయంలో..

మణికొండ: హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో ఆధ్యాత్మికతకు ప్రాముఖ్యతనిచ్చే చిడా–దహి మహోత్సవం జరిగింది. దండ మహోత్సవంగా పిలిచే ఈ కార్యక్రమంలో భక్తుల సేవే పరమ–సేవ అన్న ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ ఉత్సవం ఇస్తుందన్నారు. దైవ సేవలో మానసిక ప్రశాంతతను, శ్రేయస్సును అనుభవించమని ఈ ఉత్సవం సూచిస్తుందన్నారు. ఇందులో భాగంగా జపయజ్ఞం, నగర సంకీర్తన, భక్తుల దీక్షా కార్యక్రమం, గురుకుల పిల్లల నాటిక, ఆధ్యాత్మిక బోధనలు, తెప్పోత్సవం, నిత్యానంద గౌరాంగ అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఫ్యాషన్ సిగ్నేచర్.. స్టైల్ తత్వ..



- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన మిస్ ఇండియా నందినీ గుప్తా



సాక్షి, సిటీబ్యూరో / సనత్‌నగర్ : మహిళల కోసం మహిళలే అంకితభావంతో కలిసి వస్తే ఈ ప్రపంచం నమ్మలేని అద్భుతాలు సృష్టించవచ్చని మిస్ ఇండియా, మిస్ వరల్డ్ టాప్–20 ఫైనలిస్ట్ నందిని గుప్తా తెలిపారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ 'స్టైల్ తత్వ'ను నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఐటీసీ కాకతీయ వేదికగా మిస్ ఇండియా నందిని గుప్తా సోమవారం ఆవిష్కరించారు. ఇంటర్నేషనల్ బ్యూటీ కాంటెస్ట్‌లానే ఇది కూడా ఆలోచనతో కూడిన బ్యూటీ ప్రదర్శన. మహిళా సాధికారతకు నిదర్శనంగా ఈ ప్రదర్శన చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందని అన్నారు. జూన్ 13, 14 తేదీల్లో గొప్ప ఉద్దేశంతో రూపుదిద్దుకున్న స్టైల్ తత్వ మరింత శక్తివంతం కావాలి. సంప్రదాయ కళను ఆధునిక డిజైన్‌తో మిళితం చేయాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనకు 10 వేల మంది సందర్శకులు రానున్నట్లు అంచనా వేస్తున్నప్పటికీ ఇది రెండింతలు అవుతందని ఆశిస్తున్నట్లు నందినీ పేర్కొన్నారు. ఈ సారి ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న దోక్రా కళ పునరుజ్జీవనానికి సంబంధించిన కార్యాచరణను ఆమె ప్రత్యేకంగా ఫిక్కీ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు.

దేశవ్యాప్తంగా 200కిపైగా బ్రాండ్లు..

రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ సిగ్నేచర్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఐదో ఎడిషన్ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 205 ప్రదర్శకులు పాల్గొంటున్నారు. ఈ సంవత్సరం తొలిసారిగా స్టైల్ తత్వకు కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అధికారిక మద్దతు లభించింది. ఫ్యాషన్, డెకర్, హ్యాండ్‌లూమ్, ఆభరణాలు, హోమ్ లివింగ్, ఇతర కళాత్మక ఉత్పత్తులు ప్రదర్శించనున్నారు. ఇందులో జనగాం, కేశ్లగూడ, బేల్సారి రాంపూర్ వంటి గ్రామాల్లోని కళాకారులతో ఆధునిక డిజైన్‌లకు యాక్సెస్ కల్పిస్తుండటం విశేషం. ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ 'జ్ఞానవృద్ధి, డిజైన్ కలయిక, మార్కెట్ లింకేజ్'ల పై ప్రత్యేకకార్యాచరణ చేపట్టిందని ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రతిభా కుందా తెలిపారు.

70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే

- టీపీసీసీ కార్యవర్గ కూర్పులో సామాజిక సమతుల్యత

సాక్షి హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కార్యవర్గ కూర్పులో సామాజిక సమతుల్యత కొట్టొచ్చినట్టు కనిపించింది. రెండు కేటగిరీల్లో మొత్తం 96 మందిని నియమించగా, అందులో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. పీసీసీ ఉపాధ్యక్షులుగా 27 మందిని నియమించగా, అందులో ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు అవకాశం కల్పించారు. సామాజిక కోణంలో చూస్తే 27 మంది ఉపాధ్యక్షుల్లో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లింలకు 3 పదవులు ఇచ్చారు. చాలా కాలం నుంచి పార్టీలో పనిచేస్తున్న వారు, పార్టీకి విధేయతగా ఉంటున్నవారు, గతంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేసినవారికి అవకాశం లభించింది. 69 మందిని ప్రధాన కార్యదర్శులుగా నియమించగా, అందులో ముగ్గురు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించారు. సామాజిక వర్గాల పరంగా చూస్తే బీసీలకు అత్యధికంగా 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులు ఇచ్చారు. పదిమంది రెడ్లకు చోటు దక్కింది. రెండు కేటగిరీల్లో కలిపి మొత్తం 12 మంది మహిళలకు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించారు. ఈ కూర్పును బట్టి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మొదటి నుంచీ చెబుతున్న విధంగానే ఆయన నేతృత్వంలో సామాజిక కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. పీసీసీలో కీలకమైన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల హోదాలో ఇంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలను నియమించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన అయిన కులగణన ప్రభావం ఈ కమిటీల కూర్పుపై స్పష్టంగా కనిపించిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాగా ఉపాధ్యక్షులుగా 35 మందిని, ప్రధాన కార్యదర్శులుగా 75 మందిని నియమించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ప్రతిపాదించగా, ఉపాధ్యక్షులు 8 మందిని, ప్రధాన కార్యదర్శులు ఆరుగురిని కుదించి ఏఐసీసీ ఆమోదం తెలిపింది. మూడు నాలుగు పేర్లతో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల జాబితాను కూడా అధిష్టానానికి సమర్పించినప్పటికీ ఎవరిని నియమించాలన్న దానిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా వేశారు.

జంబో కార్యవర్గం

▶ మొదటి పేజీ తరువాయి

ముగ్గురు ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పర్ణికారెడ్డి, డా.మట్ట రాగమయిలకు అవకాశం ఇచ్చారు.

మంత్రులకు శాఖల కేటాయింపుపై చర్చోపచర్చలు

మంత్రివర్గ విస్తరణలో కొత్తగా ముగ్గురు మంత్రులు అధికారం చేపట్టడంతో వారికి కేటాయించాల్సిన శాఖలపై కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అనుభవం దృష్ట్యా వీరికి ఏయే శాఖలు కేటాయించాలన్న అంశంపై చర్చించారు. సీఎం వద్దే హోం, న్యాయ, మున్సిపల్, విద్య, మైనింగ్ వంటి కీలక శాఖలు ఉన్నందున వాటిని కొత్త మంత్రులకు కేటాయించే అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. అదే సమయంలో ఖాళీగా ఉన్న మరో మూడు స్థానాల్లో మంత్రులుగా ఎవరిని తీసుకోవాలన్న దానిపై చర్చించారు. మంత్రి పదవులు ఆశిస్తున్న సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డిలతో పాటు ఇద్దరు మైనార్టీ నేతల పేర్లపైనా చర్చ జరిగినట్లు సమాచారం. వీటితో పాటే చీఫ్ విప్, రెండు విప్‌ల పదవుల భర్తీపైన చర్చ జరిగింది. చీఫ్ విప్ పదవిని రెడ్డి లేదా వెలమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారని తెలిసింది.

టీపీసీసీ ఉపాధ్యక్షులు: టి.కుమార్‌రావు, కె.రఘువీర్ రెడ్డి, ఎంపీ, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, డా.చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్యే, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్సీ, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, బి.కైలాష్ కుమార్, నమిండ్ల శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్‌కుమార్, చిట్ల సత్యనారాయణ, లకావత్ ధన్వంతి, ఎం.వేణుగౌడ్, కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఎం.ఏ. ఫహీమ్ (సంగారెడ్డి), ఎస్. సురేష్ కుమార్, బొంతు రామ్మోహన్, అఫ్సర్ యూసుఫ్ జాహీ, ఎస్.జగదీశ్వర్‌రావు, నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్, గుమ్ముల మోహన్ రెడ్డి, చిన్నపటాల సంగమేశ్వర్.

పీసీసీ ప్రధాన కార్యదర్శులు: వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, సీహెచ్ పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, డా.మట్ట రాగమయి, ఎమ్మెల్యే, సీహెచ్.రాంభూపాల్, ఏ.సంజీవ్ ముదిరాజ్, బొజ్జా సంధ్యారెడ్డి, మల్లాది రాంరెడ్డి, అబ్దేశి సదాలక్ష్మి, ఎం.బేబి స్వర్ణకుమారి, దారాసింగ్, తాండూరు, జి.శశికళా యాదవ రెడ్డి, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, ముహమ్మద్ అబ్దుల్ ఫహీమ్, సంతోష్‌కుమార్ రుద్ర, దుర్గం భాస్కర్, ముహమ్మద్ ఖాజా ఫఖ్రుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, నరేశ్ జాదవ్, అల్లం భాస్కర్, డా. గిరిజ షెట్కార్, కొప్పుల ప్రవీణ్ కుమార్, ఏ. జంగారెడ్డి, కస్బా శ్రీనివాస్‌రావు, దుద్దిల్ల శ్రీనివాస్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, చరగాని దయాకర్, పీసారి మహిపాల్ రెడ్డి, గజ్జెల కాంతం, ఏడుపుగంటి సుబ్బారావు, చకిలం రాజేశ్వర్‌రావు, ఎర్ల కొమరయ్య, డా.ఏ.రవిబాబు, నాగ సీతారాములు, ససెం శ్రీనివాస్ గౌడ్, పృథ్వీ చౌదరి వేణుల, అంబటి రాజేశ్వర్, డి.డి.వెంకట్‌రాజ్, బొడ్డిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, మొహమ్మద్ సబీర్ అలీ, కట్ల రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, మడు సత్యనారాయణగౌడ్, టోపాజీ అనంత కిషన్, వి.రామారావు గౌడ్, అచ్యుత్ రమేష్‌బాబు, పెద్దనొల్ల బాలమురళీకృష్ణ (చిన్న), ఎం.రాజీవ్‌రెడ్డి, ఆదంరాజ్ దేకపాటి, షమీం అఫ్రూ, ఇ.వి.శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, అమొగోత్ వెంకటేశ్‌పవార్, రాయగిరి కల్పనాయాదవ్, రాజేష్ కాశిపాక, రహమత్ హుస్సేన్, పి. ప్రసన్న కుమార్ శర్మ, ముహమ్మద్ అసదుద్దీన్, నందిమల్ల యాదయ్య ముదిరాజ్, దైదా రవీందర్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, జి.నాగభూషణం, ఉపేందర్ రెడ్డి, ధర్మారావు, నూతి సత్యనారాయణ గౌడ్, దుర్గాప్రసాద్, డా. సి.వేంకటగోవింద్‌రావు, పెండ్లి శ్రీనివాసులు రెడ్డి.

సీఎం నిర్ణయం మేరకే శాఖ కేటాయింపు

- మంత్రి గడ్డం వివేక్
- కుటుంబ సభ్యులతో కలిసి ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో భేటీ



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి వివేక్ దంపతులు. చిత్రంలో ఎంపీ వంశీకృష్ణ

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకే తనకు శాఖ కేటాయింపు ఉంటుందని మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. ఏ శాఖ ఇచ్చినా బాగా పనిచేస్తానని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా తన పనితీరు ఉంటుందన్నారు. తండ్రి వెంకటస్వామి నేర్పిన రాజకీయ విలువలు పాటిస్తూ.. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని చెప్పారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సోమవారం తొలిసారి ఢిల్లీకి వచ్చిన వివేక్.. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు సతీమణి సరోజ, కుమారుడు, ఎంపీ వంశీకృష్ణతో కలిసి వివేక్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలనీ ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లు సూచించారని చెప్పారు. ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు తీసుకొచ్చేందుకు అందరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారని చెప్పారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. తనను మంత్రివర్గంలోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సోమవారం ఉదయం కలిశారు.

కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

- బీజేపీ, కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- ప్రాజెక్టు వ్యక్తిగత నిర్ణయం కాదు.. మంత్రివర్గ ఆమోదంతోనే నిర్మాణమని వెల్లడి
- కుట్రపూరిత రాజకీయాలకు భయపడబోమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న కుట్రతో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వ్యక్తి నిర్ణయం కాదని.. అప్పటి తెలంగాణ మంత్రివర్గ సమష్టిగా నిర్ణయమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని గతంలో మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, హరీశ్‌రావు స్పష్టం చేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమన్నారు. ఆచరణలో పెట్టే బాధ్యత అధికారులు, యంత్రాంగంపై ఉంటుందని.. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం అంశంలో దాచాల్సిందేమీ లేదని.. ఇది పూర్తి పారదర్శకంగా జరిగిన పని అని కేటీఆర్ పేర్కొన్నారు.

హరీశ్‌రావు ప్రజెంటేషన్ చూస్తే అసలు విషయం తెలుస్తుంది

మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చూస్తే కాళేశ్వరం విషయంలో అసలు అంశాలు తెలుస్తాయని కేటీఆర్ అన్నారు. '45 లక్షల ఎకరాలకు నీరు అందించేలా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును ఇతర దేశాల్లో ఏ నాయకుడైనా నాలుగేళ్లలో పూర్తి చేసి ఉంటే ఆ దేశ చరిత్రలో వారి పేరు శాశ్వతంగా నిలిచిపోయేది. ఆ నాయకుడి పాలనను ప్రశంసలతో ముంచెత్తేవారు. కానీ మన దేశంలో మాత్రం రాజకీయ కుయుక్తులు, కుట్రలకు ఇంతటి ఘనమైన కాళేశ్వరం ప్రాజెక్టు పావుగా మారింది' అని కేటీఆర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దున్నపోతు ఈనిందంటే దుడ్డెను కట్టేయమన్నట్టుగా అసత్య ఆరోపణలు చేస్తూ నోటీసులతో వేధిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. భాక్రా నంగల్, నాగార్జున సాగర్, నర్మద, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నిర్మించడానికి దశాబ్దాల పాటు కాంగ్రెస్ ప్రభుత్వాలు సమయం తీసుకున్నాయని.. కానీ కేసీఆర్ మాత్రం నాలుగేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేశారని కేటీఆర్ గుర్తుచేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ విధ్వంసకర పాలన నడుస్తోంది

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసే విధ్వంసకర కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రస్తుతం నడుస్తోందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'ఎన్నికలకు ముందు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. పదవుల్లోకి రాగానే ప్రజలను మోసం చేశారు. రాష్ట్రాన్ని విధ్వంసకర ఆలోచనలతో నాశనం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడే వారెవరు మా పార్టీలో లేరు' అని కేటీఆర్ వెల్లడించారు.

నెలాఖర్లో రాష్ట్రానికి అమిత్ షా

పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర హోంమంత్రి



కేంద్రమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంగిరెడ్డి. చిత్రంలో ఎంపీ అర్వింద్

సాక్షి, న్యూఢిల్లీ: జూన్ నెలాఖరులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, పసుపు బోర్డు చైర్‌పర్సన్ పల్లె గంగిరెడ్డి.. ఢిల్లీలో అమిత్ షాను కలిసి ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. తమ ఆహ్వానాన్ని షా అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని అర్వింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పసుపు బోర్డు అధికారిక లోగోను కూడా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. జూన్ చివరి వారంలో జరగనున్న ఈ కార్యక్రమం తేదీ, సమయాన్ని ఇంకా నిర్ణయించలేదని, త్వరలో ప్రకటిస్తామని అర్వింద్ వెల్లడించారు.

మహాలక్ష్మి పథకం ద్వారానే లాభాల్లోకి ఆర్టీసీ

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- సూర్యాపేటలో 45 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం



ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన తర్వాత కండక్టర్‌తో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

సూర్యాపేట: మహాలక్ష్మి పథకం ద్వారానే ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట ఆర్టీసీ బస్ డిపోలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన 45 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎప్పుడూ నష్టాల బాటలోనే సంస్థ కొనసాగిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడి రవాణాశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆర్టీసీలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ప్రభుత్వ సంస్థను కాపాడుకునేందుకు ముందుకు వెళ్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు 182 కోట్ల జీరో టికెట్లను జారీచేసి రూ.6,088 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేసిందని, ఈ డబ్బులతో సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకుందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పదేళ్ల కాలంలో ఒక్క బస్సు, కొత్త ఉద్యోగం ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని నష్టాల ఊబిలోకి నెట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుంచి వాతావరణాన్ని కాపాడుకునేందుకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేటి నుంచి 'ప్రజా వినియోగ కార్యక్రమం'

- గాంధీభవన్‌లో అందుబాటులో ఉండనున్న ఇద్దరు ప్రతినిధులు
- తొలి రోజు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, కాసుల బాలరాజు

సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ పక్షాన గాంధీభవన్‌లో ఇప్పటికే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతుండగా నేటి నుంచి 'ప్రజా వినియోగ కార్యక్రమం' పేరిట మరో కార్యక్రమం జరగనుంది. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సూచన మేరకు ప్రతి రోజూ ఇద్దరు ప్రభుత్వ, ప్రజాప్రతినిధులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండి ప్రజల విన్నపాలు స్వీకరించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. తొలిరోజు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అందుబాటులో ఉండనున్నారు. తొలిదశలో భాగంగా కార్పొరేషన్ చైర్మన్లు రోజుకు ఇద్దరు చొప్పున గాంధీభవన్‌లో ఉండి ప్రజల సమస్యలపై విజ్ఞాపనలు తీసుకుంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరిగింది

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

లక్సెట్టిపేట: 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఈ జిల్లా ప్రజల కృషి ఉంది. కార్యకర్తలు చాలా త్యాగం చేశారు. బీఆర్ఎస్ పాలనలో చాలా ఇబ్బందులు పడ్డారు. వారిని గుర్తించడం లేదు' అంటూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉందని, చాలా అన్యాయం జరిగిందని, అధిష్టానం గుర్తించాలన్నారు. 25 ఏళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను కార్యకర్తలు ఆర్మీలా పని చేశారని చెప్పారు. తాను ఎవరికీ వ్యతిరేకం కాదని, తనకు జరిగిన అన్యాయాన్ని కార్యకర్తలు సహించలేక పోతున్నారన్నారు.

హెచ్‌సీయూలో ఎంటెక్ కోర్సుకు దరఖాస్తులు

గడువు జూన్ 30

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సీఏఎస్ఈఎస్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఎంటెక్ కోర్సుకు దరఖాస్తులను కోరుతున్నారు. ఎంటెక్ ఇన్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ, ఎంటెక్ ఇన్ మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సుల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. బీటెక్/ఎంఎస్సీ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ రిలేటెడ్ ఏరియాస్, వాలిడ్ గేట్ స్కోర్ ఇన్ ఈసీఈ/ఐఎన్/ఫిజిక్స్ అర్హతలు ఉన్నవారు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను జూన్ 30లోగా పంపాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు హెచ్‌సీయూ వెబ్‌సైట్ చూడాలని సూచించారు. రెండు కోర్సుల్లో.. ఒక్కొక్క దానిలో 18 సీట్లు మాత్ర మే అందుబాటులో ఉంటాయి.

విచారణ సాగిందిలా..

కేసీఆర్‌కు వివరించిన హరీశ్‌రావు

- కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత అధినేతతో భేటీ
- జస్టిస్ ఘోష్ ప్రస్తావించిన అంశాలు తెలియజేసిన మాజీ మంత్రి
- ఉదయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ తదితరులతో సమావేశం
- రేపు కమిషన్ ముందుకు కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు..సోమవారం పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఉదయం హాజరైన ఆయన ఆ తర్వాత ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు. ఈ నెల 11న కేసీఆర్ సైతం కమిషన్ ఎదుట హాజరుకానున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. కమిషన్ ప్రస్తావించిన అంశాలు, వాటికి తాను ఇచ్చిన వివరణ, అందజేసిన డాక్యుమెంట్లు తదితరాలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలిసింది. అలాగే 11న విచారణ సందర్భంగా కేసీఆర్ వద్ద పీసీ ఘోష్ ప్రస్తావించేందుకు అవకాశం ఉన్న అంశాలను లోతుగా విశ్లేషించినట్లు తెలిసింది. మంగళవారం కూడా కేసీఆర్‌తో హరీశ్‌రావు మరోమారు భేటీ అయ్యే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా విచారణ కమిషన్ ఎదుట అన్ని విషయాలను సమగ్రంగా వివరించిన హరీశ్‌రావును కేసీఆర్ అభినందించారు. శనివారం తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రజలకు వాస్తవాలను వివరించేలా ఉందని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ప్రభుత్వం వివేకంతో వ్యవహరించాలి: హరీశ్‌రావు

విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు సోమవారం ఉదయం 9.30కు హరీశ్‌రావు కోకాపేటలోని తన నివాసం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసేందుకు పార్టీ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం విద్వేషంతో కాకుండా వివేకంతో వ్యవహరించాలని అన్నారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకుని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని పటాపంచలు చేశారని నేతలు అభినందించారు. ఆ తర్వాత నినాదాల నడుమ ర్యాలీగా బయలుదేరి ఉదయం 11 గంటల ప్రాంతంలో బీఆర్‌కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. హరీశ్‌రావు వెంట మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంజయ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, సునీతా లక్ష్మారెడ్డితో పాటు పలువురు నేతలు లోనికి వెళ్లారు.

ప్రజల నాడి తెలిసిన ప్రధాని మోదీ

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ప్రజల నాడి తెలిసిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని రాజ్యసభ సభ్యుడు, బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రశంసించారు. ఆయన సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఏం కావాలో తెలిసిన వ్యక్తి కాబట్టే.. కేంద్రంలో ఆయన ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ గాడిన పెట్టారని, 11 ఏళ్ల పాలనలో దేశాన్ని నాలుగో ఆర్థిక శక్తిగా మార్చివేశారన్నారు. ప్రపంచంలో భారత్ నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. త్వరలో మూడోస్థాయికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కానీ రాష్ట్రంలో 18 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అపఖ్యాతి మూటగట్టుకుందన్నారు. ప్రజలకు అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అటు ఢిల్లీ హైకమాండ్‌తో.. ఇటు సహచర మంత్రులతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఢిల్లీకి మూటలు మోస్తూ.. అవినీతి మరక అంటించుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ భరోసా పేరుతో ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. ప్రజలు బృందాలుగా వచ్చి మొరపెట్టుకుంటున్నారని, లంచం లేకుంటే పని ముందుకు సాగదని వాపోతున్నారని లక్ష్మణ్ చెప్పారు.

అన్ని నిర్ణయాలూ మంత్రివర్గ ఆమోదంతోనే..

▶ మొదటి పేజీ తరువాయి

లేకపోవడంతో.. వాటి నిర్మాణాన్ని పునఃసమీక్షించి రీఇంజనీరింగ్‌పై సిఫారసులు చేసేందుకు గత ప్రభుత్వం తన నేతృత్వంలో నాటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావుతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. మంత్రివర్గ ఉప సంఘం సిఫారసుల ఆధారంగా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రెండు భాగాలుగా విభజించడం జరిగిందని, ఒక భాగాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పరిమితం చేయగా, రెండో భాగాన్ని కాళేశ్వరం ప్రాజెక్టుగా నిర్మించడం జరిగిందని తెలిపారు.

అందుకే మేడిగడ్డకు బరాజ్..

మహారాష్ట్ర అభ్యంతరాలు, తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ పేర్కొనడంతో బరాజ్ లొకేషన్‌ను మేడిగడ్డ వద్దకు మార్చినట్టు హరీశ్‌రావు చెప్పారు. '2014 జూలై 23న నేను మహారాష్ట్ర వెళ్లి అక్కడి నీటిపారుదల శాఖ మంత్రి హసన్ ముష్రీఫ్‌ను కలవగా, తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని తేల్చి చెప్పారు. అక్కడ బరాజ్ నిర్మాణానికి అంగీకరించమబోని, పనులు చేపట్టి నిధులు వృధా చేసుకోవద్దని కోరుతూ నాటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చవాన్ అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డికి రాసిన లేఖ ప్రతిని ముష్రీఫ్ నాకు అందజేశారు. బరాజ్ నిర్మాణానికి వ్యతిరేకంగా స్థానికులు ధర్నాలు చేస్తుండడంతో అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. తర్వాత మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 2015 ఫిబ్రవరి 17న మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర సీఎం ఫడ్నవీస్, తెలంగాణ సీఎం కేసీఆర్ సమావేశమై చర్చలు జరిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి వ్యతిరేకంగా తాను స్వయంగా ఆందోళనలు చేసిన నేపథ్యంలో అనుమతించడం సాధ్యం కాదని ఫడ్నవీస్ తేల్చి చెప్పారు..' అని హరీశ్‌రావు వివరించారు.

అలాగైతే 48 టీఎంసీల లభ్యతే..

'మహారాష్ట్ర అనుమతించిన మేరకు తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే 48 టీఎంసీల లభ్యతే ఉంటుంది. 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే 160 టీఎంసీలను తరలించుకోగలం. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత మాత్రమే ఉండగా, అందులో 63 టీఎంసీలపై ఎగువ రాష్ట్రాలకు హక్కులున్నట్టు తేల్చుతూ 2015 ఫిబ్రవరి 18న సీడబ్ల్యూసీ లేఖ రాసింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు 160 టీఎంసీల నీళ్లు అవసరం. ఆ మేరకు నీళ్లను నిల్వ చేసుకోవడానికి బరాజ్‌ల నిల్వ సామర్థ్యం పెంచుకోవాలని 2008 ఆగస్టు 12న సీడబ్ల్యూసీ ఇంకో లేఖ రాసింది. అందుకే ప్రాజెక్టు రీఇంజనీరింగ్ చేయాల్సి వచ్చింది. మేడిగడ్డ వద్ద 282.3 టీఎంసీల నీటి లభ్యత ఉందని 2017 నవంబర్ 12న సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. అక్కడ బరాజ్ నిర్మించాలని 2016 జనవరి 17న వ్యాప్కోస్ నివేదిక ఇచ్చింది..' అని మాజీమంత్రి చెప్పారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లొకేషన్ మార్చాలని హైపవర్ కమిటీ సిఫారసు చేసిందా? అని కమిషన్ అడగగా.. ఇలాంటి సాంకేతిక అంశాలపై నీటిపారుదల శాఖ నిర్ణయాలు తీసుకుందని బదులిచ్చారు. ఇంజనీర్ల సూచనలను గౌరవించారా? అని కమిషన్ ప్రశ్నించగా, అవునని హరీశ్ చెప్పారు. సైట్ పరిస్థితుల ఆధారంగా ప్రాజెక్టుల లొకేషన్లు మారడం సహజమేనని, నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్ వంటి ప్రాజెక్టుల విషయంలో సైతం అలానే జరిగిందని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

కేఐపీసీఎల్ ఏర్పాటుపై కేబినెట్‌లో నిర్ణయం

'కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నిధుల కొరత ఉండడంతోనే రుణాల సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్)ను ఏర్పాటు చేశాం. కేఐపీసీఎల్ ఏర్పాటుపై మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నా, దాని రుణాలు, వడ్డీలను ఎలా తిరిగి చెల్లించాలనే అంశంపై మాత్రం ఎలాంటి చర్చ జరగలేదు..' అని హరీశ్ తెలిపారు. రుణాలకు ప్రభుత్వం పూర్తి గ్యారెంటీ ఇచ్చి వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించిందని వివరించారు.

నీటి నిల్వ ఇంజనీర్లకు సంబంధించిన బాధ్యత

ఎవరి ఆదేశాలతో బరాజ్‌లలో నీళ్లను నిరంతరంగా నిల్వ చేశారని కమిషన్ ప్రశ్నించగా.. ఇది ఇంజనీర్లకు సంబంధించిన బాధ్యత అని హరీశ్ చెప్పారు. ఈ విషయంలో తామెలాంటి సూచనలు చేయలేదన్నారు. నీటి నిల్వ కోసమే బరాజ్‌లు నిర్మించారా? అని కమిషన్ అడగగా, ఇది పూర్తిగా సాంకేతిక పరమైన అంశమని జవాబిచ్చారు. బరాజ్‌లలో ఏ పరిమాణంలో నీళ్లను నిల్వ చేయాలి అని కమిషన్ ప్రశ్నించగా, మొత్తం 141 టీఎంసీలను నిల్వ చేసేందుకు వాటిని నిర్మించామని చెప్పారు. కాంట్రాక్టర్లతో ఒప్పందాలు జరిగాక కొత్తగా ఫ్లడ్ బ్యాంకులు, డిశ్చార్జి ఛానల్స్ నిర్మాణం పనులు అప్పగించడం ప్రణాళిక లోపం కాదా? అని కమిషన్ అడగగా, సాంకేతిక అంశాలపై సమాధానమివ్వలేనని హరీశ్ బదులిచ్చారు. టెండర్లు పూర్తై కాంట్రాక్టర్లతో ఒప్పందాలు జరిగాక నిబంధనలు మార్చవచ్చా? అని ప్రశ్నించగా, క్షేత్ర స్థాయి పరిస్థితుల ఆధారంగా నీటిపారుదల శాఖ సిఫారసులు చేస్తే మార్చవచ్చని వివరణ ఇచ్చారు. నిపుణుల కమిటీ ఎందుకు ఏర్పాటు చేశారని కమిషన్ అడగగా, మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపుపై సిఫారసులు చేసేందుకని బదులిచ్చారు. ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌తో పాటు బొగ్గు గనులుండడంతో నేరుగా నీటి తరలింపు సాధ్యం కాదని నిపుణుల కమిటీ తేల్చిందన్నారు.

హిందీలో చెప్పండి పరవాలేదు..

దాదాపు గంట పాటు హరీశ్‌రావు క్రాస్ ఎగ్జామినేషన్‌ను కమిషన్ నిర్వహించింది. తెలుగు మాధ్యమంలో చదివిన తనకు ఆంగ్లంపై పట్టులేదని ప్రారంభంలోనే హరీశ్‌రావు తెలపగా, హిందీలో సమాధానమిస్తే ఆంగ్లంలో తర్జుమా చేసుకుంటామని జస్టిస్ ఘోష్ చెప్పారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నేతలకు సైతం కోర్టు హాల్లోకి కమిషన్ అనుమతినిచ్చింది. న్యాయవాదులకు అనుమతి లేదని కమిషన్ సిబ్బంది తెలియజేయగా, లిఖిత పూర్వక ఆదేశాలు తీసుకొస్తేనే బయటకు వెళ్తామని బీఆర్ఎస్ లీగల్ సెల్ నేత సోమ భరత్‌కుమార్ వాగ్వాదానికి దిగారు. దీంతో సాధారణ వ్యక్తులుగా కూర్చోవడానికి వారికి కమిషన్ అనుమతినిచ్చింది. క్రాస్ ఎగ్జామినేషన్ అనంతరం బీఆర్‌కేఆర్ భవన్ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడిన హరీశ్‌రావు వివరాలను వెల్లడించారు.

75 ఏళ్ల నుంచి కానరాని స్వరాజ్యం

- సీపీఐ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వమ్



మాట్లాడుతున్న బినోయ్ విశ్వమ్

చందానగర్(హైదరాబాద్): స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ నినదించిన స్వరాజ్యం అంటే ప్రజలందరికీ కూడు, గూడు, నీడ అని.. 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం స్వరాజ్యం ఎక్కడుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వమ్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన బినోయ్ విశ్వమ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నినదిస్తున్న 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' పూర్తిగా అబద్ధమని, పేదలు, కార్మికులు, ఉద్యోగులు, రైతుల పక్షాన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ లేరన్నారు. బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులతో అంటకాగుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనంనేనిపై ఎన్నికల పిటిషన్ కొట్టివేత

- పిటిషనర్ సరైన ఆధారాల్లేకుండానే కేసు వేశారన్న హైకోర్టు
- తీర్పుపై కూనంనేని హర్షం.. న్యాయం గెలిచిందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను కొట్టేస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు కూనంనేని అఫిడవిట్ దాఖలు చేయలేదని.. అందువల్ల ఆయన ఎన్నికను రద్దు చేస్తూ ఆదేశాలివ్వాలని కొత్తగూడేనికి చెందిన నందూలాల్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న క్రమంలోనే నందూలాల్ పిటిషన్‌ను కొట్టేయాలంటూ కూనంనేని హైకోర్టును ఆశ్రయించారు. కూనంనేని విజ్ఞప్తిని హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు. సరైన ఆధారాల్లేకుండా నందూలాల్ పిటిషన్ వేశారంటూ కేసు కొట్టేశారు. హైకోర్టు తీర్పుపై కూనంనేని హర్షం వ్యక్తం చేశారు. అసంబద్ధమైన అంశాలతో వేసిన కేసును హైకోర్టు కొట్టేయడం ద్వారా న్యాయం గెలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో న్యాయ వ్యవస్థపట్ల మరింత విశ్వాసం, గౌరవం ప్రజల్లో పెరిగిందన్నారు. లక్షలాది మంది ఓట్లు వేసి గెలిపిస్తే వారి మనోభావాలకు భిన్నంగా అడ్డదారుల్లో ప్రయోజనం పొందాలనుకొనే వారికి ఈ తీర్పు గుణపాఠం అన్నారు.

సాహస పథం



భూమికి 14,000 అడుగుల ఎత్తులో 'ఆపరేషన్ సిందూర్' పతాకంతో అనామిక శర్మ

ఆకాశ సిందూరం

అనామిక శర్మ ఆకాశ సాహసాలు కొత్తేమీ కాదు. సాహసానికి సామాజిక సందేశం జోడించడం ఆమె శైలి. ఈసారి 'ఆపరేషన్ సిందూర్' పతాకాన్ని ఆకాశమంత ఎత్తున ప్రదర్శించింది.



భారత సాయుధ దళాలకు మద్దతుగా థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ గగనతలంలో ఆపరేషన్ సిందూర్ పతాకాన్ని నింగిన ఎగరేసింది అనామిక. రెండు చేతులతో 'ఆపరేషన్ సిందూర్' పతాకాన్ని పట్టుకొని సింగిల్–ఇంజిన్ ఎయిర్‌క్రాఫ్ట్ పీఏసీ 750ఎక్స్ఎల్ నుంచి దూకి 'ఆపరేషన్ సిందూర్' పతాకాన్ని ప్రదర్శించింది. దాదాపు 14,000 అడుగుల ఎత్తు నుంచి డ్రాప్ జోన్‌లోకి దూకింది.

'ఈ జంప్ చేసినందుకు సంతోషంగా ఉంది. ముప్పులు, ప్రమాదాల బారి నుంచి దేశాన్ని రక్షిస్తున్న భారత సాయుధ దళాలకు శాల్యూట్ చేస్తున్నాను. మన సాయుధ దళాల సత్తా ఏమిటో మరోసారి ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపణ అయింది' అంటుంది అనామిక.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనామిక శర్మ తండ్రి అజయ్‌శర్మ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఎఫ్) కమాండోగా పనిచేశారు. స్కైడైవింగ్‌లో అనామికకు తొలి గురువు. 'యాక్టివ్ డైవర్స్'గా గుర్తింపు పొందిన ఈ తండ్రీకూతుళ్లు ఎన్నో గగనతల సాహసాలు చేశారు

యునైటెడ్ పారాచూట్ అసోసియేషన్ (యుపీఏ)లో పిన్న వయస్కురాలైన అనామిక శర్మ 'డి' కేటగిరి డైవింగ్ లైసెన్స్‌ను పొందింది. మన దేశంలోని ఏకైక మహిళా స్కైడైవింగ్ కోచ్ అనామిక.ప్రయాగ్‌రాజ్‌లో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన అనామిక దేశంలోని వివిధ ప్రాంతాలలోని పాఠశాలల్లో చదువుకుంది. బెంగళూరులో బీ.టెక్. చేసింది. పదేళ్ల వయసులోనే మన దేశంలోని యంగెస్ట్ ఫిమేల్ స్కైడైవర్‌గా సంచలనం సృష్టించింది. 300ల స్కైడైవ్స్ చేసింది.

గత సంవత్సరం 13,000 అడుగుల ఎత్తులో రామమందిరం పతాకాన్ని, ఈ సంవత్సరం మహాకుంభమేళ పతాకాన్ని బ్యాంకాక్‌లో 13,000 అడుగుల ఎత్తులో ప్రదర్శించింది. అనామిక శర్మ తాజా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

• బ్యూటిప్స్



టీ స్పూన్ టొమాటో గుజ్జు, సెనగపిండి, చిటికెడు పసుపు, అర టీస్పూన్ నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి, కళ్ల మీద గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు ఉంచి ఇరవై నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. తర్వాత ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తుంటే కళ్ల కింద నల్లని వలయాలు తగ్గుముఖం పట్టి, ముఖం కాంతిమంతం అవుతుంది.

- పుదీనా ఆకుల్ని మెత్తగా రుబ్బి, నీళ్లు కలిపి మాడుకు పట్టించాలి. గంట తరువాత స్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది.

చరిత్రలో మహిళ

దారి చూపిన నారి



'ప్రభువెక్కిన పల్లకీ కాదోయ్ అది మోసిన బోయిలు ఎవరు?' అని ప్రశ్నించాడు కవి. లూయిస్, క్లార్క్ సాహస, అన్వేష యాత్రలు ప్రపంచ ప్రసిద్ధం. అయితే లూయిస్, క్లార్క్ ద్వయానికి దారి చూపింది 'సకాగవేయ' అనే సాహసికురాలు అనే విషయం చాలా తక్కువమందికి తెలుసు. నేటివ్ అమెరికన్ అయిన సకాగవేయ లూయిస్, క్లార్క్‌లకు అనువాదకురాలిగా, గైడ్‌గా పనిచేసింది.

లూయిస్, క్లార్క్‌లు 1804 నుంచి 1806 వరకు అమెరికాలో ఎన్నో అన్వేష యాత్రలు చేశారు. ఈ ఇద్దరు అమెరికా ఆర్మీలో కెప్టెన్, కమాండింగ్ ఆఫీసర్ హోదాలో పనిచేశారు. 1804 నవంబర్‌లో లూయిస్, క్లార్క్‌లు తొలిసారిగా నార్త్ డకోటలో షోషోన్ తెగకు చెందిన సకాగవేయను కలుసుకున్నారు. సకాగవేయ వయసు పదిహేడు సంవత్సరాలు. అప్పటికి ఆమె గర్భవతి. 1805లో జీన్స్ బాప్టీస్ట్ అనే కొడుకుకి జన్మనిచ్చింది. కొన్ని నెలలకే పసిబిడ్డను భుజాన వేసుకొని లూయిస్, క్లార్క్‌ల అన్వేష యాత్రలో భాగం అయింది. ఈ అన్వేష యాత్రలో ఎంతోమంది నేటివ్ అమెరికన్స్‌తో మాట్లాడాల్సి వస్తుంది. ప్రమాదాలు పొంచి ఉంటాయి. రెండు భాషల్లో ప్రావీణ్యం ఉన్న సకాగవేయ వారికి అనువాదకురాలిగా పనిచేయడమే కాదు ఎన్నో మొక్కల పేర్లు,



సకాగవేయ

వాటి వివరాలు, ఔషధ గుణాల గురించి చెప్పేది. ప్రమాదాలను పసిగట్టేది.

కొండల్లో, కోనల్లో, ఎల్లోరివర్ ప్రాంతాలలో లూయిస్, క్లార్క్‌లకు దారి చూపింది. అందుకే క్లార్క్ ఆమెను 'పైలట్' అని పిలిచేవాడు.

పసిఫిక్ మహా సముద్రాన్ని చేరుకోవడంతో లూయిస్, క్లార్క్‌ల అన్వేష యాత్ర 1806లో విజయవంతంగా పూర్తయింది. ఈ యాత్ర విజయానికి సకాగవేయ సంపూర్ణ సహకారాన్ని అందజేసింది.

అయితే సకాగవేయ పడిన కష్టానికి భర్తకు 232 ఎకరాల భూమి దక్కింది తప్ప ఆమెకు చిల్లి గవ్వ కూడా దక్కలేదు. ఎలాంటి సన్మానమూ జరగలేదు. అయినప్పటికీ అమెరికా చరిత్రలో సకాగవేయ అసాధారణ మహిళ. సాహసం మూర్తీభవించిన సకాగవేయ ముఖచిత్రంతో నాణేలు, స్టాంప్‌లు ముద్రించారు. ఎన్నోచోట్ల విగ్రహాలు నెలకొల్పారు.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 9న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,810
బంగారం (22 క్యారెట్లు)	89,620
వెండి	1,03,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,870
బంగారం (22 క్యారెట్లు)	89,550
వెండి	1,08,400
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,600
బంగారం (22 క్యారెట్లు)	89,550
వెండి	1,18,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,870
బంగారం (22 క్యారెట్లు)	92,240
వెండి	1,08,400
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,300
బంగారం (22 క్యారెట్లు)	89,600
వెండి	1,03,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,690
బంగారం (22 క్యారెట్లు)	89,550
వెండి	1,18,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



• దిక్సూచి

అవగాహన పెరిగేలా

బ్రెస్ట్–క్యాన్సర్‌కు సంబంధించిన జాగ్రత్తలు, నవీన సాంకేతికత గురించి వివిధ సదస్సుల ద్వారా మహిళలకు అవగాహన కలిగిస్తోంది గీతా మంజునాథ్. తన వ్యక్తిగత ప్రయాణం నుంచి మొదలు హెల్త్‌కేర్ సిస్టమ్‌లో ఎదురయ్యే సవాళ్లు, ప్రాణాలను కాపాడటంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యత... ఇలా ఎన్నో విషయాలను మంజునాథ్ ప్రేక్షకులతో పంచుకుంటుంది.

రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు వీలు కల్పించే హెల్త్ టెక్ కంపెనీ 'నిరామై హెల్త్ ఎనాలటిక్స్'కు గీతా మంజునాథ్ ఫౌండర్, సీయీవో.

'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్' నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ, కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్ నుంచి మేనేజ్‌మెంట్ డిగ్రీ చేసింది. మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లలో గీతకు దశాబ్దాల అనుభవం ఉంది. బెంగళూరులో జరిగిన 'షీస్పార్క్స్' సదస్సులో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం రూపొందించిన ఏఐ ఆధారిత వైద్య పరికరం థర్మాలిటిక్స్ గురించి వివరించింది.

'రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. ఇది అన్ని క్యాన్సర్‌లలో అత్యంత నయం చేయదగినది' అంటుంది గీతా మంజునాథ్.

• ఇంటిప్స్

- మెత్తటి క్లాత్‌ను వేడినీటిలో ముంచి అద్దాన్ని తుడిస్తే చక్కగా శుభ్రపడుతుంది. తడి అద్దం అంచుల నుంచి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి.
- అమ్మోనియా, వెనిగర్ వంటి వాటిని నీటిలో కలిపి ఆ మిశ్రమంలో ముంచి పిండేసిన క్లాత్‌తో తుడవవచ్చు.



సాగుబడి
మృగశిర కార్తె: జూన్ 8 నుంచి



'జాబ్స్ టియర్స్'.. కొత్త మిల్లెట్ పంట!

'జాబ్స్ టియర్స్'.. ఇది మన దేశానిదే అయినా మనకు తెలియని పంట. మణిపూర్‌కు చెందిన మిల్లెట్ పంట. అధిక పోషక విలువతో కూడి ఉంటుంది. మరో విశేషం ఏమిటంటే.. మల్టీకట్ మిల్లెట్ క్రాప్. అంటే, ఒక్కసారి నాటితే చాలు, మూడుసార్లు ధాన్యం కోసుకోవచ్చు. మొదటి కోత తర్వాత కొద్ది నెలల వ్యవధిలో మరో రెండుసార్లు పంట తీసుకోవచ్చు. మణిపూర్ ప్రాంతంలో ఇది సాగవుతోంది. అన్నంగా వండుకు తినొచ్చు. పశువులకు గ్రాసంగా, దాణాగా పెడతారు. మణిపూర్‌లోని సేనాపతి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డేవిడ్ కమీ 'సాక్షి సాగుబడి'తో ఈ పంట విశేషాలు పంచుకున్నారు.



గ్రామినే కుటుంబంలోని ఒక స్మాల్ మిల్లెట్ పంట ఇది. 1–2 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. గింజలు రకాన్ని బట్టి రంగు మారుతుంది. పసుపు, ఊదా లేదా గోధుమ రంగులో ఉంటాయి. కన్నీటి బిందువు రూపంలో ఉంటాయి. అందుకే 'టియర్స్' అనే పేరొచ్చింది. ఎటువంటి నేలల్లో, ఎంతటి ప్రతికూల వాతావరణాన్నయినా తట్టుకుంటుంది. దీని బియ్యంలో మాంసకృత్తులు 9%, కొవ్వు 0.5–6.1%, పిండిపదార్థం 58–77%, పీచు 0.3–8.4, 100 గ్రాముల బియ్యంలో 1500 కిలో కేలరీలుంటాయి. వరి బియ్యం, గోధుమలతో పోల్చితే కొవ్వు, ప్రొటీన్ చాలా ఎక్కువ. జాబ్స్ టియర్స్ పైపొట్టు తీసిన ముడి బియ్యాన్ని అన్నంగా వండుకొని తింటే ఆరోగ్యం. పిండితో రొట్టె చెయ్యొచ్చు. సూప్‌లలో చిక్కదనం కోసం కలుపుకోవచ్చు. సిరిధాన్యాలతో చేసే చిరుతిళ్లన్నీ చేసుకోవచ్చు. మద్యం తయారీకీ వాడుతున్నారు. కోళ్లకు, పశువులకు కూడా పుష్టికరమైన ఆహారం ఇది.

కరువు కాలంలో ఇతర పంటలు పోయినా ఇది బతికి, మనుషుల్ని, పశువుల్ని బతికిస్తుంది. నీటి ముంపును తట్టుకుంటుంది. ఆమ్ల గుణం ఉండే నేలల్లో, లేటరైట్ నేలల్లో, కొండవాలులో నిస్సారమైన భూముల్లోనూ పెరుగుతుంది. సముద్రతలం నుంచి 2 వేల మీటర్ల వరకు ఎత్తు గల ప్రాంతాల్లో పండుతుంది. విత్తనాలను బాగా మసిలే వేడి నీళ్లలో 10 నిమిషాలు ఉంచి, విత్తుకుంటే తెగుళ్లు రావు. మే–జూలై మధ్య విత్తుకోవచ్చు. 8–10 అంగుళాల లోతు దుక్కిచేసి, సాళ్లుగా విత్తుకోవాలి/ వెద పెట్టాలి. 100–115 రోజుల పంట. గింజ గట్టిపడి, తేమ 20% కన్నా తగ్గినప్పుడు కోత కోసుకోవాలి. హెక్టారుకు 2–4 టన్నుల ధన్యం దిగుబడినిస్తుంది. పైపొట్టు తీసేస్తే 30–50% వరకు ముడిబియ్యం వస్తాయి. హెక్టారుకు 34 టన్నుల పచ్చిగడ్డి, 8 టన్నుల ఎండు గడ్డి పండుతుంది.


ఇతర వివరాలకు.. డా. డేవిడ్ కమీ davidkamei81@gmail.com

• వ్యవసాయ ఉగ్రవాదం

పటిష్ఠ క్వారంటైన్‌తోనే చెక్!

అమెరికాపై చైనా వ్యవసాయ ఉగ్రవాద చర్యతో ఉలిక్కిపడ్డ ప్రపంచదేశాలు
ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని అక్రమంగా అమెరికా తెచ్చిన ఇద్దరు చైనీయుల అరెస్ట్
పటిష్టమైన అంతర్జాతీయ క్వారంటైన్ వ్యవస్థతోనే వ్యవసాయ ఉగ్రవాదానికి చెక్

చైనా తమపై ఆగ్రో టెర్రరిజానికి పాల్పడిందని ఇటీవల అమెరికా ప్రకటించింది. 'ఫ్యూసేరియం గ్రామినిరమ్' అనే ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని చైనా నుంచి అక్రమంగా అమెరికాలోకి తీసుకువచ్చిన నేరానికి చైనా పౌరురాలు, మిచిగాన్ యూనివర్సిటీ పరిశోధకురాలు యుంకింగ్ జియాన్(33), ఆమె చైనా ప్రియుడు జున్‌యాంగ్ లియు(33)లను అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది ఖచ్చితంగా చైనా పనిగట్టుకొని చేయిస్తున్న 'ఆగ్రో టెర్రరిస్టు' చర్యేనని అమెరికా ఆరోపించింది. శత్రు దేశంలో జీవ భద్రతను, వ్యవసాయ– ఆహార భద్రతను విచ్ఛిన్నం చేసే ఉగ్రవాద చర్యలను 'ఆగ్రో టెర్రరిజం' అని వ్యవహరిస్తారు. ఈ వార్తతో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. ఈ నేపథ్యంలో.. అసలు 'ఫ్యూసేరియం గ్రామినిరమ్' శిలీంధ్రం పంటలకు ఎంతవరకు ప్రమాదకరం? ఒక దేశం నుంచి మరో దేశానికి ఏదైనా శిలీంధ్రాలు, వైరస్‌లు, సూక్ష్మజీవులు, విత్తనాలను పరిశోధనల కోసం అధికారిక అనుమతులతో తీసుకెళ్లే వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటుంది? దాని అవసరం ఏమిటి? వంటి విషయాలను పరిశీలిద్దాం.





ఫ్యూసేరియం గ్రామినీరమ్ శిలీంధ్రం సోకి దెబ్బతిన్న గోధుమ, మొక్కజొన్న కంకులు

కొత్త వాతావరణమే సమస్య

ఒక దేశం మరో దేశంపై ఆయుధాలతో విరుచుకు పడితే ఆ దాడి నష్టం ఏపాటిదో అప్పటికప్పుడే తెలిసిపోతుంది. అదే గనక.. ఒక విధ్వంసక శిలీంధ్రాన్నో, సూక్ష్మజీవినో, వైరస్‌నో జీవాయుధంగా ప్రయోగిస్తే ఈ ఆగ్రో టెర్రరిస్టు చర్య వల్ల కలిగే నష్టం వెంటనే తెలియదు. కొన్నేళ్లు పట్టొచ్చు. ఎందుకంటే, ఒక దేశంలో ఉండే శిలీంధ్రం లేదా వైరస్ వేరు దేశపు కొత్త వాతావరణ పరిస్థితుల్లోకి ప్రవేశించినప్పుడు ఆ వాతావరణం నప్పితే చెలరేగిపోవచ్చు. అక్కడి పంట పొలాల్లో విధ్వంసం సృష్టించి ఆ దేశపు ఆహారోత్పత్తి పునాదుల్నే కదిలించి, కోలుకోలేని దెబ్బ తీయవచ్చు. లేదంటే, ఆ కొత్త వాతావరణం సరిపడకపోతే తేలిపోనూవచ్చు. ఆ కొత్త వాతావరణంలోని ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలిలో తేమపై ఈ శిలీంధ్రం, సూక్ష్మజీవి, వైరస్, విత్తనాల ప్రవర్తన తీరు ఎంత విధ్వంసకరంగా ఉంటుందన్న విషయం ఆధారపడి ఉంటుంది. అందుకే పరిశోధనల కోసం విదేశాలకు ఇలాంటివి తీసుకెళ్లాలంటే పటిష్టమైన పరీక్షలు, నియమనిబంధనలతో కూడిన క్వారంటైన్ వ్యవస్థ ఏర్పాటైంది. అదేమీ లేకుండా ఫంగస్‌ను పంపటం ద్వారా చైనా 'ఆగ్రో టెర్రరిస్టు (వ్యవసాయ ఉగ్రవాద)' చర్యకు ఒడిగట్టిందని అమెరికా మండిపడింది. 'ప్రమాదకరమైన జీవాయుధాన్ని అక్రమంగా దేశంలోకి తీసుకురావటం వ్యవసాయ సంబంధమైన ఉగ్రవాద చర్య. ఇది పంటలకే కాదు మనుషులు, పశువుల ఆరోగ్యానికి కూడా గొడ్డలిపెట్టు. యావత్ జాతి భద్రతకే ప్రత్యక్ష ముప్పు' వంటిదని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్ కష్ పటేల్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

అన్ని దేశాల్లోనూ ఉన్నదే!

'ఫ్యూసేరియం గ్రామినిరమ్' శిలీంధ్రంను 'కిల్లర్ ఫంగస్' అని కూడా అభివర్ణిస్తున్నారు. 'గ్రామినే' కుటుంబానికి చెందిన వరి, మొక్కజొన్న, గోధుమ, బార్లీ వంటి ప్రధాన ఆహార ధాన్యపు పంటలకు కంకి దశలో సోకటం ద్వారా దిగుబడిని దెబ్బతీసి తీవ్ర ఆర్థిక నష్టం కలిగిస్తుంది అయితే, ఇది ఇప్పటికే దాదాపు అన్ని దేశాల్లోనూ ఉన్న శిలీంధ్రమేనని నిపుణులు చెబుతున్నారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, కేంద్ర ప్రభుత్వ జాతీయ మొక్కల జన్యు వనరుల సంస్థ (ఐసిఎఆర్–ఎన్‌బిపిజిఆర్) హైదరాబాద్ కేంద్రం మాజీ సంచాలకులు డాక్టర్ బలిజేపల్లి శరత్‌బాబు 'సాక్షి సాగుబడి'తో మాట్లాడుతూ.. 'ఇది కొత్త శిలీంధ్రం కాదు. అమెరికా, భారత్, పాకిస్తాన్, చైనా సహా చాలా దేశాల్లో ఇప్పటికే ఉనికిలో ఉంది. అనేక పంటల కంకులను ఆశించి, దిగుబడికి పెను నష్టం చేస్తుంటుంది. ఇది సోకిన ధాన్యం తింటే వికారం, వాతులు వంటి సమస్యలు వస్తాయి. అయితే, పంటలకు విధ్వంసకమైనదైనప్పటికీ ఇది ప్రాణహాని కలిగించినట్లు ఆధారాలు లేవు. నిజానికి పప్పులు, మిరపకాయలు, వేరుశనగలను ఆశించే అఫ్లోటాక్సిన్లు దీనికన్నా ప్రమాదకరం. ఒక్కోసారి కేన్సర్ కారకం కూడా కావచ్చు' అన్నారు.

దిగుమతి, ఎగుమతికి క్వారంటైన్ తప్పనిసరి!

శిలీంధ్రం, సూక్ష్మజీవి, వైరస్, విత్తనాలు, మొక్కలు వంటి జీవ పదార్థాలను ఒక దేశం పరిశోధనల కోసం, వ్యాపార రీత్యా అధికారికంగా ఎగుమతి చేయాలన్నా, దిగుమతి చేసుకోవాలన్నా అంత సులువేమీ కాదు. అంతర్జాతీయ మొక్కల సంరక్షణ ఒడంబడిక (ఐపిపిసి)లో పేర్కొన్న విధంగా కఠినమైన క్వారంటైన్ నియమ నిబంధనలను రెండు దేశాలూ త్రికరణశుద్ధితో పాటించాల్సిందే.


ఎగుమతి చేసే దేశం ప్రమాదం లేదని ఫైటో శానిటరీ సర్టిఫికెట్ ఇవ్వాలి. దిగుమతి చేసుకునే దేశ ప్రభుత్వం దిగుమతి చేసుకునే సంస్థ/వ్యక్తికి ఇంపోర్ట్ పర్మిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దిగుమతి చేసుకున్న తర్వాత ఒక సీజన్‌లో క్వారంటైన్ చట్టాల ప్రకారం ప్రయోగాలు చేసి, అందులో హానికారక చీడపీడలు ఏవీ రవాణా కావటం లేదని నిర్ధారించుకున్న తర్వాతే ఆ దేశపు సహజ వాతావరణంలోకి ప్రవేశపెట్టడానికి అనుమతిస్తారు. ఇదంతా జరగడానికి చాలా సమయం పడుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాలన్నీ సాధారణ వ్యవసాయోత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు కూడా శానిటరీ, ఫైటో శానిటరీ నియమాలు పాటించాల్సిందే. ఈ నియమాలను అమలుచేసే పటిష్ఠ క్వారంటైన్ వ్యవస్థ అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో అమల్లో ఉంటుంది. ఎయిర్‌పోర్టులు, సీపోర్టుల్లో తనిఖీలు అతి కఠినంగా ఉంటాయి. అమెరికా ప్రధాన భూభాగానికి దూరంగా ఉన్న హవాయి రాష్ట్రం నుంచి దాదాపు అన్ని రకాల పండ్లు కూరగాయలు వేరే రాష్ట్రాలకు తీసుకెళ్లడానికి నిర్దిష్టమైన ఆంక్షలు అమల్లో ఉన్నాయన్నారు డాక్టర్ శరత్‌బాబు.

మన క్వారంటైన్ వ్యవస్థ బలహీనం



చైనా నుంచి 'ఫ్యూసేరియం గ్రామినిరమ్' శిలీంధ్రాన్ని అమెరికాకు తీసుకెళ్లింది పరిశోధనల కోసమైనప్పటికీ క్వారంటైన్ నిబంధనలు పాటించలేదు. అనుమతులు లేవు కాబట్టే ఈ పనిని 'వ్యవసాయ ఉగ్రవాద' చర్యగా అమెరికా సీరియస్‌గా పరిగణించింది. జియోపాలిటికల్ ఉద్రిక్తతలు కూడా దీనికి కారణమై ఉండొచ్చు. ఈ శిలీంధ్రం అన్ని దేశాల్లోనూ ఉన్న జాతే. అయినా, వేర్వేరు దేశాల్లో అనేక ఉపజాతులు ఉంటాయి. ఒక ఉపజాతి ఒక దేశంలో పెద్ద సమస్య కాకపోయినా, వేరే దేశంలోని విభిన్న వాతావరణంలోకి వెళ్లిన తర్వాత పెను విపత్తు సృష్టించవచ్చు లేదా నిద్రాణంగా ఉండిపోవచ్చు. అందుకే జీవపదార్థాలేవైనా దేశ సరిహద్దులు దాటించేటప్పుడు కఠినమైన క్వారంటైన్ పరీక్షలు చెయ్యటం తప్పనిసరి. మన దేశంలో ఈ క్వారంటైన్ వ్యవస్థ బలహీనంగా ఉంది. ఇకనైనా పటిష్టం చెయ్యాలి.

– డాక్టర్ బలిజేపల్లి శరత్‌బాబు,
అధ్యక్షులు, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా,
మాజీ సంచాలకులు, జాతీయ మొక్కల జన్యు వనరుల సంస్థ (ఐసిఎఆర్–ఎన్‌బిపిజిఆర్) హైదరాబాద్ కేంద్రం.


జుగ్‌రాజ్

మళ్లీ ఓడిన భారత హాకీ జట్టు

ఆమ్‌స్టెల్వీన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) ప్రొ లీగ్ యూరోపియన్ అంచె పోటీల్లో భారత జట్టు వరుసగా రెండో పరాజయం చవిచూసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–3తో ఒలింపిక్ చాంప్ నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలైంది. 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ (20వ నిమిషంలో) రెండో క్వార్టర్‌లో గోల్ చేయగా... జుగ్‌రాజ్ సింగ్ 54వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. డచ్ జట్టులో థిస్ వాన్ డామ్ (24వ నిమిషంలో), జెప్ హోడెమాకెర్స్ (33వ నిమిషంలో), జిప్ జాన్సెన్ (57వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. ఈ మ్యాచ్‌లో ఆరంభంలోనే ముందుగా భారత శిబిరమే దాడులకు పదనుపెట్టింది. అభిషేక్ ఆరో నిమిషంలోనే ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై కొట్టిన షాట్ వైడ్‌గా వెళ్లింది. కాసేపటికే శిలానంద్ మిడ్‌ఫీల్డ్ నుంచి దూసుకొచ్చి కొట్టిన షాట్ కూడా లక్ష్యాన్ని చేరలేదు. అయితే ప్రత్యర్థి స్ట్రయికర్ల గురి మాత్రం మన డిఫెండర్లను బోల్తాకొట్టించి మరీ గోల్స్‌గా నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లో భారత్‌కు ఏకంగా 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభిస్తే ఒకటి మాత్రమే గోల్‌గా సఫలమైంది. భారత్ రేపు జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో అర్జెంటీనాతో ఆడుతుంది.



ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో ధోని

మరో ఆరుగురికి కూడా చోటు

లండన్: భారత మాజీ కెప్టెన్, సారథిగా టి20, వన్డే వరల్డ్ కప్‌లను గెలిపించిన మహేంద్ర సింగ్ ధోనిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సముచిత రీతిలో గౌరవించింది. ఐసీసీ ప్రకటించిన 'హాల్ ఆఫ్ ఫేమ్' జాబితాలో ధోనికి చోటు కల్పించింది. 2025 ఏడాదికిగాను ధోనితో పాటు మరో ఆరుగురు ప్లేయర్లు 'హాల్ ఆఫ్ ఫేమ్'లోకి ఎంపికయ్యారు. గ్రేమ్ స్మిత్, హాషిమ్ ఆమ్లా, మాథ్యూ హేడెన్, డేనియెల్ వెటోరిలతో పాటు మహిళా క్రికెటర్లు సారా టేలర్, సనా మీర్‌లను ఐసీసీ ఎంపిక చేసింది. భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ కెప్టెన్‌గా ధోని గుర్తింపు తెచ్చుకున్నాడు. అతని నాయకత్వంలోనే భారత్ 2007 టి20 వరల్డ్ కప్, 2011 వన్డే వరల్డ్ కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీలను సొంతం చేసుకుంది. 90 టెస్టుల్లో 4876 పరుగులు, 350 వన్డేల్లో 10773 పరుగులు, 98 టి20ల్లో 1617 పరుగులు సాధించిన ధోని... వికెట్ కీపర్‌గా 824 మందిని అవుట్ చేయడంలో భాగస్వామిగా ఉన్నాడు. 'ప్రపంచ క్రికెట్‌లో ఆటగాళ్లు చేసిన సేవలకు గుర్తింపుగా భావించే ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కడం పెద్ద గౌరవంగా భావిస్తున్నా. ఎంతో మంది దిగ్గజాల సరసన నా పేరు కూడా చేరడం గొప్ప అనుభూతి. ఎప్పటికీ చిరస్మరణీయం' అని ధోని స్పందించాడు.

11 ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు పొందిన భారత క్రికెటర్లు. సునీల్ గావస్కర్ (2009), బిషన్ బేడీ (2009), కపిల్ దేవ్ (2010), అనిల్ కుంబ్లే (2015), రాహుల్ ద్రవిడ్ (2018), సచిన్ టెండూల్కర్ (2019), వినూ మన్కడ్ (2021), డయానా ఎడుల్జీ (2023), వీరేంద్ర సెహ్వాగ్ (2023), నీతూ డేవిడ్ (2024), మహేంద్ర సింగ్ ధోని (2025) ఈ జాబితాలో ఉన్నారు.

మాథ్యూ హేడెన్ (ఆస్ట్రేలియా): టెస్టుల్లో ఓపెనర్‌గా 50కి పైగా సగటుతో ఆసీస్ ఘనవిజయాల్లో కీలకంగా నిలిచిన హేడెన్ రెండు వన్డే వరల్డ్ విజయాల్లో సభ్యుడు.

గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా): ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక టెస్టు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా (109) వ్యవహరించడంతో పాటు అత్యధిక విజయాలు (53) సాధించిన రికార్డు స్మిత్ సొంతం.

హాషిమ్ ఆమ్లా (దక్షిణాఫ్రికా): సుదీర్ఘ కాలం టెస్టుల్లో వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించిన ఆమ్లా సఫారీ టీమ్ తరఫున ట్రిపుల్ సెంచరీ చేసిన తొలి ఆటగాడు.

డేనియెల్ వెటోరీ (న్యూజిలాండ్): టెస్టు క్రికెట్‌లో 4 వేలకు పైగా పరుగులు చేసిన 300కు పైగా వికెట్లు తీసిన అరుదైన ఆటగాళ్లలో ఒకడైన వెటోరీ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుర్తింపు పొందాడు.

సారా టేలర్ (ఇంగ్లండ్): మహిళల క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్ కీపర్‌గా గుర్తింపు పొందిన సారా టేలర్ 2 వన్డే వరల్డ్ కప్, ఒక టి20 వరల్డ్ కప్ గెలుచుకున్న జట్టులో సభ్యురాలు.

సనా మీర్ (పాకిస్తాన్): 14 ఏళ్ల కెరీర్‌లో 120 వన్డేలు, 106 టి20లు ఆడిన సనా మీర్ పాకిస్తాన్ మహిళా క్రికెట్‌కు పెద్ద దిక్కులా నిలబడింది. 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కిన తొలి పాక్ మహిళా క్రికెటర్‌గా సనా గుర్తింపు పొందనుంది.

భారత్ 'ఎ', ఇంగ్లండ్ లయన్స్ మ్యాచ్ 'డ్రా'

నార్తంప్టన్: భారత్ 'ఎ', ఇంగ్లండ్ లయన్స్ జట్ల మధ్య రెండో అనధికారిక టెస్టు 'డ్రా' అయింది. భారత లోయర్ ఆర్డర్ బ్యాటర్లు తనుశ్ కొటియాన్ (90 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్), అన్షుల్ కంబోజ్ (51 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ఆఖరి రోజు 163/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 'ఎ' 92 ఓవర్లలో 417/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకొని 439 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచింది. ఇంగ్లండ్ లయన్స్ మ్యాచ్ ముగిసే సమయానికి 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది.

'ఈతరం' వైరానికి సైరన్

అల్‌కరాజ్, సినెర్ మధ్య హోరాహోరీ

- టైటిల్స్ వేటలో సమరాలకు 'సై'
- గ్రాండ్‌స్లామ్‌లతో కొత్త చరిత్రకు శ్రీకారం

5 గంటల 29 నిమిషాలు... ఓపెన్ ఎరాలో రెండో సుదీర్ఘమైన ఫైనల్... ఈ మారథాన్ పోరులో అల్‌కరాజ్, సినెర్ కొదమ సింహాల్లా తలపడ్డారు... ప్రతీ పాయింట్ కోసం, ప్రతీ గేమ్ కోసం పోరాటం... ఈ అసాధారణ సమరంలో ఒక్క టాయిలెట్ బ్రేక్ లేదు... ఒక్క మెడికల్ టైమౌట్ లేదు... అద్భుతమైన ఫిట్‌నెస్ ప్రదర్శన... తుది విజేత అల్‌కరాజ్ అయినా మ్యాచ్‌లో ఇద్దరూ చూపించిన గొప్ప ఆట భవిష్యత్తులో పురుషుల టెన్నిస్‌లో జరగబోయే హోరాహోరీ సమరాలకు ట్రైలర్‌లా కనిపించింది... ఈ పోటీ ఇక్కడితో ఆగిపోదని, ముున్ముందూ 'బిగ్ 3' స్థానంలో 'బిగ్ 2'తో ప్రపంచ టెన్నిస్‌ను తాము శాసించబోతున్నామని కొత్త తరంలో అల్‌కరాజ్, సినెర్ నిరూపించారు.

సాక్షి క్రీడా విభాగం


ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ ట్రోఫీతో సినెర్
ఫ్రెంచ్ ఓపెన్ విన్నర్స్ ట్రోఫీతో అల్‌కరాజ్

కార్లోస్ అల్‌కరాజ్ వయసు 22 ఏళ్లు అయితే యానిక్ సినెర్‌కు 24 ఏళ్లు... కొత్త మిలీనియంలో 2000 తర్వాత పుట్టిన ఇద్దరు ఆటగాళ్లు తలపడిన తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మ్యాచ్ ఇది. రెండు దశాబ్దాలకు పైగా టెన్నిస్‌ను ఫెడరర్, నాదల్, జొకోవిచ్ శాసించారు. ఈ ముగ్గురు కలిసి ఏకంగా 66 గ్రాండ్‌స్లామ్‌లు గెలుచుకున్నారు. మూడేళ్ల క్రితమే ఫెడరర్ తప్పుకోగా, గత సీజన్ ముగిసిన తర్వాత నాదల్ ఆట ముగిసింది. ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో ఓటమి తర్వాత జొకోవిచ్ వ్యాఖ్యలు చూస్తే అతనూ మరెంతో కాలం కొనసాగేలా అనిపించడం లేదు. వీరి అధ్యాయం ముగిసిన తర్వాత టెన్నిస్ బోసిపోతుందని... అలాంటి గొప్ప సమరాలు చూడలేమని అంతా అనుకున్నారు. 1990ల్లో పుట్టిన ఆటగాళ్లు ఎవరూ నిలకడను చూపించలేక 'బిగ్ 3'కి కనీస పోటీ ఇవ్వలేక వెనుకబడిపోయారు. అలాంటి సమయంలో ఆదివారం పోరాటం కొత్త మజాను అందించింది. ఒకేసారి ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి అడుగు పెట్టిన వీరిద్దరే గత ఆరు గ్రాండ్‌స్లామ్‌లలో చెరో మూడు గెలుచుకోవడం చూస్తే కొత్త వైరం ఎలా ఉండనుందో అర్థం చేసుకోవచ్చు.

అలా మొదలైంది...

అల్‌కరాజ్, సినెర్ మధ్య వైరం ఈనాటిది కాదు. స్పెయిన్‌లో జరిగిన చాలెంజర్ ఈవెంట్లో తొలిసారి వీరిద్దరు తలపడ్డారు. 15 ఏళ్ల అల్‌కరాజ్ రెండు గంటల పాటు సాగిన మూడు సెట్‌ల పోరులో తనకంటే రెండేళ్లు పెద్దయిన సినెర్‌ను ఓడించాడు. వీరిద్దరి ఆటను చూసిన ప్రేక్షకులు, వ్యాఖ్యాతలు కచ్చితంగా భవిష్యత్తులో పెద్ద ఆటగాళ్లుగా ఎదుగుతారని జోస్యం చెప్పారు. కొన్నేళ్లకు అదే నిజమైంది. ప్రొఫెషనల్ కెరీర్‌లో 2021లో ఇద్దరి మధ్య మొదటి మ్యాచ్ జరగ్గా... అక్కడా అల్‌కరాజ్‌దే పైచేయి అయింది. అయితే తొలిసారి ఫైనల్లో తలపడిన మ్యాచ్‌లో (క్రొయేషియా ఓపెన్) సినెర్ గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. 2022 వింబుల్డన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఇద్దరూ తొలిసారి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లో తలపడ్డారు. ఇక్కడ సినెర్ గెలవగా, తర్వాత జరిగిన యూఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్‌దే పైచేయి అయింది. ఆదివారం మ్యాచ్ తరహాలోనే 5 గంటల 15 నిమిషాలు సాగిన ఐదు సెట్‌ల పోరులో అల్‌కరాజ్ నెగ్గాడు. అదే జోరులో టోర్నీని గెలుచుకొని తొలి గ్రాండ్‌స్లామ్ సాధించడంతో పాటు వరల్డ్ నంబర్‌వన్ కావడంతో అల్‌కరాజ్ కెరీర్ దూసుకుపోయింది. మరో వైపు సినెర్ పూర్తిగా వెనుకబడిపోకుండా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాడు. 2023లో అల్‌కరాజ్ 6 టోర్నీల్లో విజేతగా నిలవగా... సినెర్ తొలి ఏటీపీ–1000 టైటిల్ నెగ్గాడు. ఓవరాల్‌గా ఇప్పుడు ఏటీపీ సర్క్యూట్‌లో 8–4తో అల్‌కరాజ్‌దే పైచేయి అయినా ఈ లెక్క ఎప్పుడైనా మారిపోవచ్చు.

సమ ఉజ్జీలుగా...

	అల్‌కరాజ్	సినెర్
గ్రాండ్‌స్లామ్ టైటిల్స్	5	3
ఏటీపీ ఫైనల్ టైటిల్స్	0	1
ఏటీపీ-1000 టైటిల్స్	7	4
మొత్తం కెరీర్ టైటిల్స్	20	19
ప్రపంచ ర్యాంకింగ్	2	1

హోరాహోరీగా దూసుకుపోతూ...

ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో సినెర్ చేతిలో జొకోవిచ్ ఓడిపోవడం పురుషుల టెన్నిస్‌లో ఒక కొత్త శకం ఆరంభానికి సూచిక. స్వయంగా జొకోవిచ్ కూడా ఇదే విషయాన్ని చెప్పాడు. 'ఇది ఆ ఇద్దరు ఆటగాళ్లకే కాదు...ప్రపంచ టెన్నిస్‌కు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇలాంటి వైరం టెన్నిస్‌కు అవసరం అనడంలో ఎలాంటి సందేహం లేదు. వారిద్దరు ఆడుతున్న తీరు చూస్తే రాబోయే కొన్నేళ్ల పాటు పెద్ద సంఖ్యలో ట్రోఫీలు వీరి ఖాతాలోనే చేరడం ఖాయం' అని జొకో అభిప్రాయపడ్డాడు. రోలండ్ గారోస్ ఫైనల్లో తొలి రెండు సెట్‌లు గెలుచుకొని సినెర్ పైచేయి సాధించినట్లు కనిపించగా... నాలుగో సెట్‌లో అసాధారణ ఆటతో మూడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని అల్‌కరాజ్ చివరకు టైటిల్ గెలవడం వీరి మధ్య పోటీని చూపించింది. ఎక్కడా వెనక్కి తగ్గని పట్టుదల, పోరాటతత్వం, చివరి వరకు ఓటమిని అంగీకరించని శైలి అంతా ఈ మ్యాచ్‌లోనే కనిపించింది. కెరీర్ ఆరంభంలో ప్రదర్శనను పక్కన పెడితే 2024 నుంచి వీరిద్దరు గ్రాండ్‌స్లామ్‌లను శాసించడం మొదలైంది. ముందుగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలుచుకొని సినెర్ మొదలు పెడితే ఫ్రెంచ్, వింబుల్డన్ అల్‌కరాజ్ ఖాతాలోకి వెళ్లాయి. ఆ తర్వాత యూఎస్ ఓపెన్‌తో ముగించిన సినెర్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను నిలబెట్టుకున్నాడు. తీవ్ర పోటీ మొదలైన ఈ స్థితిలో మరికొద్ది రోజుల్లో వింబుల్డన్‌ను నిలబెట్టుకునేందుకు అల్‌కరాజ్ సిద్ధమవుతుండగా... ఆ తర్వాత సినెర్ యూఎస్ ఓపెన్‌ను నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరం.


ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభోత్సవంలో 'బిగ్-3' జొకోవిచ్, ఫెడరర్, నాదల్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫన్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్రేజీ కాంబినేషన్?


● రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, దర్శకుడు త్రివిక్రమ్ క్రేజీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకునేందుకు సన్నాహాలు ఆరంభమైనట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ ఓ కథను సిద్ధం చేసి, రామ్ చరణ్‌కు వినిపించారట. ఈ కథ నచ్చడంతో సినిమా చేసేందుకు రామ్‌చరణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థలు నిర్మించనున్నాయని, త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన రానుందని భోగట్టా. కాగా ప్రస్తుతం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' సినిమా చేస్తున్నారు రామ్‌చరణ్. అలాగే దర్శకుడు సుకుమార్‌తో రామ్‌చరణ్ ఓ సినిమా చేయాల్సి ఉంది. మరి..'పెద్ది' తర్వాత రామ్‌చరణ్ సినిమా సుకుమార్‌తో ఉంటుందా? లేక త్రివిక్రమ్‌తోనా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

లక్ష్యం కోసం...


● ఎన్టీఆర్

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్న స్పై యాక్షన్ డ్రామా చిత్రం 'వార్ 2'. కియారా అద్వానీ హీరోయిన్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తమిళ్, తెలుగు భాషల్లో రిలీజ్ కానుంది. కాగా ఇటీవల 'వార్ 2' సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో కనిపించిన ఎన్టీఆర్ లుక్స్, స్టైలింగ్ బాగున్నాయనే చర్చ జరిగింది. ఈ విషయంపై 'వార్ 2' సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసిన అనైతా ష్రాఫ్ అడజానియా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ''వార్ 2' సినిమా కోసం ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనలో ఏదో ఆకర్షణ శక్తి ఉంది. సెట్స్‌కి ఎంట్రీ ఇవ్వగానే ఆ ఎనర్జీ టీమ్ అందరిలోకి వచ్చేస్తుంటుంది. 'వార్ 2' లో ఎన్టీఆర్ పోషించిన పాత్రలో ఎన్నో లేయర్స్ ఉన్నాయి. అందుకే చాలా లుక్స్‌ని డిజైన్ చేశాం. ఆయన పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్స్‌ని డిజైన్ చేశాం. ఓ ఉద్దేశంతో ఓ లక్ష్యం కోసం పనిచేసే మానవ యంత్రంలా చూపించే ప్రయత్నం చేశాం'' అని అనైతా ష్రాఫ్ అడజానియా చెప్పారు.

శివుడి అనుమతి లేనిదే...


● బాలకృష్ణ

'నా శివుడి అనుమతి లేనిదే ఆ యముడైనా కన్నెత్తి చూడడు. నువ్వు చూస్తావా.. అమాయకుల ప్రాణాలు తీస్తావా' అంటూ అఘోరా పాత్రలో బాలకృష్ణ చెప్పే డైలాగ్‌తో మొదలవుతుంది 'అఖండ: తాండవం' సినిమా టీజర్. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అఖండ: తాండవం'. వీరి కాంబినేషన్‌లో 2021లో వచ్చిన 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ: తాండవం' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జార్జియా లొకేషన్స్‌లో జరుగుతోంది. కాగా నేడు (జూన్ 10) బాలకృష్ణ బర్త్ డే. ఈ సందర్భంగా 'అఖండ: తాండవం' టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. 'వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది' అన్న డైలాగ్ టీజర్‌లో ఉంది. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న 'అఖండ: తాండవం' దసరా సందర్భంగా సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్.




ఇంతకుమించి కోరుకోవడానికి ఏముంది

\- నయనతార


● విఘ్నేశ్, నయన్

తమిళ చిత్ర పరిశ్రమలో బెస్ట్ కపుల్ అనగానే హీరోయిన్ నయనతార– డైరెక్టర్ విఘ్నేశ్ శివన్‌ల జోడీ గుర్తొస్తుంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించిన 'నేను రౌడీనే'(2015) చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించారు. ఆ సమయంలో నయన్–విఘ్నేశ్‌ల మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారడంతో పెద్దల అంగీకారంతో 2022 జూన్ 9న పెళ్లి చేసుకున్నారు. వారికి ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్నారు. సోమవారం మూడవ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ద్వారా ఫోటోలను షేర్ చేశారు నయనతార. ''ఒకరిపై ఒకరు అంతలా ఎలా ప్రేమ చూపుతారన్నది ఎప్పటికీ సమాధానం దొరకని ఆశ్చర్యపరిచే విషయం. కానీ.. నీ రూపంలో దానికి నాకు సమాధానం దొరికింది. నీ ప్రేమను వర్ణించడానికి నాకు మాటలు చాలవు. నా మనసు కోరుకునే ప్రేమవు నువ్వు. ఇద్దరిగా ప్రారంభమైన మన ప్రయాణం నలుగురుగా మారింది. ఇంతకు మించి కోరుకోవడానికి ఏముంది. స్వచ్ఛమైన ప్రేమ అంటే ఏంటో, అది ఎలా ఉంటుందో నువ్వు నాకు చూపించావు. నా జీవిత భాగస్వామికి పెళ్లి రోజు శుభాకాంక్షలు'' అంటూ పోస్ట్ చేశారు నయనతార. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇదిలా ఉంటే.. నయనతార తెలుగులో ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నారు.

షారుక్‌ఖాన్‌తో సుకుమార్?


● షారుక్ ఖాన్

బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకోనుందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. షారుక్‌తో ఓ సినిమా చేసేందుకు టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రయత్నాలు చేస్తోందని, ఈ దిశగా చర్చలు ప్రారంభమయ్యాయని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాకు షారుక్ ఓకే చెబితే, దర్శకుడిగా సుకుమార్‌తో ఈ చిత్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలని మైత్రీ మూవీ మేకర్స్ అనుకుంటున్నారని టాక్. మరి.. సుకుమార్, షారుక్‌ఖాన్ కాంబినేషన్‌లో సినిమా సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇదిలా ఉంటే.. ఇటీవల షారుక్‌ఖాన్‌ను కలిశారట తమిళ దర్శకుడు వెట్రిమారన్. ఈ నేపథ్యంలో షారుక్‌ఖాన్ సినిమా ఏ దర్శకుడితో ఉండబోతుందనే చర్చ జరుగుతోంది. ఇక ప్రస్తుతం హిందీ చిత్రం 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో బిజీగా ఉన్నారు షారుక్‌ఖాన్. ఈ ఏడాదిలోనే ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం కానుంది.

సర్దార్ సీక్వెల్ సమాప్తం


● మాళవికా మోహనన్, కార్తీ


'సర్దార్' సీక్వెల్ 'సర్దార్ 2' షూటింగ్ సమాప్తం అయింది. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన స్పై యాక్షన్ డ్రామా 'సర్దార్'. 2022 అక్టోబరులో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా కార్తీ, పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లోనే 'సర్దార్' సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2' రానుంది. ఈ సీక్వెల్ చిత్రీకరణ పూర్తయినట్లుగా మేకర్స్ వెల్లడించారు. కార్తీ టైటిల్ రోల్‌లో నటించిన ఈ చిత్రంలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించగా, ఎస్‌జే సూర్య పవర్‌ఫుల్ పాత్రలో నటించారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ సినిమాను నిర్మించారు. ''పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇక 'సర్దార్' సినిమాలో తండ్రీకొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. సీక్వెల్‌లోనూ ద్విపాత్రాభినయం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

చండీ దుర్గమా ఆరంభం


● ఓలి, మైను ఖాన్, అలీ, జయశ్రీ

నూతన నటీనటులతో మైను ఖాన్ ఎండీ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'చండీ దుర్గమా' సినిమా ఆరంభమైంది. హెచ్‌బిజే క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్‌పై జయశ్రీ వెల్ది నిర్మిస్తున్నారు. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు అలీ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, నటుడు చిట్టి కెమెరా స్విచ్చాన్ చేశారు.. నటుడు రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. మైను ఖాన్ ఎండీ మాట్లాడుతూ– ''సౌందర్యగారి 'అమ్మోరు', విజయశాంతిగారి 'చండీ' వంటి సినిమాల తర్వాత అమ్మవారి కథతో సినిమా రాలేదు. ఇప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా, ఈతరం ప్రేక్షకులకు నచ్చేలా 'చండీ దుర్గమా' రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మన ప్రేక్షకులు అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాలను ఆదరించారు. మా సినిమాని కూడా అలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాం'' అని జయశ్రీ వెల్ది చెప్పారు. సినిమాటోగ్రాఫర్ వైఎస్ కృష్ణ, కో ప్రొడ్యూసర్ ఓలి మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంకే.

పూంగవనం


● సునీల్

హాస్య నటుడిగా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు సునీల్. 'పుష్ప 1, 2' చిత్రాలతో ఆయనకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీంతో ఇతర భాషల్లోనూ వరుసగా అవకాశాలు అందుకుంటున్నారాయన. తాజాగా ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న తమిళ–తెలుగు ద్విభాషా చిత్రంలో నటించే అవకాశం అందుకున్నారు. రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మాణంలో రూపొందనున్న ఈ చిత్రంలో 'పూంగవనం' అనే పాత్రలో సునీల్ నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించి, ఆయన లుక్‌ని రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా విజయ్ మిల్టన్ మాట్లాడుతూ– ''సునీల్‌గారు సహజ నటనకు నిలువెత్తు ఉదాహరణ. మా సినిమాలో ఆయన చేయబోయే పాత్ర చాలా ప్రత్యేకమైనది. హాస్యం, భావోద్వేగాలు మిళితమైన ఈ పాత్ర ఆయన నటనకు మరో కొత్త కోణాన్ని పరిచయం చేయనుంది. ఆయన ఇప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా, మనసుని హత్తుకునే చాలా సహజమైన పాత్ర ఇది. ఈ చిత్రంలోని ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటిస్తాం. ఈ సినిమా టైటిల్‌ను ఈ నెల 15న విడుదల చేస్తాం'' అని తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
10-6-2025

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	256	82,445
నిఫ్టీ ▲	100	25,103

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	19,622	▲	92
డోజోన్స్‌	42,820	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,832	▼	6
డాక్స్‌	24,174	▼	130
షాంఘై	3,340	▲	14
నికాయ్‌	38,088	▲	347

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్‌)	95,864
బంగారం (22 క్యారెట్‌)	95,480
వెండి (కేజీ)	1,05,560

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒక్కోటికి	83.79	87.47
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒక్కోటికి	113.63	118.56
€	యూరో	ఒక్కోటికి	95.57	100.04
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒక్కోటికి	48.26	70.03
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఒక్కోటికి	54.48	58.31
S$	సింగపూర్‌ డాలర్‌	ఒక్కోటికి	64.29	68.97
SAR	సౌదీ రియాల్‌	ఒక్కోటికి	21.94	23.44
UAE D	యూఏఈ దిర్హామ్‌	ఒక్కోటికి	22.42	24.20
¥	చైనా యువాన్‌	ఒక్కోటికి	11.05	12.87

కొనసాగుతున్న వెండి వెలుగులు



- రూ.1,000 అప్‌; మరో కొత్త గరిష్టం
- ఢిల్లీలో ధర రూ. 1.08 లక్షలు

న్యూఢిల్లీ: వెండి రికార్డు ర్యాలీ కొనసాగుతోంది. అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా సోమవారం వెండి కేజీ ధర మరో రూ. 1,000 పెరిగి కొత్త గరిష్ట స్థాయి రూ. 1,08,100ని తాకిందని ఆలిండియా సరాఫా అసోసియేషన్‌ తెలిపింది. ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలరు బలహీనపడటం, అంతర్జాతీయంగా భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు పెరగడం, ఎలక్ట్రిక్‌ వాహనాలు.. సౌర విద్యుత్‌ పరిశ్రమల నుంచి డిమాండ్‌ పెరగడం తదితర అంశాలు ఇందుకు కారణమని ట్రేడర్లు తెలిపారు. వెండి అంతర్జాతీయంగా 13 ఏళ్ల గరిష్టం, దేశీయంగా లైఫ్‌టైమ్‌ గరిష్టాలను తాకినట్లు మెహతా ఈక్విటీస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రాహుల్‌ కలాంత్రి తెలిపారు. యూరప్‌లో ద్రవ్యోల్బణం నెమ్మదించడం, వాణిజ్య వివాదాలు సమసిపోవడంపై ఆశావహ భావం నెలకొనడం లాంటి అంశాలతో వెండి ధర కన్సాలిడేషన్‌ శ్రేణి నుంచి బైటపడిందని, ఔన్సు (31.1 గ్రాములు) రేటు 36 డాలర్లను అధిగమించిందని పేర్కొన్నారు.

మరోవైపు, న్యూఢిల్లీ బులియన్‌ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల పది గ్రాముల పసిడి ధర రూ. 280 మేర తగ్గి రూ. 97,780కి (పన్నులు సహా) పరిమితమైంది. అలాగే 99.5 శాతం స్వచ్ఛ త గల బంగారం ధర రూ. 250 క్షీణించి రూ. 97,350కి తగ్గింది. అమెరికా, చైనా మధ్య నెలకొన్న వివాదాల పరిష్కారం కోసం ఇరు దేశాల మధ్య సానుకూల సంప్రదింపులు జరిగే అవకాశం ఉందని ఇన్వెస్టర్లలో ఆశాభావం నెలకొన్న నేపథ్యంలో బంగారంలాంటి సురక్షితమైన పెట్టుబడి సాధనాలకు డిమాండ్‌ కాస్త నెమ్మదించవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ సీనియర్‌ అనలిస్ట్‌ సౌమిల్‌ గాంధీ చెప్పారు.

ప్రభుత్వానికి ఎస్‌బీఐ భారీ డివిడెండ్‌

రూ. 8,077 కోట్లు చెల్లింపు

న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి(2024–25) షేరుకి రూ. 15.9 చొప్పున డివిడెండ్‌ ప్రకటించింది. దీంతో సంస్థ ప్రమోటర్‌ కేంద్ర ప్రభుత్వానికి దాదాపు రూ. 8,077 కోట్ల డివిడెండ్‌ చెల్లించింది. ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు, ఫైనాన్స్‌ సెక్రటరీ అజయ్‌ సేథ్‌ సమక్షంలో ఎస్‌బీఐ చైర్మన్‌ సీఎస్‌ శెట్టి తాజాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డివిడెండ్‌ చెక్‌ అందించారు.



కాగా.. అంతక్రితం ఏడాదిలో షేరుకి రూ. 13.7 చొప్పున ప్రభుత్వానికి రూ. 6,959 కోట్లకుపైగా డివిడెండ్‌ చెల్లించిన సంగతి తెలిసిందే. గతేడాది ఎస్‌బీఐ 16 శాతం అధికంగా రూ. 70,901 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు 2023–24లో రూ. 61,077 కోట్ల లాభం సాధించింది.

ఐపీవోకు లలితా జ్యువెలరీ

- సెబీకి ప్రాస్పెక్టస్‌ దాఖలు
- రూ. 1,700 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: బంగారు ఆభరణ వర్తక దిగ్గజం లలితా జ్యువెలరీ మార్ట్‌ పబ్లిక్‌ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్‌ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ.1,200 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 500 కోట్ల విలువైన షేర్లను ఎం.కిరణ్‌ కుమార్‌ జైన్‌ విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 1,700 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. అర్హతగల సంస్థ ఉద్యోగులకు డిస్కౌంట్‌లో షేర్లను ఆఫర్‌ చేయనుంది. ఐపీవో నిధుల్లో రూ. 1,015 కోట్లు కొత్త స్టోర్ల ఏర్పాటుకు వెచ్చించనుంది. 1985లో చెన్నైలోని టీనగర్‌లో తొలి స్టోర్‌ను ప్రారంభించిన కంపెనీ 2024 డిసెంబర్‌కల్లా 56 స్టోర్లకు విస్తరించింది. తద్వారా గోల్డ్‌, సిల్వర్‌, డైమండ్‌ జ్యువెలరీ విక్రయిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడులలో అధిక స్టోర్లు కలిగిన కంపెనీకి తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరిలోనూ కార్యకలాపాలున్నాయి. 2024 డిసెంబర్‌31తో ముగిసిన 9 నెలల్లో రూ.12,595 కోట్ల ఆదాయం, రూ. 262 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఎంఎస్‌ఎంఈలకు షిప్‌రాకెట్‌ దన్ను



హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: పబ్లిక్‌ ఇష్యూ సన్నాహాల్లో ఉన్న ఈ-కామర్స్‌ సర్వీసుల సంస్థ షిప్‌రాకెట్‌ తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా చిన్న, మధ్య తరహా సంస్థలపై (ఎంఎస్‌ఎంఈ) మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తమ ప్లాట్‌ఫాంపై 3 లక్షల మంది పైగా విక్రేతలు ఉండగా ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణలో తమ ప్లాట్‌ఫాం ద్వారా 18,000 విక్రేతలు లావాదేవీలు సాగిస్తున్నట్లు సంస్థ సీఈవో అతుల్‌ మెహతా (డొమెస్టిక్‌ షిప్పింగ్‌) సోమవారమిక్కడ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రెండు రాష్ట్రాల్లో సుమారు 35 లక్షల పైగా డెలివరీలు నమోదయ్యాయని ఎస్‌ఎంఈల కోసం షిప్‌రాకెట్‌ యాత్ర 2025 కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తమకు 32 గిడ్డంగులు ఉండగా, హైదరాబాద్‌లో ఒకటి ఉందన్నారు. 3 డార్క్‌ స్టోర్స్‌ ఉండగా.. తదుపరి విడతలో హైదరాబాద్‌, చెన్నై తదితర నగరాల్లో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డ్రోన్లతో డెలివరీ, క్విక్‌ డెలివరీ విభాగాలపైనా దృష్టి పెడుతున్నామని మెహతా వివరించారు.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..

టూ-వీలర్ల విక్రయాలు జూమ్‌	ఆతిథ్య రంగంలో 6-8 శాతం వృద్ధి

మైక్రాన్‌ సెమీకండక్టర్‌ సెజ్‌

గుజరాత్‌లో రూ. 13,000 కోట్ల భారీ పెట్టుబడి

కర్ణాటకలో రూ. 100 కోట్లతో 'ఈక్వస్‌' సెజ్‌ • ప్రతిపాదనలకు కేంద్ర వాణిజ్య శాఖ ఆమోదం

న్యూఢిల్లీ: సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్‌ పరికరాల తయారీకి సంబంధించి మరిన్ని ప్రత్యేక ఆర్థిక మండళ్లకు (సెజ్‌) కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ఇందులో మైక్రాన్‌ సెమీకండక్టర్‌ టెక్నాలజీ ఇండియా, హుబ్బళ్లి డ్యూరబుల్‌ గూడ్స్‌ క్లస్టర్‌ (ఈక్వస్‌ గ్రూప్‌) ప్రతిపాదనలు ఉన్నాయి. కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటన ప్రకారం గుజరాత్‌లోని సాణంద్‌లో మైక్రాన్‌ సుమారు 37.64 హెక్టార్ల విస్తీర్ణంలో సెజ్‌ ఏర్పాటు చేయనుంది. దీనిపై రూ. 13,000 కోట్లు ఇన్వెస్ట్‌ చేయనుంది. మరోవైపు, కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఈక్వస్‌ గ్రూప్‌ 11.55 హెక్టార్లలో ఎలక్ట్రానిక్స్‌ పరికరాల సెజ్‌ను నెలకొల్పనుంది. దీనిపై రూ. 100 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.



పెట్టుబడులు.. తయారీకి ఊతం

దేశీయంగా సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్‌ పరికరాల తయారీని ప్రోత్సహించే దిశగా సెజ్‌ నిబంధనలను సరళతరం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అధునాతన రంగాలు ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడి ఉండటం, తయారీ కార్యకలాపాలకు భారీగా పెట్టుబడుల అవసరం నెలకొనడం, లాభాలార్జించేందుకు సుదీర్ఘ సమయం పట్టేసే అవకాశం ఉండటం తదితర అంశాల నేపథ్యంలో పెట్టుబడులు, తయారీకి ఊతమిచ్చే విధంగా ప్రభుత్వం నిబంధలను సడలిస్తోందని వాణిజ్య శాఖ తెలిపింది. ఇందులో భాగంగా సెమీ కండక్టర్లు లేదా ఎలక్ట్రానిక్స్‌ పరికరాల తయారీ కోసం సెజ్‌లను ఏర్పాటు చేసేందుకు ఒకేచోట కనీసం 10 హెక్టార్ల స్థలం ఉంటే సరిపోతుందని పేర్కొంది. ప్రస్తుతం ఈ పరిమితి 50 హెక్టార్లుగా ఉంది. ఇక సెజ్‌లలోని సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్‌ పరికరాల తయారీ సంస్థలు అంతర్జాతీయంగానే కాకుండా, నిర్దిష్ట సుంకాలు చెల్లించిన మీదట దేశీయంగా కూడా విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు వివరించింది. ఈ సవరణలన్నీ దేశీయంగా హైటెక్‌ తయారీకి, సెమీకండక్టర్ల తయారీ వ్యవస్థ అభివృద్ధికి, ప్రత్యేక నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాల కల్పనకు దోహదపడతాయని పేర్కొంది. 2025 జూన్‌ 3న ఈ సవరణలను కేంద్ర వాణిజ్య శాఖ నోటిఫై చేసింది.

మార్కెట్లకు బ్యాంకింగ్‌ జోష్‌

- నాలుగో రోజూ లాభాలే
- సెన్సెక్స్‌ 256 పాయింట్లు అప్‌
- 82,445 వద్ద ముగింపు
- సెంచరీతో నిఫ్టీ 25,103కు



జీడీపీ గణాంకాలు, ఆర్‌బీఐ రేట్ల కోత ఇన్వెస్టర్లకు జోష్‌నిస్తున్నాయి. దీంతో కొనుగోళ్లకే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో వరుసగా నాలుగో రోజు దేశీ స్టాక్‌ మార్కెట్లు బలపడ్డాయి. వెరసి 4 రోజుల్లో సెన్సెక్స్‌ 1,707 పాయింట్లు(2.1 శాతం), నిఫ్టీ 560 పాయింట్లు(2.3 శాతం) చొప్పున లాభపడ్డాయి.

ముంబై: వరుసగా నాలుగో రోజు దేశీ స్టాక్‌ మార్కెట్లు బలపడ్డాయి. ప్రధానంగా బ్యాంకింగ్‌, ఫైనాన్షియల్‌ కౌంటర్లకు డిమాండ్‌ కనిపించింది. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత, సీఆర్‌ఆర్‌ తగ్గింపు ఇందుకు సహకరించాయి. వెరసి సెన్సెక్స్‌ 256 పాయింట్లు లాభపడి 82,445 వద్ద ముగిసింది. నిఫ్టీ 100 పాయింట్లు ఎగసి 25,103 వద్ద స్థిరపడింది. గ్లోబల్‌ మార్కెట్ల సానుకూలత సైతం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 480 పాయింట్లు జంప్‌చేసి 82,669ను తాకింది. నిఫ్టీ 25,160వరకూ పుంజుకుంది. కాగా.. నాలుగు రోజుల్లో సెన్సెక్స్‌ 1,707 పాయింట్లు, నిఫ్టీ 560 పాయింట్లు చొప్పున ర్యాలీ చేయడం గమనార్హం! యూఎస్‌, చైనా వాణిజ్య చర్చలు సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు విశ్లేషకులు తెలియజేశారు.

రియల్టీ మినహా..

ఎన్‌ఎస్‌ఈలో రియల్టీ మినహా అన్ని రంగాలూ లాభపడ్డాయి. పీఎస్‌యూ.. ప్రయివేట్‌ బ్యాంక్స్‌, ఫైనాన్షియల్స్‌, ఐటీ, ఆయిల్‌ 2–1% మధ్య పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో జియో, బజాజ్‌ ఫైనాన్స్‌, కొటక్‌ బ్యాంక్‌, ట్రెంట్‌, యాక్సిస్‌, హీరోమోటో, ఇండస్‌ఇండ్‌, మారుతీ 4–1.5% మధ్య ఎగశాయి.

చిన్న షేర్లు ప్లస్‌

బీఎస్‌ఈలో మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ సూచీలు 1% చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 2,750 లాభపడగా.. 1,464 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 1,993 కోట్లు, దేశీ ఫండ్స్‌ రూ. 3,504 కోట్లు విలువైన స్టాక్స్‌ కొనుగోలు చేశాయి.

భవిత

స్పర్థయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఏఐసీఎల్‌ఏఎస్‌లో 166 అసిస్టెంట్‌ పోస్టులు

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్‌ అండ్‌ అల్లైడ్‌ సర్వీసెస్‌ కంపెనీ లిమిటెడ్‌(ఏఏఐసీఎల్‌ఏఎస్‌).. ఫిక్స్‌డ్‌ టర్మ్‌ కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన మూడేళ్లు పనిచేసేందుకు అసిస్టెంట్‌(సెక్యూరిటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 166.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి జనరల్‌ అభ్యర్థులకు ఇంటర్‌లో 60 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి.
» **వయసు:**01.06.2025 నాటికి 27ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.21,000 నుంచి 22,500
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 09.06.2025.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025
» **వెబ్‌సైట్‌:** https://aaiclas.aero

ఏఏఐసీఎల్‌ఏఎస్‌లో 227 సెక్యూరిటీ స్క్రీనర్‌ పోస్టులు

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్‌ అండ్‌ అల్లైడ్‌ సర్వీసెస్‌ కంపెనీ లిమిటెడ్‌(ఏఏఐసీఎల్‌ఏఎస్‌)..ఫిక్స్‌డ్‌ టర్మ్‌ ప్రాతిపదికన మూడేళ్లు పనిచేసేందుకు సెక్యూరిటీ స్క్రీనర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 227.
» **రాష్ట్రాల వారీగా పోస్టులు:** అమృత్‌సర్‌–35, వడోదర–16, చెన్నై–176.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి జనరల్‌ అభ్యర్థులకు ఇంటర్‌లో 60 శాతం మార్కులు సాధించాలి.ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.
» **వయసు:**01.06.2025 నాటికి 27 ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.21,000 నుంచి 22,500
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 09.06.2025.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025
» **వెబ్‌సైట్‌:** https://aaiclas.aero

ఆర్‌సీఎఫ్‌ఎల్‌లో 75 మేనేజ్‌మెంట్‌ ట్రైనీ/ఆఫీసర్‌ పోస్టులు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్‌ అండ్‌ ఫెర్టిలైజర్స్‌ లిమిటెడ్‌(ఆర్‌సీఎఫ్‌ఎల్‌).. వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్‌ ట్రైనీ/ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 75.
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్‌(ఫైనాన్స్‌)ఈ–1 గ్రేడ్‌–10, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(బాయిలర్‌)–05, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(మార్కెటింగ్‌)–08, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(కెమికల్‌)–11, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(మెకానికల్‌)–02, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(ఇన్విరాన్‌మెంట్‌)–01, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(ఎలక్ట్రికల్‌)–03, మేనేజ్‌మెంట్‌ట్రైనీ(ఇన్‌స్ట్రుమెంటేషన్‌)–03, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(సివిల్‌)–05, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(సేఫ్టీ)–01, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(మెటీరియల్‌)–19, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(ఇండస్ట్రియల్‌ ఇంజనీరింగ్‌)–01, ఆఫీసర్‌(సెక్రటేరియల్‌)ఈ1/ఈ2 గ్రేడ్‌–08, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ(హ్యూమన్‌ రిసోర్సెస్‌)–01, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ (అడ్మినిస్ట్రేషన్‌)–02.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్స్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ఆఫీసర్స్‌ ఈ1 గ్రేడ్‌ పోస్టులకు 34 ఏళ్లు, ఆఫీసర్‌ ఈ1/ఈ2 గ్రేడ్‌ పోస్టులకు 40 ఏళ్లు, మేనేజ్‌మెంట్‌ ట్రైనీ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మేనేజ్‌మెంట్‌ ట్రైనీలకు మొదటి ఏడాది శిక్షణ సమయంలో రూ. 60,000, ఆఫీసర్‌ ఈ1 గ్రేడ్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, ఆఫీసర్‌ ఈ2 గ్రేడ్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్‌ టెస్ట్‌, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**16.06.2025.
» **వెబ్‌సైట్‌:** www.rcfltd.com

పది, ఇంటర్‌తో కేంద్రంలో కొలువు

» 2423 పోస్టుల భర్తీకి ఎస్‌ఎస్‌సీ నోటిఫికేషన్‌
» కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్ష, స్కిల్‌ టెస్ట్‌తో ఎంపిక
» పది, ఇంటర్‌, డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు

కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ స్టాఫ్‌ సెలక్షన్‌ కమిషన్‌(ఎస్‌ఎస్‌సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. దీనిద్వారా ఆయా మంత్రిత్వ శాఖలు /విభాగాలు/సంస్థల్లో గ్రూప్‌ సి, డి పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టనుంది. పదో తరగతి, ఇంటర్‌, డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్‌ఎస్‌సీ గ్రూప్‌ సి, డి ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష తదితర వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 2423

పోస్టుల వివరాలు

జూనియర్‌ ఇంజనీర్‌, సబ్‌ డివిజనల్‌ ఆఫీసర్‌ గ్రేడ్‌–2, సైంటిఫిక్‌ అసిస్టెంట్‌, ఫైర్‌మెన్‌, మల్టీటాస్కింగ్‌ స్టాఫ్‌, సివిలియన్‌ మోటార్‌ డ్రైవర్‌, టెక్నికల్‌ ఆపరేటర్‌, క్లర్క్‌, లైబ్రరీ ఇన్ఫర్మేషన్‌ అసిస్టెంట్‌, లైబ్రరీ క్లర్క్‌, బొటానికల్‌ అసిస్టెంట్‌, ఫీల్డ్‌ అటెండెంట్‌, ఆఫీస్‌ అటెండెంట్‌, ల్యాబొరేటర్‌ అటెండెంట్‌, అప్పర్‌ డివిజన్‌ క్లర్క్‌, టెక్నికల్‌ అసిస్టెంట్‌, అసిస్టెంట్‌ అర్కివిస్ట్‌, అసిస్టెంట్‌ ఆర్కియలాజికల్‌ కెమిస్ట్‌, హార్టికల్చర్‌ అసిస్టెంట్‌ గ్రేడ్‌–2, జూనియర్‌ అకౌంటెంట్‌, సీనియర్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌, జూనియర్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌, స్టాఫ్‌ కార్‌ డ్రైవర్‌, కెమికల్‌ అసిస్టెంట్‌, సెక్షన్‌ ఆఫీసర్‌, రీసెర్చ్‌ అసిస్టెంట్‌, లేబొరేటరీ అటెండెంట్‌, సర్వేయర్‌, అసిస్టెంట్‌ కమ్యూనికేషన్‌ ఆఫీసర్‌, టెక్నికల్‌ ఆపరేటర్‌(డ్రిల్లింగ్‌), టెలికామ్‌ అసిస్టెంట్‌ తదితర పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి పదోతరగతి, ఇంటర్‌, డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ఆయా పోస్టులను అనుసరించి 01.08.2025 నాటికి 18–35 ఏళ్ల మధ్యలో ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం–ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ తదితర రిజర్వేషన్‌ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

- కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్షతోపాటు టైపింగ్‌/డేటా ఎంట్రీ/కంప్యూటర్‌ ప్రొఫిషియన్సీ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌ను మెట్రిక్యులేషన్‌ లెవెల్‌, హయ్యర్‌ సెకండరీ(10+2)లెవెల్‌, గ్రాడ్యుయేషన్‌ ఆపై స్థాయి.. ఇలా మూడు స్థాయిల్లో నిర్వహిస్తారు.

200 మార్కులకు పరీక్ష

కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్షలో 200 మార్కులకు నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్‌ ఇంటెలిజెన్స్‌ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్‌ అవేర్‌నెస్‌ 25 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్‌ అప్టిట్యూడ్‌ 25 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ 25ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట. ఈ పరీక్షలో నెగిటివ్‌ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్ష ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌/హిందీల్లో ఉంటుంది.

రాత పరీక్షలో రాణించేలా

మెట్రిక్యులేషన్‌ స్థాయి పరీక్ష

- మెట్రిక్యులేషన్‌ స్థాయి పరీక్షకు సంబంధించిన జనరల్‌ ఇంటెలిజెన్స్‌ విభాగం సిలబస్‌లో.. నాన్‌ వెర్బల్‌ టైప్‌ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో సిమిలారిటీస్‌ అండ్‌ డిఫరెన్సెస్‌, స్పేస్‌ విజువలైజేషన్‌, ప్రాబ్లం సాల్వింగ్‌, అనాలసిస్‌, జడ్జిమెంట్‌, డెసిజన్‌ మేకింగ్‌, విజువల్‌ మెమురీ, రిలేషన్‌షిప్స్‌, ఫిగర్‌ క్లాసిఫికేషన్‌, అరిథమెటికల్‌ నంబర్‌ సిరీస్‌, నాన్‌ వెర్బల్‌ సిరీస్‌ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్‌ అవేర్‌నెస్‌ విభాగంలో.. పరిసరాలపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కరెంట్‌ అఫైర్స్‌, తాజా సంఘటనలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిణామాలు, ఇతర దేశాలతో భారత్‌ సంబంధాలతోపాటు చరిత్ర–సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, క్రీడలు, పరిశోధనలు వంటి వాటి నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- క్వాంటిటేటివ్‌ అప్టిట్యూడ్‌లో.. నంబర్‌ సిస్టమ్స్‌, హోల్‌ నెంబర్స్‌, డెసిమల్స్‌ –ఫ్రాక్షన్స్‌, ఆర్థిమెటికల్‌ ఆపరేషన్స్‌, పర్సంటేజెస్‌, రేషియోస్‌ అండ్‌ ప్రపోర్షన్స్‌, యావరేజెస్‌, ఇంటరెస్ట్‌, ప్రాఫిట్‌ అండ్‌ లాస్‌, మెన్సురేషన్‌, టైం అండ్‌ డిస్టెన్స్‌, టైమ్‌ అండ్‌ వర్క్‌ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ విభాగంలో.. అభ్యర్థికి ఇంగ్లిష్‌ భాషపై ఉన్న ప్రాథమిక అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో వొకాబ్యులరీ, గ్రామర్‌, సెంటెన్స్‌ స్ట్రక్చర్‌, సినానిమ్స్‌, యాంటానిమ్స్‌లపై ప్రశ్నలు అడుగుతారు.



హయ్యర్‌సెకండరీ (10+2) స్థాయి పరీక్ష

- హయ్యర్‌ సెకండరీ స్థాయి పరీక్షకు సంబంధించిన జనరల్‌ ఇంటలిజెన్స్‌ విభాగంలో.. నాన్‌ వెర్బల్‌, వెర్బల్‌ టైప్‌ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అనాలజీ, వెన్‌ డయాగ్రమ్స్‌, నంబర్‌ క్లాసిఫికేషన్స్‌, డ్రాయింగ్‌ ఇన్ఫరెన్సెస్‌, ఫిగరల్‌ క్లాసిఫికేషన్స్‌, సిమాంటిక్‌ సిరీస్‌, నంబర్‌ సిరీస్‌, ఫిగరల్‌ సిరీస్‌, ప్రాబ్లం సాల్వింగ్‌, కోడింగ్‌–డీకోడింగ్‌ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్‌ అవేర్‌నెస్‌ విభాగంలో.. అభ్యర్థికి పరిసరాలపై ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో కరెంట్‌ అఫైర్స్‌, తాజా సంఘటనలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిణామాలు, భారత్‌కు ఇతర దేశాలతో ఉన్న సంబంధాలతోపాటు చరిత్ర–సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, క్రీడలు, పరిశోధనలు తదితరాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- క్వాంటిటేటివ్‌ అప్టిట్యూడ్‌ విభాగంలో.. నంబర్‌ సిస్టమ్‌, అరిథమెటిక్‌ ఆపరేషన్స్‌లో పర్సంటేజెస్‌, రేషియో అండ్‌ ప్రపోర్షన్స్‌, స్క్వేర్‌రూట్స్‌, ప్రాఫిట్‌ అండ్‌ లాస్‌, ఇంటరెస్ట్‌(సింపుల్‌ అండ్‌ కాంపౌండ్‌), మిక్షర్స్‌ అండ్‌ అలిగేషన్స్‌, టైమ్‌ అండ్‌ వర్క్‌, టైమ్‌ అండ్‌ డిస్టెన్స్‌; అదేవిధంగా ఆల్జీబ్రా, జామెట్రీ, మెన్సురేషన్స్‌, ట్రిగనోమెట్రీ, స్టాటిస్టిక్స్‌ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ విభాగంలో.. స్పాటింగ్‌ ద ఎర్రర్స్‌, ఫిల్‌ ఇన్‌ ద బ్లాంక్స్‌, సినానిమ్స్‌/హోమోనిమ్స్‌, ఆంటోనిమ్స్‌, స్పెల్లింగ్స్‌, ఇడియమ్స్‌–ఫ్రేజెస్‌, వన్‌ వర్డ్‌ సబ్‌స్టిట్యూట్స్‌, యాక్టివ్‌/పాసివ్‌ వాయిస్‌, కాంప్రహెన్షన్‌ ప్యాసేజెస్‌ తదితరాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

గ్రాడ్యుయేషన్‌ స్థాయి పరీక్ష

- గ్రాడ్యుయేషన్‌, ఆపై స్థాయి పరీక్షకు సంబంధించిన జనరల్‌ ఇంటెలిజెన్స్‌ విభాగంలో.. వెర్బల్‌, నాన్‌ వెర్బల్‌ ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా అనాలజీస్‌, నంబర్‌ సిరీస్‌, కోడింగ్‌– డీకోడింగ్‌, స్టేట్‌మెంట్‌–కన్‌క్లూజన్‌, సిలోజిజమ్స్‌, వెన్‌ డయాగ్రమ్స్‌, ఇండెక్సింగ్‌, క్లాసిఫికేషన్స్‌ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ఎస్‌ఎస్‌సీ జాబ్స్‌

- జనరల్‌ అవేర్‌నెస్‌ విభాగంలో.. పరిసరాలపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో కరెంట్‌ అఫైర్స్‌, తాజా సంఘటనలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిణామాలు, ఇతర దేశాలతో భారత సంబంధాలతోపాటు చరిత్ర–సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, క్రీడలు, పరిశోధనలు వంటి వాటి నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- క్వాంటిటేటివ్‌ అప్టిట్యూడ్‌ విభాగంలో.. అభ్యర్థులకు సంఖ్యలపై ఉన్న అవగాహన, వాటిని ఉపయోగించే సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రేషియో ప్రపోర్షన్స్‌, స్క్వేర్‌ రూట్స్‌, యావరేజెస్‌, ఇంటరెస్ట్‌, ప్రాఫిట్‌ అండ్‌ లాస్‌, డిస్కౌంట్‌, అలిగేషన్స్‌ అండ్‌ మిక్సర్స్‌, టైమ్‌ అండ్‌ డిస్టెన్స్‌, టైమ్‌ అండ్‌ వర్క్‌, ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగనోమెట్రీ, స్టాటిస్టిక్స్‌పై ప్రశ్నలు ఉంటాయి.
- ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ విభాగంలో.. ఇంగ్లిష్‌పై అభ్యర్థికున్న పట్టు, ఇంగ్లిష్‌లో రాసే సామర్థ్యాన్ని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. బేసిక్‌ కాంప్రహెన్షన్‌పై ప్రశ్నలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేది:** 23.06.2025
- **దరఖాస్తుల సవరణ:** జూన్‌ 28, 29, 30 తేదీల్లో
- **కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్ష తేదీలు:** 24 జూలై నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు
- **వెబ్‌సైట్‌:** https://ssc.gov.in

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్‌, గ్రూప్స్‌ పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » టెట్‌/డీఎస్సీ ప్రత్యేకం– చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ పెడగాజి
» గ్రూప్స్‌, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్‌ స్టడీస్‌–ఫిజిక్స్‌ » బ్యాంక్‌ ఎగ్జామ్స్‌ ప్రత్యేకం–క్వాంటిటేటివ్‌ అప్టిట్యూడ్‌

ఇడ్లీలు, దోసెల వంటి అల్పాహారం కోసం కావాల్సిన పిండిని ఇంట్లోనే రుబ్బి తయారు చేసుకుంటాం. ఇప్పుడు అలా కాకుండా దుకాణం నుంచి కొని తెచ్చుకునేవారి సంఖ్య పెరిగింది. రెడీమేడ్ పిండి కొనుక్కోవడం ఎప్పటి నుంచో ఉంది. ఇదేం కొత్త విషయం కాదంటారా? నిజమే.. రుబ్బిన పిండి వంటి రెడీ టు కుక్ మిశ్రమాలను గడిచిన రెండేళ్లలో కొత్తగా 1.8 కోట్ల కుటుంబాలు కొనుగోలు చేయడమే ఇక్కడ సరికొత్త విషయం. అంతర్జాతీయ పరిశోధన సంస్థ కాంటార్ 'ఎఫ్ఎంసీజీ పల్స్' నివేదికలో ఇలాంటి అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఇడ్లీ పిండి కూడా షాపు నుంచే!



- మారుతున్న వినియోగదారుల ధోరణి
- రెడీ టు కుక్ కూరలవైపు మొగ్గు
- 56 గంటలకు ఒకసారి దుకాణానికి
- చిన్న ప్యాక్‌ల వైపు కస్టమర్ల ఆసక్తి
- పెరిగిన అన్‌బ్రాండెడ్ ఉత్పత్తుల సేల్స్
- 'కాంటార్ ఎఫ్ఎంసీజీ పల్స్' నివేదిక

ఇంటికి కావాల్సిన సరుకుల కోసం భారతీయులు ఒక ఏడాదిలో దుకాణాలకు 156 సార్లు వెళ్లారట. అంటే 56 గంటలకు ఒకసారి లేదా ప్రతి రెండు రోజులకోసారి సరుకులు కొనుగోలు చేశారని కాంటార్ తన 'ఎఫ్ఎంసీజీ పల్స్' నివేదికలో వెల్లడించింది. 2023-24లో సైతం భారతీయులు ఇదే స్థాయిలో షాపింగ్ చేశారని తెలిపింది. అంతేకాదు, వినియోగదారులు ఖర్చు చేసిన మొత్తం, కొనుగోలు చేసిన ఉత్పత్తుల సంఖ్య పెరిగిందని వివరించింది. 2025 జనవరి–మార్చి కాలంలో ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) అమ్మకాల్లో 3.5% వృద్ధి నమోదైంది.

అన్‌బ్రాండెడ్ హవా..

స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన 22 కంపెనీల పరిమాణ వృద్ధి రేటు కేవలం 3.6% మాత్రమే. కానీ, ప్రముఖ కంపెనీలవి కాని అన్‌బ్రాండెడ్ ఉత్పత్తులు ఏడాదిలో 6.1% వృద్ధి సాధించాయి. 2023-24తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుడు కొనుగోలు చేసిన సగటు ప్యాక్ పరిమాణం 16% పెరిగింది. అంటే పావుకిలో బదులు అరకిలో.. అరకిలో బదులు కిలో ఇంటికి తెచ్చుకున్నారన్న మాట. అలాగే ప్యాక్‌ల సంఖ్య 13% పెరిగింది. 2023-24లో వినియోగదార్లు సగటున 200 ప్యాక్‌లు కొనుగోలు చేస్తే.. 2024-25కు వచ్చే సరికి ఇది 226కి చేరింది.

వాషింగ్ లిక్విడ్స్..

దుస్తులు ఉతికేందుకు వాడే సబ్బుల అమ్మకాలు క్రమంగా తగ్గుతున్నాయి. సబ్బులకు బదులు కస్టమర్లు లిక్విడ్స్‌ను ఎంచుకుంటున్నారు. ఎఫ్ఎంసీజీ రంగంలో వాషింగ్ లిక్విడ్స్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగంగా అవతరించాయి. రెండు ఆర్థిక సంవత్సరాల్లో వీటి పరిమాణం 2.7 రెట్లు దూసుకెళ్లింది. వాషింగ్ లిక్విడ్స్ కొనుగోలు చేస్తున్న గృహాల సంఖ్య 2022-23 నుంచి కొత్తగా 2.4 కోట్లు పెరిగింది. 20 శాతం కుటుంబాలే దేశంలో వీటిని వినియోగిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. గత 5 ఏళ్లలో దేశంలో వాషింగ్ మెషీన్ల అమ్మకాలు పెరగడమే.

అంతా రెడీమేడ్..

రెడీ-టు-కుక్ మిశ్రమాల అమ్మకాలు రెండింతలై కొత్తగా 1.8 కోట్ల కుటుంబాలకు ఇవి చేరాయి. ప్రధానంగా దోసె, ఇడ్లీల తయారీకి వాడే రుబ్బిన పిండ్లు ఎక్కువగా కొంటున్నారు. రెడీ-టు-కుక్ కూరలను నూతనంగా 6 లక్షల గృహాలు ఆస్వాదించాయి. మ్యూస్లీ, పొరిజ్, ఓట్స్‌తో తయారైన అల్పాహార ఉత్పత్తులు రెండు సంవత్సరాలలో 1.5 రెట్లు వృద్ధి చెందాయి. కార్బొనేటెడ్ శీతల పానీయాలు, పండ్ల రసాలు, పాల ఆధారిత పానీయాలు, చాక్లెట్స్, బిస్కెట్స్, సాల్టీ స్నాక్స్, ఐస్ క్రీమ్స్ వంటి ఉత్పత్తుల విక్రయాలు 2.4% పెరిగాయి. బిస్కెట్స్ వినియోగం ఇంటి వెలుపల తగ్గితే, ఇళ్లలో పెరిగింది.

చిన్న ప్యాక్‌లవైపు..

దేశంలోని ఉత్తర, తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో 10-40 లక్షల మధ్య జనాభా ఉన్న మినీ మెట్రో పట్టణాల్లో.. వినియోగ వస్తువులు, ఇతర విభాగాల ధరల పెరుగుదల, వేతన వృద్ధి స్తబ్దుగా కొనసాగుతుండడం కొనుగోళ్లను తగ్గిస్తోంది. దుకాణాలకు వెళ్తున్న సంఖ్యలో మార్పు లేనప్పటికీ చిన్న, మరింత చవకైన ప్యాక్ పరిమాణాల వైపు కస్టమర్లు మళ్లుతున్నారు. అంటే ధరను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటున్నారన్నమాట. ఇక 2024-25లో సూపర్ మార్కెట్స్‌లో అమ్మకాల పరిమాణం 43% ఎగిసింది. కిరాణా దుకాణాల వ్యాపారం మాత్రం స్థిరంగా ఉంది.

పట్టణ మార్కెట్లు మెరుగ్గా..

పట్టణ మార్కెట్లు 2025 జనవరి–మార్చి త్రైమాసికంలో 4.4% వృద్ధిని సాధించగా, గ్రామీణ మార్కెట్లు 2.7% పెరిగాయి. పట్టణ మార్కెట్.. గ్రామీణ ప్రాంతాల కంటే వేగంగా వృద్ధి చెందడం ఇది వరుసగా మూడో త్రైమాసికం. చాలా లిస్టెడ్ కంపెనీల అమ్మకాల్లో పట్టణ మార్కెట్ల నుంచి 50-70% సమకూరుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, వేతనాల్లో పెరుగుదల తక్కువగా ఉండటం, ఇంటి అద్దెలు పెరగడం గత సంవత్సరంలో పట్టణాల్లో రోజువారీ కిరాణా, ప్రధాన వస్తువుల డిమాండ్‌పై ప్రభావం చూపాయి. హిందుస్తాన్ యూనిలీవర్, గోద్రెజ్ కంజ్యూమర్ ప్రొడక్స్, టాటా కంజ్యూమర్ ప్రొడక్స్, మారికో వంటి ఎఫ్ఎంసీజీ కంపెనీలు మిశ్రమ ఫలితాలను అందుకున్నాయి. వాటి అమ్మకాల్లో పెరుగుదల గరిష్ఠంగా 7 శాతాన్ని మించలేదు. ఖరీదైన వస్తువులు, పెద్ద ప్యాక్‌ల వైపు కస్టమర్లు ఆకర్షితులవుతున్నందున రాబోయే రోజుల్లో పట్టణ ఎఫ్ఎంసీజీ రంగంలో బలమైన వృద్ధి కనిపించే అవకాశం ఉందని కాంటార్ నివేదిక పేర్కొంది.

- నరుకుల కోసం ఒక ఏడాదిలో 156 సార్లు వెళ్లారు. అంటే 56 గంటలకోసారి అన్నమాట.
- ప్యాక్ సైజు 16 శాతం, ప్యాక్‌ల సంఖ్య 13 శాతం పెరిగింది.
- జాతీయ సగటుతో పోలిస్తే దక్షిణ ఢిల్లీ వాసుల ఎఫ్ఎంసీజీ వినియోగం రెండింతలు అధికం.
- పశ్చిమ ఢిల్లీవాసులు గరిష్టంగా ఏటా రూ.39,325 ఖర్చు చేశారు.
- వ్యయాల పరంగా నైరుతి బెంగళూరు ప్రీమియం ఎఫ్ఎంసీజీ మార్కెట్‌గా నిలిచింది.

క్లుప్తంగా...



అన్నం పెట్టమంటే కోడలు చెప్పుతో కొడుతోంది


ఆస్తులు తిరిగి ఇప్పించాలని వృద్ధ దంపతుల మొర

హనుమకొండ అర్బన్: 'కుమారుడితో సహజీవనం చేస్తున్న మహిళ మాకు అన్నం పెట్టమంటే చెప్పుతో కొడుతోంది' అని ఓ వృద్ధ దంపతులు సోమ వారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరి గిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు వారిని 'సాక్షి' పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. 'నా పేరు ఊడత కొమురమ్మ, భర్త పేరు సమ్మయ్య. మాది పరకాల మండలం సీతారాంపూర్ గ్రామం. మాకు ఇద్దరు కొడుకులు. వారసత్వంగా వచ్చిన భూమిని 1.30 ఎకరాల చొప్పున ఇద్దరికీ సమానంగా పంచాము. కుల పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నప్పుడు మమ్మల్ని జీవితాంతం సాదాలని చెప్పారు. కానీ, పిల్లలు ఆస్తి తీసుకున్నాక మా ఆలనాపాలనా చూడటం లేదు. ఒక కొడుకుకు ఇబ్బందుల కారణంగా మూడు పెళ్లిళ్లు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం మా కోడలు అన్నం పెట్టమంటే చెప్పుతో కొడుతోంది. మాకు తిండి పెట్టని కొడుకులకు మా ఆస్తి ఎందుకివ్వాలి. అందుకే అధికారులకు విన్నవిస్తున్నాం.. మా ఆస్తిని మా పేర్ల పైకి మార్చండి. మా ఆలనాపాలనా చూసుకున్న వారికి మా తదనంతరం ఆస్తి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

సీపీగెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ పాండురంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీగెట్)–2025 కన్వీనర్‌గా ప్రొఫెసర్ పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఇది వరకు ఆయనే కన్వీనర్‌గా వ్యవహరించగా, ఈసారి కూడా ఆయన్నే సీపీగెట్ కన్వీనర్‌గా నియమిస్తూ ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీపీగెట్‌ను ఈసారి కూడా ఉస్మానియా యూనివర్సిటీయే నిర్వహించనుంది. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఈ వారంలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

గెయిల్‌కు లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్



శంషాబాద్ (హైదరాబాద్): రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్యాసింజర్ టెర్మినల్ విస్తరణకు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (గెయిల్)కు.. ప్రతిష్టాత్మక లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్ దక్కింది. ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాలివి. పర్యావరణహిత చర్యలతో ప్రయాణికుల సౌలభ్యానికి అనుగుణంగా చేపట్టిన ఈ విస్తరణ పనులను.. అమెరికన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ గుర్తించి ఈ సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. విస్తరణ పనులకు లీడ్‌వీ4 బిల్డింగ్ డిజైన్ కన్‌స్ట్రక్షన్ ఫ్రేమ్‌వర్క్‌లో అత్యున్నత ప్రాజెక్టు రేటింగ్‌లో 84 పాయింట్లు లభించినట్లు తెలిపారు. పర్యావరణ హిత విస్తరణ పనులకు అమెరికన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ గుర్తింపు లభించడం.. గెయిల్ సంస్థ నిబద్ధతతో చేపట్టిన పనితీరుకు నిదర్శనమని జీఎంఆర్ గ్రూప్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఇందార ప్రభాకర్‌రావు అన్నారు.

ఎండకు 'కంది'పోదు!

- ప్రపంచంలోనే తొలిసారిగా గరిష్ట ఉష్ణోగ్రతను తట్టుకొనే కంది వంగడాన్ని అభివృద్ధి చేసిన ఇక్రిశాట్..
- 125 రోజుల్లో చేతికందే ఐసీపీవీ 25444 రకం కంది పంట.. హెక్టార్‌కు 2 టన్నుల దిగుబడి



కంది పంటను పరిశీలిస్తున్న ఇక్రిశాట్ డీజీ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డీజీ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, శాస్త్రవేత్తలు

సాక్షి, హైదరాబాద్: గరిష్ట ఉష్ణోగ్రతలను తట్టుకొని.. హెక్టార్‌కు 2 టన్నుల దిగుబడిని ఇచ్చే కంది వంగడాన్ని ఐసీపీవీ 25444 పేరుతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలను కూడా తట్టుకుంటుంది. కేవలం 125 రోజుల్లో పంట చేతికి వచ్చే ఈ వంగడాన్ని ఖరీఫ్, రబీలో ఎప్పుడైనా సాగు చేయొచ్చు. కేవలం రెండున్నర అడుగులు మాత్రమే పెరిగే ఈ కందిని మిషన్ ద్వారా కోయొచ్చు. కూలీల సమస్య, ఎరువుల అవసరం తగ్గుతుంది. ఈ మేరకు ఇక్రిశాట్ అధికారులు సోమవారం హైదరాబాద్ నుంచి మీడియాను పటాన్‌చెరులో సంస్థ అభివృద్ధి చేసిన ఐసీపీవీ 25444 రకం కంది చేల దగ్గరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, ప్రోగ్రాం డైరెక్టర్ షాన్ మైట్స్, లీడ్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకాష్ గంగశెట్టి, అసోసియేట్ సైంటిస్ట్ డాక్టర్ శ్రుతి బెలియప్ప తదితరులు ఐసీపీవీ 25444 కంది వంగడం గురించి వివరించారు.

అత్యధిక వేడిని తట్టుకునే పంట

కర్ణాటక, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ఐసీపీవీ 25444 వంగడాన్ని విజయవంతంగా పరీక్షించామన్నారు. 2021లో దీనికోసం ప్రయత్నాలు ప్రారంభించి, 2024 నాటికి స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిలో పూర్తి చేశామని తెలిపారు. కొత్త రకాన్ని అభివృద్ధి చేయడానికి అయ్యే 15 సంవత్సరాల పనిని కేవలం ఐదేళ్లలో పూర్తి చేసినట్టు వివరించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో కందిపప్పుకు ఒక కొత్త దశను తీసుకొచ్చే అద్భుత ఆవిష్కరణగా వారు పేర్కొన్నారు.

దేశీయ పప్పుదినుసుల లోటును తీర్చే శుభవార్త

భారత్‌లో కందిపప్పు వినియోగం 5 మిలియన్ టన్నులుగా ఉండగా, దేశీయంగా 3.5 మిలియన్ టన్నుల కందిపప్పు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందని లీడ్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకాశ్ గంగశెట్టి తెలిపారు. దేశ అవసరాలకు మరో 1.5 మిలియన్ టన్నులు అవసరం కాగా, ఇందుకోసం సంవత్సరానికి రూ. 6,700 కోట్ల దిగుమతుల భారం పడుతోందని తెలిపారు. ఇక్రిశాట్ ద్వారా అభివృద్ధి చేసిన ఐసీపీవీ 25444 వంగడంతో ఈ లోటు తీరే అవకాశముందన్నారు. తాండూరు, వికారాబాద్, వరంగల్, నల్లగొండ, మెదక్, సంగారెడ్డి ప్రాంతాలు ఈ పంటకు అనుకూలమని చెప్పారు.

భారత్‌తో పాటు ఇతర దేశాల్లో కూడా...

భారత్‌తోపాటు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఈక్వడార్ దేశాల్లోనూ ఈ కందిని ఉత్పత్తికి వినియోగించేందుకు అవకాశముందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు తెలిపారు. వాతావరణ స్థిరత్వ పంటగా ఐసీపీవి 25444కి మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే శక్తి ఉందన్నారు.

ప్రజల ఆలోచనలు మార్చండి

- సమాజాన్ని తట్టిలేపే శక్తి కవులు, కళాకారులకే ఉంది
- 'ప్రభుత్వ పథకాలు – సమాజాభివృద్ధి – సాంస్కృతి'సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు



సదస్సులో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్సీ కోదండరాం, అలేఖ్య, వెన్నెల, జయేశ్‌రంజన్ తదితరులు..

సనత్‌నగర్: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర చడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాత్రమే సరిపోవని, సామాజిక రుగ్మతలను రూపుమాపి నప్పుడే నవ సమాజం నిర్మితమవుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బేగంపేట టూరిజం ప్లాజాలో 'ప్రభుత్వ పథకాలు–సమాజాభివృద్ధి–సాంస్కృతి'అంశాలపై తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేడు ప్రజల జీవన విధానం గతితప్పడం వల్లే సమాజంలో అనేక పెడ ధోరణులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూ లాలను అన్వేషిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సమాజాన్ని తట్టిలేపే శక్తి కవులు, కళాకారులు, సాహితీవేత్తలకే ఉందని చెప్పారు. కలాలకు పదునుపెట్టి రచనలు, ఆటపాటలు, ప్రదర్శనలతో సమాజాన్ని మేల్కొ ల్పాలని సూచించారు. కవులు, కళాకారులు ప్రజల్లో చైత న్యం తెచ్చే కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైతే రూ.10 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించటం, ప్రస్తుతం అందులో పనిచేస్తున్న కళాకారుల పారితోషికం పెంపు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజల, పర్యాటక, సాంస్కృతిక స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి, విద్యా శాఖ కమిషనర్ దేవసేన, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కవులు అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, ఉస్తాద్ చౌదరపల్లి రవికుమార్, ఆకుల సందానం, వంగ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్, దరువు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోనే టెన్త్ పరీక్షలు

విద్యా కేలండర్ విడుదల చేసిన విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: ఈ విద్యా సంవత్సరం (2025-26) టెన్త్ పరీక్షలను 2026 మార్చిలో నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని జనవరి 10 నాటికి మొత్తం సిలబస్ బోధన పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. విద్యాశాఖ 2025-26 విద్యా సంవత్సరం కేలండర్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ నెల 12వ తేదీన మొదలయ్యే పాఠశాలలు 2026 ఏప్రిల్ 23వరకు నడుస్తాయని, మొత్తం 230 పనిదినాలు ఉంటాయని వెల్లడించింది. స్కూళ్లలో ప్రతిరోజూ 5 నిమిషాలపాటు విద్యార్థులకు మెడిటేషన్ చేయించాలని సూచించింది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 10 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు ఉంటాయి. 2026 జనవరి 11 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు.

డీఎస్సీ టీచర్ల వేతన బడ్జెట్ విడుదల

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించేందుకు విద్యాశాఖ సోమవారం రూ.51.19 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. 2008 డీఎస్సీ బాధిత ఉపాధ్యాయుల్లో 1,225 మందిని ఎస్జీటీలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించారు. వీరికి నెలకు రూ.31,040 వేతనం ఖరారు చేశారు. ఫిబ్రవరిలో వీరికి బడుల్లో నియామకాలు కూడా ఇచ్చారు. మార్చి 1న వేతనం అందాల్సి ఉండగా.. ఇవ్వలేదు. మార్చి వేతనం.. ఏప్రిల్ 1న అందాల్సి ఉండగా పెండింగ్‌లో పెట్టారు. ఏప్రిల్ వేతనాన్ని మే1న కూడా ఇవ్వలేదు. ఏప్రిల్ 24తో బడులు మూతపడగా.. వీరిని ఉద్యోగాల నుంచి తొలగించారు. తాజాగా జూన్ 12 నుంచి వీరిని విధుల్లోకి తీసుకోవలసి ఉంది. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ తాజాగా బడ్జెట్‌ను విడుదల చేసింది.

తనిఖీలపై లీక్.. తర్వాతే విజి'లెన్స్'!

- ఇసుక తోడేళ్లకు పలువురు ఇంటి దొంగల సహకారం
- తనిఖీలపై ముందస్తు సమాచారం.. అప్రమత్తమైన ఇసుక మాఫియా
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కొత్తపల్లి, రాజోళిలో తనిఖీల రోజు క్వారీల బంద్
- వారు వెళ్లగానే యథేచ్ఛగా కొనసాగుతున్న తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అనుమతుల మాటున సర్కారు ఆదాయానికి గండికొడుతున్న ఇసుక మాఫియాకు చెందిన క్వారీల్లో ఈ నెల 6న జరిగిన రాష్ట్రస్థాయి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల సమాచారం ముందే లీకైనట్లు తెలుస్తోంది. దీనివెనక ఇంటిదొంగల ప్రమేయం ఉందన్న చర్చ నడుస్తోంది. అందుకే మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళిలో ఇసుక తోడేళ్లు అప్రమత్తమై ఆ రోజు తవ్వకాలు నిలిపివేయడంతోపాటు క్వారీల్లో ఎలాంటి అనుమానాలు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారని తెలియవచ్చింది. క్వారీల్లో తనిఖీలకు అధికారులు వచ్చేలోపే ఇసుక వ్యాపారులు అప్పటికప్పుడే భారీ గుంతలను పక్కనున్న మట్టి, ఇసుకతో నింపారని సమాచారం. కొత్తపల్లి క్వారీలో తనిఖీలకు వచ్చిన క్రమంలో క్షేత్రస్థాయి పరిస్థితి భిన్నంగా ఉండటం చూసి నివ్వెరపోయినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ రీచ్‌లో అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని.. కానీ క్వారీలో ఎవరూ లేరని అధికారులు అనుకున్నట్లు సమాచారం. అయితే అధికారులు తిరిగి వెళ్లగానే ఈ రెండు చోట్లా యథేచ్ఛగా ఇసుక దందా కొనసాగుతోంది. క్వారీల్లో అనుమతులకు మించి తవ్వకాలతోపాటు ఒక్కో వాహనంలో పరిమితికి మించి 5-7 టన్నుల చొప్పున నింపి పంపుతున్నారు. ఉమ్మడి జిల్లాకు అనుమతులు తీసుకున్న వారు రోజూ వందలాది వాహనాల్లో హైదరాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాలకూ తరలిస్తున్నారు.

గ్రామస్తుల వద్ద ఆరా..

కొత్తపల్లి క్వారీలో జరుగుతున్న ఇసుక దందాపై విజిలెన్స్ అధికారులు గ్రామస్తుల వద్ద ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇసుక వ్యాపారుల వెనుక కీలక రాజకీయ నేతలు ఉన్నారని.. జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలకు వాటాలతోపాటు కొందరికి రోజువారీగా ముడుపులు అందుతున్నాయనే విషయాన్ని వారు గ్రహించినట్లు సమాచారం. దీంతోపాటు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోనే లీకువీరులు ఉన్నట్లు గ్రహించిన ఉన్నతాధికారులు.. ఇంటి దొంగలు ఎవరో తేల్చడంపై దృష్టిపెట్టారు. దీంతోపాటు ఆయా ఇసుక క్వారీల్లో అక్రమాలపై ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిక అందజేయనున్నట్లు సమాచారం.

వాహనాలు అప్పగించి.. తిరిగి వెళ్లి

తనిఖీల అనంతరం అధికారులు ఎన్‌హెచ్-44పై ఇసుకతో వెళ్తున్న రెండు లారీలను జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు. అందులో ఒక వాహనంలో పరిమితికి మించి ఇసుకను తీసుకెళ్తున్నట్లు గుర్తించిన అధికారులు జరిమానా విధించారు. రాజోళికి సంబంధించి 7 టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఒక వాహనానికే జరిమానా వేయడం అలంపూర్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అధికార పక్షానికి చెందిన వాహనాలను విడిచిపెట్టి.. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒకరి వాహనానికే జరిమానా విధించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



మిర్యాలగూడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

భూభారతి మాకు ఎన్నికల రెఫరెండమే!

- ఈ చట్టం దేశానికే రోల్ మోడల్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం: ఉత్తమ్

మిర్యాలగూడ: భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్ అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో భూభారతి చట్టం కాంగ్రెస్ పార్టీకి రెఫరెండం లాంటిదని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 22 మండలాల్లో 22 రెవెన్యూ గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని భూ సమస్యలు పరిష్కరించామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరిస్తున్న దరఖాస్తులను ఆగస్టు 15 లోపు పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ధరణి ద్వారా వచ్చిన 9.26 లక్షల దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. 6 వేల మంది సర్వేయర్లను, 10,956 మంది వీఆర్వో, వీఆర్ఏలను త్వరలోనే నియమిస్తామని వెల్లడించారు.

వేగంగా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తకుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, లిఫ్టులను పూర్తిచేసి తీరుతామని చెప్పారు. సాగర్ ఎడమకాల్వ మరమ్మతులకు రూ.67 కోట్లతో ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు డబ్బు రూ.15,181 కోట్లను 12 లక్షల మంది రైతులకు చెల్లించినట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రోడ్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారు వద్దకే జడ్జి

- అనారోగ్యంతో కోర్టు హాల్‌లోకి రాలేక బాధితురాలి అవస్థ..
- బయటికొచ్చిన జడ్జి.. ఫిర్యాదీ వివరాల నమోదు
- రాజీ కుదరడంతో కేసు కొట్టివేత

కోరుట్ల/ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో కోర్టు హాల్‌లోకి రాలేని ఫిర్యాదీ దగ్గరకు.. స్వయంగా జడ్జి వచ్చారు. బాధితురాలి కేసుకు పరిష్కారం చూపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి కోర్టులో జరిగిన ఈ సంఘటన వివరాలివి. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌కు చెందిన చల్ల రమక్క.. అదే గ్రామానికి చెందిన చల్ల మల్లేశ్, చల్ల శంకర్‌లపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో 2024 సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. రమక్క ఫిర్యాదు మేరకు 174/2024 క్రైం నంబరు కింద సెక్షన్ 329(4), 292, 118(1) ప్రకారం చల్ల మల్లేశ్, చల్ల శంకర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మెట్‌పల్లి కోర్టుకు చార్జిషీట్ పంపించారు. ఆ కేసుకు కోర్టులో కేలండర్ కేసు నంబర్ 549/2024 కేటాయించి నిందితుల హాజరుకు నోటీసులు పంపించారు. నిందితులు, ఫిర్యాదీ కలిసి రాజీ చేసుకుని సోమవారం కోర్టుకు వచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న ఫిర్యాదీ చల్ల రమక్క.. కోర్టు హాల్‌లోకి జడ్జి అరుణ్‌కుమార్ ముందుకు రాలేక ఆటోలోనే ఉండిపోయారు. పరిస్థితిని తెలుసుకున్న జడ్జి అరుణ్‌కుమార్ కోర్టు హాల్ బయటకు వచ్చి.. ఆటోలో ఉన్న ఫిర్యాదీ చల్ల రమక్క నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇరు పక్షాలకు రాజీ కుదిరిన క్రమంలో.. చల్ల మల్లేశ్, చల్ల శంకర్‌లపై ఉన్న కేసు కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం



హార్వెస్టర్ ద్వారా వరి కోతలు (ఫైల్)

ఎద్దులు వద్దు.. యంత్రాలు ముద్దు

ట్రాక్టర్లు, యంత్రాలతోనే పంటల సాగు

పని త్వరగా ముగుస్తుండడంతో రైతుల మొగ్గు

వాహనాలకు డిమాండ్‌తో పాటే పెరుగుతున్న అద్దె

పాల్వంచ రూరల్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): వ్యవసాయంలో ఒకప్పుడు కూలీలు, పశువులు, ఎడ్లబండ్లు, నాగళ్ల వినియోగమే అధికంగా ఉండేది. కానీ కూలీల కొరత, పశు పోషణ కష్టంగా మారడం.. యాంత్రీకరణ అందుబాటులోకి రావడంతో రైతుల పని సులభమైంది. దీంతో పల్లె, పట్నం తేడా లేకుండా.. రైతులు యంత్రాలను వినియోగిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఫలితంగా కూలీల కొరత తీరడమే కాక సమయం తగ్గిందని రైతులు చెబుతున్నారు. ఇలా రకరకాల కారణాలతో రైతులు ఎద్దు లేని వ్యవసాయం చేస్తున్నారు.

తగ్గిన సమయం

గతంలో రైతులు ఎద్దులు, నాగళ్లతో నాలుగైదు రోజులు దుక్కి దున్ని విత్తనాలు నాటేవారు. ప్రస్తుతం నాగళ్లు, ఎద్దులు కనుమరుగవడంతో యంత్రాలు, ట్రాక్టర్లతో పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఈ విధానంలో సమయం తగ్గి పని త్వరగా ముగుస్తున్నా రైతులపై భారం మాత్రం పెరిగిందని తెలుస్తోంది.

ట్రాక్టర్లకు పెరిగిన డిమాండ్

వ్యవసాయ పనులకు పశువులు, కూలీలపై ఆధారపడకుండా రైతులు ట్రాక్టర్లు ఉపయోగిస్తుండడంతో డిమాండ్ పెరిగింది. వానాకాలం ప్రారంభం కావడంతో ఎక్కడ చూసినా.. రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నించి విత్తనాలు నాటుతున్నారు. సాగు చేస్తున్నారు. పత్తి విత్తనాలు నాటేందుకు ఎకరం భూమిలో దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు రూ.4 వేల కిరాయి చెల్లించాలి. ఎకరం పొలంలో వరి నాట్లు వేయడానికి ట్రాక్టర్‌తో నాలుగుసార్లు దున్నించాల్సి ఉంటుంది. సాలు దున్నడానికి రూ.1,500, దమ్ము చేయడానికి రూ.2,500, గొర్రు తోలడానికి మరో రూ.1,500 చొప్పున ప్రాంతాల వారీగా రూ.5 వేల నుంచి రూ.7 వేలు ఖర్చవుతుంది. అయితే, అందరూ ఒకేసారి వ్యవసాయ పనులు మొదలుపెట్టడంతో.. ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగి అద్దె భారంగా మారుతోంది.

కానరాని పశువులు

కొన్నేళ్ల క్రితం వరకు వ్యవసాయ పనులు పశువులు లేకుండా జరిగేవి కావు. ఏ గ్రామంలో చూసినా ఇళ్లలో పశువులు, వ్యవసాయ పరికరాలు ఉండేవి. పశు పోషణ భారంగా మారడంతో.. వ్యవసాయ పనుల్లో రైతులు పశువుల వినియోగం తగ్గించారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలపైనే మక్కువ చూపుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

వానాకాలం ప్రారంభం కావడంతో ఎక్కడ చూసినా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా రైతులు గతేడాది వేసిన పత్తి కర్రలు తొలగిస్తున్నారు. దుక్కులు దున్నించి పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఇలా ఏ పొలంలో చూసినా ట్రాక్టర్లతో దుక్కి దున్నుతున్నారు. రైతులంతా ఒకేసారి పనులు ప్రారంభించడంతో.. స్థానికంగా ట్రాక్టర్ల లభ్యత లేక.. పొరుగు గ్రామాల నుంచి అద్దెకు తెప్పించాల్సి వస్తోంది. ఒకప్పుడు నాగళ్లతో ఎకరంలో విత్తనాలు నాటాలంటే.. రైతులకు నాలుగైదు రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ట్రాక్టర్లతో దుక్కి దున్నించి విత్తనాలు నాటడం ఒకే రోజులో పూర్తవుతోంది.



మినీ హార్వెస్టర్‌తో వరి కోస్తున్న బన్సీలాల్ (ఫైల్)



ఖర్చు పెరిగింది

గతంలో పశువులతో దుక్కి దున్నించేది. ఇప్పుడు కాడెడ్లు లేక.. ఉన్న నాలుగెకరాల భూమిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నించా. ట్రాక్టర్ల వినియోగంతో సమయం తక్కువగా పడుతున్నా.. ఖర్చు మాత్రం పెరుగుతోంది. ఇదే సమయాన వరికోతలు హార్వెస్టర్‌తో చేయిస్తే.. కూలీలకు ఇచ్చే కూలీ రేట్ల కన్నా ఖర్చు తక్కువే వస్తోంది.

– బానోతు బన్సీలాల్,
రైతు, జగన్నాథపురం



ట్రాక్టర్లపైనే ఆధారం..

సాగు పనుల్లో పశువుల వినియోగం తగ్గగా, రైతులు ట్రాక్టర్ల పైనే ఆధారపడుతుండడంతో డిమాండ్ పెరిగింది. సీజన్‌లో ధర పెరిగినా.. ట్రాక్టర్ ఖర్చులు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఎకరం పొలం దున్నడానికి 20 లీటర్ల డీజిల్ ఖర్చవుతుండగా డ్రైవర్‌కు రూ.700 – రూ.1,000 చెల్లించాలి. కల్టివేటర్లు పాడైతే అదనపు ఖర్చే.

– కల్లెం వెంకటరెడ్డి,
రైతు, ట్రాక్టర్ యజమాని, రెడ్డిగూడెం



ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

దళితులకు స్ఫూర్తిదాయక గౌరవం

మంత్రివర్గ విస్తరణపై నాగరిగారి ప్రీతం



సాక్షి, హైదరాబాద్: మంత్రివర్గ విస్తరణలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్‌లకు అవకాశం కల్పించడం ద్వారా స్వరాష్ట్ర సాధనలో దళితుల పోరాటానికి స్ఫూర్తిదాయక గౌరవం ఇచ్చినట్టయిందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవెల్లి వెంకటస్వామి తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ ఏర్పాటుతో దళిత, గిరిజన వర్గాలకు స్వేచ్ఛగా గాలి పీల్చుకునే అవకాశం లభించిందని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆధునిక అంబేడ్కర్‌లా దళితుల పక్షాన నిలిచి సాధారణ కార్యకర్తలకు కూడా తగిన గౌరవం ఇచ్చారని చెప్పారు. సీఎంకు కృతజ్ఞతగా త్వరలోనే దళిత విభాగం పక్షాన రాష్ట్ర వ్యాప్త పర్యటన చేపట్టనున్నట్టు ప్రీతం వెల్లడించారు.



రెండో రోజు ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఐసెట్ చైర్మన్ అల్తాఫ్ హుస్సేన్

ప్రశాంతంగా ముగిసిన ఐసెట్

నల్లగొండ టూటౌన్: నల్లగొండ ఎంజీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత ఐసెట్–2025 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రశ్నపత్రాల సెట్‌ను ఐసెట్ చైర్మన్, ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ అల్వాల రవి విడుదల చేశారు. సాంకేతికతను జోడించి పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు సిబ్బంది చేసిన కృషిని ఐసెట్ చైర్మన్ అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు.. 64,938 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఓఎంసీ కేసులో అప్పీళ్లపై విచారణకు అనుమతి

- గాలి జనార్దన్‌రెడ్డి బెయిల్ దరఖాస్తుపై తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసు (ఓఎంసీ)లో దోషులు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ చేపట్టేందుకు హైకోర్టు అనుమతిచ్చింది. శిక్ష నిలిపివేత కోరుతూ గాలి జనార్దన్‌రెడ్డి, ఓఎంసీ కంపెనీ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)లలో విచారణను నేటికి వాయిదా వేసింది. అలాగే బెయిల్ కోరుతూ దాఖలు చేసిన ఐఏలపై తీర్పు రిజర్వు చేసింది. ఓఎంసీ కేసులో దోషులుగా తేలడంతో గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లకు సీబీఐ కోర్టు మే 6న ఏడేళ్ల జైలు విధించడం తెలిసిందే. అనంతరం వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఓఎంసీ కంపెనీతోపాటు గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులు హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, నళిన్‌కుమార్, నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. ఇప్పటికే పిటిషనర్లు మూడున్నరేళ్లకు పైగా జైల్లో ఉన్నారని.. ట్రయల్ కోర్టు విధించిన శిక్షలో సగానికిపైగా అనుభవిస్తే బెయిల్ మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం కింద పిటిషనర్లపై నమోదు చేసిన అభియోగాలు రుజువు కాలేదని.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే ట్రయల్ కోర్టు శిక్ష విధించిందని వాదించారు. ఆయన జైల్లో ఉంటే కంపెనీని కొనసాగించడం సాధ్యంకాదన్నారు. ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ ప్రజల తరఫున వాదనలు వినిపించే హక్కు గాలికి ఉందన్నారు. సీబీఐ తరఫున శ్రీనివాస్ కపాడియా వాదనలు వినిపిస్తూ బెయిల్ అప్లికేషన్లపై నిర్ణయం తీసుకొనే విచక్షణను కోర్టుకే వదిలేస్తున్నామన్నారు. వాదనలు విన్న న్యాయమూ ర్తి.. సీబీఐ కోర్టు నుంచి రికార్డులు తెప్పించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ప్రధాన పిటిషన్ (శిక్షను రద్దు చేయడం)పై విచారణను ఆగస్టు 11కు.. శిక్ష నిలిపివేత కోరుతూ వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌ల పిటిషన్లపై ఈ నెల 17కు వాయిదా వేశారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి పిటిషన్‌ను కూడా తమ ముందు ఉంచితే విచారణ చేపడతామని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.



సింగరేణి కార్పొరేట్ కార్యాలయం



గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా కార్యాలయం ఎదుట నిరసన

ఈ మందులు ఏ'మాత్ర'ం!

సింగరేణిలో తీవ్రమైన మందుల కొరత

- నెల రోజులుగా కార్మికుల అవస్థలు
- నిరాశగా వెనుతిరుగుతున్న రిటైర్డ్ కార్మికులు
- కొనుగోలులో జాప్యం వల్లే ఈ సమస్య
- స్థానికంగా కొంటున్నా సరిపోని మందులు

సింగరేణి సమాచారం		
మెయిన్ ఆస్పత్రి, కొత్తగూడెం	:	1
ఏరియా ఆస్పత్రులు	:	6
డిస్పెన్సరీలు	:	21
వైద్యసేవలు పొందేవారు		
శాశ్వత ఉద్యోగులు	:	41,000
కాంట్రాక్టు కార్మికులు	:	25,000
రిటైర్డ్ ఉద్యోగులు	:	1,60,000

గోదావరిఖని: సింగరేణి ఆస్పత్రుల్లో తీవ్ర మందుల కొరత ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత హైదరాబాద్, వరంగల్ లాంటి దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు నరకయాతన పడుతున్నారు. సంస్థలో సుమారు 41 వేల మంది శాశ్వత, దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. సుమారు 1.60 లక్షల మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులకు యాజమాన్యం వైద్యసేవలు అందిస్తోంది. వీరికోసం ఏటా రూ.35 కోట్ల విలువైన మందులను కొనుగోలు చేస్తోంది.

టెండర్లలో జాప్యం..

సంస్థ ఉద్యోగులకు అవసరమైన మందుల కొనుగోళ్లకు చేపట్టే టెండర్ ప్రక్రియలో జాప్యం జరిగింది. గతంలో కొందరు డైరెక్టర్లను పక్కకు పెట్టడం, కొత్తవారి నియామకం ఆలస్యం కావడంతో ఫైళ్లు క్లియర్ కాలేదు. దీంతో మందులు సకాలంలో అందడం లేదని అధికారులు చెబుతున్నారు. మే 15న టెండర్ ప్రక్రియ ఖాయం కాగా, కాంట్రాక్టు సంస్థలు జూన్ 9లోగా ఆస్పత్రులకు మందులు పంపిణీ చేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు.

స్థానికంగా కొనుగోళ్లు

ఏరియా స్థాయిలో జీఎంల నోట్ ద్వారా ఔషధాలు కొనుగోలు చేసి రోగులకు అందజేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. అవసరాలకు అనుగుణంగా నిధులు విడుదల చేసే అధికారం జీఎంలకు లేకపోవడంతో.. తక్కువ మొత్తంలో వెచ్చించి మందులు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మందుల కొరత తలెత్తుతోంది. బీపీ, అల్సర్ సంబంధిత మందులు సకాలంలో అందడం లేదని రోగులు వాపోతున్నారు. నెలలో 10 రోజులకు సరిపడా మందులే ఇస్తున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు అధిక వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

పదిరోజులకు మాత్రమే ఇస్తున్నారు



ప్రకృతికి విరుద్ధంగా బొగ్గు గనుల్లో పనిచేశా. అనేక జబ్బుల బారినపడ్డా. రిటైరయ్యాక కూడా బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పుల మందులు ప్రతీనెల వాడాలి. హైదరాబాద్ నుంచి సుమారు 250 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి వస్తే.. పదిరోజులకు సరిపడా మందులే ఇచ్చి మళ్లీ రమ్మంటున్నారు.

– డి.సాంబశివరావు,
రిటైర్డ్ ఉద్యోగి, అల్వాల్, హైదరాబాద్

కార్పొరేట్‌ను ముట్టడిస్తాం



మందుల కొరతతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారి సంక్షేమం కోసం ఏటా రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని సింగరేణి చెబుతున్నా.. ఆచరణలో విఫలమవుతోంది. రెండు నెలలుగా మందుల కొరత వేధిస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే కార్పొరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– మద్దె ఎల్లయ్యగౌడ్,
డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఏఐటీయూసీ

ఆర్డర్లు జారీ చేశాం



మందులు సరఫరా చేసే సంస్థలకు ఇప్పటికే ఆర్డర్లు జారీ చేశాం. సుమారు 80 శాతం వరకు కొరత తీరింది. మరో 15 రోజుల్లో పూర్తిస్థాయి మందులు అందుబాటులోకి వస్తాయి. దూర ప్రాంత రోగుల ఇబ్బందులు తొలగించేందుకు స్థానికంగా మందులు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చాం.

– కిరణ్‌రాజ్‌కుమార్,
చీఫ్ మెడికల్ ఆఫీసర్, సింగరేణి

విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్ విక్రయాలు



మెడికల్ స్టోర్స్‌పై కొరవడిన పర్యవేక్షణ వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే అమ్మకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మెడికల్ స్టోర్స్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లాభాపేక్షతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్ విక్రయాలు చేపడుతున్నారు. అవగాహన లేమితో దగ్గు, జలుబు, జ్వరం, నొప్పుల వంటి చిన్న అనారోగ్య సమస్యలతో మెడికల్ స్టోర్స్‌ను సంప్రదిస్తున్న వారికి అవసరం లేకున్నా యాంటిబయోటిక్స్‌ని కట్టబెడుతున్నారు. వీటి అతి వినియోగం ప్రజారోగ్యానికి పెను విపత్తుగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. వీటిని అతిగా వినియోగించడంతో యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సంభవించి, ప్రాణాంతక వ్యాధుల బారినపడిన సమయంలో మందులు పనిచేయని దుస్థితి నెలకొంటోంది.

నిబంధనలు బేఖాతర్

రాష్ట్రంలో 42 వేల హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాలు ఉన్నాయి. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం 1945లోని షెడ్యూల్ హెచ్, హెచ్ 1లో ఉండే మందులను మెడికల్ స్టోర్స్‌లో వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించకూడదు. ఈ మందుల్లో యాంటిబయోటిక్ మందులు కూడా ఉంటాయి. అయితే నిబంధనలను చాలా వరకూ స్టోర్స్ యజమానులు బేఖాతరు చేస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

అవగాహనా కార్యక్రమాలేవి?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి విపత్తుగా మారిన ఏఎంఆర్ నియంత్రణ దిశగా అడుగులు వేశారు. ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. వైద్య, పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, ఇతర శాఖలను సమన్వయ పరుచుకుంటూ ఏఎంఆర్ నియంత్రణకు ప్రణాళిక రచించారు. పలు సంస్థలతో వైద్య శాఖ ఎంవోయూలు చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా చర్యలు నీరుగారిపోయాయి. ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఏఎంఆర్ కారణంగా దాదాపు యాభై లక్షల మంది మరణిస్తున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. 2050 నాటికి ఏఎంఆర్ కారణంగా మృత్యువాత పడేవారి సంఖ్య కోటికి చేరే అవకాశం ఉందని అంచనా. ప్రపంచం ఎదుర్కొంటున్న తొలి పది ఆరోగ్య సంక్షోభాల్లో ఏఎంఆర్ ఒకటని డబ్ల్యూహెచ్‌వో సైతం స్పష్టం చేస్తోంది.

క్లుప్తంగా...

కొమ్మినేని అరెస్టును ఖండిస్తున్నాం



లబ్బీపేట (విజయవాడ తూర్పు): సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో సాక్షి పేపర్, టీవీ లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. జర్నలిస్టు కృష్ణంరాజు మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. కానీ దీనిని టీడీపీ సోషల్ మీడియా ట్రోల్ చేసి వైఎస్ జగన్ కుటుంబ సభ్యులకు ఆపాదించడం దారుణం.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్, విజయవాడ నగర పాలక సంస్థ

ఏడాది పాలన పూర్తి సందర్భంగా 12న రాష్ట్ర ఉత్సవం

ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుపరిపాలన – స్వర్ణ ఆంధ్రప్రదేశ్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వ వన వృద్ధి సలహాదారుగా అంకారావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వనాల వృద్ధికి సంబంధించిన ప్రభుత్వ సలహాదారుగా కే అంకారావు నియమితులయ్యారు. అంకారావు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారని ఈ మేరకు వెలువడిన ఉత్తర్వులు తెలిపాయి. పల్నాడు జిల్లాకు చెందిన అంకారావు పలు సంవత్సరాలుగా నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్, చెత్తను ఏరి అక్కడి వృక్షాలు, వన్య ప్రాణులకు మేలు చేస్తున్నారు.

యోగా దినోత్సవ సమన్వయం కోసం అధికారుల నియామకం

సాక్షి, అమరావతి: ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్న నేపథ్యంలో ఏర్పాట్లు, సమన్వయం కోసం పలువురు అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్.కె.బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు యోగా నిర్వహించే ప్రదేశాల్లో ఈనెల 15 నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు సేవలందించేందుకు పలువురు జాయింట్ కలెక్టర్లను, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, తహసీల్దార్లను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.1,000 కోట్లు దాటిన పెట్టుబడులకు ప్రత్యేక నోడల్ ఆఫీసర్

సాక్షి, అమరావతి: రూ.1,000 కోట్లు దాటిన ప్రతీ ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెగా ప్రాజెక్టులకు జిల్లాస్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించాలని, ఈ అధికారి వివిధ డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకుంటూ సింగిల్ పాయింట్ ఫెసిలిటేషన్ ఇవ్వాలని సూచించింది. దీంతోపాటు ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారం, నెలావారీ నివేదికలు, అనుబంధ సంస్థల మౌలిక వసతుల కల్పన వంటి విధులను నిర్వహించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మత్స్యశాఖ అదనపు డైరెక్టర్‌గా చంద్రశేఖర్ రెడ్డి

సాక్షి, అమరావతి: మత్స్యశాఖ అదనపు డైరెక్టర్‌గా స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ట్రెనింగ్ (ఎస్‌ఐఎఫ్‌టీ–కాకినాడ) ప్రిన్సిపాల్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. కమిషనరేట్‌లో అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తోన్న ఎ.అంజలిని ఎస్‌ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ సోమవారం మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

డ్యూయల్ మేజర్లతోనే పీజీ!



కూటమి ప్రభుత్వ నిర్ణయంతో డిగ్రీ విద్యలో గందరగోళం

- గతంలో సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టు విధానంపై బురదజల్లిన కూటమి నేతలు
- ఇప్పుడు రెండు మేజర్ సబ్జెక్టులు తొలి సెమిస్టర్ నుంచే అమలు
- రెండో ఏడాది నుంచి మైనర్ సబ్జెక్ట్ తప్పనిసరి
- కానీ, మైనర్ సబ్జెక్టులో పీజీ చేసే అవకాశం కోల్పోతున్న విద్యార్థులు
- గతంలో సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులతో పీజీకి అవకాశం
- కంప్యూటర్స్ మేజర్ సబ్జెక్టుగా తీసుకునే వారు మైనర్ క్వాంటం కంప్యూటింగ్ చదవాల్సిందే
- కానీ ఈ సబ్జెక్టుల బోధనకు వనరులు కరువు
- ఇంటర్న్‌షిప్ కాలవ్యవధి కుదింపు.. బట్టీ చదువులకే ప్రాధాన్యం

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం డిగ్రీ విద్యలో గందరగోళం సృష్టిస్తోంది. గతంలో సింగిల్ మేజర్, మైనర్ విధానంపై బురదజల్లడమే కాకుండా తాము అధికారంలోకి వస్తే పాత పద్ధతి(మూడు కోర్ సబ్జెక్టులు)ని ప్రవేశపెడతామని చెప్పి.. ఇప్పుడు డ్యూయల్ మేజర్‌లతో విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. తొలి సెమిస్టర్ నుంచే రెండు మేజర్ సబ్జెక్టులను అమలు చేయడమే కాకుండా రెండో ఏడాది నుంచి మైనర్ సబ్జెక్టును తప్పనిసరి చేసింది. కానీ మైనర్ సబ్జెక్టుకు క్రెడిట్లు తక్కువ కేటాయించడం ద్వారా అందులో పీజీకి అవకాశం లేకుండా చేసింది. అలాగే ఎలాంటి బోధన వనరులు లేకపోయినా.. క్వాంటం కంప్యూటింగ్ సబ్జెక్టును తప్పనిసరి చేసి విద్యార్థులను హడలెత్తిస్తోంది. ఇంటర్న్‌షిప్ సమయంలో కోత విధించి.. పుస్తకాల బట్టీకి ప్రాధాన్యమిచ్చింది.

బోధన సాధ్యమేనా?

బీకాం కోర్సులకు సంబంధించి కొత్త విధానంలో సబ్జెక్టుల కాంబినేషన్‌పై గందరగోళం నెలకొంది. బీకాంలో కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్ల అనుబంధ మేజర్ సబ్జెక్టులుగా చదివే వారు తప్పనిసరిగా క్వాంటం టెక్నాలజీని మైనర్ సబ్జెక్టుగా అభ్యసించాలని నిబంధన పెట్టడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. క్వాంటం టెక్నాలజీ సబ్జెక్టును బోధించే వనరులు రాష్ట్రంలో జల్లెడ పెట్టి వెతికినా దొరకని పరిస్థితి ఉందని.. ప్రభుత్వం సొంత ప్రచారం కోసం విద్యార్థులను బలి చేస్తోందని విద్యావేత్తలు మండిపడుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యార్థులకు అత్యాధునిక విద్యను అందించేందుకు ఎడెక్స్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థల ద్వారా ఆన్‌లైన్ వర్టికల్స్ చదువుకునే అవకాశం కల్పించిందని వారు గుర్తు చేస్తున్నారు. కానీ, కూటమి ప్రభుత్వంలో కాలేజీలో పాఠాలు చెప్పడానికే వనరుల కొరత ఉన్నప్పుడు ఈ టెక్నాలజీ కోర్సులను ఎలా బోధిస్తారని ప్రశ్నిస్తున్నారు. కాగా, మేజర్ 1, మేజర్ 2, మైనర్ సబ్జెక్టులకు కాంబినేషన్ సబ్జెక్టుల జాబితాను ప్రభుత్వం ఇంకా విడుదల చేయకపోవడంపై డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

గతంలో విద్యార్థులకు అనుకూలంగా..

ఒక సబ్జెక్టులో విద్యార్థి సంపూర్ణ నైపుణ్యాలు సాధించాలనే లక్ష్యంతో యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా గత ప్రభుత్వం సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకువచ్చింది. రెండో సెమిస్టర్ నుంచి 100కి పైగా సబ్జెక్టుల్లో నచ్చిన సబ్జెక్టును మైనర్ కింద చదువుకునేలా క్రెడిట్లు రూపొందించింది. అంటే మేజర్, మైనర్‌లో ఏదో ఒక సబ్జెక్టుతో పీజీలో ప్రవేశాలకు అర్హత పొందొచ్చు. దీంతో పాటు ఐచ్ఛికంగా మరో మైనర్ సబ్జెక్టును విద్యార్థి చదివితే దానికి కూడా క్రెడిట్లు ఇచ్చి అందులో సైతం పీజీ చేసేందుకు వీలు కల్పించింది. ఇక్కడ మేజర్‌కు 60, మైనర్‌కు 24 క్రెడిట్లు కేటాయించింది. నాలుగేళ్ల డిగ్రీ విధానంలో ఏడు సబ్జెక్టులు మాత్రమే ఉండేవి. అందులో ఒక సబ్జెక్టును కేవలం చివరి సంవత్సరంలో మాత్రమే చదవాల్సి ఉండేది.

మైనర్ సబ్జెక్టులో పీజీకి అవకాశం లేదు..

కూటమి ప్రభుత్వం సింగిల్ మేజర్ విధానం స్థానంలో డ్యూయల్ మేజర్ ప్రకటించింది. ఇందులో తొలి సెమిస్టర్ నుంచే విద్యార్థి ప్రధానంగా రెండు సబ్జెక్టులు(మేజర్1, 2) తీసుకోవాలి. మూడో సెమిస్టర్ నుంచి మైనర్ సబ్జెక్టును తప్పనిసరిగా చదవాలి. ఇక్కడ మేజర్ 1కు 48, మేజర్ 2కు 32, మైనర్‌కు 16 క్రెడిట్లు కేటాయించింది. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక సబ్జెక్టులో కనీసం 24 క్రెడిట్లు ఉంటేనే.. అందులో పీజీ చేయొచ్చు. ఈ లెక్కన కేవలం 2 మేజర్లలో ఏదో ఒక దానిలో మాత్రమే పీజీ చదివేందుకు అర్హత ఉంటుంది. పైగా డ్యూయల్ మేజర్ నాలుగేళ్ల డిగ్రీలో 8 సబ్జెక్టులను చదవాల్సి ఉంటుంది.

ఇంటర్న్‌షిప్, క్రెడిట్లలో కోత..

వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యార్థులకు తరగతి బోధనతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించేందుకు 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టింది. తొలి ఏడాది అనంతరం 180 గంటల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, రెండో ఏడాది తర్వాత 180 గంటల ఇంటర్న్‌షిప్, చివరి ఏడాది(విద్యార్థి వీలును బట్టి) ఏదో ఒక సెమిస్టర్‌లో పూర్తిగా లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించింది. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యార్థులను పూర్తిగా బట్టీ చదువులకే పరిమితం చేస్తోంది. కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టును 120 గంటలకు, స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌ను 120 గంటలకు, లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌ను 10 వారాలకు(240 గంటలకు) కుదించింది. పైగా క్రెడిట్లను 20 నుంచి 16కు తగ్గించింది.

అనితకు అఘాయిత్యాలేమీ కనిపించడం లేదా?

- కనీసం ఆమె స్పందించిన దాఖలాలు కూడా లేవు
- అనవసర విషయాలతతో డైవర్షన్ రాజకీయాలు
- మాజీ హోం మంత్రి వనిత విమర్శ



దేవరపల్లి: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వాటిగురించి ఎవరైనా మాట్లాడితే తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారని మాజీ హోం మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత విమర్శించారు. జర్నలిస్టు కృష్ణంరాజు మహిళలపై చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ, మహిళల తరఫున ఖండించామన్నారు. అయినా డైవర్షన్ పాలిటిక్స్‌తో... వైఎస్ జగన్, సాక్షి చానల్ గురించి తప్పుగా మాట్లాడటమే పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. బాలికలు, యువతులు, మహిళలపై తరచూ అత్యాచారాలు, అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నా హోం మంత్రి వంగలపూడి అనిత కనీసం స్పందించిన దాఖలాల్లేవని అన్నారు. నల్లజర్లలో పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం నివాసం వద్ద సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ''పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో బాలికపై టీడీపీ కార్యకర్త అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. అనంతపురం జిల్లాలో దళిత బాలికపై ఆరు నెలలుగా సామూహిక అత్యాచారం జరిగింది. విషయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా కేసు నమోదు చేయలేదు. అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థిని తన్మయి అదృశ్యంపై ఫిర్యాదు చేసి వారం గడిచినా స్పందించలేదు. అనవసర విషయాలపై దృష్టిపెడుతున్న హోం మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారు. దాన్నుంచి దృష్టి మళ్లించేందుకు మభ్యపెడుతున్నారు'' అని పేర్కొన్నారు. ఎంతసేపు వైఎస్ జగన్‌ను తిట్టడమే తప్ప కూటమికి వేరే పని లేదని వనిత దుయ్యబట్టారు. గతంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి గురించి వంగలపూడి అనిత ఎన్నో మాట్లాడారని, ఆమెకు చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్ చెప్పారా? అని ఆమె ప్రశ్నించారు. కృష్ణంరాజు వ్యాఖ్యలకు వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలంటున్న అనిత.. వైఎస్ విజయమ్మ, భారతిపై మాట్లాడిన మాటలకు ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ మహిళలకు ఇచ్చిన గౌరవం ఏ సీఎం కూడా ఇవ్వలేదన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షుడు మద్దూరి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, మేస్నీ కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం

ఖండించిన ప్రవాసాంధ్రులు

సాక్షి, అమరావతి: సాక్షి టీవీ డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు పథకం ప్రకారం సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పలువురు ప్రవాసాంధ్రులు పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు కనుసన్నల్లో మూడు రోజులుగా ఆర్గనైజ్‌డ్‌గా ఆందోళనలు, దిష్టిబొమ్మల దహనాలు, చెప్పులతో కొట్టడాలు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఏడాది పాలనలో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చివరికి టీవీ డిబేట్‌లోని వ్యాఖ్యలను కూడా వివాదాస్పదంగా మార్చడం ఒక్క చంద్రబాబుకే చెల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొమ్మినేని అరెస్టు కక్ష సాధింపు



సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావు అరెస్ట్ అప్రజాస్వామికం. ఆ మాటలు అన్న కృష్ణంరాజు క్షమాపణ చెప్పారు. సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పింది. కొమ్మినేని కూడా ఆ మాటలపై విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎటువైపు వెళుతోంది. ఇవి కక్షపూరిత చర్యలు. పచ్చమీడియాలో జరిగిన డిబేట్‌లలో ఇంతకన్నా ఘోరమైన వ్యాఖ్యలు వినిపించాయి. వెంకటకృష్ణ డిబేట్ ప్రోగ్రామ్‌లో కొలికపూడి అనే వ్యక్తి చెప్పుతీసుకొని విష్ణువర్ధన్‌రెడ్డిని కొట్టారు. అది ఫిజికల్ అటాక్. ఎవరినీ అరెస్ట్ చేయలేదు. ఇలాంటి ఉదాహరణలు వేల సంఖ్యలో ఉన్నాయి.

– డాక్టర్ ప్రదీప్ చింత, వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్

వైఎస్ జగన్‌కు, భారతికి ఏమిటి సంబంధం?



సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనిని అరెస్ట్ చేసి చంద్రబాబు ఏపీలో కొత్త సంప్రదాయానికి తెరలేపారు. ఇదంతా రాజకీయ కక్షసాధింపు. డిబేట్‌లో జరిగిన తప్పునకు ప్రెజెంటర్‌కు ఏం సంబంధం. ఎల్లోమీడియా డిబేట్లలో జగన్‌ను, ఆయన కుటుంబాన్ని దూషించిన, దూషిస్తున్న వారిపై ఇలాగే కేసులు పెడతారా? ఎవరో చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీకి, వైఎస్ జగన్‌కు, వైఎస్ భారతికి ఆపాదించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్న చంద్రబాబుకు గతంలో టీడీపీ సీనియర్ నాయకులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ, ఆనం వెంకటరమణారెడ్డి వంటి వారు చేసిన అసభ్యకర వ్యాఖ్యలు గుర్తు లేవా. వారితో ఎందుకు క్షమాపణలు చెప్పించడం లేదు.

– దువ్వూరు మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ సింగపూర్ కన్వీనర్

ఆక్వా కంపెనీలతో మత్స్య వర్సిటీ ఎంఓయూ

సాక్షి, అమరావతి: మత్స్య, ఆక్వా కల్చర్ రంగాల అభివృద్ధి లక్ష్యంతో ఏపీ ఫిషరీస్ విశ్వ విద్యాలయం వివిధ రాష్ట్రాలకు చెందిన మూడు ప్రముఖ కంపెనీలతో సోమవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు సమక్షంలో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముంబైకు చెందిన ఆగ్రోసెల్ ప్రైవేట్ లిమిటెడ్, హరియాణాకు చెందిన ఎస్పైన్స్ నేచురా ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరుకు చెందిన హైటెక్ ఫార్మా కంపెనీలతో యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది.

ఏ సమస్యపైనైనా ఇంత వేగంగా స్పందించారా?



మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి పాలన, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనిని అక్రమంగా అరెస్ట్ చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. ‌రాష్ట్రంలో జరిగిన దారుణాలపై ఎప్పుడైనా ఇంత వేగంగా ప్రభుత్వం స్పందించిందా? సీఎం చంద్రబాబు మాట్లాడరు, హోం మంత్రి ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. అనంతపురం జిల్లాలో దళిత బాలికను టీడీపీవారు గ్యాంగ్‌రేప్ చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు? సత్యసాయి జిల్లాలో పసికందు మీద అఘాయిత్యం జరిగితే వాళ్ల ఫిర్యాదు ఇవ్వడానికీ భయపడ్డారు. కూటమి నేతలు అన్ని వ్యవస్థలను వారి చేతుల్లోకి తీసుకోవడమే దీనికి కారణం'' అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రకాశం జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసలు రాజ్యాంగబద్ధంగా వ్యవస్థలు నడుస్తున్నాయా? ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగుతోందా? అని ప్రశ్నించారు. చట్టాలను చుట్టాలుగా చేసుకుని పాలిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని అందుకే అరెస్టులు, దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కొమ్మినేని అక్రమ అరెస్ట్ చాలా బాధాకరమని, కృష్ణంరాజు వ్యాఖ్యలపై ఆయన వెంటనే జోక్యం చేసుకుని వారించిన విషయాన్ని గమనించాలని కోరారు. స్వయంగా కృష్ణంరాజు బహిరంగ క్షమాపణ చెప్పారని మేరుగు నాగార్జున పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ, సాక్షి మీడియా కూడా ఖండించిందన్నారు. ఈ అంశాన్ని వైఎస్సార్‌సీపీ, మాజీ సీఎం వైఎస్ జగన్ మీద రుద్దాలనే ఆలోచన చాలా బాధాకరం అని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏ రైతు హాయిగా లేడని తెలిపారు. నల్లబర్లీ రైతుల కష్టాలు తెలుసుకునేందుకు ఈ నెల 11న మాజీ సీఎం వైఎస్ జగన్ పొదిలికి వస్తున్నారన్నారు. సమావేశంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల సంఘం సమాఖ్య కార్యదర్శిగా డాక్టర్ సుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి: అఖిల భారత ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్ సంఘం సమాఖ్య జాతీయ కార్యదర్శిగా డాక్టర్ ఎ.వి. సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శని, ఆదివారాల్లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత కార్యవర్గ సమావేశంలో ఎన్నిక జరిగిందని సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సుబ్బారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు.

పని గంటల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వం పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు సోమవారం రాసిన లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్నమయ్య డ్యామ్ పునరుద్ధరణకు సాంకేతిక కమిటీ

సాక్షి, అమరావతి: అన్నమయ్య డ్యామ్ పునరుద్ధరణ, నిర్మాణ పనులు, డిజైన్‌ల రూపకల్పన, ప్రాజెక్టు నిర్వహణలో సవాళ్లను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వడానికి ప్రభుత్వం సాంకేతిక కమిటీని నియమించింది. కడప జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈ రమేశ్ కుమార్ (డిజైన్ నిపుణుడు), రిటైర్డు సీఈ కె.సత్యనారాయణ (హైడ్రో మెకానికల్ నిపుణుడు), జీఎస్‌ఐ రిటైర్డ్ డీజీ ఎం.రాజు(జియాలజిస్టు), సీడీవో సీఈ, హైడ్రాలజీ–ఎస్‌డీఎస్‌వో సీఈలు సభ్యులుగా ఉంటారు. కమిటీ సభ్యులకు గౌరవ వేతనం, టీఏ, డీఏ ఇవ్వనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జక్కంపూడిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

సాక్షి, అమరావతి: ఏపీ ఎకనామిక్ సిటీస్ ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఈడీసీ) అభివృద్ధి చేస్తున్న జక్కంపూడి ఎకనామిక్ టౌన్‌షిప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జెట్‌సిటీ) బాధ్యతలను ఏపీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం తొలి దశలో 10.12 ఎకరాల్లో మూడు టవర్స్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయనున్నారు. రూ.143.37 కోట్ల అంచనా వ్యయంతో 6.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఏపీఐఐసీకి అప్పగించింది. ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఏపీఈడీసీ నుంచి ఏపీఐఐసీకి బదలాయింపునకు స్టాంప్ డ్యూటీ నుంచి మినహాయింపును ఇచ్చింది. ఈ భవనాలను ఏపీఐఐసీ కేంద్ర ప్రభుత్వ నిధులతో కానీ లేక ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో కానీ పూర్తి చేయనుందని పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వికసిత భారత్‌లో ఎఫ్‌పీవోలదే క్రియాశీలక పాత్ర

బీకేఎస్ జాతీయ కార్యదర్శి మొయిని మోహన్ మిశ్రా

సాక్షి, అమరావతి: వికసిత భారత్ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) అఖిల భారత కార్యదర్శి మొయిని మోహన్ మిశ్రా పిలుపునిచ్చారు. 2047 వికసిత భారత్–స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)ల పాత్రపై సోమవారం రాష్ట్ర స్థాయి ఎఫ్‌పీవో డైరెక్టర్ల సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సదస్సులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఎఫ్‌పీవోల స్థిరీకరణ, వాటి ఆర్థిక పరిపక్వత, మార్కెటింగ్ సౌకర్యాలు, గిడ్డంగి, ప్రాసెసింగ్ యూనిట్లు వంటి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సదస్సులో మోహన్ మిశ్రా సూచించారు. రైతులకు నేరుగా లాభదాయకమైన ధరలను కల్పించే విధానాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలతో సాగు పెట్టుబడుల సమన్వయం, రైతు ఉత్పత్తిదారుల సామర్థ్యాభివృద్ధి కోసం శిక్షణ, వ్యవస్థాగత మద్దతుపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.



టైట్.. నాట్ రైట్!

స్కిన్ టైట్ దుస్తులు చాలా అందంగా అమరిపోతాయి. అవి ధరించినవారు చూడటానికీ చాలా చలాకీగా, డైనమిక్ లుక్‌తో కనిపిస్తుంటారు. ఇవన్నీ సరే. లుక్స్‌పరంగానూ ఓకే. కానీ అంతటి స్కిన్ టైట్ ఫ్యాషన్ వల్ల ఒనగూరే నష్టాల మాటేమిటి? చాలా తక్కువ మందికి మాత్రమే ఇలాంటి టైట్ ఫిటింగ్స్‌తో ఉండే నష్టాల గురించి తెలుసు. ఎప్పుడూ బాగా టైట్ జీన్స్‌తో ఉండే పురుషుల్లో చర్మ సమస్యలు రావడమే కాదు... వాళ్లలో వీర్యకణాల సంఖ్య, కదలికలూ తగ్గుతాయంటే ఆశ్చర్యపడాల్సిందేమీ ఉండదు. అందుకే "టైట్... నాట్ రైట్... ఇట్స్ ఎ బిగ్ ఫైట్ విత్ హెల్త్ అండ్ టు బి ఫిట్" అంటూ హెచ్చరిస్తున్నారు డాక్టర్లు. ఇలాంటి టైట్ ఫ్యాషన్ దుస్తులు లేదా ఇతరత్రా యాక్సెసరీస్‌తో వచ్చే సమస్యలపై అవగాహన పెంపొందించుకోడానికి ఉపయోగపడేదే ఈ కథనం.

అవి టైట్ ఫ్యాషన్ దుస్తులా, లేదా మరోటా అనే దానికంటే ముందుగా అవి సౌకర్యంగా ఉన్నాయా అన్నది ముఖ్యం. అంతకంటే చూసుకోవాల్సిన ముఖ్యమైన అంశం మరోటి ఉంది. అదే ఆ దుస్తులు లేదా ఆ ఫ్యాషన్ ఆరోగ్యకరమా కాదా అన్నది. ఫ్యాషన్ దుస్తులతో మంచి డైనమిక్ లుక్ ఉన్నప్పటికీ దాంతో వచ్చే కొన్ని రకాల అనర్థాలేమిటో చూద్దాం.

టైలు, కాలర్‌లు...



'టై' అనేది గొంతు చుట్టూ బిగుతుగా చుట్టుకుపోయి ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే దాన్ని కట్టుకోడానికి వీలుగా కాలర్ దగ్గర బటన్ పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇలా చాలాసేపు టై కట్టుకునే ఉండటం వల్ల కొందరిలో బటన్‌తో మెడ చుట్టూ ఉండే చర్మం నొక్కుకుపోవచ్చు. అక్కడి కండరాలూ, రక్తనాళాలూ చాలా కొద్దిమేర అయినప్పటికీ ఎంతో కొంత ప్రతికూల ప్రభావాలకు లోనుకావచ్చు. ఇలాంటి బిగుతైన 'టై', 'నాట్' ల కారణంగా కనిపించే ప్రభావాలివి....

ఇవీ అనర్థాలు...

- **పిగ్మెంటేషన్ సమస్యలు:** బిగుతైన టైలు, కాలర్ల వల్ల మెడ వద్ద పిగ్మెంటేషన్ సమస్య రావచ్చు. అంటే అక్కడి చర్మం రంగు మారవచ్చు. కొన్నిసార్లు చర్మం మందంగానూ మారవచ్చు. ఇలా చర్మం రంగు మారడం, చర్మం మందంగా మారిపోవడాన్ని ఎమిలాయిడోసిస్, అకాంథోసిస్ నైగ్రికేన్ అంటారు.
- **ఫంగల్ ఇన్ఫెక్షన్లు:** బిగుతైన కాలర్ల వల్ల గాలి ఆడకపోవడం వల్ల టీనియా కార్పోరిస్, టీనియా వెర్సికోలర్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ముప్పు కూడా ఉంటుంది.
- **స్కిన్ ట్యాగ్స్ (పులిపిరులు):** బిగుతుగా ఉన్న చోట దుస్తులు చర్మంతో నిత్యం ఒరుసుకుపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో పులిపిరులు వాటిలో ఇరుక్కుని ఇబ్బంది పడే అవకాశముంటుంది.

బిగుతైన టీ-షర్ట్స్... టైట్ టాప్స్‌లతో...

ఒంటికి పట్టినట్లుగా ఉండే టీ-షర్ట్‌తో చాలామంచి డైనమిక్ లుక్ వస్తుంది. చూడ్డానికి అవి ధరించిన వ్యక్తులు కూడా ఒబేసిటీతో అనిపించకుండా సన్నగా, బక్కపలచగా కనిపిస్తుండటంతో వారి కదలికల్లో చురుకుదనం కనిపిస్తుంటుంది. అయితే బిగుతైన టీ-షర్ట్స్ చాలా సమస్యలను తెచ్చిపెడతాయి. అవి...

- **ఫంగల్ ఇన్ఫెక్షన్లతో బాహుమూలాల్లో నలుపు:** ఒంటికి పట్టేసినట్లుగా ఉండటం వల్ల గాలి ఆడక టీనియా కార్పోరిస్, టీనియా వెర్సికోలర్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. ఇలాంటివి చాలా సందర్భాల్లో ప్రధానంగా బాహుమూలాల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటాయి. దేహంలోని మిగతాచోట్ల ఉండే చర్మంతో పోల్చినప్పుడు బాహుమూలాల్లోని చర్మం నల్లగా కనిపించడానికి బిగుతైన దుస్తుల వల్ల అక్కడ పిగ్మెంటేషన్ ఏర్పడటమే ముఖ్య కారణం.
- **బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్:** బిగుతైన దుస్తుల వల్ల ఛాతీ, వీపును పట్టేసినట్లుగా ఉండటంతో కొంతమందిలో ఇది మొటిమల (పింపుల్స్)కు దారితీయవచ్చు. మరికొందరిలో సెగగడ్డలు (హీట్ బాయిల్స్) కూడా రావచ్చు.
- ఉరఃపంజరం చుట్టూ ఉండే కండరాల్లో నొప్పి కూడా రావచ్చు.
- పొట్ట చుట్టూ బాగా బిగుతుగా ఉండటం వల్ల కడుపులో స్రవించే గ్యాస్ట్రిక్ ఆమ్లాలు పైకి తన్నడం వల్ల ఛాతీలో మంట, కడుపులోంచి పైకి తన్నినట్లుగా ఉండే ఫీలింగ్ (రిఫ్లక్స్ ఈజోఫేజైటిస్) వంటివి సాధారణం.

బిగుతైన ప్యాంట్లు (టైట్ ప్యాంట్స్ / టమ్మీ టక్కర్ క్లాత్స్)...

ఇటీవల చాలామంది ఇవ్వాళ్టి ట్రెండ్‌లో భాగంగా బిగుతైన ప్యాంట్లు (టైట్ డెనిమ్స్) ధరిస్తుండటం మామూలే. ఇందులో హై వెయిస్ట్ జీన్స్, మిడ్ వెయిస్ట్ డెనిమ్, లో-వెయిస్ట్ జీన్స్, టమ్మీ టక్కర్స్ అని ఇలా చాలా రకాలే ఉంటున్నాయి. అయితే ఇవి చాలా ఆరోగ్య సమస్యలకూ కారణమయ్యే అవకాశాలున్నాయి. అవి...

- **చర్మానికి:** టైట్ ఫిట్స్ బిగుతుగా ఉండటం వల్ల గాలి సరిగా ఆడక, చెమట విపరీతంగా పట్టడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్స్, చెమటకాయల వంటి ప్రిక్లీ హీట్ సమస్యలు, పిగ్మెంటేషన్ (చర్మం రంగుమారడం), నడుము చుట్టూరా నల్లటి మచ్చలా ఏర్పడటం, సెగగడ్డలు రావడం జరగవచ్చు. అలాగే ప్యాంట్ విడవగానే ఒత్తిడి వల్ల మచ్చలు ఏర్పడటం ఒరుసుకుపోయినట్లుగా కావడం, ఎర్రగా దద్దుర్లు రావడం (ప్రెషర్ అర్టికేరియా) జరగవచ్చు. ప్యాంటు క్లాత్ చర్మానికి ఆని ఉన్న చోట దురదలు రావడం, ఎర్రగా మారడం జరగవచ్చు.
- **కండరాలకు:** తీవ్రమైన వెన్నునొప్పి రావచ్చు. ఇది నడుము చుట్టూ ఉన్న టైట్‌నెస్ వల్ల జరిగే పరిణామం. టైట్‌గా ఉండే ట్రౌజర్స్ వల్ల టీనియా క్రూరిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్స్ రావచ్చు. ఇవి ప్రధానంగా గజ్జల్లో, గ్రోయిన్స్‌లో, పిరుదుల మీద వచ్చే అవకాశాలు ఎక్కువ.
- **నరాలకు:** కొన్ని సందర్భాల్లో ట్రౌజర్ బిగుతు వల్ల నరాలు ఒత్తుకుపోతే తుంటి ఎముక కీళ్లలో 'మెరాల్జియా పారెస్థటికా' అనే సమస్య రావచ్చు. ఇందులో తొడకు తిమ్మిరి రావడం, స్పర్శ కోల్పోవడం / స్పర్శాజ్ఞానం తగ్గడం వంటివి జరగవచ్చు.
- **వీర్యకణాల సంఖ్య తగ్గడం:** బిగుతైన ప్యాంట్లు పురుషుల్లో వీర్యకణాల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తాయి. వాటి సంఖ్య మిల్లీలీటర్‌కు 60 లక్షల నుంచి 20 లక్షలకు పడిపోతే పురుషుల్లో వ్యంధ్యత్వ (ఇన్‌ఫెర్టిలిటీ) సమస్య కూడా వచ్చే అవకాశాలు లేకపోలేదు.
- **కడుపునొప్పి:** బిగుతు దుస్తులు యాసిడ్ రిఫ్లక్స్ కండిషన్‌ను ప్రేరేపించి కడుపు నొప్పి, గుండెలో మంట వంటి కండిషన్‌లకు దారితీసే అవకాశాలెక్కువ.



డా. స్వప్నప్రియ,
సీనియర్ డర్మటాలజిస్ట్

బిగుతైన మహిళల లో-తొడుగులు (బ్రాలు)... అనర్థాలు...

మహిళలు వాడే లో తొడుగుల (బ్రాల) బిగుతు... తమకు సౌకర్యంగా ఉన్న మేరకే ఉండాలి. అంతకంటే మించితే అవి కొన్ని సమస్యలు దారితీయవచ్చు. అవి...

- భుజాల నొప్పి, • మెడ నొప్పి, • వెన్ను నొప్పి, • శ్వాసతీసుకోవడంలో సమస్య (ఇది ఛాతీని పట్టేసినట్లుగా ఉండటం వల్ల కలుగుతుంది). • రొమ్ము సమస్యలు. బాగా బిగుతైన బ్రాల వల్ల మెడ ఎముక (కాలర్‌బోన్) నొప్పి రావచ్చు.

బాగా బిగుతుగా ఉండే లోదుస్తుల (అండర్‌గార్మెంట్స్)తో...

చాలా బిగుతుగా ఉండే డ్రాయర్లు, అండర్‌గార్మెంట్లతో ఫంగల్ ఇన్ఫెక్షన్లు, మూత్రసంబంధమైన ఇన్ఫెక్షన్లు, వ్యంధ్యత్వం వంటి సమస్యలు వస్తాయి.

నడుము చుట్టూ నలుపు చారికా?

పురుషుల్లో నడుము చుట్టూ బెల్టు పెట్టుకునే చోట లేదా మహిళల్లోనైతే వారు లోపలి లంగా లేదా సెల్వార్ నాడా కట్టుకునే చోట నల్లగా మచ్చపడే అవకాశం ఉంది. అందుకే మరీ గట్టిగా లాగిగానీ లేదా మరింతగా బిగించిగానీ కట్టకపోవడం మంచిది. ఇక్కడ మరీ బిగుతుగా కాకుండా మరీ వదులుగా కాకుండా తగినంత సౌకర్యంగా ఉండేలా బెల్ట్/నాడా కట్టుకోవడం మంచిది. ఈ నలుపు పోవడానికి చిన్న చిట్కాలు...

- మనం చేసే పని (వృత్తి)లో భాగంగా మరీ ఎక్కువ సేపు అదేపనిగా నిలబడి ఉండటమూ / కూర్చొని ఉండటం సరికాదు. ప్రతి గంటకు ఒకసారి కనీసం 5 – 10 నిమిషాలపాటైనా అటూ ఇటూ నడుస్తూ ఉండాలి. దీనివల్ల అన్ని భాగాల్లో లాగే నడుము ప్రాంతంలో కూడా రక్తప్రసరణ చక్కగా జరుగుతుంది. దీనివల్ల నలుపు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది.
- క్యాలరీలు తక్కువగా ఉండి, పీచు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఈ ఫైబర్ వల్ల శరీరానికి మంచి బిగువు వస్తుంది. ఇలా బిగువుగా ఉండే వారిలో చర్మం మంచి మిలమిలలతో ఆరోగ్యంగా ఉంటుంది.
- ఇటు మహిళలైనా, అటు పురుషులైనా పడుకునే సమయంలో కాళ్ల కింద తలగడ పెట్టుకుని, అవి పడక నుంచి 10 అంగుళాల పైన ఉండేలా జాగ్రత్త తీసుకుంటే నడుము చుట్టూ ఉన్న నల్ల మరకల నివారణకు తోడ్పడటమే కాకుండా, గుండెకూ తగినంత రక్తప్రసరణ సులువుగా అవుతుంటుంది.



బిగుతు దుస్తులతో మరిన్ని అనర్థాలు...

మన దేశపు మహిళల్లో భారతీయ సంస్కృతిలో భాగంగా చీర కట్టుకునే వారిలో లోపలి లంగా (పెట్టికోట్) బాగా బిగుతుగా ఉన్నా లేదా సెల్వార్ తాలూకు బొందు బాగా టైట్‌గా కట్టినా... అక్కడి చర్మానికి ఫంగల్ ఇన్ఫెక్షన్స్ కనిపించే అవకాశాలు ఎక్కువ. అలాంటప్పుడు చర్మం అంతా ఈ ఇన్ఫెక్షన్ వల్ల దోక్కుపోయినట్లుగా అనిపించవచ్చు.

- ఇక కాలి కింది భాగంలో బిగుతైన సాక్స్ వంటివి వాడేవారికి ఎక్జిమా వచ్చినట్లుగా కనిపిస్తుంది.

బిగుతైన షూస్ / సాక్స్‌తో...



- **అథ్లెట్స్ ఫుట్:** బాగా బిగుతుగా ఉండే బూట్లు (షూస్) లేదా మేజోళ్ల (సాక్స్)ను అదేపనిగా ఎక్కువసేపు ధరించి ఉండటం వల్ల కాలివేళ్ల మధ్య ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావచ్చు. వీటినే అథ్లెట్స్ ఫుట్ అంటారు.
- **హ్యామర్ టో:** బాగా బిగుతైన షూస్ అదేపనిగా . దరిచడం వల్ల 'హ్యామర్ టో' అనే కండిషన్ వస్తుంది. షూ ముందు భాగం బాగా సన్నగా ఉండటం వల్ల కాలివేళ్లన్నీ దగ్గరకు చేసినట్లుగా కుంచించుకుపోయి ఈ పరిస్థితికి దారితీస్తుంది.
- **బ్యునియన్:** ఈ కండిషన్‌లో కాలి బొటనవేలు ఒక పక్కకు నొక్కుకుపోయి దాని చివర ఎముక బయటకు తన్నినట్లుగా వెలుపలికి వస్తుంది. ఇలా జరగడాన్ని బ్యునియన్ అంటారు.
- **డయాబెటిక్ ఫుట్:** చక్కెర వ్యాధి ఉన్నవారిలో బిగుతైన పాదరక్షల వల్ల 'డయాబెటిక్ ఫుట్' అనే కండిషన్ వస్తుంది. నిర్లక్ష్యం చేసిన కొందరిలో ఇది గ్యాంగ్రీన్ (చర్మం కుళ్లిపోవడం) అనే కండిషన్‌కు దారితీసే ముప్పు కూడా లేకపోలేదు.

చికిత్సలు...

తమకు వచ్చిన ఫంగల్ ఇన్ఫెక్షన్‌ను బట్టి తగిన యాంటీఫంగల్ క్రీమ్‌లతో చికిత్స అవసరం కావచ్చు. అదే హ్యామర్‌టో, బునియన్ లాంటి కండిషన్లకు ఒక్కోసారి శస్త్రచికిత్స కూడా చేయాల్సి రావచ్చు.

డయాబెటిక్ ఫుట్ వచ్చినవారు తమకు తగిన పాదరక్షలను ఎంపిక చేసుకుని, చక్కెరను ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలి. వీళ్లు... కాళ్లు కడుక్కున్న తర్వాత అవి పూర్తిగా పొడిగా మారాక గానీ... పాదరక్షలు ధరించకూడదు. పైగా ఇలాంటి వారు తరచూ తమ పాదాలను చెక్ చేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే చక్కెరవ్యాధి ఉన్నవారిలో స్పర్శజ్ఞానం తక్కువగా ఉండటం వల్ల జరగాల్సిన అనర్థం జరిగిపోయాక గాని వారికి జరిగిన నష్టమేమిటో తెలియకపోవచ్చు. అందుకే ఫ్యాషన్ పరంగా బిగుతైన దుస్తులు బాగానే ఉన్నప్పటికీ వాటి ఎంపికలో కాస్తంత విజ్ఞతతోనూ, మంచి వివేచనతోనూ తగినంత విచక్షణనూ పాటించడం మేలు.

నివారణ...

బిగుతైన దుస్తులను ధరించడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను, చర్మవ్యాధులను తగ్గించడం చాలా సులభం. కేవలం వాటికి బదులు మంచి గాలి ఆడేందుకు వీలుగా ఉండే దుస్తులు ధరించడం మంచిది. అయితే ఇలాంటి టైట్ ఫిటింగ్ ఫ్యాషన్‌ను వదులుకోడానికి ఇష్టపడని యువత ఒక జాగ్రత్తను పాటించడం మంచిది. అదేమిటంటే... మరీ ఎక్కువ బిగుతైన దుస్తులకు బదులుగా ఒంటికి నప్పేలా ఉండటంతో పాటు, హానికరం కానంత మేరకు మాత్రమే బిగుతైన దుస్తులను ధరించడం మంచిది. ఇక అండర్‌గార్మెంట్స్, సాక్స్ విషయానికి వస్తే... చర్మానికి అంటుకుపోయేంత బిగువుగా కాకుండా, కాస్తంత గాలి ఆడేందుకు వీలుగా ఉండేవి వాడటం మేలు. ఇక్కడ నైలాన్ వంటి వాటికి బదులుగా కాటన్‌వి ఎంపిక చేసుకోవడం చాలావరకు మేలు చేసే అంశం.

బిజినెస్ రీల్

జీఆర్‌టీ గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ పథకం



హైదరాబాద్: ఆభరణాల సంస్థ జీఆర్‌టీ జ్యుయలర్స్ తాజాగా గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ పేరిట ఆభరణాల కొనుగోలు కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నెలవారీ ప్లాన్‌లో భాగంగా కస్టమర్లు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని పొదుపు చేసి, 11 నెలల వ్యవధిలో తమకు నచ్చిన ఆభరణాన్ని కొనుగోలు చేయొచ్చు. అలాగే 18 శాతం వరకు వేస్టేజీ ఉండదు. పసిడి, వెండి, వజ్రం, ప్లాటినం వంటి ఆభరణాలన్నింటికీ ఇది వర్తిస్తుంది. గడువు ముగిసిన తర్వాత విలువపరంగా లేదా బరువుపరంగా తమకు ఏది ప్రయోజనకరమైతే, ఆ విధానంలో పథకాన్ని రిడీమ్ చేసుకోవచ్చు. కనిష్టంగా నెలవారీ అడ్వాన్స్ పేమెంట్ రూ. 1,000 నుంచి ప్రారంభమవుతుందని జీఆర్‌టీ జ్యుయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ 'ఆనంద్' అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు. తమకు ప్రియమైన వారి జన్మదినం తదితర సందర్భాల కోసం వారికి ఇష్టమైన ఆభరణాలను బహుమతిగా అందించేందుకు, ముందు నుంచే ప్రణాళిక వేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. 1964లో ప్రారంభమైన జీఆర్‌టీ జ్యుయలర్స్‌కి 63 శాఖలు ఉన్నాయి.

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మ్యూచువల్ ఫండ్ వెబ్‌సైట్ ప్రారంభించింది. సంస్థ అందించే డిజిటల్ ఫస్ట్ పథకాలపై ఆసక్తిగా ఉన్న వారు ముందస్తుగా ఇందులో రిజిస్టర్ చేసుకుని పెట్టుబడులకు సంబంధించిన కంటెంట్‌కి యాక్సెస్ పొందవచ్చు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్ఎల్), అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్ కలిసి ఈ సంస్థను జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేశాయి. మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఈ ఏడాది మే 26న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతులు మంజూరు చేసింది. జియో బ్లాక్‌రాక్ ఎండీ, సీఈవోగా సిద్ స్వామినాథన్, చీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా అమిత్ భొసాలే, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా అమోల్ పాయ్ తదితరులు నియమితులయ్యారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2025

విశాఖ	550-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIO FIN	305.45	3.89
KOTAK BANK	2,140.80	3.25
BAJ FINANCE	9,624.00	2.69
TRENT	5,922.00	2.51
AXIS BANK	1,220.50	2.17

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	256.99	1.86
ICICI BANK	1,434.50	1.73
TITAN	3,533.90	0.73
M & M	3,085.00	0.69
ADANI PORTS	1,467.00	0.32

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,178
ఎన్ఎస్ఈ	1,17,745
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,40,108
ఎఫ్ఐఐ	+ 1,993
డీఐఐ	+ 3,504

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.85 (రాత్రి 11.30కు)	$ 64.58 (సోమ ముగింపు)
బ్రెంట్	66.73 (రాత్రి 11.30కు)	$ 66.47 (సోమ ముగింపు)

టూ-వీలర్ల విక్రయాలు జూమ్

- ఈసారి కోవిడ్ పూర్వ స్థాయికి మించి అమ్మకాలు
- 8-9 శాతం వృద్ధి అంచనా
- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ద్విచక్ర వాహన విక్రయాలు గణనీయంగా పెరగనున్నాయి. కోవిడ్ పూర్వ స్థాయికి మించి 8-9 శాతం మేర వృద్ధి చెందనున్నాయి. నెమ్మదిస్తున్న ద్రవ్యోల్బణం, సానుకూల వర్షపాతం తదితర అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. దేశీయ టూ-వీలర్ పరిశ్రమ 2023, 2024, 2025 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా 8 శాతం, 10 శాతం, 11 శాతం వృద్ధి చెందినట్లు వివరించింది. ఎగుమతులు 21 శాతం మేర పుంజుకోవడంతో పాటు దేశీయంగా అమ్మకాలు 9 శాతం వృద్ధి చెందడంతో 2025 ఆర్థిక సంవత్సరంలో విక్రయాల పరిమాణం గణనీయంగా పెరిగిందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. ద్రవ్యోల్బణ భారం, అధిక వడ్డీ రేట్లు, కరెన్సీ కష్టాలు మొదలైన సమస్యలతో సతమతమైన కీలక మార్కెట్లలో పరిస్థితులు కాస్త మెరుగుపడటంతో ఎగుమతులు కోలుకున్నాయని వివరించింది. ఇక దేశీయంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవడం, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ స్థిరంగా కొనసాగడం సానుకూలాంశాలుగా నిల్చాయని పేర్కొంది. 'గత ఆర్థిక సంవత్సర పనితీరును కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ద్విచక్ర వాహనాల విక్రయాలు పటిష్టంగా వృద్ధి చెందనున్నాయి. అధిక బేస్‌తో పాటు నిర్దిష్ట నిబంధనలను పాటించే క్రమంలో 1-2 శాతం మేర ధరలు పెరిగినప్పటికీ 2026 ఆర్థిక సంవత్సరంలో కూడా పరిశ్రమ 8-9 శాతం వృద్ధిని సాధించే అవకాశం ఉంది' అని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. ఎగుమతుల పరిమాణం 12-14 శాతం, దేశీయంగా అమ్మకాలు స్థిరంగా 6-8 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడగలదని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్ గోస్వామి తెలిపారు.

ఇతరత్రా ముఖ్యాంశాలు..

- ఎగుమతులకు పటిష్టమైన డిమాండ్ నెలకొనడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండటం, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండటం, రుతుపవనాలు..ఆదాయాలపై గ్రామీణ ప్రాంతాల్లో సెంటిమెంటు మెరుగుపడుతుండటం మొదలైనవి ద్విచక్ర వాహనాల విక్రయాలకు సానుకూలాంశాలుగా నిలవనున్నాయి.
- ఈ మధ్యకాలంలో రిజర్వ్ బ్యాంక్ 100 బేసిస్ పాయింట్ల మేర కీలక వడ్డీ రేటును తగ్గించడం వల్ల అఫోర్డబిలిటీ పెరుగుతుంది. డిమాండ్‌కి ఊతం లభిస్తుంది.
- అధిక బేస్ వల్ల దేశీయంగా టూ-వీలర్ల అమ్మకాల వృద్ధి ఒక మోస్తరు స్థాయికి పరిమితం కావచ్చు. కానీ ఎగుమతులు పటిష్టంగా ఉండటం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండటమనేది మొత్తం పరిశ్రమ స్థాయిలో అమ్మకాల పరిమాణం నిలకడగా పెరిగేందుకు దోహదపడుతుంది.
- ఎగ్జిక్యూటివ్, ప్రీమియం మోటార్‌సైకిళ్ల సెగ్మెంటు .. ద్విచక్ర వాహనాల విక్రయ వృద్ధికి దోహదపడతాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా ఎలక్ట్రిక్ టూ-వీలర్లకు డిమాండ్ పెరుగుతుండటం వల్ల ద్విచక్ర వాహనాల విక్రయాల పరిమాణం మొత్తం మీద పెరిగింది.
- 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ-టూవీలర్ల అమ్మకాలు 7.8 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో మొత్తం టూ-వీలర్ల విక్రయాల్లో 1.78 శాతం వాటా ఉన్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వాటా 4.38 శాతానికి పెరిగింది. తక్కువ బేస్ ఎఫెక్ట్ వల్ల వార్షికంగా 180 శాతం వృద్ధి చెందింది. ఆ తర్వాత సంవత్సరాల్లోనూ మెరుగైన వృద్ధి నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంలో 29 శాతం పెరగ్గా, 2025లో 19 శాతం వృద్ధితో 12 లక్షల యూనిట్లకు అమ్మకాలు చేరాయి.

కార్ల ఉత్పత్తిపై 'మ్యాగ్నెట్ల' కొరత ప్రభావమేమీ లేదు

మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ



న్యూఢిల్లీ: ప్రస్తుతానికి తమ వాహనాల ఉత్పత్తిపై రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ కొరత ప్రభావమేమీ లేదని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ తెలిపారు. ఉత్పత్తి కార్యకలాపాలన్నీ ప్రణాళికలకు అనుగుణంగా యథాప్రకారమే కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లను దిగుమతి చేసుకునేందుకు చైనా ప్రభుత్వం లైసెన్సులు ఇస్తే రాబోయే నెలల్లో కూడా తయారీకి ఎలాంటి సమస్య ఉండబోదని వివరించారు. పరిశ్రమ వర్గాల ప్రకారం పలు దేశీ సరఫరా సంస్థలు రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల దిగుమతికి చైనా ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఇప్పటివరకు రాకపోవడంతో ఈ విషయంలో సాయం అందించాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వాహనాలు, గృహోపకరణాలు మొదలైన వాటిల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ప్రాసెసింగ్‌లో అంతర్జాతీయంగా చైనాకు 90 శాతం వాటా ఉంది. వీటిని ఎగుమతి చేయడంపై ఏప్రిల్ 4 నుంచి చైనా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఏడు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌తో పాటు వాటికి సంబంధించిన మ్యాగ్నెట్ల ఎగుమతి కోసం ప్రత్యేక లైసెన్సు తీసుకోవాలని నిర్దేశించింది.

సుజ్లాన్‌లో దిగ్గజాల పెట్టుబడులు

తాజాగా 1.45 శాతం వాటా కొనుగోలు

- జాబితాలో గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన దిగ్గజం సుజ్లాన్ ఎనర్జీ కంపెనీలో పెట్టుబడులపై గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలు కన్నేశాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా తాజాగా గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ, సొసైటీ జనరాలితోపాటు మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) ఉమ్మడిగా 1.45 శాతం వాటా కొనుగోలు చేశాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం 1.45 శాతం వాటాకు సమానమైన 19.81 కోట్ల షేర్లను సొంతం చేసుకున్నాయి. ఇందుకు షేరుకి రూ. 66.05 సగటు ధరలో రూ. 1,309 కోట్లు వెచ్చించాయి. అయితే దేశీ ఎంఎఫ్‌లు.. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్, ఎడిల్‌వీజ్, బంధన్, సుందరం, ఇన్వెస్కోసహా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితరాలు ఈ షేర్లను కొనుగోలు చేశాయి. సుజ్లాన్ ఎనర్జీ ప్రమోటర్ సంస్థలు తంతి హోల్డింగ్స్, వినోద్ ఆర్ తంతి(వైస్‌పర్సన్, ఎండీ), తంతి ఆర్ రామ్‌జీభాయ్, ఆర్‌యూ తంతి షేర్లను విక్రయించారు. కాగా.. తాజా లావాదేవీల తదుపరి సుజ్లాన్ ఎనర్జీలో ప్రమోటర్ల ఉమ్మడి వాటా 13.25 శాతం నుంచి 11.8 శాతానికి క్షీణించింది.

ఈ నేపథ్యంలో సుజ్లాన్ ఎనర్జీ షేరు ఎన్ఎస్ఈలో 0.8 శాతం పుంజుకుని రూ. 67 వద్ద ముగిసింది.

శంకర బిల్డింగ్‌లో వాటా విక్రయం

7.8 శాతం వాటా అమ్మిన ప్రమోటర్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్‌లో ప్రమోటర్, ఎండీ సుకుమార్ శ్రీనివాస్ తాజాగా 7.8 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా శ్రీనివాస్ షేరుకి రూ. 926.1 సగటు ధరలో 19 లక్షల షేర్లు అమ్మివేశారు. బీఎస్ఈ గణాంకాల ప్రకారం వీటి విలువ రూ. 176 కోట్లు. ఈ లావాదేవీ తదుపరి శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్‌లో ప్రమోటర్ల వాటా 49.25 శాతం నుంచి 41.41 శాతానికి దిగివచ్చింది. కాగా.. చార్టర్డ్ ఫైనాన్స్ అండ్ లీజింగ్, సింగులారిటీ ఈక్విటీ ఫండ్ 1, ఏస్ ఇన్‌ఫ్రాసిటీ డెవలపర్స్, సేజ్‌వన్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, రితీ ఫౌండేషన్ ఈ షేర్లను సొంతం చేసుకున్నాయి.

జపాన్‌ను అధిగమిస్తున్నందుకు సంతృప్తి చెందొద్దు

తలసరి ఆదాయం భారత్‌లో ఎంతో తక్కువ

- డబ్ల్యూఈఎఫ్ మాజీ ఎండీ క్లైడే స్మద్జా




న్యూఢిల్లీ: భారత్ జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నందుకు సంతృప్తి చెందొద్దని.. తలసరి ఆదాయం పరంగా జపాన్‌తో పోల్చి చూస్తే భారత్ ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉన్నట్టు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) మాజీ ఎండీ క్లాడే స్మద్జా వ్యాఖ్యానించారు. ఐఎంఎఫ్ 2025 ఏప్రిల్ డేటా ప్రకారం భారత్‌లో తలసరి ఆదాయం 2,878 డాలర్లు. జపాన్ తలసరి ఆదాయం 33,956 డాలర్లలో పోల్చి చూస్తే కేవలం 8.5 శాతమే కావడం గమనార్హం. భారత్ తలసరి ఆదాయం కంటే జపాన్‌లో తలసరి ఆదాయం 11.8 రెట్లు అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ''భారత్ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకోవడం సాధించిన ప్రగతికి సంబంధించి మంచి సంకేతమే. కానీ, ఈ విషయంలో సంతృప్తి చెందడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదు''అని పేర్కొన్నారు. ఆర్థికంగా భారత్ కొత్త స్థానానికి చేరుకోవడం అన్నది.. సంస్కరణలను వేగవంతం చేయడానికి.. అభివృద్ధి ఫలాలు కేవలం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి వర్గాలకే పరిమితం కాకుండా పౌరులు అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రేరణ కావాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా సాంకేతిక పోటీలో భారత్ కీలకమైన కూడలిలో ఉన్నట్టు తెలియజేస్తూ.. బిగ్ డేటా పరంగా ఆధిక్యత ప్రదర్శిస్తున్నట్టు స్మద్జా తెలిపారు. ఈ స్థానాన్ని తప్పకుండా కాపాడుకోవడంతోపాటు.. అంతర్జాతీయంగా టెక్నాలజీ, ఆవిష్కరణల్లో అగ్రస్థానానికి చేరుకోవడానికి దీన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

చేతులు మారిన విప్రో ప్రమోటర్ వాటా

1.93 శాతం వాటా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ చేతికి

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐటీ దిగ్గజం విప్రో ప్రమోటర్ల వాటాలో 1.93 శాతం చేతులు మారింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సమాచారం ప్రకారం 1.93 శాతం వాటాకు సమానమైన 20.23 కోట్ల ఈక్విటీ షేర్లను అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ విక్రయించింది. వీటిని షేరుకి రూ. 250 సగటు ధరలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు చెందిన ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హర్షమ్ ట్రేడర్స్ అండ్ ప్రజీమ్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 5,057 కోట్లుకాగా.. ప్రజీమ్, జాష్, హర్షమ్ ట్రేడర్స్ విప్రో ప్రమోటర్ గ్రూప్ సంస్థలే కావడం గమనార్హం! కాగా.. గతేడాది నవంబర్‌లో ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 1.6 శాతం వాటాకు సమానమైన 8.49 కోట్ల విప్రో షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,757 కోట్లు వెచ్చించింది. అయితే ప్రజీమ్, జాష్ ట్రేడర్స్ వీటిని విక్రయించిన విషయం విదితమే.

క్వాంటమ్ ఎనర్జీ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల అంకుర సంస్థ క్వాంటమ్ ఎనర్జీ తమ తయారీ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని మహేశ్వరంలో ఏటా 2 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ప్రాంతీయంగా ఉపాధి కల్పనకు కూడా ఇది దోహదపడుతుందని సంస్థ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. ప్రస్తుతం ఏటా 1 లక్ష వాహనాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నట్లు చెప్పారు. ప్లాస్మా, మిలన్, బిజినెస్ పేరిట క్వాంటమ్ వాహనాలు విక్రయిస్తోంది.

ఆడి కొత్త సిగ్నేచర్ ఎడిషన్ ఏ4 విడుదల



ముంబై, జూన్ 9: జర్మనీ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి పాపులర్ సెడాన్ కారు ఏ4 సిగ్నేచర్ ప్రత్యేక ఎడిషన్‌ని భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ ప్రత్యేక ఎడిషన్ కారు ధర రూ. 57,11,000 (ఎక్స్ షోరూమ్)గా ప్రకటించింది. నాలుగు రంగుల్లో కస్టమర్లకు అందుబాటులో ఉండే ఈ సిగ్నేచర్ ఎడిషన్‌లో ప్రీమియం స్టైలింగ్, ఎలిగెంట్ డిజైన్ ప్రధాన ఆకర్షణలు. ఈ సందర్భంగా ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లోన్ మాట్లాడుతూ –'ఆడి ఏ4 సేల్స్‌లో మంచి గుర్తింపు పొందిన ఈ సెడాన్ కారు తాజా సిగ్నేచర్ ఎడిషన్ ద్వారా కస్టమర్లకు మరింత ప్రీమియం అనుభూతిని కలిగిస్తాం' అని చెప్పారు.

సంక్లిష్ట చక్రంలో సూక్ష్మ రుణ రంగం

అధిక వడ్డీ రేట్లు, కఠిన వసూళ్ల ప్రక్రియలు • ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు



ముంబై: అధిక రుణ భారం, గరిష్ట వడ్డీ రేట్లు, కఠిన వసూళ్ల ప్రక్రియలతో కూడిన సంక్లిష్ట సైకిల్‌తో సూక్ష్మ రుణ రంగం సతమతమవుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్‌రావు అన్నారు. 'అందరికీ ఆర్థిక సేవలు' అన్న అంశంపై హెచ్ఎస్‌బీసీ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. సూక్ష్మ రుణాలపై అధిక వడ్డీ రేట్లను ప్రధానంగా ప్రస్తావించారు. జనాభాలో మినహాయింపు వర్గాలకు సంఘటిత ఆర్థిక సేవలను అందించడంలో సూక్ష్మ రుణ రంగం విశ్వసనీయ వేదికగా ఉన్నట్టు పేర్కొన్నారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేసే విషయంలో సూక్ష్మ రుణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయంటూ.. ఈ విషయంలో కొన్ని సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఇటవలి త్రైమాసికాల్లో సూక్ష్మ రుణాలపై వడ్డీ రేట్లు కొంత మోస్తరు స్థాయికి రావడాన్ని గమనించినట్టు చెప్పారు. అయినప్పటికీ వడ్డీ రేట్లు, మార్జిన్లు గరిష్ట స్థాయిలోనే కొనసాగుతున్నట్టు తెలిపారు. కొన్ని సంస్థలకు తక్కువ వ్యయాలకే నిధులు లభిస్తున్నప్పటికీ మిగిలిన పరిశ్రమతో పోల్చితే అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అధిక రాబడులను ఇచ్చే సంప్రదాయ వ్యాపారానికి వెలుపలి అవకాశాలపై రుణదాతలు దృష్టి సారించాలని సూచించారు.

ప్రక్రియలను మెరుగుపరుచుకోవాలి..

''సూక్ష్మ రుణ రంగంలో తరచుగా సమస్యలు ఏర్పడడం ఇటీవలి కాలంలో పెరిగింది. ఒక్కో రుణ గ్రహీత బకాయిల భారం పెరిగింది. దీంతో కొన్ని సందర్భాల్లో కఠిన వసూళ్ల ప్రక్రియలు విషాద పరిణామాలకు దారితీస్తున్నాయి''అని రాజేశ్వరరావు చెప్పారు. ఇలాంటి వాటిని పరిష్కరించుకోవడం భాగస్వాములు అందరి ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా అవసరమని పేర్కొన్నారు. రుణ గ్రహీతలు అధికంగా రుణం తీసుకోవడాన్ని నిరోధించేందుకు వీలుగా నియంత్రిత సంస్థలు తమ క్రెడిట్ ఆమోద ప్రక్రియలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే, కఠిన రుణ వసూళ్ల ప్రక్రియలను విడిచి పెట్టాలన్నారు. స్థిరమైన, బాధ్యతాయుత విధానంలో సేవలు అందించాలని సూచించారు. ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడాన్ని కూడా రాజేశ్వరరావు ప్రస్తావించారు. ఈ విషయంలో నిబంధనలు తీసుకురావాలా? లేదా అన్నదాన్ని ఆర్‌బీఐ పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

ఆతిథ్య రంగంలో 6-8 శాతం వృద్ధి

ఈ రంగానికి స్థిరమైన అవుట్‌లుక్

- మధ్యకాలానికి సానుకూల డిమాండ్
- గదుల టారిఫ్‌లు పెరుగుతాయి
- రేటింగ్ సంస్థ ఇక్రా నివేదిక



న్యూఢిల్లీ: దేశ ఆతిథ్య రంగం (హాస్పిటాలిటీ) ఈ ఆర్థిక సంవత్సరంలో 6-8 శాతం మధ్య వృద్ధి చెందొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. ఈ రంగానికి అవుట్‌లుక్‌ను సానుకూలం నుంచి స్థిరత్వానికి తగ్గించింది. జమ్మూ కశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వచ్చే కొన్ని నెలల పాటు భారత్‌కు విదేశీ పర్యాటకుల రాక స్తబ్దుగా ఉంటుందని, ఆ తర్వాత నుంచి క్రమంగా పుంజుకోవచ్చని తెలిపింది. ఆతిథ్య రంగానికి దేశీ పర్యాటకం ఇప్పటి వరకు కీలక చోదకంగా ఉండగా, సమీప కాలంలోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా వేసింది. మౌలిక సదుపాయాలు, విమాన సేవల అనుసంధానత మెరుగుపడడం, జనాభా పరంగా సానుకూలత, ఎంఐసీఈ కార్యక్రమాలు పెరగడం, గత కొన్నేళ్లలో కొత్త కన్వెన్షన్ సెంటర్లు అందుబాటులోకి రావడం మధ్యకాలంలో ఆతిథ్య రంగంలో వృద్ధికి సానుకూలిస్తాయని ఇక్రా తెలిపింది. 2025-26లో ఆతిథ్య రంగం ఆదాయాలు, రుణ పరిస్థితులు స్థిరంగా ఉంటాయని పేర్కొంది. సానుకూల అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్య కాలంలో అప్‌గ్రేడ్‌ను సూచిస్తే.. స్థిరమైన అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్యకాలంలో మార్పులేమిని సూచిస్తుంది.

72-74 శాతం ఆక్యుపెన్సీ

దేశవ్యాప్తంగా ప్రీమియం హోటళ్లలో ఆక్యుపెన్సీ (గదుల బుకింగ్) 2025-26 సంవత్సరంలో 72-74 శాతం మధ్య ఉండొచ్చన్నది ఇక్రా అంచనా. 2023-24లో నమోదైన 70-72 శాతంతో పోల్చితే కాస్త పెరగనుంది. ప్రీమియం హోటళ్లలో సగటు రూమ్ ధరలు రూ.8,200-8,500 మధ్య ఉండొచ్చని ఇక్రా తెలిపింది. 2024-25లో ఈ ధరలు రూ.8,000-8,200 మధ్య ఉన్నట్టు వెల్లడించింది. కొన్ని హోటళ్ల నవీకరణ చేపట్టడం, సరఫరా పెరగకపోవడంతో ధరలు పెరగనున్నట్టు పేర్కొంది. ''మూడేళ్లపాటు వరుసగా బలమైన డిమాండ్‌ను ఆతిథ్య పరిశ్రమ చూసింది. దేశీ విహార పర్యటనలు, సమావేశాలు, సదస్సులకు (ఎంఐసీఈ) డిమాండ్, వివాహాలు, వ్యాపార పర్యటనలు ఇందుకు అనుకూలించాయి. కానీ, 2025-26లో 6-8 శాతం మేర మోస్తరు వృద్ధికి పరిమితం కావొచ్చు'' అని ఇక్రా లిమిటెడ్ కార్పొరేట్ రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జితిన్ మక్కర్ తెలిపారు. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి, మే నెలలో ఉత్తర, పశ్చిమ భారత్‌లో అనిశ్చితులు పెరగడంతో ప్రయాణ, ఎంఐసీఈ కార్యక్రమాల రద్దులు పెరిగినట్టు చెప్పారు. ఇటీవలి వారాల్లో డిమాండ్ కోలుకుంటున్నట్టు తెలిపారు. ఆదాయంలో వృద్ధి తక్కువగానే ఉన్నప్పటికీ.. 13 బడా హోటల్ కంపెనీలు 34-36 శాతం మధ్య మార్జిన్లు నమోదు చేయొచ్చని ఇక్రా అంచనా వేసింది. వ్యయ నియంత్రణలు, అస్సెట్ లైట్ (అద్దెకు తీసుకోవడం) నమూనా మార్జిన్లకు మద్దతునిస్తాయని తెలిపింది.

ఈ ఏడాది... కలిసొచ్చింది!

- బిగ్‌బాష్ లీగ్‌లో మొదటిసారి నెగ్గిన హోబర్ట్ హరికేన్స్
- ఎఫ్ఏ కప్‌లో 119 ఏళ్ల తర్వాత కప్పు గెలిచిన క్రిస్టల్ ప్యాలెస్



ఆర్‌సీబీ ఒక్కటే కాదు... మరో 11 జట్లకు ఈ సంవత్సరమే తొలి టైటిల్

ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు...అది క్రీడా రంగమైతే ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పోరాడతారు!ఎన్ని అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా నిలబడతారు....అడ్డంకులను అధిగమిస్తూ గమ్యానికి చేరువవుతారు! సర్వశక్తులు ధారపోసినా కొన్నిసార్లు ఆశించిన ఫలితం రాదు...అయినా వెనకడుగు వేయకుండా ఎట్టకేలకు గెలుపు రుచి చూస్తారు!

తాజా ఐపీఎల్ ఫలితాన్ని విశ్లేషిస్తే ఈ విషయం అవగతమవుతుంది. లీగ్ ప్రారంభం నుంచి ట్రోఫీ చేజిక్కించుకోవడం కోసం తహతహలాడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు... ఎట్టకేలకు 18వ సీజన్‌లో తమ కల నెరవేర్చుకుంది. ఐపీఎల్ ఆరంభం నుంచి బెంగళూరు జట్టుతోనే కొనసాగుతున్న 'కింగ్' విరాట్ కోహ్లి ఆ సంతోషంలో మునిగి తేలుతున్నాడు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది వివిధ క్రీడాంశాల్లో 11 జట్లు ఇలా తొలిసారి తమ 'కప్పు కల'ను తీర్చుకున్నాయి. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ తరహాలో... ఆస్ట్రేలియాలోని బిగ్‌బాష్ టి20 లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్, చాంపియన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ), ఎఫ్ఏ కప్‌లో క్రిస్టల్ ప్యాలెస్ జట్టు ఈసారే తొలి టైటిల్ సాధించాయి. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఇలా వేర్వేరు ఆటల్లో తొలిసారి ట్రోఫీ చేజిక్కించుకున్న జట్లపై ప్రత్యేక కథనం...

- సాక్షి క్రీడావిభాగం

క్రిస్టల్ ప్యాలెస్... 119 ఏళ్ల తర్వాత!



ఐపీఎల్‌లో తొలి టైటిల్ గెలిచేందుకు బెంగళూరుకు 18 సీజన్లు ఎదురు చూడాల్సి వచ్చిందని అనుకుంటుంటే... ఫుట్‌బాల్ అసోసియేషన్ చాలెంజ్ కప్ (ఎఫ్ఏ కప్)లో క్రిస్టల్ ప్యాలెస్ జట్టు 119 సంవత్సరాల తర్వాత తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. మే 17న జరిగిన ఫైనల్లో క్రిస్టల్ ప్యాలెస్ 1–0 గోల్స్ తేడాతో మాంచెస్టర్ సిటీ జట్టును ఓడించి టైటిల్ ఖాతాలో వేసుకుంది. శతాబ్దకాలంగా ఒక్కసారి కూడా కప్పు గెలవకపోయినా... తమ జట్టుకు అండగా నిలుస్తున్న అభిమానులకు ఈ విజయాన్ని అంకితమిచ్చింది.

18 ఏళ్ల తర్వాత ఆర్‌సీబీ...

టి20 ఫార్మాట్‌లో నిర్వహించిన తొలి ఐసీసీ ప్రపంచకప్ విజయవంతం కావడంతో ఆ మరుసటి ఏడాదే (2008)... ప్రతిష్టాత్మక ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభమైంది. అప్పటి నుంచి లీగ్‌లో పోటీ పడుతున్న ఆర్‌సీబీ జట్టు... ఎట్టకేలకు 18వ సీజన్‌లో విజేతగా నిలిచి ట్రోఫీని ముద్దాడింది. లీగ్ దశలో రెండో స్థానంలో నిలిచిన బెంగళూరు... క్వాలిఫయర్–1తో పాటు తుదిపోరులోనూ పంజాబ్ కింగ్స్‌ను ఓడించి టైటిల్ ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఒకే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక ప్లేయర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన కోహ్లి ఎట్టకేలకు చాంపియన్ హోదా దక్కించుకున్నాడు. బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన కోహ్లి... కప్పును చేతబట్టి చిన్నపిల్లాడిలా సంబరాల్లో మునిగిపోవడం అభిమానులను ఎంతగానో అలరించింది.

అర్ధశతాబ్దం తర్వాత...



సుదీర్ఘ చరిత్ర ఉన్న బొలోగ్నా ఫుట్‌బాల్ క్లబ్... అర్ధశతాబ్దం తర్వాత కోపా ఇటాలియా కప్ చేజిక్కించుకుంది. మే 15న మిలాన్ వేదికగా జరిగిన తుదిపోరులో బొలోగ్నా జట్టు 1–0 గోల్స్ తేడాతో ఏసీ మిలాన్ జట్టుపై గెలిచింది. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ప్రమాదకర జట్టుగా ముద్రపడ్డ బొలోగ్నా... ఎట్టకేలకు 51 సంవత్సరాల తర్వాత ఒక మేజర్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది.

90 ఏళ్ల తర్వాత...



బెల్జియంకు చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ రాయల్ యూనియన్ సెయింట్ గిల్లోయిస్ ఇప్పటి వరకు 12 టైటిల్స్ సాధించింది. అందులో 11 ట్రోఫీలను 1904 నుంచి 1935 మధ్య గెలుచుకున్న రాయల్ యూనియన్ 90 ఏళ్ల పోరాటం తర్వాత పన్నెండో టైటిల్ ఖాతాలో వేసుకుంది. ఒకదశలో ద్వితీయ డివిజన్‌కు పడిపోయిన ఆ జట్టు... తిరిగి పుంజుకొని విజయం సాధించడం విశేషం.

హోబర్ట్ హరికేన్స్ తొలిసారి...



ఆస్ట్రేలియా ప్రఖ్యాత టి20 టోర్నమెంట్ బిగ్‌బాష్ లీగ్ లో కొత్త విజేత అవతరించింది. 2011 నుంచి నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ మొదటిసారి ట్రోఫీ ముద్దాడింది. జనవరి 27న జరిగిన ఫైనల్లో హోబర్ట్ హరికేన్స్ 7 వికెట్ల తేడాతో సిడ్నీ థండర్స్‌పై గెలిచి విజేతగా నిలిచింది. ఓపెనర్ మిచెల్ ఓవెన్ (42 బంతుల్లో 108; 6 ఫోర్లు, 11 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగడంతో ఫైనల్లో హరికేన్స్ సునాయాసంగా గెలుపొందింది.

1933 తర్వాత తొలిసారి...



నెదర్లాండ్స్‌లోని డెవెంటర్ నగరానికి చెందిన 'గో అహెడ్ ఈగల్స్' ఫుట్‌బాల్ జట్టు... సుదీర్ఘ పోరాటం తర్వాత ఈ ఏడాది తమ తొలి టైటిల్ సాధించింది. 1920 నుంచి 1930 వరకు ప్రత్యర్థులను భయపెట్టిన ఈగల్స్... 1933 తర్వాత తొలి సారి డచ్ కప్ గెలుచుకుంది. ఏప్రిల్ 21న జరిగిన తుదిపోరు 'షూటౌట్'లో ఈగల్స్ విజయం సాధించి కప్పు కల తీర్చుకుంది.

స్టుట్‌గార్ట్ 28 ఏళ్ల తర్వాత...



జర్మనీకి చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ వీఎఫ్‌బీ స్టుట్‌గార్ట్.. 28 ఏళ్ల తర్వాత డీఎఫ్‌బీ పోకల్ ఫైనల్లో విజేతగా నిలిచింది. మే 24న జరిగిన తుది పోరులో స్టుట్‌గార్ట్ 4–2 గోల్స్ తేడాతో అరిమినియా బీలెఫెల్డ్ జట్టును ఓడించింది. ఈ టోర్నీలో స్టుట్‌గార్ట్ విజేతగా నిలవడం ఇది నాలుగోసారి. అయితే దాదాపు మూడు దశాబ్దాలకు ముందే మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన స్టుట్‌గార్ట్... మళ్లీ ఇన్నాళ్లకు తమ టైటిల్స్ సంఖ్యను నాలుగుకు పెంచుకుంది.

హ్యారీ కేన్‌కు మరింత ప్రత్యేకం...

ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు స్టార్ హ్యారీ కేన్‌కు కూడా ఈ ఏడాది చాలా గొప్పగా సాగింది. కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన కేన్‌కు టైటిల్ లోటు మాత్రం ఉండిపోయింది. అయితే ఈ ఇంగ్లండ్ స్ట్రయికర్ ఈ ఏడాది తన కప్పు కలను నెరవేర్చుకున్నాడు. బేయర్న్ మ్యూనిక్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ... బుండెస్‌లిగా ట్రోఫీ కై వసం చేసుకున్నాడు. ఈ లీగ్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన కేన్... జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.



పీఎస్‌జీ 43 ఏళ్ల తర్వాత...



ప్రతిష్టాత్మక చాంపియన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) జట్టు తొలిసారి విజేతగా నిలిచింది. జూన్ 1న జరిగిన తుదిపోరులో పీఎస్‌జీ జట్టు 5–0 గోల్స్ తేడాతో ఇంటర్ మిలాన్ జట్టుపై గెలుపొందింది. సుదీర్ఘ చరిత్రగల యూరోపియన్ కప్‌లో పీఎస్‌జీ జట్టుకు 43 ఏళ్ల తర్వాత ఇదే మొదటి టైటిల్ కావడంతో అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి.

70 ఏళ్ల తర్వాత...



1955లో చివరిసారిగా ఎఫ్ఏ కప్ సొంతం చేసుకున్న న్యూ క్యాజిల్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్... ఏడు దశాబ్దాల తర్వాత ఇన్నాళ్లకు ఈ ఏడాది ఇంగ్లిష్ ఫుట్‌బాల్ లీగ్ కప్ గెలుచుకుంది. ఈ ఏడాది మార్చి 16న జరిగిన తుదిపోరులో న్యూక్యాజిల్ జట్టు 2–1 గోల్స్ తేడాతో లివర్‌పూల్‌ను మట్టికరిపించి చాంపియన్‌గా అవతరించింది.

అదే బాటలో ఇండియానా పేసర్స్..



నేషనల్ బాస్కెట్‌బాల్ సంఘం (ఎన్‌బీఏ) లీగ్‌లో కూడా ఈ ఏడాది కొత్త చాంపియన్ అవతరించడం ఖాయమైంది. ఇండియానా పేసర్స్, ఒక్లాహోమా థండర్ సిటీ జట్ల మధ్య 'బెస్ట్ ఆఫ్ సెవెన్' పద్ధతిలో టైటిల్ పోరు జరగనుంది. గతంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ఇండియానా పేసర్స్ జట్టు... ఈ ఏడాది చక్కటి ఆటతీరుతో ఎన్‌బీఏ ఫైనల్‌కు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన తొలి ఫైనల్లో ఇండియానా పేసర్స్ 111–110తో ఒక్లాహోమా సిటీ థండర్‌పై నెగ్గగా... ఆదివారం జరిగిన రెండో ఫైనల్లో ఒక్లాహోమా సిటీ థండర్ 123–107తో ఇండియానా పేసర్స్ జట్టును ఓడించింది. ఏడింటిలో తొలుత నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన జట్టు విజేతగా నిలుస్తుంది.

17 ఏళ్ల తర్వాత...



ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ టోటెన్‌హామ్ హాట్‌స్పర్... 17 ఏళ్ల పోరాటం తర్వాత ఈ ఏడాది యూరోపా లీగ్ ట్రోఫీ దక్కించుకుంది. మే 22న జరిగిన ఫైనల్లో టోటెన్‌హామ్ ఎఫ్‌సీ 1–0 గోల్స్ తేడాతో మాంచెస్టర్ యునైటెడ్‌పై గెలిచి సంబరాల్లో మునిగిపోయింది.



పోర్చు 'గోల్' చేరింది

- నేషన్స్ లీగ్ టైటిల్‌ను రెండోసారి సొంతం చేసుకున్న రొనాల్డో బృందం
- ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ స్పెయిన్‌పై 'షూటౌట్'లో గెలుపు

మ్యూనిక్: జగద్విఖ్యాత స్ట్రయికర్ క్రిస్టియానో రొనాల్డో నేషన్స్ లీగ్‌లో పోర్చుగల్ జట్టును విజేతగా నిలిపాడు. ఆద్యంతం ఉత్కంఠను రేపిన ఫైనల్లో రొనాల్డో నాయకత్వంలోని పోర్చుగల్ జట్టు 'పెనాల్టీ షూటౌట్'లో 5–3తో డిఫెండింగ్ స్పెయిన్‌పై విజయం సాధించి ఈ టోర్నీలో రెండోసారి విజేతగా నిలిచింది. 2018–2019లో తొలిసారి జరిగిన నేషన్స్ లీగ్ టోర్నీలోనూ పోర్చుగల్ జట్టుకే టైటిల్ లభించింది. నిర్ణీత సమయం, అదనపు సమయం ముగిసేవరకు పోర్చుగల్, స్పెయిన్ జట్లు 2–2 గోల్స్‌తో సమఉజ్జీగా నిలిచాయి. దీంతో 'షూటౌట్' అనివార్యమైంది. ఇందులో పోర్చుగల్ గోల్ కీపర్ డీగో కోస్టా కీలకపాత్ర పోషించాడు. నాలుగో పెనాల్టీకి దిగిన స్పెయిన్ స్ట్రయికర్ అల్వారో మొరాటా కిక్‌ను డీగో కోస్టా సమర్థంగా అడ్డుకోవడంతోనే పోర్చుగల్‌కు విజయం ఖాయమైంది. దీంతో మైదానంలోని రొనాల్డో అభిమానులు విజయ సంబరాల్లో మునిగి తేలారు. స్పెయిన్ తరఫున మొదటి ముగ్గురు విజయవంతంగా గోల్స్ చేయగా... మొరాటా ఒక్కడే విఫలమయ్యాడు. అంతకుముందు రెగ్యులర్ టైమ్ మ్యాచ్ కూడా పోటాపోటీగా సాగింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో మార్టిన్ జుబిమెండి 21వ నిమిషంలో గోల్ చేసి స్పెయిన్‌ను 1–0తో ఆధిక్యంలో నిలిపాడు. అయితే ఐదు నిమిషాల వ్యవధిలోనే న్యూనో మెండెస్ (26వ నిమిషంలో) గోల్ కొట్టడంతో 1–1తో స్కోరు సమమైంది. తిరిగి తొలి అర్ధభాగం ముగిసే ఆఖరి నిమిషంలో స్పెయిన్ ఆటగాడు ఒయర్జబెల్ (45వ నిమిషంలో) గోల్ చేసి 2–1తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ద్వితీయార్ధం మొదలయ్యాక పోర్చుగల్ ఈ స్కోరును సమం చేసేందుకు ఎంతగానో ప్రయత్నించినా... స్పెయిన్ రక్షణపంక్తి, గోల్ కీపర్ సమన్వయంతో ఒక్క షాట్ కూడా లక్ష్యాన్ని చేరలేదు. ఎట్టకేలకు స్టార్ స్ట్రయికర్ రొనాల్డో 61వ నిమిషంలో చేసిన గోల్ వల్లే పోర్చుగల్ మ్యాచ్‌లో నిలిచింది. దీంతో అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో అతని రికార్డు గోల్ స్కోరు 138కి చేరింది. అక్కడ 2–2తో సమమైన స్కోరు నిర్ణీత సమయం, అదనపు సమయం ముగిసేవరకు కొనసాగింది. విజేతను తేల్చేందుకు షూటౌట్‌ను నిర్వహించగా స్పెయిన్ తరఫున మెరినో, బెయెనా, ఇస్కో సఫలమవగా, మొరాటా నిరాశపరిచాడు. పోర్చుగల్ తరఫున రామొస్, విటిన్‌హా, ఫెర్నాండెజ్, మెండెస్, నివెస్ ఇలా ఐదుగురు గోల్స్ చేయడంతో ట్రోఫీ చేజిక్కించుకుంది. విజయానంతరం 40 ఏళ్ల రొనాల్డో భావోద్వేగానికి గురయ్యాడు. 'క్లబ్‌ల తరఫున ఇదివరకు ఎన్నో టైటిల్స్ గెలిచాను. కానీ అవేవీ పోర్చుగల్ విజయానికి సాటిరావు. దేశానికి ట్రోఫీ అందించిన ఆనందం ఎప్పటికీ ప్రత్యేకం' అని ఉబికివచ్చే కంట నీరును అదుపు చేసుకుంటూ వ్యాఖ్యానించాడు.

సహజకు డబుల్స్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి డబుల్స్ టైటిల్‌ను సాధించింది. డొమినికన్ రిపబ్లిక్ రాజధాని సాంటో డొమింగోలో జరిగిన ఈ టోర్నీలో సహజ (భారత్)–హిరోకో కువాటా (జపాన్) జోడీ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఫైనల్లో సహజ–హిరోకో ద్వయం 6–3, 6–2తో ఎస్టెర్ అడెషినా (బ్రిటన్)–సోఫియా ఎలీనా (వెనిజులా) జంటపై గెలిచింది. ఐటీఎఫ్ సర్క్యూట్‌లో సహజకిదే తొలి డబుల్స్ టైటిల్. సింగిల్స్ విభాగంలో ఆమె నాలుగు టైటిల్స్ సొంతం చేసుకుంది.



అతిపెద్ద కంటైనర్ నౌకకు
కేరళలో జల వందనం

తిరువనంతపురం: ఎంఎస్సీ–ఇరీనా.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కంటైనర్ నౌక. సోమవారం ఉదయం కేరళలోని విళింజమ్ ఇంటర్నేషన్ సీపోర్టుకు చేరుకుంది. పోర్టు అధికారులు సాదర స్వాగతం పలికారు. సంప్రదాయ రీతిలో జల వందనం సమర్పించారు. ఈ నౌక పొడవు 399.9 మీటర్లు, వెడల్పు 61.3 మీటర్లు. ఫీఫా మ్యాచ్‌ల కోసం డిజైన్ చేసే ఫుట్‌బాల్ పిచ్ కంటే నాలుగు రెట్లు పెద్దది. ఏకంగా 24,346 కంటైనర్లను మోసుకెళ్లగలదు. ఇది ప్రస్తుతం విళింజమ్ పోర్టులో ఆగింది. మంగళవారం తిరిగి వెళ్లే అవకాశం ఉంది. ఎంఎస్సీ–ఇరీనా నౌక రాక పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు.



కేరళ సమీపంలో నౌకలో అగ్నిప్రమాదం

నలుగురి జాడ గల్లంతు ● 18 మందిని రక్షించిన తీరగస్తీ బలగాలు

కొచ్చి: సింగపూర్ జెండాతో శ్రీలంక నుంచి ముంబైకి బయల్దేరిన విదేశీ కంటైనర్ సరకు రవాణా నౌక కేరళ సమీప సముద్రజలాల్లో అగ్నిప్రమాదానికి గురైంది. 22 మంది సిబ్బంది ఉన్న ఈ నౌక నుంచి 18 మందిని భారత తీర గస్తీ బలగాలు కాపాడాయి. 270 మీటర్ల పొడవైన ఎంవీ వాన్ హాయ్503 పేరు గల ఈ నౌకలో నలుగురి జాడ గల్లంతయింది. కేరళలోని కన్నూర్ జిల్లాలోని అరిఖక్కల్ పట్టణ తీరం నుంచి 44 నాటికల్ మైళ్ల దూరంలో సోమవారం ఉదయం 9.20 గంటలకు ఈ దుర్ఘటన సంభవించింది. విషయం తెల్సిన వెంటనే భారత గస్తీ బలగాలు రంగంలోకి దిగి 18 మంది సిబ్బందిని కాపాడాయి. నౌకలో ఎనిమిది మంది చైనా, ఆరుగు తైవాన్, ఐదుగురు మయన్మార్, ముగ్గురు ఇండోనేసియాకు చెందిన సిబ్బంది ఉండగా వారిలో 18 మందిని రక్షించగాలిగారు. వీరిని ఐఎన్ఎస్ సూరత్ నౌకలో మంగళూరు పోర్ట్‌కు తీసుకొచ్చారు. షెడ్యూల్ ప్రకారం నౌక జూన్10వ తేదీకల్లా ముంబైలోని నవాషేవా ప్రాంతానికి చేరుకోవాల్సి ఉండగా మార్గమధ్యంలోనే ప్రమాదానికి గురైంది. గత 30 రోజుల్లో కేరళ సమీపంలో సరకు రవాణానౌక ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. మే 24న లైబీరియా జెండాతో వెళ్తున్న కార్గో నౌక తీరానికి 14.6 మైళ్లదూరంలో మునిగిపోయింది.

న్యాయ వ్యవస్థ స్వతంత్రత

కాపాడేందుకే కొలీజియం

కొలీజియం వ్యవస్థలో లోపాలున్న మాట నిజమే

- న్యాయవ్యవస్థ పదేపదే పారదర్శకత నిరూపించుకోవాలి
- జడ్జీలు సైతం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు ఇది ముఖ్యమైన భద్రతా వ్యవస్థగా కొనసాగుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. కొలీజియం వ్యవస్థపై విమర్శలు వస్తున్నాయని అంగీకరించారు. ఈ వ్యవస్థ పరిపూర్ణం కాదని చెప్పారు. కానీ, కార్యనిర్వాహక వర్గం జోక్యం నుంచి న్యాయమూర్తులను రక్షించడంలో కొలీజియం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న జస్టిస్ సూర్యకాంత్ తాజాగా సియాటెల్ యూనివర్సిటీలోని 'రౌండ్ గ్లాస్ ఇండియా సెంటర్'లో జరిగిన కార్యక్రమంతోపాటు మరో రెండు చోట్ల కీలక ప్రసంగాలు చేశారు. సుప్రీంకోర్టు ఇటీవల చేపట్టిన పలు చర్యలను ప్రస్తావించారు. న్యాయ వ్యవస్థలో పారదర్శకతను మెరుగుపర్చేందుకే వీటిని అమల్లోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల్లో విశ్వాసం పెంచుకోవడానికి న్యాయవ్యవస్థ పదే పదే తమ పారదర్శకతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కొలీజియంపై వస్తున్న విమర్శలను నిరాకరించలేమని, ఈ వ్యవస్థను మరింత మెరుగుపర్చాలన్న సంకల్పంతో న్యాయ వ్యవస్థ ముందడుగు వేస్తోందని ఉద్ఘాటించారు.

న్యాయం అంటే సిద్ధాంతం, బాధ్యత

న్యాయమూర్తులు అంటే అపరిమిత అధికారం కలిగినవారు కాదని... వారు కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమేనని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలను నిలబెట్టే విధంగా వ్యవహరించాలని న్యాయమూర్తులకు సూచించారు. కోర్టులు అధికారాన్ని ప్రదర్శించే వ్యవస్థలుగా కాకుండా, ప్రజాస్వామ్య ప్రయాణంలో భాగస్వాములై ఉండాలని పేర్కొన్నారు. న్యాయం అనేది తాత్కాలికంగా పంపిణీ చేయాల్సిన ఉత్పత్తి కాదని.. అది ఒక సిద్ధాంతం, ఒక బాధ్యత అని తేల్చిచెప్పారు. స్వేచ్ఛ, సమానత్వం, స్వయం పాలన అనేవి అనుకోకుండా వచ్చినవి కాదని, ఇవన్నీ సుదీర్ఘమైన పోరాటాల ఫలితంగా సమాజానికి లభించాయని జస్టిస్ సూర్యకాంత్ గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో సీనియారిటీ ఆధారంగా, ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తరువాత జస్టిస్ సూర్యకాంత్ 2025 నవంబర్‌లో భారత సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

మళ్లీ ట్రంప్‌కు

మస్క్ మద్దతు!

వాషింగ్టన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డోజ్) నుంచి నిష్క్రమణ, వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ విషయంలో తీవ్రస్థాయిలో విబేధాలతో ఎడమొఖం పెడముఖంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య సయోధ్యకు ఒక ఆశ చిగురించింది. ఇందుకు లాస్ ఏంజెలెస్ అక్రమవలసదారుల అరెస్ట్‌ల వ్యతిరేక ఉద్యమం కారణంకావడం విశేషం. బాధ్యతాయుతంగా పరిపాలించడంలో మీరిద్దరూ విఫలం కావడం వల్లే లాస్ ఏంజెలెస్‌లో ఉద్యమం ఇంతటి స్థాయిలో ఉధృతంగా కొనసాగుతోందని, దీనికి బాధ్యత వహిస్తూ కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ నూసమ్, నగర మహిళా మేయర్ కరెన్ బాస్ తనకు క్షమాపణ చెప్పాలని ట్రంప్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ట్రంప్ చేసిన ఒక 'ఎక్స్' పోస్ట్‌ను మస్క్ సోమవారం రీపోస్ట్ చేశారు. ట్రంప్ చర్యను సమర్థించారు.

మోదీ పాలనలో ఆకలి, అసమానతలే

11 ఏళ్ల పాలనపై కాంగ్రెస్ 'రిపోర్ట్ కార్డు' విడుదల

న్యూఢిల్లీ: దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఆకలి, అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపించారు. వృద్ధి రేటు పడిపోయిందని, ధరలు పెరిగిపోయాయని, హామీలు అమలుకు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనపై కాంగ్రెస్ సోమవారం రిపోర్ట్ కార్డు విడుదల చేసింది. ఇందులో రెండు బుక్‌లెట్లు ఉన్నాయి. ఒకదాంట్లో 2024లో బీజేపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, మరొక బుక్‌లెట్‌లో గత 11 ఏళ్లలో ఇచ్చిన వాగ్దానాలు ఉన్నాయి. ఈ వివరాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత రాజీవ్ గౌడ సోమవారం మీడియాతో మాట్లాడారు. తప్పుడు ప్రచారం, తప్పుడు వార్తలు సృష్టించడంలో మోదీ సర్కారు ఆరితేరిపోయిందని మండిపడ్డారు. వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీగా తమపై ఉందన్నారు. 81 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తున్నట్లు మోదీ ప్రభుత్వం చెప్పుకుంటోందని గుర్తుచేశారు. నిజానికి ప్రపంచ ఆకలి సూచీలో 127 దేశాలకు గాను మన దేశం 105వ స్థానంలో ఉందని వివరించారు. చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని వెల్లడించారు. మోదీ ప్రభుత్వ నిర్వాకాల వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు విపరీతంగ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రభుత్వం తప్పుడు ప్రచారంతో జనాన్ని మభ్యపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. కేవలం అబద్ధాలతో మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని కాంగ్రెస్ నేత మహిమా సింగ్ విమర్శించారు.

అఖిలపక్ష బృందాలతో నేడు మోదీ భేటీ

న్యూఢిల్లీ: పాకిస్తాన్ ఉగ్రోన్మాదాన్ని ప్రపంచానికి చాటేందుకు పలు దేశాల్లో పర్యటించిన అఖిలపక్ష బృందాలతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సమావేశం కానున్నారు. కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల ఎంపీలు, మాజీ దౌత్యవేత్తలు, కేంద్ర మాజీ మంత్రులు తదితరులతో కూడిన ఏడు బృందాలు 33 దేశాల్లో 10 రోజులకు పైగా పర్యటించడం తెలిసిందే. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, అనంతర పరిణామాలు తదితరాలను ఆయా దేశాల ప్రభుత్వాలతో పాటు మీడియాకు కూడా భారత బృందాలు కూలంకషంగా వివరించాయి. ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న రాజీలేని పోరుకు ఆ దేశాల మద్దతును బలంగా కూడగట్టగలిగాయి. ఈ విషయంలో భారత్‌కు దన్నుగా నిలుస్తామని, పోరులో కలిసి వస్తామని దాదాపుగా అన్ని దేశాలూ విస్పష్టంగా ప్రకటించాయి. పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగొచ్చిన అఖిలపక్ష బృందాలతో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇప్పటికే భేటీ అయ్యారు. వారు తమ బాధ్యతను అద్భుతంగా నిర్వర్తించి కేంద్ర ప్రభుత్వం వారిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. నాలుగు బృందాలకు అధికార ఎన్డీఏ కూటమి ఎంపీలు సారథ్యం వహించారు. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ ఎంపీలు ఒక్కో బృందం పర్యటించాయి.

'నమో' యాప్ సర్వేలో పాల్గొనండి

- 11 ఏళ్ల దేశ అభివృద్ధి ప్రయాణంపై అభిప్రాయాలు చెప్పండి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: గత 11 సంవత్సరాల్లో భారత్ సాధించిన అభివృద్ధి ప్రస్థానంపై 'నమో' యాప్ నిర్వహిస్తున్న 'జన్‌మన్' సర్వేలో పాలుపంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో పోర్టల్ లింకును షేర్ చేశారు. ''అన్నింటి కంటే మీ ఆలోచనలు మిన్న. నమో యాప్ ద్వారా సర్వేలో పాల్గొనండి. 11 ఏళ్ల దేశ అభివృద్ధి ప్రయాణంపై మీరు అభిప్రాయాలు వెల్లడించండి. దశాబ్దానికిపైగా భారత్ అభివృద్ధి ప్రస్థానాన్ని మీరు ఎలా చూస్తున్నారో మాకు తెలియజేయండి'' అని మోదీ పేర్కొన్నారు.

సోనియాగాంధీకి వైద్యపరీక్షలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీకి ఆదివారం వైద్య పరీక్షలు జరిగాయి. 78 ఏళ్ల సోనియా అధిక రక్తపోటుతో రెండు రోజుల క్రితం సిమ్లాలో ఆస్పత్రిలో చేరడం తెలిసిందే. శనివారం ఆమె ఆస్పత్రి నుంచి డిశ్చార్జయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో సోనియా సమగ్ర వైద్యపరీక్షలు చేయించుకున్నారు. గత ఫిబ్రవరిలో ఆరోగ్య సమస్యలతో ఆమె గంగారాం ఆస్పత్రిలోనే కొన్నాళ్లపాటు చికిత్స తీసుకున్నారు.

అమెరికాకు ఎగుమతులు 35 శాతం పతనం: చైనా

బీజింగ్: అమెరికా–చైనా మధ్య వాణిజ్యంలో అనిశ్చితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో అమెరికాకు ఎగుమతులు 35 శాతం పడిపోయినట్లు చైనా వెల్లడించింది. ఈ ఎగుమతుల విలువ 28.8 బిలియన్ డాలర్లు. గత ఏడాది మే నెలలో ఎగుమతుల విలువ 44 బిలియన్ డాలర్లుగా ఉంది. మరోవైపు అమెరికా–చైనా మధ్య వాణిజ్య చర్చలకు రంగం సిద్ధమవుతోంది. అతిత్వరలో లండన్‌లో ఈ చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలోకి వచ్చిన తర్వాత చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచిన సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్‌పై భీకర దాడి

- 479 డ్రోన్లు, 20 క్షిపణులు ప్రయోగించిన రష్యా
- వాటిని మధ్యలోనే కూల్చేశామన్న ఉక్రెయిన్

కీవ్: తమ గడ్డపై డ్రోన్లతో తమ యుద్ధ విమానాలను ధ్వంసం చేసిన ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం ప్రతీకార చర్యలు తీవ్రతరం చేసింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఏకంగా 479 డ్రోన్లు, 20 క్షిపణులు ఉక్రెయిన్ భూభాగంపై ప్రయోగించింది. రెండు దేశాల మధ్య మూడేళ్ల క్రితం యుద్ధం మొదలైన తర్వాత రష్యా ఒకేరాత్రి ఈ స్థాయిలో దాడికి దిగడం ఇదే మొదటిసారి. ప్రధానంగా మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లోని నగరాలు, పట్టణాలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిగాయి. అయితే, రష్యా ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను చాలావరకు మధ్యలోనే కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళం సోమవారం ప్రకటించింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌తో మొత్తం 277 డ్రోన్లు, 19 క్షిపణులు నేలమట్టం చేశామని వెల్లడించింది. రష్యా దాడిలో ఒకరు గాయపడినట్లు తెలియజేసింది. మరోవైపు రష్యాపై వైమానిక దాడులు యథావిధిగా కొనసాగిస్తున్నట్లు ఉక్రెయిన్ సైన్యం సోమవారం పేర్కొంది. సరిహద్దుకు 650 కిలోమీటర్ల దూరంలో రష్యా భూభాగంలో రెండు ఫైటర్ జెట్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అయితే, దీనిపై రష్యా సైన్యం స్పందించలేదు. మరోవైపు ఆదివారం రాత్రి ఉక్రెయిన్ ప్రయోగించిన 49 డ్రోన్లు కూల్చివేశామని రష్యా రక్షణ శాఖ తేల్చిచెప్పింది. ఇదిలా ఉండగా, మృతదేహాల అప్పగింతపై రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్నాయి. వచ్చే వారం కొన్ని మృతదేహాలను పరస్పరం అప్పగించుకొనే అవకాశం కనిపిస్తోంది.

వీడిన 'హనీమూన్' హత్య మిస్టరీ

మేఘాలయలో అదృశ్యమై యూపీలో ప్రత్యక్షమైన హతుడి భార్య

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన సోనమ్
- ఆమె, ప్రియుడు సహా ఐదుగురి అరెస్ట్
- రాజా రఘువంశీ హత్యకేసులో విడిపోతున్న చిక్కుముడులు

షిల్లాంగ్/లక్నో/ఘాజీపూర్/ఇండోర్: పెళ్లయిన తొమ్మిది రోజులకు హనీమూన్‌కు వెళ్లి మేఘాలయలో శవమై తేలిన నవవరుడు రాజా రఘువంశీ హత్య కేసులో ఎట్టకేలకు భార్య సోనమ్ ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో పోలీసులకు లొంగిపోయింది. ప్రియుడి ప్లాన్ ప్రకారం కొందరికి సుపారీ ఇచ్చి భర్తను ఆమెనే హత్య చేయించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రిదాటాక ఈ కేసులో పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వివరాలను మేఘాలయ మహిళా డీజీపీ ఇదాషీషా నోంగ్‌రాంగ్ సోమవారం పత్రికా సమావేశంలో చెప్పారు.

ప్రియుడు కుష్వాహాతో కలిసి కుట్ర!

సోనమ్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో 19 ఏళ్ల ఆకాశ్ రాజ్‌పుత్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 22 ఏళ్ల విశాల్ సింగ్ చౌహాన్, 21 ఏళ్ల రాజ్‌సింగ్ కుష్వాహా, బినా పట్టణంలో 23 ఏళ్ల ఆనంద్ కుర్మీలను పోలీసులు అరెస్ట్‌చేశారు. అయితే మీడియా కథనాల ప్రకారం మేఘాలయలో అదృశ్యమైన సోనమ్ ఆదివారం అర్ధరాత్రి దాటాక ఉత్తరప్రదేశ్‌లోని వారాణాసి–ఘాజీపూర్ రహదారి పక్కన కాశీ ధాబా వద్దకు ఒంటరిగా వచ్చి తన సోదరుడు, తన భర్త సోదరునికి ఫోన్ చేసింది. వాళ్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్నారు. ఆమె చాలా నీరసంగా కనిపించడంతో తొలుత సదర్ ఆస్పత్రికి తర్వాత 'వన్ స్టాప్ సెంటర్'కు తరలించి చివరకు అరెస్ట్‌చేశారు. అయితే తాను నిర్దోషినని, ఎవరో తనను కిడ్నాప్‌చేశారని సోనమ్ చెప్పింది. అయితే పోలీసులు మాత్రం భర్త హత్యోదంతంలో సోనమ్‌ది కీలకపాత్ర అని చెబుతున్నారు. సోనమ్ సోదరుడు నిర్వహించే ఒక కంపెనీలో పనిచేసే రాజ్‌సింగ్ కుష్వాహాకు ఆమెతో సన్నిహిత సంబంధం ఉందని, రాజ్‌సింగ్ ప్లాన్ ప్రకారమే మరికొందరికి సుపారీ ఇచ్చి సోనమే భర్తను చంపేయించిందని పోలీసులు చెప్పారు. కుష్వాహాతో సోనమ్ తరచూ మాట్లాడేదని రాజా రఘువంశీ సోదరుడు సైతం ఆరోపించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు కుష్వాహాకు స్నేహితులని తేలింది. ఇండోర్‌లో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసే రాజారఘువంశీకి సోనమ్‌తో మే11వ తేదీన వివాహమైంది. ఇద్దరు మే 20వ తేదీన మేఘాలయకు హనీమూన్‌కు వెళ్లారు. 22న మావ్‌లఖియాత్ గ్రామంలో ఒక స్కూటర్‌ను అద్దెకు తీసుకుని సజీవ చెట్ల వంతెనను చూసేందుకు వెళ్లి 23వ తేదీన అదృశ్యమయ్యారు. 10 రోజుల తర్వాత జూన్ రెండున భర్త మృతదేహాన్ని ఈస్ట్‌ఖాసీ హిల్స్ జిల్లాలోని వేసాడాంగ్ జలపాతం సమీప లోయలో పోలీసులు కుళ్లిన స్థితిలో కనుగొన్నారు. అప్పటి నుంచి సోనమ్ ఆచూకీ కోసం మేఘాలయ సిట్ పోలీసులు, రాష్ట్ర ఎన్డీఆర్ఎఫ్, స్థానిక నిఘా బృందాలు, స్థానిక యంత్రాంగం విస్తృతస్థాయిలో గాలిస్తుండటం తెల్సిందే. రాజ్ కుష్వాహా, విశాల్ చౌహాన్, ఆకాశ్ రాజ్‌పుత్‌లను ఇండోర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీళ్లను ఏడు రోజులపాటు మేఘాలయ పోలీసు కస్టడీకి అప్పగిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులిచ్చారు.



రిటర్న్ టికెట్లు బుక్‌చేయలేదు

కోడలు అరెస్ట్ వార్త తెలిసి రాజా తల్లి ఉమా రఘువంశీ మీడియాతో మాట్లాడారు. ''పెళ్లయ్యాక హనీమూన్‌కు వెళ్లే ఉద్దేశ్యం మా అబ్బాయికి లేదు. కానీ భార్య ప్రోద్బలంతోనే అతను ట్రిప్‌కు వెళ్లాడు. ట్రిప్‌కు వెళ్లబోతున్న విషయం కోడలు మాలో ఒక్కరికి కూడా చెప్పలేదు. మేఘాలయకు వెళ్లాలనే ప్లాన్ సోనమ్‌దేనని మా అబ్బాయి చిట్టచివర్లో చెప్పాడు. ట్రిప్ టికెట్లు ఆమెనే బుక్‌చేసింది. కానీ రిటర్న్ టికెట్లు బుక్‌చేయలేదు. నా కుమారుడు గాయాలపాలై చనిపోతే ఈమెకు ఒక్క గాయం కాకపోవడం అనుమానంగా ఉంది. నా కొడుకును ఆమెనే చంపి ఉంటే సోనమ్‌ను ఖచ్చితంగా ఉరితీయాల్సిందే''అని ఉమ డిమాండ్ చేశారు.

రాజా శరీరంపై లోతైన గాయాలు

రాజా మృతదేహానికి చేపట్టిన పోస్ట్‌మార్టమ్ నివేదిక తాజాగా బహిర్గతమైంది. తలపై రెండు లోతైన గాయాలున్నాయి. ఒకటి ముందువైపు, మరోటి వెనుకవైపు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. శరీరంపైనా కత్తి గాయాలున్నాయి. మధ్యప్రదేశ్‌లో పథకరచన చేసి, మేఘాలయలో అమలుచేసి, చివరకు ఉత్తరప్రదేశ్‌లో నిందితులు దొరికిపోయారని పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. తమ రాష్ట్రంలో హత్య జరగడంతో స్థానికులే ఈ హత్యచేశారని పుకార్లు రావడంతో మేఘాలయ పర్యాటకంపై ప్రభావం పడిందని, ఇప్పుడు అంతా స్పష్టతరావడంతో మా రాష్ట్రంపై పడిన మచ్చ తొలగిపోయిందని రాష్ట్ర మంత్రి అలెగ్జాండర్ ఆనందం వ్యక్తంచేశారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన
యువ ఐఏఎస్ అధికారి

- రెండుసార్లు యూపీఎస్సీలో మెరుగైన ర్యాంక్‌లు
- ఆరేళ్లుగా ఒడిశాలో మంచి పనితీరుతో ఆకట్టుకున్న ఛక్మా

భవానీపట్నా/భువనేశ్వర్: త్రిపురలోని గ్రామీణ నేపథ్యమున్న ధీమన్ ఛక్మాకు గత ఆరేళ్లుగా ప్రజల్లో ఎంతో మంచిపేరుంది. రెండుసార్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పరీక్షల్లో మెరుగైన ర్యాంక్‌లు సాధించి శెభాష్ అనిపించుకుని ప్రస్తుతం సబ్–కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఛక్మాను విజిలెన్స్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా లంచం కేసులో అరెస్ట్‌చేశారు. ఒడిశాలోని ధర్మగఢ్ సబ్–కలెక్టర్‌గా ఉంటూ ఒక వ్యాపారి నుంచి రూ.10 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. సోమవారం ఆయనను స్థానిక కోర్టు 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆదివారం కలహండీ జిల్లాలోని ఛక్మా నివాసంలో విజిలెన్సు అధికారులు రూ.47 లక్షల నగదును స్వాధీనంచేసుకున్నారు. తనకు రూ.20 లక్షలు లంచం ఇవ్వకపోతే నీ అంతు చూస్తానని స్థానిక వ్యాపారిని సబ్–కలెక్టర్ హోదాలో ఛక్మా బెదిరించాడు. దీంతో ఆ వ్యాపారి తమను ఫిర్యాదుచేశారని విజిలెన్స్ ఎస్పీ ఎం.రాధాకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జప్తు చేసిన నగదు విషయంలో ఆయన ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో అవినీతి నిరోధక(సవరణ)చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం సబ్–కలెక్టర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్‌చేశారు.

ఎవరీ ఛక్మా?

త్రిపురలోని కంచన్‌పూర్‌కు చెందిన ఈ యువ అధికారి 2019లోనే యూపీఎస్సీలో 722 ర్యాంక్ సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)లో చేరారు. ఒడిశా కేడర్ ఐఎఫ్ఎస్ అధికారిగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లోని బరిపదలో అదనపు చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేశారు. రెండేళ్లకే మళ్లీ 2021లో యూపీఎస్సీ రాసి ఈసారి 482 ర్యాంక్ సాధించారు. దీంతో ఈసారి ఐఏఎస్ హోదా సాధించారు. శిక్షణ తర్వాత ధర్మగఢ్ సబ్–కలెక్టర్‌గా పోస్టింగ్‌ఇవ్వడంతో అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు. రెండుసార్లు అఖిల భారత సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణుడై అప్పట్లో ఈశాన్య రాష్ట్రాల యువతకు ఆదర్శంగా నిలిచి ఇప్పుడు అవినీతికి పాల్పడి జైలు ఊచలు లెక్కపెడుతున్నాడు.





ఇజ్రాయెల్ దళాలు పడవను అదుపులోకి తీసుకోవడంతో చేతులెత్తిన థన్‌బర్గ్ బృందం. (సర్కిల్‌లో) థన్‌బర్గ్

గ్రెటా థన్‌బర్గ్ నిర్బంధం

- పడవలో గాజాకు వెళ్తుండగా అడ్డుకున్న ఇజ్రాయెల్
- 'సెలబ్రిటీలతో కూడిన సెల్ఫీ బోట్' అంటూ ఎద్దేవా

జెరూసలేం: కల్లోల గాజా స్ట్రిప్‌కు మానవతా సాయం తీసుకొని వెళ్తున్న అంతర్జాతీయ హక్కుల ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్, ఇతర కార్యకర్తలతో కూడిన పడవను ఇజ్రాయెల్ సోమవారం నిర్బంధించింది. గాజా నుంచి 200 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లో ఈ ఉదంతం చోటుచేసుకుంది. థన్‌బర్గ్ బృందాన్ని అరెస్టు చేయడమే గాక పడవను ఇజ్రాయెల్‌కు దారి మళ్లించారు. గాజాలోని హమాస్ మిలిటెంట్ల కోసం ఆయుధాలు తరలిస్తున్నారన్న అనుమానంతో ఈ చర్య తీసుకున్నట్లు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఆ పడవకు అనుమతి లేదని తేల్చిచెప్పింది. ''నిజానికి అది సెలబ్రిటీలతో కూడిన సెల్ఫీ పడవ. అందులో వచ్చిన వారిది ఫక్తు పబ్లిసిటీ స్టంట్ తప్ప మరోటి కాదు''అంటూ ఆక్షేపించింది. ''థన్‌బర్గ్ తదితరులను వారి మాతృదేశాలకు పంపించేస్తాం. పడవలో వచ్చిన మానవతా సాయాన్ని సరైన మార్గాల్లో గాజాకు పంపుతాం''అని వెల్లడించింది. పడవను నిర్బంధించిన అనంతరం లైఫ్ జాకెట్లు ధరించిన థన్‌బర్గ్ బృందానికి అధికారులు శాండ్‌విచ్‌లు, తాగునీరు అందిస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. థన్‌బర్గ్ అరెస్టును సీపీఐ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ఖండించారు. ఆమెను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలిపేందుకు...

యుద్ధం పేరుతో గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధంపై నిరసన తెలిపేందుకు ఫ్రీడం ఫ్లోటిల్లా కొవలిషన్ అనే సంస్థ ఈ పడవ ప్రయాణాన్ని ఏర్పాటు చేసింది. పర్యావరణ ఉద్యమకారిణి అయిన థన్‌బర్గ్ తదితరులు వారం క్రితం ఆ పడవలో సిసిలీ నుంచి గాజాకు బయల్దేరారు. పాలస్తీనా మూలాలున్న యూరోపియన్ పార్లమెంట్ సభ్యురాలు రీమా హసన్‌తో పాటు మరో ఆరుగురు ఫ్రాన్స్‌వాసులు తదితరులు ఈ బృందంలో ఉన్నారు. తమ తక్షణ విడుదలకు చర్యలు తీసుకోవాల్సిందిగా స్వదేశమైన స్వీడన్‌కు థన్‌బర్గ్ విజ్ఞప్తి చేశారు. నిర్బంధించిన వారందరినీ వెంటనే తిప్పి పంపాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయల్ మాక్రాన్ ఇజ్రాయెల్‌ను కోరారు.

మల్కిభ రాముడిగా పేరొందిన కుతుబ్‌షాహీ రాజు?

పదిహేనో శతాబ్దం చివరి నాటికి క్షీణ దశకు చేరిన బహమనీ సామ్రాజ్యం అయిదు రాజ్యాలుగా చీలిపోయింది. అందులో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం ఒకటి. ఈ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా. ఇతడు 1496 నుంచి 1518 వరకు సుబేదార్‌గా తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. 1518లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. కుతుబ్‌షాహీలు తొలుత తెలంగాణను పాలించారు. 1565లో విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత ఇతర తెలుగు ప్రాంతాలు కూడా వీరి ఆధీనంలోకి వచ్చాయి. తెలంగాణ అనే పదం వీరి కాలం నుంచే ప్రాచుర్యం పొందింది. కుతుబ్‌షాహీలు సుమారు రెండు శతాబ్దాల (1496-1687) పాటు తెలంగాణను పాలించారు. వీరు తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఆదరించి తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీ యుగం

కులీకుతుబ్‌షా తన బంధువులతో కలసి మధ్య ఆసియా నుంచి దక్కన్‌కు వలస వచ్చాడు. ఇతడు బహమనీ సుల్తాన్ మహమూద్ షా (1482-1518) కొలువులో చేరి సేనాపతి అయ్యాడు. ఆ సమయంలో ఇతడు తెలంగాణ ప్రాంతంలో దోపిడీ దొంగలను అణచివేశాడు. ఎదురు తిరిగిన సామంతులను దారిలోకి తెచ్చాడు. 1487లో బహమనీ రాజ్యంలో దక్కనీ, అఫాకీ(స్థానికేతర)ల మధ్య ఘర్షణలు తలెత్తాయి. కులీ వీటి నుంచి సుల్తాన్‌ను రక్షించాడు. గోవా పాలకుడైన బహదూర్ జిలానీ (1493) సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణచివేసే ప్రయత్నంలో నాటి తెలంగాణ పాలకుడైన కుతుబ్ ఉల్‌ముల్క్ దకనీ మరణించాడు. దీంతో మహమూద్ షా ఆ బాధ్యతను కులీకుతుబ్‌షాకు అప్పగించాడు. తిరుగుబాటును కులీ పూర్తిగా అణచి వేశాడు. దీంతో మహమూద్‌షా అతడికి కుతుబ్ ఉల్‌ముల్క్ బిరుదునిచ్చి 1496లో గోల్కొండ జాగీర్‌దార్‌గా నియమించాడు. కులీకుతుబ్‌షా 1518లో స్వతంత్రం ప్రకటించుకొని తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. గోల్కొండను కాకతీయుల కాలంలో నిర్మించారు. దీన్ని గతంలో మంగళారం అని పిలిచేవారు. కులీ స్వతంత్రంగా పాలన చేపట్టిన తొలినాళ్లలో మెదక్ జిల్లా కోహిర్ నుంచి ఓరుగల్లు వరకు మాత్రమే ఇతడి పాలనలో ఉండేది. ఓరుగల్లు నుంచి తూర్పు తీరం వరకు ఉన్న ప్రాంతాన్ని షితాబ్‌ఖాన్ (సీతాపతిరాజు) పాలించేవాడు. ఇతడు గజపతుల సామంతుడు. షితాబ్‌ఖాన్ 1504లో ఓరుగల్లు కోటను కైవసం చేసుకున్నాడు. ఇతడు స్వతంత్రంగా ఓరుగల్లు రాజ్యపాలన చేపట్టాడు. ఇతడి మంత్రి ఎనుములపల్లి పెద్దనామాత్యుడు. చరిగొండ ధర్మన్న అనే కవి పెద్దనామాత్యుడి వద్ద ఆశ్రయం పొందాడు. ధర్మన్న రచించిన చిత్రభారతంలో షితాబ్‌ఖాన్ ప్రశంస కనిపిస్తుంది. వరంగల్, ఖమ్మం మెట్టు, నల్లగొండ ప్రాంతాలు షితాబ్‌ఖాన్ రాజ్యంలో భాగంగా ఉండేవి. కులీకుతుబ్‌షా ఓరుగల్లుపై దాడి చేసి ఇతణ్ని సంహరించాడు.

రాజ్య విస్తరణ

రాచకొండ, పానుగల్లు, ఘనపురం (మహబూబ్‌నగర్), దేవరకొండ, నల్లగొండ, ఉర్లుగొండ, ఉండ్రుగొండ, అనంతగిరి దుర్గాధిపతులు స్వతంత్రంగా పరిపాలించేవారు. కృష్ణదేవరాయల మరణానంతరం (1529) కులీకుతుబ్‌షా ఈ దుర్గాలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. తర్వాత కరీంనగర్ జిల్లాలో కివాం ఉల్‌ముల్క్‌ను ఓడించాడు. ములంగూర్, ఎల్గందుల, రామగిరి కోటలను స్వాధీనం చేసుకున్నాడు. ఆదిల్‌షాతో యుద్ధం చేసి కోవిలకొండను ఆక్రమించాడు. హరిచంద్ తిరుగుబాటును అణచి నల్లగొండను వశం చేసుకున్నాడు. తర్వాత కృష్ణానదీ తీరం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. కొండపల్లి, ఇంద్రకొండ, ఏతగిరి, దుర్గాధీశులను ఓడించాడు. దీంతో కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి పాలనలోకి వచ్చింది. కులీకుతుబ్‌షా కవి పండితులను ఆదరించాడు. ఇతడికి ఆరుగురు కుమారులు. చివరి వాడైన ఇబ్రహీం కుతుబ్‌షాను దేవరకొండ పాలకుడిగా నియమించాడు.

యువరాజు, పెద్ద కుమారుడైన హైదర్ ముందే మరణించాడు. రెండో కుమారుడైన కుతుబుద్దీన్ యువరాజు అయ్యాడు. కానీ రాజకీయాల పట్ల శ్రద్ధ పెట్టలేదు. మిగతా ముగ్గురు తండ్రి బతికుండగానే సింహాసనాన్ని ఆకాంక్షించారు. నాలుగో కుమారుడైన అబ్దుల్ కరీం తిరుగుబాటు చేశాడు. ఇతడు బీజాపూర్ వెళ్లి సుల్తాన్‌తో సంప్రదింపులు జరిపాడు. గోల్కొండను ముట్టడించాలని భావించాడు. ఆ ప్రయత్నాల్లోనే మరణించాడు. కులీకుతుబ్‌షా మూడో కుమారుడైన జంషీద్, అయిదో కుమారుడైన దౌలత్ వారసత్వం కోసం కలహించుకున్నారు. దీంతో కులీకుతుబ్‌షా జంషీద్‌ను గోల్కొండలో, దౌలత్‌ను భువనగిరిలో బంధించాడు. జైలు నుంచి తప్పించుకున్న జంషీద్ తండ్రిని హత్య చేశాడు. సోదరుడైన కుతుబుద్దీన్‌ను చిత్రహింసలకు గురి చేసి జైల్లో ఉంచాడు. అనంతరం సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు రాజ్యాన్ని విస్తరించలేదు. కానీ తన రాజ్య భాగాలను కోల్పోలేదు.

మల్కిభరాముడు

కులీ ఆరో కుమారుడు ఇబ్రహీం కుతుబ్‌షా (1550-80). ఇతడు విజయనగర రాజుల సాయంతో సింహాసనాన్ని ఆక్రమించాడు. కవి పండితులను ఆదరించి మల్కిభరాముడిగా పేరొందాడు. ఇతడు విజయనగరంలో ఏడేళ్లపాటు శరణార్థిగా ఉన్నాడు. వారి సహాయంతోనే సింహాసనాన్ని ఆక్రమించాడు. కానీ వారి పతనానికే కారణమయ్యాడు. బీజాపూర్, అహ్మద్‌నగర్, గోల్కొండ, విజయనగర రాజులు దక్కన్‌పై ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇబ్రహీం తళ్లికోట యుద్ధంలో విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. ఈ యుద్ధంలో ఓటమి వల్ల విజయనగర సామ్రాజ్యం పతనావస్థకు చేరింది. దీంతో ఇబ్రహీం కుతుబ్‌షా తీరాంధ్రను జయించడానికి మార్గం సుగమమైంది. ఇతడు 1571లో రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలను జయించాడు. 1579లో కొండవీటిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత వినుకొండ, ఖమ్మం దుర్గాలను, కసింకోటను వశం చేసుకున్నాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా తన పాలనా కాలంలో హుస్సేన్‌సాగర్, ఇబ్రహీం పట్నం చెరువులను తవ్వించాడు. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్, లంగర్ (భిక్షా గృహాలు)ను ఏర్పాటు చేశాడు. మూసీనదిపై పురానాపూల్ వంతెనను నిర్మించాడు.

ఇబ్రహీం మరణానంతరం మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580-1612) అధికారం చేపట్టాడు. ఇతడు 14వ ఏట రాజ్యానికొచ్చాడు. ఇతడు ఇబ్రహీం, భాగీరథిల సంతానం. దక్కన్ ముస్లింల సహకారంతో అశ్వారావు చేసిన కృషి వల్ల మహమ్మద్ కులీ అధికారంలోకి వచ్చాడు. ఇతడు కవి అయినప్పటికీ రాజ్య విస్తరణలో అలక్ష్యం ప్రదర్శించలేదు. దక్షిణాన పెనుగొండ, గండికోటలను జయించాడు. తూర్పున శ్రీకాకుళం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. అనేక తిరుగుబాట్లను అణచివేశాడు. 1592లో రాజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. ఇదే సమయంలో మొగలులు విజృంభించి 1590 నాటికి ఉత్తర భారతాన్నంతా ఆక్రమించారు.

అనంతరం వారు దక్కన్‌పై దృష్టి సారించి అహ్మద్‌నగర్‌ను వశపర్చుకున్నారు. ఈ ప్రభావం మహమ్మద్ కులీపై కూడా పడింది. ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఇవేవీ కులీ కళాపోషణను ప్రభావితం చేయలేదు. తన ప్రియురాలైన భాగమతి పేరు మీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. కులీ ఆమెకు హైదర్ మహెల్ అనే పేరు పెట్టాడు. దీంతో భాగ్యనగరం హైదరాబాద్‌గా వ్యవహారంలోకి వచ్చింది.

ఇతడు చార్మినార్ (1591), చార్‌కమాన్(1592), జామామసీద్(1597-1598)లను నిర్మించాడు. దారుల్ షిఫా, దాద్ మహల్, ఖుదాదాద్ మహల్, నద్ది మహల్‌లను నిర్మించాడు. భాగెమహమ్మది, బన్నత్ ఘాట్, కోహినూర్ తదితర నిర్మాణాలు చేపట్టాడు. ఇవన్నీ ఇతడి కళాభిరుచికి నిదర్శనం.

కులీ మరణం తర్వాత అతడి అల్లుడయిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా(1612-26) సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు మొగలులతో సఖ్యతగా వ్యవహరించాడు. ఇతడి కాలంలోనే డచ్చి వారు, బ్రిటిషర్లు తీరాంధ్ర వెంట వర్తక స్థావరాల్ని నెలకొల్పారు. మహమ్మద్ కుతుబ్‌షా ఖైరతాబాద్ మసీద్‌ను నిర్మించాడు. మక్కా మసీదు నిర్మాణానికి పునాది వేశాడు. 1624లో ఈద్‌గాను నిర్మించాడు. అమ్మాన్ భవనం, నబీబాగ్ కూడా ఇతడి కాలం నాటివే.

పతనం ఆరంభం..

మహమ్మద్ తర్వాత అతడి పెద్ద కుమారుడైన అబ్దుల్లా కుతుబ్‌షా(1626-72) రాజ్యానికి వచ్చాడు. ఇతడు మొగలుల నుంచి స్వతంత్రతను నిలబెట్టుకోలేకపోయాడు. దక్కన్‌లో మొగలులను ఎదిరించిన మలికంబర్ 1626లో, బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా 1627లో మరణించారు. వీరి మరణంతోపాటు కొన్ని ఇతర కారణాల వల్ల దక్కన్‌పై మొగలుల దండయాత్రకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

మొగల్ చక్రవర్తి షాజహాన్ 1636లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతడితో సంధి చేసుకుని మొగలుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు. నాటి నుంచి కుతుబ్‌షాహి రాజ్య క్షీణదశ ప్రారంభమైంది. అబ్దుల్లా ఒకవైపు సామంతుడిగా ఉంటూనే కర్ణాటక రాజ్యంపై ఆధిపత్యం కోసం ప్రయత్నించాడు. తన సేనాని మహ్మద్ సయీద్ మీర్‌జుంలాను 1645లో కర్ణాటకపై దండయాత్రకు పంపాడు. ఫలితంగా కర్ణాటక రాజ్య తూర్పు భాగాలు అబ్దుల్లా రాజ్యంలో భాగమయ్యాయి. 1653లో విశాఖపట్టణం సుల్తాన్ వశమైంది. తీరాంధ్ర గోల్కొండ సామ్రాజ్యంలో విలీనమైంది. ఈ విజయాలతో విదేశీ వర్తకుల వ్యాపార స్థావరాలు గోల్కొండ రాజ్య పరిధిలోకి వచ్చాయి. దీంతో వారికి గోల్కొండ రాజ్యంతో సంబంధాలు ఏర్పడ్డాయి.

కర్ణాటక విజయాలతో అబ్దుల్లా సేనాని మహమ్మద్ సయీద్‌లో అత్యాశ మొదలైంది. ఇతడు తిరుగుబాటు చేసి స్వతంత్రం ప్రకటించుకున్నాడు. దక్కన్ సుబేదార్, షాజహాన్ కుమారుడైన ఔరంగజేబుకు చాడీలు చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ఔరంగజేబు 1656లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతి కష్టం మీద ఔరంగజేబుతో సంధి చేసుకున్నాడు. కుతుబ్‌షా తన రెండో కుమార్తెను ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ సుల్తాన్‌కు ఇవ్వడానికి అంగీకరించాడు. మహమ్మద్‌ను తన వారసుడిగా ప్రకటించడానికి, కోటి హొన్నులు కప్పం కట్టడానికి అబ్దుల్లా ఒప్పుకున్నాడు. దీంతో గోల్కొండలో మొగల్ అధికారుల ఆధిపత్యం పెరిగింది. ఫలితంగా గోల్కొండ రాజ్యం తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ సంక్షోభాన్ని అదనుగా భావించిన ఐరోపా కంపెనీలు కుతుబ్‌షాహీల పట్ల అవిధేయంగా ప్రవర్తించాయి. సంక్షోభానంతరం అబ్దుల్లా వారిని దారిలోకి తెచ్చుకున్నాడు.

తానీషా పాలన

1672లో అబ్దుల్లా మరణించడంతో వారసత్వ వివాదం ఏర్పడింది. అనూహ్య పరిస్థితుల్లో అబుల్ హసన్ తానీషా (1672-87) కుతుబ్‌షాహీ రాజ్య వారసుడయ్యాడు. తానీషా సుల్తాన్ పదవిని చేపట్టగానే ఔరంగజేబుకు అనేక కానుకలు పంపాడు. మొగలులకు సామంతుడిగా ఉండేందుకు అంగీకరించాడు. ఇందుకు ఔరంగజేబు ఒప్పుకున్నాడు. కానీ తానీషా శివాజీకి సహాయపడకూడదని, పేష్కను సమయానికి చెల్లించాలని షరతులు విధించాడు. మొగలులతో ఎప్పటికైనా ప్రమాదమేనని తానీషా భావించాడు. అందుకే రాజ్యాన్ని పటిష్ఠం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. తాను అధికారంలోకి రావడానికి తోడ్పడిన ముజఫర్‌ను మీర్ జుమ్లా (ప్రధానమంత్రి)గా నియమించాడు. కానీ అతడు అన్ని వ్యవహారాల్లో తలదూర్చేవాడు. అది సహించని తానీషా ముజఫర్‌ను తొలగించాడు. హనుమకొండకు చెందిన మాదన్నను ప్రధానిగా, అక్కన్నను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. మాదన్న రాజ్య వ్యవహారాలను చక్కదిద్దాడు. కర్ణాటక ప్రాంతంలో పాశ్చాత్య వర్తకులు సృష్టించిన అలజడులను అణచివేశాడు. తిరుగుబాటుదారులపై కఠిన చర్యలు తీసుకున్నాడు. ఉన్నత పదవుల నుంచి స్థానికేతరులను తొలగించి స్థానికులను నియమించాడు. నీటి వనరుల నిర్మాణాలు చేపట్టి వ్యవసాయాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాడు. దళారీలను తొలగించి రైతులపై జరిగే దౌర్జన్యాలను అరికట్టాడు. గనులను పునరుద్ధరించి రాజ్య సంపదను పెంచాడు.

ఔరంగజేబు దండయాత్ర

ఇదే సమయంలో ఔరంగజేబు దక్కన్ రాజ్యాలన్నింటినీ నిర్మూలించడానికి ఉద్యుక్తుడయ్యాడు. మొగలుల నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడానికి తానీషా 1677లో శివాజీతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి కుదరడంలో అక్కన్న మాదన్నలు ముఖ్య పాత్ర పోషించారు. ఇది ఔరంగజేబు ఆగ్రహానికి కారణమైంది. కొంత కాలానికి శివాజీ మరణించాడు. దీంతో ఔరంగజేబు అదను చూసుకొని 1685లో గోల్కొండపై దండెత్తాడు. మొగలు సైన్యానికి ఔరంగజేబు కుమారుడైన షా ఆలం నాయకత్వం వహించాడు.

మొదట గోల్కొండకే విజయం లభించింది. కానీ సేనానుల నమ్మక ద్రోహంతో గోల్కొండ ఓడిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో తానీషా మొగలులతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం పాత బకాయిల కింద మొగలులకు కోటి హొన్నులు చెల్లించాలి. ఏటా రెండు లక్షల హొన్నుల కప్పం చెల్లించాలి. మల్ఖేడు, సేడం ప్రాంతాలను మొగలులకు అప్పగించాలి. అక్కన్న మాదన్నలను పదవుల నుంచి తొలగించాలి. మొదటి మూడు షరతులను తానీషా అమలు చేశాడు.

కానీ అక్కన్న మాదన్నలను తొలగించడంలో ఆలస్యం చేశాడు. ఇది సహించని ముస్లిం సర్దార్లు 1686 మార్చి 24 రాత్రి అక్కన్న మాదన్నలను హత్య చేశారు. వారి తలలను ఔరంగజేబుకు కానుకగా పంపారు. అయినా ఔరంగజేబు సంతృప్తి చెందలేదు. బీజాపూర్ ఆక్రమణ అనంతరం 1687 ఫిబ్రవరి 7న మళ్లీ గోల్కొండపై దండెత్తాడు. ఎనిమిది నెలల హోరాహోరీ యుద్ధం తర్వాత ఒక సేనాని ద్రోహంతో గోల్కొండ మొగలుల వశమైంది. అబుల్ హసన్ తానీషాను బంధించి దౌలతాబాద్ కోటకు తరలించారు. దీంతో కుతుబ్‌షాహీల పాలన అంతరించింది. గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది.

అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?



టెట్/డీఎస్సీ

చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగాజీ

వైయక్తిక భేదాలు

1. వీటిలో శాబ్దికేతర సామూహిక పరీక్ష?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) ఆర్మీ బీటా 4) భాటియా నిష్పాదన
2. వీటిలో శాబ్దిక పరీక్ష కానిది?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) రావన్స్ ప్రోగ్రెసివ్ టెస్ట్
   4) ఒటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
3. సెప్టెంబరు 5, 1971 ఏ వారం? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే రాజు అనే విద్యార్థి క్యాలెండర్ సహాయంతో ఆదివారం అని సమాధానం ఇచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం రాజు ఉపయోగించిన ఉత్పత్తి?
   1) యూనిట్లు 2) వర్గాలు
   3) అంతర్భావాలు 4) సంబంధాలు
4. ఈ-మెయిల్, టెలిగ్రాం, పోస్ట్ కార్డు, బుక్‌లో వేరుగా ఉన్నదేది? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. బుక్ తప్ప మిగిలినవి ప్రసార సాధనాలని రాము సమాధానమిచ్చాడు. రాములో గమనించే ఉత్పత్తి గిల్‌ఫర్డ్ ప్రకారం?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
5. అవగాహన అనే లక్ష్యంతో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
6. వినియోగమనే లక్ష్యంలో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
7. ప్రజ్ఞా విభాజన పట్టికకు సంబంధించి సరి కాని ప్రవచనం?
   1) సగటు కంటే తక్కువ 81-90 ప్రజ్ఞా లబ్ధి
   2) అల్పబుద్ధులు 51-70 ప్రజ్ఞాలబ్ధి
   3) ఉన్నత ప్రజ్ఞావంతులు121-140ప్రజ్ఞాలబ్ధి
   4) మంద బుద్ధులు 25-50 ప్రజ్ఞాలబ్ధి
8. ప్రజ్ఞా విభజన పట్టికలో ఆరోహణ క్రమంలోని సరైన జతను గుర్తించండి?
   1) మందబుద్ధులు, అల్పబుద్ధులు, మూఢులు, బుద్ధిహీనులు
   2) మందబుద్ధులు, మూఢులు, అల్పబుద్ధులు, బుద్ధిహీనులు
   3) మూఢులు, బుద్ధిహీనులు, అల్ప బుద్ధులు, మందబుద్ధులు
   4) బుద్ధిహీనులు, మందబుద్ధులు, అల్ప బుద్ధులు, మూఢులు
9. Rose పదం చూసినప్పుడు ప్రయోజ్యుడు XOP అనే అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?
   1) స్మృతి- విస్మృతి 2) ద్వంద్వ సంసర్గలు
   3) గుర్తింపు 4) ఏదీకాదు
10. 'మానవులందరూ మర్త్యులే. సోక్రటీస్ మానవుడు కాబట్టి మర్త్యుడే' అని ఆలోచించడం ఏ రకమైన ఆలోచన?
    1) విభిన్న 2) హేతుబద్ధ
    3) ఊహాలోచన 4) సమైక్య
11. రిమోట్ అసోసియేషన్ టెస్ట్ ఏ ప్రవర్తనాంశాన్ని మాపనం చేస్తుంది?
    1) సృజనాత్మకత 2) ప్రజ్ఞ
    3) సహజ సామర్థ్యాలు 4) స్మృతి
12. వీటిలో సరికాని జత?
    1) అమూర్తంగా ఆలోచించడమే ప్రజ్ఞ-టెర్మన్
    2) గ్రహణ శక్తిని ప్రజ్ఞ అంటారు- గాల్టన్
    3) భౌతిక సామాజిక పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించడమే ప్రజ్ఞ- పియాజే
    4) అభ్యసించగల సామర్థ్యమే ప్రజ్ఞ-స్పెన్సర్
13. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించేది?
    1) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
    2) రాజు స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత గలవాడు
    3) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
    4) రాజు గణితం కంటే సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు
14. వీటిలో సరికాని జత?
    1) డాల్టన్ ప్రణాళిక- మోరిసన్
    2) విన్నెట్కా ప్రణాళిక- వాష్ బర్న్
    3) గారీ ప్రణాళిక-విలియం బర్ట్
    4) నాన్ గ్రేడెడ్ పద్ధతి- గుడ్ లాడ్
15. ప్రజ్ఞ, సృజనాత్మకతలకు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) ప్రజ్ఞ ఉన్న వ్యక్తులందరూ సృజనా త్మకంగా ఉండాలని లేదు
    2) సృజనాత్మకత ఉన్న వారందరికీ ఎంతో కొంత ప్రజ్ఞ ఉంటుంది
    3) సృజనాత్మకంగా ఉండాలంటే ప్రజ్ఞ అవసరం లేదు
    4) విభిన్న ఆలోచన ఉన్నవారికి సృజనాత్మకత ఎక్కువ
16. ఉపాధ్యాయుడు 4×5×6 అనే ప్రశ్నను ఇచ్చినపుడు విద్యార్థి ఉపయోగించే విషయం?
    1) చిత్రాలు 2) చిహ్నాలు
    3) వర్గాలు 4) సంబంధాలు
17. పావురం, గరుడపక్షి, నెమలి, కంగారుల్లో సరి కానిది గుర్తించమని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. కంగారు జంతువు, మిగిలినవి పక్షులని విద్యార్థి సమాధానమిచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం విద్యార్థి ఉపయోగించిన ఆలోచన ఫలితం?
    1) పద్ధతులు 2) వర్గాలు
    3) సంబంధాలు 4) యూనిట్లు
18. విద్యార్థి శారీరక వయసు పదేళ్లు. ఐతే 16 ఏళ్ల వారికి ఉద్దేశించిన పరీక్షను సాధించాడు. ప్రజ్ఞా లబ్ధి ఆధారంగా ఆ విద్యార్థి ఏ వర్గీకరణకు చెందుతాడు?
    1) ఉన్నత 2) అత్యున్నత
    3) సగటుకంటే ఎక్కువ 4) ప్రతిభ కలవారు
19. రెండు ప్రపంచయుద్ధాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయి. మూడో ప్రపంచయుద్ధం జరిగితే అనర్థాలేమిటి? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. గిల్‌ఫర్డ్ ప్రకారం ఆ విద్యార్థి ఉపయోగించిన ఉత్పన్నాలు?
    1) వర్గాలు 2) సంబంధాలు
    3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
20. వీనిలో సాధారణ కారకం(జి)కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) అభ్యసనం, సాధారణ ప్రజ్ఞను ప్రభావితం చేస్తుంది
    2) వంశపారంపర్యత సాధారణ ప్రజ్ఞను నిర్ధారిస్తుంది
    3) గణితం, సైన్సులో ప్రతిభ సాధారణ కారకంపై ఆధారపడి ఉంటుంది.
    4) సాధారణ కారకం (జి) ప్రజ్ఞను నిర్ధారించే ప్రధాన అంశం
21. ద్వికారక సిద్ధాంతం ప్రకారం తీవ్ర భాషాపరమైన అభిరుచులు ఏ కారకంపై ఆధారపడి ఉంటాయి?
    1) జి 2) పి 3) ఎస్ 4) జి1
22. వీటిలో వ్యక్త్యంతర్గత భేదాన్ని సూచించేది?
    1) రాణి తన వయసు వారితోపాటు మార్కులు సాధిస్తుంది
    2) రాణి తెలుగులో చూపిన అభిరుచి గణితంలో చూపదు
    3) రాణి క్రీడల్లో ఇతరుల కంటే ప్రతిభ చూపుతుంది
    4) రాణి క్రీడలు, చదువుకు సమాన ప్రాధాన్యమిస్తుంది
23. వీటిలో సరికాని ప్రవచనం?
    1) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగుపర్చుకోలేం
    2) జ్ఞానం ప్రజ్ఞ అనే గమ్యాన్ని చేరడానికి సహకరిస్తుంది
    3) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగుపర్చుకోవచ్చు
    4) ప్రజ్ఞ వల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుంది
24. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించనిది?
    1) రాజులో తన వయసువారి కంటే మానసిక పరిపక్వత ఎక్కువ
    2) రాజు చదవడం ఇష్టపడినంత రాయడం ఇష్టపడడు
    3) రాజు తన స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత కలవాడు
    4) రాజు క్రికెట్ ఏ స్థాయిలో ఆడతాడో హాకీ కూడా అదేస్థాయిలో మిగతావారి కంటే బాగా ఆడగలడు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1	5) 4
6) 3	7) 4	8) 3	9) 2	10) 2
11) 1	12) 4	13) 2	14) 1	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 1
21) 3	22) 2	23) 3	24) 2	

మనోవిజ్ఞాన శాస్త్రం- స్వభావం, పద్ధతులు

1. విద్యపై సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావాన్ని కనుక్కోవడానికి చేసే పరిశోధనలో స్వతంత్ర చరం?
   1) వయసు 2) ప్రజ్ఞ
   3) సాంఘిక ఆర్థిక స్థితి 4) విద్య
2. వీటిలో ప్రవర్తన లక్షణాన్ని వర్ణించడంలో సరైన ప్రవచనం?
   1) స్తబ్దమైంది 2) స్థిరమైంది
   3) గతి శీలమైంది 4) అచేతనమైంది
3. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థుల ను మూడు సమూహాలుగా విభజించాడు. వీటిలో మొదటి సమూహానికి హోంవర్క్ చేస్తే బహుమతి ఇస్తానని తెలిపాడు. రెండో సమూహానికి హోంవర్క్ ఇచ్చాడు. కానీ దండన/ బహుమతి ప్రకటించలేదు. మూడో సమూహానికి ఇంటి పని చేయక పోతే దండిస్తానని చెప్పాడు. ఇందులో నియంత్రిత సమూహం?
   1) ఒకటోది 2) రెండోది
   3) మూడోది 4) ఒకటి, మూడు సమూహాలు
4. నవజాత శిశువును అధ్యయనం చేయడానికి ఉపయోగపడని పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
5. 'నిన్నటికంటే ఈ రోజు పాఠం బాగా అర్థమైందని' టీచర్‌తో విద్యార్థి చెప్పినప్పుడు ఆ విద్యార్థి ఉపయోగించిన పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
6. వ్యక్తి అధ్యయనంలో అన్ని విషయాలను సక్రమంగా విశ్లేషణ చేయడానికి ఉపయో గించాల్సిన పరిశీలన పద్ధతి?
   1) సంచరిత 2) అసంచరిత
   3) నియంత్రిత 4) అంతఃపరిశీలన
7. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం ఆధునిక విద్యకందించిన విషయం?
   1) ఆశయాలు ఎందుకు నిర్ణయించుకోవాలి
   2) ఏ ఆశయాలు నిర్ణయించుకోవాలి
   3) ఎలా లక్ష్యాలు సాధించాలి
   4) ఏ పాఠ్యాంశాలు బోధించాలి
8. 'పని చేయని, పని చేసే తల్లులు-వారి పిల్లల సాధన' అనే అంశాల గురించి ప్రయోగ పూర్వకంగా ఫలితాలు తెలుసుకో వాలనుకున్న పరిశీలకుడు పరీక్షించాల్సిన స్వతంత్ర చరం?
   1) పని చేయని తల్లులు
   2) పనిచేసే తల్లులు 3) 1, 2
   4) పనిచేసే తల్లుల పిల్లల విద్యాసాధన
9. కేస్‌స్టడీలో ప్రధానంగా ఉపయోగించే పద్ధతి?
   1) ప్రయోగ 2) అసంచరిత పరిశీలన
   3) సమాంతర అధ్యయన(Cross Sectional)
   4) కాలక్రమ (Longitudinal)
10. ప్రయోగ పద్ధతిలో వేర్వేరు వయసున్న శిశువులను ప్రయోజ్యులుగా ఎంపిక చేసుకొని అధ్యయనం చేసే పద్ధతి?
    1) సంచరిత పరిశీలన
    2) అసంచరిత పరిశీలన
    3) సమాంతర అధ్యయన (Cross Sectional)
    4) కాలక్రమ (Longitudinal)
11. ప్రజ్ఞ ప్రభావం సృజనాత్మకతపై ఉండదని పేర్కొన్న పరిశోధకుడు నియంత్రించిన మధ్యస్థ చరం?
    1) ప్రజ్ఞ 2) సృజనాత్మకత
    3) ప్రేరణ 4) ప్రజ్ఞ, సృజనాత్మకత
12. సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావం విద్యార్థుల సాధనపై ఉంటుందనే పరిశోధనలో ప్రయోగ ఫలితం?
    1) విద్యార్థుల సాంఘిక ఆర్థిక స్థితి
    2) విద్యార్థుల వైఖరి 3) విద్యార్థుల సాధన
    4) విద్యార్థుల అభిరుచి
13. బోధనానుభవం ప్రభావం బోధనా సామర్థ్యంపై ఉందో లేదో తెలుసుకోవాల నుకునే ప్రయోగంలో బోధనాభిరుచి ఏ చరం?
    1) స్వతంత్ర 2) పరతంత్ర
    3) మధ్యస్థ 4) అస్థిర
14. 'నేను ఆందోళనలో ఉన్నానని' పేర్కొన్న వ్యక్తి ఉపయోగించిన పద్ధతి?
    1) పరిశీలన 2) అంతఃపరీక్షణ
    3) ప్రయోగ 4) వ్యక్తి అధ్యయన
15. ఉపాధ్యాయుడు ఆట స్థలంలో విద్యార్థుల ప్రవర్తనను వీడియో సహాయంతో గమనించడం ఏ పరిశీలన?
    1) నియంత్రిత 2) సంచరిత
    3) ప్రయోగ 4) అసంచరిత
16. శైశవ దశలోని లక్షణాలను తెలుసుకోవడానికి తగని పద్ధతి?
    1) ప్రయోగ 2) వ్యక్తి అధ్యయన
    3) అంతఃపరీక్షణ 4) పరిశీలన
17. వ్యక్తి అధ్యయన పద్ధతిలో సమస్యాత్మక విద్యార్థి కానిది?
    1) ప్రతిభావంతుడు
    2) అభ్యసన వైకల్యత ఉన్నవాడు
    3) సగటు ప్రజ్ఞ ఉన్న విద్యార్థి
    4) చదువులో వెనకబడిన విద్యార్థి
18. గ్రామీణ/పట్టణ ప్రాంతాల ప్రభావం విద్యార్థి వ్యక్తీకరణ నైపుణ్యాలపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగ పరిశోధనలో మధ్యస్థ చరం కానిది?
    1) వ్యక్తీకరణ నైపుణ్యాలు 2) అభిరుచి
    3) కుటుంబం 4) విద్యార్హతలు
19. విల్ హెల్మ్ ఊంట్‌కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) సంరచనాత్మక వాదానికి మూలపురుషుడు
    2) సంసర్గవాదానికి మూలపురుషుడు
    3) మనోవిజ్ఞానశాస్త్ర పితామహుడు
    4) ప్రయోగాత్మక మనో విజ్ఞానశాస్త్ర పితామహుడు
20. హెర్బర్ట్ సోపానాల్లో సరైన వరుస క్రమం?
    1) సన్నాహం, సంసర్గం, ప్రదర్శన, అన్వయం,సాధారణీకరణం, సింహా వలోకనం
    2) సన్నాహం, ప్రదర్శన, అన్వయం, సంసర్గం,సాధారణీకరణం, సింహావ లోకనం
    3) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, సింహావలోకనం, అన్వయం
    4) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, అన్వయం, సింహా వలోకనం.
21. జీన్ పియాజె తన ముగ్గురి పిల్లల సంజ్ఞానాత్మక వికాసాన్ని అనేక ఏళ్ల పాటు పరిశీలించాడు. ఇది ఏ రకమైన పరిశోధనా పద్ధతి?
    1) అంతఃపరిశీలన
    2) సమాంతర (Cross sectional)
    3) కాలక్రమ (Longitudinal)
    4) వ్యక్తి అధ్యయన పద్ధతి
22. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థు లను రెండు సమూహాలుగా విభజించి, ఒక సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశ పెట్టాడు. రెండో సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశపెట్టలేదు. ప్రయోగం అనంతరం ఫలితాలు విశ్లేషించాడు. ఇది ఏ రకమైన సమూహ నమూనా?
    1) ఏక 2) నియంత్రిత
    3) పరిభ్రమణ 4) ద్వి
23. ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధిస్తూ విద్యార్థుల ఇంగితాలను గమనించడం ఏ పరిశీలన?
    1) అసంచరిత 2) ప్రయోగ
    3) సంచరిత 4) స్వయం
24. ప్రస్తుత నార్కోఅనాలిసిస్ పద్ధతికి మూలమైన వాదం?
    1) గెస్టాల్ట్ 2) మనో విశ్లేషణ
    3) ప్రవర్తన 4) సంరచనాత్మక
25. ఆదాయ ప్రభావం ఉద్యోగ సంతృప్తిపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగంలో మధ్యస్థచరం కానిది?
    1) ఉద్యోగి వైఖరి 2) ఉద్యోగి సంతృప్తి
    3) ఉద్యోగి అభిరుచి 4) ఉద్యోగి ప్రేరణ

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 2
6) 1	7) 3	8) 3	9) 4	10) 3
11) 3	12) 3	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 1	19) 2	20) 4
21) 3	22) 2	23) 3	24) 3	25) 2

సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

భౌతిక శాస్త్రంలో ముందుగా భౌతిక రాశులు, బలం, ఉష్ణం, కాంతి, ధ్వని, అయస్కాంతత్వం, విద్యుత్ మొదలైన పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి. వీటి కోసం 10వ తరగతి వరకు ఉన్న భౌతిక శాస్త్ర పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. వీటితో పాటు శుద్ధగతిక శాస్త్రం, విశ్వ గురుత్వాకర్షణ, ప్రవాహిలు, తలతన్యత, ద్రవ్యరాశి కేంద్రం, ఆధునిక భౌతిక శాస్త్రం లాంటి అంశాలపై కూడా ఇటీవల ప్రశ్నలు అడుగుతున్నారు. వీటి కోసం 6 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలతోపాటు ఇంటర్మీడియట్ స్థాయి పుస్తకాలను కూడా చదవాలి. అభ్యర్థికి 10వ తరగతి వరకు ఉన్న అన్ని అంశాలపై సాధారణ అవగాహన ఉండాలనేది జనరల్ స్టడీస్ ముఖ్య ఉద్దేశం. పరీక్షల దృష్ట్యా జనరల్ సైన్స్‌లో భౌతిక శాస్త్రానికి వెయిటేజీ ఉంది. శిక్షణా సంస్థల్లో కొంత మంది అధ్యాపకులు తరచుగా కొన్ని టాపిక్స్‌ను మాత్రమే బోధించి, వాటి నుంచే ప్రశ్నలు వస్తాయని చెబుతారు. కానీ పోటీ పరీక్షలకు సంబంధించి నిర్దిష్టంగా ఒక టాపిక్ నుంచి ప్రశ్నలు వస్తాయని చెప్పలేం. వర్తమాన అంశాల ప్రాధాన్యాల ఆధారంగా ఏ పాఠ్యభాగం నుంచైనా ప్రశ్నలు ఇవ్వవచ్చు. అందువల్ల అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి.

భౌతిక శాస్త్రంలో సాధారణంగా స్టాండర్డ్ జీకే, ప్యూర్ సైన్స్, అప్లయిడ్ సైన్స్ లేదా జనరల్ సైన్స్ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. శాస్త్రవేత్తలు, పరికరాల పేర్లు, ఆవిష్కరణలు- సంవత్సరాలు మొదలైనవి స్టాండర్డ్ జీకేకు సంబంధించిన అంశాలు. కొన్ని ఉదాహరణలు..

1. టెలిస్కోప్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
2. అచ్చుయంత్రాన్ని కనుగొన్నదెవరు?
3. విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదించింది ఎవరు?
4. ఐన్‌స్టీన్‌కు ఏ సిద్ధాంతానికి నోబెల్ బహుమతి లభించింది?
5. ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఏ సంవత్సరంలో లభించింది?
6. 'యురేకా' అని అరిచిందెవరు?

సమాధానాలు

1) గెలీలియో 2) జాన్ గూటన్ బర్గ్ 3) న్యూటన్
4) ఐన్‌స్టీన్ 'ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్' కనుగొన్నందుకు నోబెల్ బహుమతి లభించింది. వాస్తవానికి ఈయన సాపేక్ష సిద్ధాంతానికి నోబెల్ వస్తుందని భావించారు.
5)1921
6) ఆర్కిమెడిస్. గ్రీకు భాషలో 'యురేకా' అంటే 'కనుగొన్నాను' లేదా 'తెలుసుకున్నాను' అని అర్థం. నూతన విషయాన్ని కనుగొన్న సందర్భంలో ఆర్కిమెడిస్ 'యురేకా' అని గట్టిగా అరుస్తూ వీధుల వెంట తిరిగారు.

ప్యూర్ సైన్స్‌లో భాగంగా ఒక్కోసారి ఫిజిక్స్‌లో సమస్య (ప్రాబ్లం)లపై కూడా ప్రశ్నలు అడగవచ్చు. సులభమైన అంశాలు, దాదాపుగా నేరుగా సమాధానం గుర్తించేవిధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. గతంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సమస్యలపై అడిగిన కొన్ని ప్రశ్నలను గమనించండి.



1. ఒక వస్తువు వేగాన్ని రెట్టింపు చేస్తే దాని గతిశక్తి ఎన్నిరెట్లు అవుతుంది?
2. ఒక రేడియోధార్మిక మూలకం అర్ధజీవిత కాలం 4 సంవత్సరాలు. అయితే అది 3/4వ వంతు విఘటనం చెందడానికి పట్టే కాలం ఎంత?
3. ఒక గ్రహం, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం రెట్టింపు అయితే దాని ఆవర్తన కాలం ఎన్ని రెట్లు అవుతుంది?

సమాధానాలు

1) 4 రెట్లు 2) 8 సంవత్సరాలు
3) 2√2 రెట్లు

మూడో విభాగమైన అప్లయిడ్ సైన్స్ నుంచి అత్యధిక ప్రశ్నలు వస్తాయి. ఫిజిక్స్‌లో సుమారు తొంభై శాతం ప్రశ్నలు ఈ విభాగం నుంచే ఉంటాయి. దీంట్లో భాగంగా మౌలికాంశాలతో పాటు వివిధ ధర్మాలు, నియమాలు, సూత్రాలు, సిద్ధాంతాలు, వాటి అనువర్తనాలపై ప్రశ్నలు అడుగుతారు. **ఉదా:** కాంతి ధర్మాలు, అయస్కాంతాల సాధారణ ధర్మాలు, ధ్వని ధర్మాలు.

నియమాలకు సంబంధించి న్యూటన్ గమన నియమాలు, కెప్లర్ గ్రహగమన నియమాలు, న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ నియమం, ఆర్కిమెడిస్ సూత్రం, ప్లవన సూత్రం, బెర్నౌలీ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, పాస్కల్ సూత్రం మొదలైనవాటిని క్షుణ్నంగా చదవాలి. వీటి ఆధారంగా నిజ జీవితంలో జరిగే సంఘటనల్ని విశ్లేషించుకోవాలి. అభ్యర్థి సబ్జెక్ట్‌కు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించడంతో పాటు జనరల్ సైన్స్‌లో ప్రశ్నలను అడగడంలో ఉన్న మరో ముఖ్య ఉద్దేశం విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించడం. విషయాన్ని బట్టీపట్టడం కంటే అర్థం చేసుకుంటూ చదివినప్పుడే ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. ఎక్కువగా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను చదవడం వల్ల నిర్మాణాత్మక పరిజ్ఞానం, సామర్థ్యం, తార్కిక విశ్లేషణ సాధ్యం కాదు. అందువల్ల ప్రధాన కాన్సెప్టులను క్షుణ్నంగా అధ్యయనం చేయడం ప్రయోజనకరం. పాఠ్యాంశాలపై పట్టు సాధించిన తర్వాత సాధ్యమైనంత ఎక్కువగా ప్రశ్నలను సాధన చేయాలి. అభ్యర్థులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఒక వస్తువు భారం దేంట్లో గరిష్ఠంగా ఉంటుంది?
   1) శూన్య ప్రదేశం 2) హైడ్రోజన్
   3) గాలి 4) నీరు
2. నీటిలో తేలియాడుతున్న వస్తువు దృశ్యభారం ఎంత?
   1) శూన్యం
   2) వస్తువు నిజ భారంలో సగం
   3) వస్తువు నిజ భారానికి సమానం
   4) వస్తువు నిజ భారానికి రెట్టింపు
3. ఒక ప్రవాహిలో మునిగి ఉన్న వస్తువు ఘ.ప. 200 ఘనపు సెంటీమీటర్లు. అయితే అది ఎంత ఘనపరిమాణం ఉన్న నీటిని స్థానభ్రంశం చెందిస్తుంది?
   1) 0 2) 50 ఘ.సెం.మీ.
   3) 200 ఘ.సెం.మీ.
   4) 400 ఘ.సెం.మీ
4. ఒక ప్రవాహిలో వేలాడుతున్న వస్తువు దృశ్య భారం ఎంత?
   1) దాని నిజ భారానికి రెట్టింపు
   2) నిజ భారానికి సమానం
   3) నిజ భారంలో సగం 4) శూన్యం
5. ఆకుపచ్చని కాంతిలో పసుపు పచ్చని పుష్పం ఏ వర్ణంలో కనిపిస్తుంది?
   1) తెలుపు 2) నలుపు
   3) ఆకుపచ్చ 4) పసుపు పచ్చ
6. కిందివాటిలో ప్రాథమిక వర్ణం కానిది?
   1) ఎరుపు 2) ఆకుపచ్చ
   3) పసుపుపచ్చ 4) నీలం
7. అణు రియాక్టర్లలో మితకారిణి విధి ఏమిటి?
   1) చర్యా వేగాన్ని మార్చడం
   2) న్యూట్రాన్ల వేగాన్ని పెంచడం
   3) న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడం
   4) ఉష్ణోగ్రతను తగ్గించడం
8. భారజలం రసాయనిక నామం?
   1) డై హైడ్రోజన్ ఆక్సైడ్
   2) హైడ్రోజన్ డయాక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) హైడ్రోజన్ పెరాక్సైడ్
9. ఒకే సైజు, ఒకే ఆకృతిలో ఉన్న A, B అనే రెండు లోహపు డబ్బాలను ఒకే పదార్థంతో తయారు చేశారు. వాటిని 4^0C ఉష్ణోగ్రత వద్ద నున్న నీటితో పూర్తిగా నింపి ఒకదాన్ని వేడిచేసి, మరో దాన్ని చల్లారిస్తే ఆ రెండింటిలో నీటి ఘనపరిమాణం ఏమవుతుంది?
   1) Aలో పెరిగి Bలో తగ్గుతుంది
   2) Aలో తగ్గి Bలో పెరుగుతుంది
   3) రెండింటిలో పెరుగుతుంది
   4) రెండింటిలో తగ్గుతుంది
10. పీడనం పెరగడం వల్ల నీటి బాష్పీభవన స్థానం?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
11. కిందివాటిలో దయా అయస్కాంత పదార్థం కానిది?
    1) బంగారం 2) వజ్రం
    3) కోబాల్ట్ 4) ఆల్కహాల్
12. మాక్ నంబర్ దేనికి సంబంధించింది?
    1) ఉష్ణోగ్రత 2) వేగం
    3) పీడనం 4) భారం
13. ఒక ట్యూబ్ లైట్ 40 వాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. దాన్ని ఎన్ని గంటలపాటు వెలిగిస్తే 1 యూనిట్ కరెంట్ వినియోగం అవుతుంది?
    1) 40 2) 25 3) 24 4) 10
14. ఉష్ణోగ్రతతో నీటి స్పర్శ కోణం?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) స్పర్శ కోణం ఉష్ణోగ్రతపై ఆధారపడదు
15. భూస్థావర ఉపగ్రహాలు భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వద్ద తిరుగుతాయి?
    1) 1000 కి.మీ. 2) 3200 కి.మీ.
    3) 3600 కి.మీ. 4) 36,000 కి.మీ.
16. భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్దీ పీడనం?
    1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
17. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందెవరు?
    1) టాలమీ 2) కోపర్నికస్
    3) గెలీలియో 4) న్యూటన్
18. భూమిపై ప్రదేశం లేదా విశ్వంలోని ఏదైనా స్థానం ఆధారంగా ఒక వస్తువు ద్రవ్యరాశి, భారానికి సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
    2) ద్రవ్యరాశి, భారం రెండూ మారతాయి
    3) ద్రవ్యరాశి స్థిరంగా ఉంటుంది కానీ భారం మారుతుంది
    4) భారం స్థిరంగా ఉంటుంది కానీ ద్రవ్యరాశి మారుతుంది
19. 1 కేజీ, 10 కేజీల ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువులను సమాన వేగాలతో నిటారుగా పైకి విసిరితే, ఆ రెండింటిలో ఏది గరిష్ఠ ఎత్తుకు చేరుతుంది?
    1) 1 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    2) 10 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    3) రెండూ సమాన గరిష్ఠ ఎత్తుకు చేరుకుంటాయి
    4) వాటి గరిష్ఠ ఎత్తు అనేది పైకి విసిరిన సాధారణ వేగంపై ఆధారపడి ఉంటుంది
20. కాలానికి ప్రామాణిక ప్రమాణం ఏది?
    1) సెకన్ 2) నిమిషం
    3) గంట 4) రోజు

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 4;
5) 2; 6) 3; 7) 3; 8) 3;
9) 3; 10) 1; 11) 3; 12) 2;
13) 2; 14) 2; 15) 4; 16) 1;
17) 2; 18) 3; 19) 3; 20) 1

What is the average selling price of..



Model Questions

Directions (Q. No. 1-5) : Study the pie chart carefully and answer the given questions.


The Pie chart shows the percentage breakup of the people is living in a six floors building and the other pie chart shows the percentage breakup of the male members are living in that building.

Note: All the data is given for 2017.

Total number of people = X



Total number of male = 300



1. If the total number of females live on 3rd floor is 1/3rd of the total number of males live on 3rd floor then find the total number of people lives on 3rd floor and 4th floor together?
   a) 166 b) 176
   c) 156 d) 148 e) 184
2. If the total number of females live on 5th floor and 6th floor together is 32 then find the difference between the total number of people lives on 1st and 2nd floor together to that of the total number of people lives on 5th and 6th floor together?
   a) 100 b) 72 c) 80
   d) 84 e) 96
3. If the total number of females live on 3rd floor is 50% of the total number of males lives on 2nd floor then the total number of people live on 1st floor is what percentage of the total number of people lives on 2nd floor?
   a) 72% b) 85%
   c) 90% d) 55% e) 80%
4. The total number of people live on 5th floor in 2017 is 80. In 2018, the total number of people live on all floors together is increased by 20% from that previous year then find the difference between the total number of people live on 1st and 3rd floor together to the total number of people lives on 4th and 6th floor together in 2018. (The percentage breakup in 2018 will remain the same)
   a) 144 b) 156
   c) 162 d) 140 e) 136
5. The total number of males live on 1st floor, 2nd floor and 3rd floor together is approximately what percentage more/less than of the total number of males live on 4th floor, 5th floor and 6th floor together.
   a) 167% b) 97%
   c) 67% d) 34% e) 125%

Directions (Q. 6-10): Study the following information carefully and answer the given questions.

Among 400 cricket players, 45% played in IPL-1 and 6.25% played only in IPL-1. Again, 57.5% players played in IPL-2 and 11.25% players played only in IPL-2. Again, 72.5% players played in IPL-3 and 27.5% players played only in IPL-3. Twenty per cent players played in all three IPL tournaments.

6. How many players are there who played in IPL 1 and IPL2 but not in IPL 3?
   a) 30 b) 35 c) 40
   d) 65 e) 45
7. What is the percentage of players who played in IPL 2 and IPL 3 but not in IPL 1?
   a) 12.5% b) 16.25%
   c) 22.75% d) 24%
   e) None of these
8. What is the percentage of the players who played in at least two IPL tournaments?
   a) 30% b) 35%
   c) 45% d) 50% e) 55%
9. The number of players who played only in either IPL 1 or IPL 2 is what percentage of the players who played in all three IPL?
   a) 72% b) 75%
   c) 82.5% d) 85%
   e) None of these
10. The number of players who played in at most one IPL tournament is what percentage more/less than the number of players who played in at least one IPL?
    a) 55% more b) 55% less
    c) 40% more d) 40% less
    e) None of these

Direction (Q. No. 11-15): Refer the following line graph and answer the questions based on it.

The line graph shows the percentages of markup on CP and discount offered on MP of six different articles sold by a shopkeeper.



11. Selling price of article C is Rs.528 and the marked prices of articles C and E are the same. What is the average selling price of both the articles in Rupees?
    a) 534.5 b) 544.5 c) 554.5
    d) 524.5 e) None of these
12. Cost Price of article A is Rs.450 and that of article D is Rs.600. What is the ratio of marked price of both the articles?
    a) 5 : 6 b) 3 : 4 c) 3 : 5
    d) 4 : 5 e) None of these
13. If the cost price of article E is double to that of article A, the marked price of article E is how much percent more than that of article A?
    a) 50% b) 40% c) 60%
    d) 30% e) None of these
14. For which article, the profit percent is the minimum?
    a) D and E b) D c) E
    d) E and F e) None of these
15. If the cost price of each of the article B and F is Rs.800, then what is the total profit earned by shopkeeper on both the articles?
    a) Rs.152 b) Rs.248
    c) Rs.184 d) Rs.216
    e) Cannot be determined

KEY & SOLUTIONS

1.

Floor	Total number of males
1st floor	15
2nd floor	24
3rd floor	36
4th floor	105
5th floor	66
6th floor	54

The total number of males on 3rd floor = 36
The total number of females on 3rd floor 36/3 = 12
The total number of people on 3rd floor = 36 + 12 = 48
So, we know that 12% = 48
The total number of people on 3rd floor and 4th floor
= 12% + 32% = 44%
The total number of people on 3rd floor and 4th floor
= (48/12)× 44 = 44× 4 = 176
Ans: b


2. The total number of males live on 5th and 6th floor together
= 66 + 54 = 120
The total number of females live on 5th and 6th floor together = 32
The total number of people live on 5th and 6th floor together
= 120 + 32 = 152
So, (20% + 18%) = 152
38% = 152
The percentage of people live on 1st and 2nd floor together
= 8% + 10% = 18%
So, required difference
= 38 – 18 = 20%
Then, (152/38)×20 = 80 **Ans: c**

3. The percentage of the total number of people live on 1st floor = 8%
The percentage of the total number of people live on 2nd floor = 10%
So, required percentage =
= (8/10)×100 = 80% **Ans: e**

4. The total number of people live on 5th floor in 2017 = 80
So, 20% = 80
100% = (80/20)×100 = 400
So the total number of people lives on all floors in 2017 = 400
So the total number of people lives on all floors in 2018
= (400/100)×120 = 480
So, required difference
= (32% + 18%) – (8% + 12%)
= 30%
Then, (30/100)×480 = 144
Ans: a

5. The total percentage of people live on 1st, 2nd floor and 3rd floor together = 5 + 8 + 12 = 25%
The total percentage of people live on 4th, 5th floor and 6th floor together
= 35 + 22 + 18 = 75%
So, required percentage
= [(75-25)/75]×100
= (50/75)×100 = 67%(Approx)
Ans: c

6.



x + y + 80 + 25 = 180
or x + y = 75 _____(i)
y + z + 80 + 110 = 290
or, y + z = 100 _____(ii)
x + z + 80 + 45 = 230
or x + z = 105 _____(iii)
From eqn (i), (ii) and (iii),
x = 40, y = 35, z = 65 **Ans: c**

7. Required percentage
= (65/400)×100 = 16.25
Ans: b

8. At least two IPL = 40 + 35 + 65 + 80 = 220
Required%
= (220/400)×100 = 55%
Ans: e

9. Only IPL-1 = 25, only IPL-2 = 45
∴ Total = 70
Required%
= (70/80)×100 = 87.5% **Ans: e**

10. At least one IPL = 400
At most one IPL = 25 + 45 +110 = 180
∴ Required%
= [(400-180)/400]×100 = 55%
Ans: b

11. Marked price of article C
= [100/(100-20)]×528 = Rs.660
Then, marked price of article E
= Rs. 660
Selling price of article E
= 660×(100-15)/100 = Rs.561
Required average
= (528+561)/2 = Rs.544.5
Ans: b

12. Required ratio
= 450×(100+60)/100:
600×(100+50)/100
= 4 : 5 **Ans: d**

13. Let the cost price of article A be Rs. 100
Then, the cost price of article E
= Rs. 200
Marked price of article A
= 100 + 60% of 100 = 160
Marked price of article E
= 200 +20% of 200 = 240
Required percentage
= [(240-160)/160]×100 = 50%
Ans: a

14. Profit% = (100+Markup%) × [(100-Discount%)/100]-100
Profit% for article A
= (100+60) × [(100-25)/100]-100
= 20%
Similarly,
Profit% for article B = 19%
Profit% for article C = 32%
Profit% for article D = 5%
Profit% for article E = 2%
Profit% for article F = 8%
Ans: c

15. Profit% = (100+markup%) × [(100-Discount%)/100]-100
Profit % for article B = 19%
Profit % for article F = 8%
Total profit = 19% of 800 + 8% of 800 = 27% of 800 = Rs. 216
Ans: d